ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

గురువారము, మార్చి 1, 2007

**12 వ శా. స._ IX స. వాల్యూం -- II నంబరు --5**

శక సంవత్సరము - 1928, ఫాల్గుణం - 10

**THURSDAY, THE 1st MARCH, 2007**

**12 L.A. IX S. VOL-- II No. - 5**

**10 - Phalgun, 1928 - S.E.**

#

శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ కె. ఆర్. సురేష్ రెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ యు . పురుషోత్తమ రెడ్డి<br>శ్రీ బి. వేదవ్యాస్<br>డా. (శ్రీమతి) జి. కుతూహలమ్మ<br>శ్రీ నాదెండ్ల మనోహర్<br>శ్రీ డి.నరేంద్రకుమార్<br>శ్రీ ఎ. గోవింద నాయక్ |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| అదనపు కార్యదర్శి | : | శ్రీ కె. గోపాలకృష్ణయ్య |
| సంయుక్త కార్యదర్శులు | : | శ్రీ ఎస్. రాజ సదారామ్<br>శ్రీ ఎన్. అంజయ్య |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ డి.శివరావు<br>శ్రీ ఎం. పాండురంగాచార్య<br>శ్రీ ఎం.వి.వి.సత్యానందం<br>శ్రీ పి. సీతారాములు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ కె.ఎ.నర్సింహరాజు<br>శ్రీ డి. నర్సింహులు<br>శ్రీ కె. సుభాష్ చంద్రబోసు<br>శ్రీ కె. తులసీరాం<br>శ్రీ డి. సత్యనారాయణ<br>శ్రీ ఎ. రామిరెడ్డి<br>శ్రీమతి వి. గిరిజా సుందరి<br>శ్రీ ఎస్. జయరాం<br>శ్రీ కె. జగన్నాధరావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ మహ్మద్ జహీరుద్దీన్ |

--------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
అధికార నివేదిక

( పన్నెండవ శాసనసభ)
( తొమ్మిదవ సమావేశము : పదకొండవ రోజు )
గురువారము, మార్చి **1, 2007**
సభ ఉ. గం. **8.30** లకు ప్రారంభమైనది
( గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు )

----------

## విషయ సూచిక

1. సభా కార్యక్రమము

వాయిదా తీర్మానముల గురించి

2. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు(అనుబంధము–1)

3. ప్రకటన

4. 2007–2008 సం.పు వార్షిక ఆదాయ–వ్యయ పట్టిక (బడ్జెట్ ) పై – సాధారణ చర్చ (కొనసాగింపు)

5. 2007–2008 సం.పు వార్షిక ఆదాయ –వ్యయ పట్టిక (బడ్జెట్ ) పై

గ్రాంట్ల కొరకు అభ్యర్థన

1. అభ్యర్థన నెం. XXIV (24) - అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం
2. అభ్యర్థన నెం. XVIII (18) - గృహ నిర్మాణం
3. అభ్యర్థన నెం. XXV (25) - మహిళ, శిశు, వికలాంగుల సంక్షేమం
4. అభ్యర్థన నెం. XXI (21) - సాంఘిక సంక్షేమం
5. అభ్యర్థన నెం. XXII (22) - గిరిజన సంక్షేమం
6. అభ్యర్థన నెం. XXIII (23) - వెనుకబడిన తరగతుల సంక్షేమం

(ప్రతిపాదించబడినవి)

--------------

# సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానముల గురించి

MR. SPEAKER: Adjournment Motions have been received today.

The First Adjournment Motion given notice of by Sri T. Devender Goud Garu and others regarding imposition of service tax on artisans especially Nayi Brahmins adversely affecting their livelihood is disallowed.

The Second Adjournment Motion given notice of by Dr. G. Vijaya Rama Rao garu and others regarding imposition of service tax on artisans especially Nayi Brahmins adversely affecting their livelihood is disallowed.

The Third Adjournment Motion given notice of by Sri Nomula Narasimhaiah Garu and others regarding imposition of service tax on artisans especially Nayi Brahmins and the alleged neglect of their welfare is disallowed.

The other Adjournment Motion given notice of by Sri Chada Venkat Reddy Garu and others regarding imposition of service tax on artisans especially Nayi Brahmins adversely affecting their livelihood is disallowed.

The other Adjournment Motion given notice of by Sri G. Kishan Reddy garu regarding the alleged discontentment among the unemployed youth due to non-filling of vacancies in various Departments is disallowed.

The other Adjournment Motion given notice of by Sri Komireddi Ramulu garu regarding sanctioning a Concept School, Degree College and Girls Residential School in Metpalli Constituency is disallowed.

The last Adjournment Motion given notice of by Sri L. Raja Rao garu regarding alleged deaths in Tribal areas of Visakhapatnam district due to lack of livelihood is disallowed.

Today is the last day of the Budget and there will be winding up after a couple of Members speak.

( అంతరాయం )

ఒక్క నిమిషం ఆగండి. ఆ తరువాత రిప్లయ్ వుంటుంది. ఈ రోజు రిప్లయ్ తరువాత you have an option of clarification. కావున ఇప్పుడు మీరు రిఫ్లెక్ట్ చేసిన అంశాలు ఎడ్జెర్న్‌మెంట్ మోషన్‌లో గాని, అంతకంటే ముఖ్యంగా మీరు బడ్జెట్ చర్చలో పాలుపంచుకున్న సమయంలో, డిబేట్‌లో పార్టిసిపేట్ అయిన సమయంలో మీరు ఇచ్చిన సూచనలు అన్నీ కూడా ఆర్థిక మంత్రి గారు వారి రిప్లయ్‌లో వీటన్నింటిపై స్పందిస్తారు కాబట్టి ఈ రోజు మనం 9.30 గంటలకు మిగిలిన ఇద్దరి సభ్యుల చేత మరియు వైండింగ్ అప్ కంప్లీట్ చేయించి I will try to see that the Reply starts at 10.45 or 11.00 AM. అన్ని అంశాలూ ఈ బడ్జెట్ ఉపన్యాసములో, మీరు లేవనెత్తిన ప్రతి ఒక్క అంశముపై వీలైనంతవరకూ ఆర్థిక శాఖా మాత్యులు స్పందిస్తారు. కాబట్టి వారి రిప్లయ్ తరువాత మరలా క్లారిఫికేషన్స్ వుంటాయి. After that ఆ ఇష్యూ క్లోజ్

అయిన తరువాత if you feel further debate మీరు లేవనెత్తిన అంశాలపై ఇంకా ఫర్‌దర్ డిబేట్ అవసరమయితే definitely will look at it tomorrow. Now please cooperate.

( అంతరాయం )

వారి రిప్లయ్‌కి మీరు వేచి చూడండి. మినిష్టరు గారి రిప్లయ్ వుంటుంది. Reply will be in detail. మీరు ఇచ్చిన సూచనలపై ప్రభుత్వ ఆలోచన, వారి స్పందన వుంటుంది. రిప్లయ్ వుంటుంది. Please await. వారి రిప్లయ్ తరువాత మరలా మీకు క్లారిఫికేషన్స్ వుంటాయి.

( అంతరాయం )

శ్రీ చాడా వెంకట రెడ్డి (ఇందుర్తి) : చేతి వృత్తుల పైన మనం చర్చ చేద్దాము. గతంలో కూడా అనుకున్నాము.

శ్రీ నోముల నర్సింహయ్య (నకిరేకల్) : నడ్డి కత్తిరిస్తుంది సార్ టాక్స్‌లు.

శ్రీ ఇ. దయాకర రావు (వర్ధన్నపేట) : రోశయ్య గారికి జుట్టు లేదు కాబట్టి ఇబ్బంది లేదు.

MR. SPEAKER : ఇప్పుడు వారి రిప్లయ్ అయిన తరువాత, రిప్లయ్‌లో మినిష్టరు గారి స్పందనను మీరు చూడండి. రిప్లయ్ వినండి. రిప్లయ్ తరువాత మరలా మీకు క్లారిఫికేషన్స్ వుంటాయి. After the clarifications, if you still feel వెంకట రెడ్డి గారూ, ఇప్పుడు మీరు లేవనెత్తిన అంశాలన్నీ కూడా ....

( అంతరాయం )

ట్యాక్స్ అన్నారు. టాక్స్ రిలేటడ్ కదా బడ్జెట్ అంటే. బడ్జెట్ రిప్లయ్ వుంది, బడ్జెట్ రిప్లయ్‌లో చూడండి మరి. ఇప్పుడు రిప్లయ్ తరువాత క్లారిఫికేషన్స్ సమయంలో మీరు ఒకవేళ ఈ అంశముపై ఇంకా డిబేట్ జరగాలని మీకు అభిప్రాయం వుంటే తప్పనిసరిగా you will meet me tomorrow. I will find a way out. దయచేసి వినండి, ఒక్క నిమిషం వినండి. విజయరామారావు గారు, ఇప్పుడు మీరందరూ ఇచ్చిన ..........

( అంతరాయం )

దయాకర్ రావు గారూ, మీరు ఇచ్చిన ఎడ్జెర్న్‌మెంట్ మోషన్స్‌ను నేను చదివి వినిపించాను. Narasimhaiah garu, will you please listen to me? I have a suggestion. I have a suggestion. మీరు ఇచ్చిన ఎడ్జెర్న్‌మెంట్ మోషన్స్‌ను డిస్‌అలౌ చేస్తూ ఈ రోజు బడ్జెట్ పైన రిప్లయ్ వున్న విషయాన్ని మీకు చెప్పాను. అంతేగాక ఈ రోజు డిమాండ్స్ మూవ్ అవుతున్నాయి. ఈ రోజున మూవ్ అయ్యే డిమాండ్స్‌లో యస్.సి. వెల్‌ఫేర్ డిమాండ్స్, బి.సి. వెల్‌ఫేర్ డిమాండ్స్, మైనారిటీ వెల్‌ఫేర్ డిమాండ్స్, ట్రైబల్ వెల్‌ఫేర్ డిమాండ్స్ ఈ రోజున మూవ్ అవుతున్నాయి. రేపు ప్రొద్దున మరలా డిమాండ్స్ పైన చర్చ జరుగుతుంది. కావున మీ డిమాండ్స్‌ని ఆ డిమాండ్స్‌లో మీరు మాట్లాడే అవకాశం వుంది. Kindly cooperate because the Question Hour will be closed by 09.30 AM. ఇంకా గౌరవ సభ్యులు ఇద్దరు మాట్లాడే వారు వున్నారు.

( అంతరాయం )

శ్రీ జి. కిషన్ రెడ్డి (హిమాయత్‌నగర్) : నిరుద్యోగుల సమస్య సార్, మూడు సంవత్సరములు అయింది రిక్రూట్‌మెంట్ జరిగి.

మిస్టర్ స్పీకర్ : ఇంకా గౌరవసభ్యులు ఇద్దరు మాట్లాడే వారు వున్నారు. అదికాగానే reply will begin. Kindly cooperate.

( అంతరాయం )

శ్రీ చాడా వెంకట రెడ్డి : మాకు దీని పైన ఒక అవకాశం ఇవ్వండి.

మిస్టర్ స్పీకర్ : మీరు ఏ పన్నుపై ఎంత భారం వేశారనేదానిపై మీ అభిప్రాయాలు చెప్పారు. స్టేట్‌మెంట్ ఎలా వుంటుంది. బడ్జెట్ రిప్లయ్ వుంది ఈ రోజు. ట్యాక్సెస్ పైన మినిష్టరు గారి రిప్లయ్ వుంటుంది. రిప్లయ్ తరువాత మరలా ఈ రోజున డిమాండ్స్ మూవ్ అవుతున్నాయి. బడ్జెట్ డిమాండ్స్ మూవ్ అవుతున్నాయి. జనరల్ బడ్జెట్ అయిన తరువాత డిమాండ్స్ అంటే స్పెసిఫిక్‌గా ప్రతి ఒక్క శాఖకు సంబంధించిన డిమాండ్స్ మూవ్ అవుతున్నాయి. దాని పైన మాట్లాడే అవకాశాలు వున్నాయి. ఇది ప్రశ్నోత్తరాల సమయం. Kindly cooperate. By 9.30 a.m. we have to close.

( అంతరాయం )

శ్రీ జి. కిషన్ రెడ్డి : కేంద్ర ప్రభుత్వ బడెట్జ్‌లో పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పట్టించుకోలేదు. పేద ప్రజలు ఎక్కడికి పోతారు.

మిస్టర్ స్పీకర్ : ఈ రోజు బడ్జెట్ పైన రిప్లయ్ వుంది. గంటా, గంటన్నర సమయం వారి రిప్లయ్‌లో ఈ విషయాలన్నీ వారు మాట్లాడతారు. అనేకమైన అంశాలు వుంటాయి. బడ్జెట్ రిప్లయ్ చాలా ప్రాధాన్యత కలిగివున్న విషయం. అది మీకు తెలుసు. అనేక అంశాలు వుంటాయి. ఈ రోజు 9.30 గంటలకు క్వొశ్చన్ అవర్ క్లోజ్ అయితే ... ఇంకా ఇద్దరు గౌరవ సభ్యులు మాట్లాడాలి. మాట్లాడిన తరువాత మినిష్టరు గారి రిప్లయ్ వుంటుంది. ఇప్పుడు సమయం ఎంత వేస్ట్ అవుతుందో ప్రశ్నోత్తరాలకు అంత సమయం తగ్గుతుంది. నిరుద్యోగ సమస్య గాని, మిగతా సమస్యలపై వారు బడ్జెట్‌లో మాట్లాడతారు.

( తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు శ్రీ ఇ. దయాకర్‌రావు గారి నుండి అంతరాయం )

దయచేసి మీరు గమనించండి. మీరు ఇచ్చిన ఎడ్జర్న్‌మెంట్ మోషన్‌ను చదివి వినిపించాను. ఈ సభ ముందు ఏ రూపంలో వస్తుందో చెప్పాను. మీకు ఆ సూచనలు ఇచ్చాను. Now Question No. 6925. Minister for Finance, Medical and Family Welfare. దయాకర్ రావు గారూ, ఈ రోజు వైండింగ్ అప్ వుంది. తెలుగుదేశం పార్టీ తరపున గౌరవసభ్యులు చేస్తారు. వారు మాట్లాడే సమయంలో కూడా వారికి అవకాశం వుంది. వారు చెప్పిన తరువాత మరలా మినిష్టరు గారు రిప్లయ్ ఇస్తారు. So, these options are available.

( అంతరాయం )

శ్రీ ఇ. దయాకర్ రావు ః వారు స్టేట్‌మెంట్ ఇస్తే బాగుంటుంది.

మిస్టర్ స్పీకర్ ః మీకు స్టేట్‌మెంట్ ఎందుకు? 40 నిమిషాలు, గంట సేపు మీరు మాట్లాడండి. ఈ రోజు వైండింగ్ అప్ మీరే వున్నారు. నిన్న కూడా చెప్పాను. ఈ రోజు కూడా చెబుతున్నాను. ఈ సభ కొన్ని రూల్స్, రెగ్యులేషన్స్‌తో నడుస్తుంది. Please, that is enough. వైండింగ్ అప్ మీరే చేస్తున్నారు. మొదటి క్వొశ్చన్ వారిది. Now, please cooperate. We have already lost 10 minutes.

శ్రీ ఇ. దయాకర్‌రావు ః అధ్యక్షా, రైతుల సమస్యలపై బాగా స్పందించారని నిజామాబాద్ రైతులు మిమ్ములను పొగుడుతున్నారు.

( తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు శ్రీ ఇ. దయాకర్ రావు నుండి అంతరాయం )

మిస్టర్ స్పీకర్ ః దయాకర్ రావు గారూ, మీకు జుట్టు వుంది, రోశయ్య గారికి అనుభవం వుంది, మీకు ఎందుకు ఇబ్బంది. వారి రిప్లయ్‌లో అన్ని విషయాలు చెబుతారు. You wait for the reply. గంటసేపు ఓపిక పట్టండి, వారి సమాధానం వుంటుంది. He will respond to all your queries.

శ్రీ జి. కిషన్ రెడ్డి ః రోశయ్య గారికి పన్నెండు సార్లు పన్నులు వేసిన అనుభవం వుంది.

ఉ.8.40

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

## ఆరోగ్య సంరక్షణకు డి.ఎఫ్.ఐ.డి. నిధుల మంజూరు

ప్రశ్న నెం.101 (6925)

శ్రీ ఆర్. సూర్యప్రకాశరావు (రాజమండ్రి) – గౌరవనీయులైన ఆర్థిక, చిన్న మొత్తాల పొదుపు, లాటరీలు, ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః

(అ) ప్రాథమిక ఆరోగ్యాన్ని అందించేందుకు రంగంవారీ సహాయ కార్యక్రమం క్రింద డి.ఎఫ్.ఐ.డి. రాష్ట్రానికి నిధులు మంజూరు చేసే అవకాశమున్న విషయం వాస్తవమేనా?

(ఆ) అయితే, ప్రాథమిక ఆరోగ్య రంగములో రాష్ట్రానికి ఏ మేరకు ప్రయోజనం చేకూరుతుందిః

(ఇ) డి.ఎఫ్.ఐ.డి. ఈ ప్రతిపాదనను ఎప్పటికి ఖరారు చేసే అవకాశముంది?

**ప్రణాళిక, చిన్న మొత్తాల పొదుపు శాఖ మంత్రి ( శ్రీ కె. రోశయ్య )ః**

(అ) అవునండీ.

(ఆ) ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవడానికి నాణ్యతను మెరుగుపరిచేందుకు డి.ఎఫ్.ఐ.డి. ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందిస్తుంది. ఈ సహాయంలో ముఖ్యంగా మారుమూల, గిరిజన ప్రాంతాలలో మాతృ, శిశు ఆరోగ్య సంబంధ సమస్యలను తగ్గించడం, అంటు వ్యాధులను, అంటు వ్యాధులు కాని వ్యాధులను నివారించడం చేరి వుంటాయి. అంతేకాక, ఆరోగ్య సేవలను అందించడంలో ప్రజల

ప్రమేయాన్ని పెంచి మరింత జవాబుదారీతనాన్ని కల్పించడమవుతుంది. ముఖ్యంగా పేదలు, బడుగు వర్గాలు ప్రాథమిక ఆరోగ్య సేవలను బాగా ఉపయోగించుకోవడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య రంగం సహాయక గ్రాంటు నుండి ప్రయోజనం పొందుతుందని ఆశించడమయింది.

(ఇ) ఈ కార్యక్రమం ఆమోద పూర్వ దశలో వుంది. ఆమోదాలు పొందడానికి లోబడి 2007-08 ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించవచ్చును.

శ్రీ కె. రోశయ్య : సార్, ఇది ప్రీ-అప్రైజల్ స్టేజ్‌లో వుంది. హోప్‌ఫుల్లీ ఈ సంవత్సరము మనం కన్‌సెంట్ ఇచ్చి, ప్రాధాన్యం ఇచ్చే దానికి ఆస్కారం వుంటుందనే దానికి ఆశిస్తున్నాను.

శ్రీ ఆర్. సూర్యప్రకాశరావు : అధ్యక్షా, వైద్య శాస్త్రంలో జరుగుతున్నటువంటి పరిశోధనల ఫలితంగా మహమ్మారీ జబ్బులను నయం చేసె మెడిసిన్స్‌ను కనిపెడుతుండగా మరొకవైపు సరికొత్త జబ్బులు పుట్టుకొస్తున్న సంగతి తెలిసిందే. ఉదా:- ఈ మధ్య కాలంలో డెంగ్యూ కాని, అలాగే చికెన్ గున్యా కానీ, ఇతర వ్యాధులు కానివ్వండి. పట్టణ ప్రాంతాలలో ఎన్నో ఆధునిక సదుపాయాలు రావడం జరుగుతుంది కాని మారుమూల గ్రామీణ ప్రాంతాలలో అందవలసిన వైద్య సౌకర్యాలు ఇంకా పూర్తిగా అందవలసిన ఆవశ్యకత వుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సదుపాయాలను ప్రజలకు వైద్య సేవలను అందించడంపై ప్రభుత్వం ఇంకా దృష్టి సారిస్తున్నందుకు, అలాగే ఈ బడ్జెట్‌లో 24 కోట్ల రూపాయలను అదనంగా కేటాయించినందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ప్రాథమిక ఆరోగ్యముపై ఇంకా అదనంగా నిధులు ఖర్చు చేయవలసి వుంది. దీనికి డి.ఎఫ్.ఐ.డి. నిధులు అనుమతి తెస్తున్నందుకు దీనికి సంబంధించినటువంటి రాష్ట్ర ఆరోగ్యరంగాన్ని గాడిలో పెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఎందుకంటే ప్రజల ఆరోగ్యం అనేది ముఖ్యం. ప్రజలందరూ ఆరోగ్యంగా వుంటే మొత్తం వ్యవస్థ అంతా కూడా, సమాజం బలంగా వుంటుంది. ఆరోగ్యానికి సంబంధించినటు వంటి జాగ్రత్తలు ఇంకా తీసుకోవలసిన ఆవశ్యకత వుంది. ఈ రోజు రాష్ట్రంలో జనాభాకు అనుగుణంగా ప్రైమరీ హెల్త్ సెంటర్స్ వుండవలసినన్ని లేవు గనుక ఇంకా చాలా రావలసిన ఆవశ్యకత వుంది. అలాగే కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ కూడా చాలా రావలసిన ఆవశ్యకత వుంది. అలాగే వైద్య రంగానికి సంబంధించి డి.ఎఫ్.ఐ.డి. నిధులు వైద్య సదుపాయాల కొరకు ఖర్చు చేయాలని చెప్పి ప్రతిపాదించారు. ప్రాథమిక వైద్య సదుపాయాల కల్పనలో భాగంగా ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌లో ఎటువంటి సౌకర్యాలు కల్పించనున్నారు? రాబోయే డి.ఎఫ్.ఐ.డి. నిధుల ద్వారా వైద్య ఆరోగ్య నిర్వహణ కోసం డి.ఎఫ్.ఐ.డి. నిధులు ఎంతవరకూ ఉపయోగపడుతున్నాయి? ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ వున్నాయి? ఈ డి.ఎఫ్.ఐ.డి. నిధుల ద్వారా వీటిని ఇంకా పెంచే ఆలోచన వుందా అని తమరి ద్వారా అడుగుతున్నాను. ప్రతి ముప్ఫయి వేల జనాభాకు ఒక ప్రైమరీ హెల్త్ సెంటర్ వుండాలని చెప్పి కేంద్ర ప్రభుత్వం సూచిస్తుంది. ప్రస్తుతం ఎన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్స్ వున్నాయి? ఇంకా కొత్తగా ఈ డి.ఎఫ్.ఐ.డి. నిధుల ద్వారా ఎన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌ను స్థాపించబోతున్నారని తమరి ద్వారా అడుగుతున్నాను.

అలాగే వైద్య విద్య పూర్తి చేసిన వారు విధిగా కొంతకాలం వారు గ్రామీణ ప్రాంతాలలో పని చేయాలనే నిబంధనలు వున్నప్పటికీ అందరూ కూడా పట్టణ ప్రాంతాలలో వుండడానికి చూపించినటువంటి శ్రద్ధ గ్రామీణ

ప్రాంతాలలో వుండడానికి పెద్దగా శ్రద్ధ చూపించడం లేదు. ఈ డి.ఎఫ్.ఐ.డి. నిధులను ఉపయోగించి గ్రామీణ ప్రాంతాలలో పని చేసే వారికి ప్రత్యేకంగా అడిషనల్ శాలరీస్ ఇంకా ఎక్కువ ఇవ్వడానికి గానీ, వారు గ్రామీణ ప్రాంతాలలో వుండడానికి వారి దృష్టి మరల్చడానికి గానీ ఏమైనా ఈ డి.ఎఫ్.ఐ.డి. నిధులలో ఏదైనా ప్రత్యేక ప్రణాళిక ద్వారా కృషి చేస్తున్నారా అని తమరి ద్వారా అడుగుతున్నాను. అలాగే వైద్య ఆరోగ్య సంస్కరణలపై ప్రభుత్వం ఏదైనా నివేదిక రూపొందించిందా అని తమరి ద్వారా ఆరోగ్య మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, ఇవి కేవలం డి.ఎఫ్.ఐ.డి. నిధులకు సంబంధించిన ప్రశ్న. ఈ నిధులలో ఒక్కో డిపార్టుమెంట్‌కు, ఒక్కో రంగానికి ప్రత్యేకంగా కేటాయింపులు వున్నాయి. జనరల్‌గా వైద్య, ఆరోగ్య శాఖకు ఇస్తున్నటువంటి తోడ్పాటు కాదు. సుమారుగా ఈ సంవత్సరం నుంచి మూడు సంవత్సరాలు అమలయ్యే ఈ స్కీం 500 కోట్ల రూపాయలు రావచ్చు అని అంచనా వేసుకుంటున్నాము. వారితో ఫైనల్ స్టేజ్‌లో డిస్కషన్స్ కూడా అయ్యాయి. ప్రీ-అప్రైజల్ కూడా అయింది. త్వరలో వస్తే ఈ 500 కోట్ల రూపాయలలో ఈ సంవత్సరం ఒక వంద కోట్లు, వచ్చే సంవత్సరం 200 కోట్ల రూపాయలు, అలాగే మూడు సంవత్సరముల మీద పంపిణీ చేస్తారు.

సమాధానం 'బి' గురించి నేను మిత్రులు సూర్యప్రకాశరావు గారిని అడుగుతున్నాను. ఒకసారి సమాధానం చదవండి చాలా క్లియర్‌గా వుంది. " ఈ సహాయంలో ముఖ్యంగా మారుమూల, గిరిజన ప్రాంతాలలో మాతృ, శిశు ఆరోగ్య సంబంధ సమస్యలను తగ్గించడం, అంటు వ్యాధులను, అంటు వ్యాధులు కాని వ్యాధులను నివారించడం చేరి వుంటాయి. అంతేకాక, ఆరోగ్య సేవలను అందించడంలో ప్రజల ప్రమేయాన్ని పెంచి మరింత జవాబుదారీతనాన్ని కల్పించడమవుతుంది. ముఖ్యంగా పేదలు, బడుగు వర్గాలు ప్రాథమిక ఆరోగ్య సేవలను బాగా ఉపయోగించుకోవడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య రంగం సహాయక గ్రాంటు నుండి ప్రయోజనం పొందుతుందని ఆశించడమయింది. " అధ్యక్షా, వారి ప్రశ్నను, వారి ఆవేదనను నేను అర్థం చేసుకున్నాను. ఇది రెండు పార్టులు. డి.ఎఫ్.ఐ.డి. నుండి వచ్చే సహాయాన్ని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై వారితో మనం చేసినటువంటి చర్చలలో అంగీకరించినటువంటి సూత్రాలు ఈ రంగాలకు ఉపయోగపడుతుందనేది నిజం.

మన రాష్ట్రంలో 1570 ప్రైమరీ హెల్త్ సెంటర్స్ వున్నాయి. వాటిలో కొరతలు వున్నాయి. మన రాష్ట్రం గ్రామీణ ప్రాంతాలతో నిండినటువంటిది. నూటికి 70 మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో వుంటారు. వారికి సరైనటువంటి వైద్య సదుపాయాలు అందడం లేదనే మాట దీనిని ఎవరూ, నేను గాని, మరొకరు గానీ, లేదు, అంతా బాగున్నాయని చెప్పే పరిస్థితులో లేము. దీనిని మెరుగుపరచుకోడానికి కావలసిన అన్ని చర్యలనూ తీసుకుంటున్నాము. వైద్య, ఆరోగ్య శాఖ పద్దు వచ్చినప్పుడు ఇంకా వివరంగా చెప్పగలను. బడ్జెట్ మీద జరిగినటువంటి చర్చకు నేను రిప్లయ్ చెప్పే సమయంలో ఈ రంగములో ఏమి చేశాము, ఏమిటి అనే దానికి స్థూలంగా కొంత చెప్పే దానికి అవకాశం వుంది.

గౌరవమాత్యులు సూర్యప్రకాశరావు గారు గ్రామాలలో డాక్టర్లు వుండడం లేదు, ఎలా వుంచుతారని అన్నారు. ఇది మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పరిధిలోనికి వస్తుంది. డాక్టర్స్ కోర్సు నాలుగు సంవత్సరములు. చాలా కాలం నుండి మన రాష్ట్రంలో చేస్తున్న ప్రయత్నమేమిటంటే స్టడీస్ అయిపోయిన తరువాత పక్కా సర్టిఫికేట్ ఇవ్వకుండా ప్రొవిజనల్ సర్టిఫికేట్ ఇచ్చి కనీసం రెండు సంవత్సరములు రూరల్ ఏరియాలో పని చేసిన తరువాత

మెడికల్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్, పక్కా సర్టిఫికేట్ ఇవ్వాలనే ఆలోచన కొంతకాలం క్రితం జరిగింది. దీనికి సంబంధించి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారితో, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా లెవల్‌లో హెల్త్ మినిస్ట్రీ వారితో కూడా చాలా చర్చలు చేశాను. అనేక రాష్ట్రాలలో లేదు. మన రాష్ట్రములో చట్టం చేసే దానికి అవకాశం వుందా అనే దానికి సంబంధించి క్షుణ్ణంగా పరిశీలన చేశాను. మహారాష్ట్రలో ఇటీవల ఒక కండిషన్ పెట్టారు. మూడు సంవత్సరముల యంబిబియస్., పూర్తి అయిన తరువాత రూరల్ సర్వీసు చేయాలని అన్నారు. దానిని హైకోర్టు కొట్టివేసింది. అందువల్ల ఆ దిశలో వెళ్లే దానికి వీలులేదు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వాదన ఏమిటి? ఈ వైద్యం అనేది దేశం మొత్తం మీద యంబిబియస్., డిగ్రీకి ఒకే రకంగా వుండాలి. నాలుగు సంవత్సరముల కోర్సు అన్నాము. ఒక రాష్ట్రములో మూడు సంవత్సరములు పెట్టుకుంటారు. ఒక రాష్ట్రం నేను నాలుగేళ్లు వుంచుతాను అని, మరొక రాష్ట్రం ఐదేళ్లు వుంచుతానని అంటే కుదరదు, యూనిఫార్మిటీ వుండాలి. రూరల్ సర్వీసును కూడా కంపల్సరీగా చేయాలని కేంద్రం కూడా ఆలోచిస్తుంది. కాని ఫైనాలిటీ లేకుండా వుంది. గౌరవనీయులు కేంద్ర ఆరోగ్య మంత్రి రాందాస్ గారు కూడా డాక్టర్. స్వయంగా వారితో కూడా మాట్లాడాను. అందరూ కూడా they are agreeing for the need. ఏదో ఒక రకమైన మార్పు తెచ్చి గ్రామీణ ప్రాంతాలలో కంపల్సరీగా కొంత కాలమైనా రెండేళ్లు, మూడేళ్లు, ఒక ఏడాది వారికి వదిలిపెడుతున్నాము. కనీసం ఒక సంవత్సరము అన్నారనుకోండి సార్. ప్రతి సంవత్సరమూ కొంత మంది వస్తూ వుంటారు. మరొక సంవత్సరము మరి కొంత మంది వస్తూ వుంటారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్యులు వుండడం, వైద్య సదుపాయాలు అందించే దానికి చాలా ప్రయత్నాలు చేస్తున్నాము. ఇదివరలో 1987వ సంవత్సరమునకు ముందు వున్న వారికి నాన్-ప్రాక్టీసింగ్ అలవెన్స్ వుంది. 1987 తరువాత అపాయింట్ అయిన వారికి నాన్-ప్రాక్టీసింగ్ అలవెన్స్ లేదు.
ఉ.8.50

ఇది కొంత కన్సెర్న్‌గా ఉంటుంది వాళ్లల్లో. దానిని దృష్టిలో ఉంచుకుని పెద్దలందరితో మాట్లాడి ముఖ్యమంత్రి గారితో కూడా ఆలోచించి, ఈ డిస్పారిటీ లేకుండా చేస్తే కొందరు గ్రామాలలో ఉంటారేమో. గ్రామాలలో, వారు ఉండటానికి కావలసిన అనుకూల వాతావరణం కల్పిస్తున్నాము. ఇప్పుడు మనకు కావలసిన డాక్టర్సు రావడం లేదు. కాంట్రాక్టు బేస్ మీద రెగ్యులర్ అవుతున్నారు. వారికీ ప్రిఫరెన్సు ఇస్తున్నాము కూడా. మరల కాంట్రాక్టు ఉద్యోగాలలో ఖాళీలు ఏర్పడుతున్నాయి. వీటి మీద నిరంతరాయంగా గత సంవత్సరం, సంవత్సరన్నర నుంచి గట్టి ప్రయత్నం చేస్తున్నాము. అయితే డి.ఎఫ్.ఐ.డి. తో డాక్టర్సు నియామకం గాని, హాస్పిటల్సు నిర్మాణం గాని చేసే అవకాశం ఉండదు. ఇది స్పెసిఫిక్‌గా కొన్ని డిపార్టుమెంట్సులో సదుపాయాలు కల్పించడానికి ఇచ్చిన సాయం.

శ్రీ ఆర్. సూర్య ప్రకాశ రావు : కొత్తగా తీసుకోబోయే పోస్టులకు ఈ డి.ఎఫ్.ఐ.డి. నిధులను వాడతారా? అలాగే జనాభా ప్రాతిపదికగా ఉండాల్సిన ప్రైమరీ హెల్త్ సెంటర్సు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్సుకు కొత్తగా పెట్టబోయే వాటికి డి.ఎఫ్.ఐ.డి. నిధులను వాడతారా అని తమ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ కె. రోశయ్య : మరొక సారి మనవి చేస్తున్నాను అధ్యక్షా. D.F.I.D. project provides support to bridge the gap in the health system. అంతేగాని ఎక్స్‌పాన్షన్‌కి గాని, కొత్త డాక్టర్సు నియామకానికి గాని దీని ద్వారా అవకాశం లేదు. మరొకటి, 1571 పిహెచ్‌సిలు మనకున్నాయి. నారమ్సు ప్రకారం 200 పిహెచ్‌సిలు మనకు కావాలి. చాలామంది శాసనసభ్యులు కలిసినపుడు అడుగుతూ వుంటారు, నియోజకవర్గాలలో పెద్ద పెద్ద గ్రామాలు, మునిసిపల్ టౌన్సు కాకపోయినా, చాలా మండల్ హెడ్‌క్వార్టర్సులోను,

ఇంపార్టెంట్ విలేజెస్‌లోనూ, ఎక్కడ అవసరం ఉందో అక్కడ పెట్టాలని. వారి అభిప్రాయంతో నూటికి నూరు పాళ్లూ ఏకీ భవిస్తున్నాను. కాని 1570 పిహెచ్‌సిలలో డాక్టర్లును ప్రొవైడ్ చేసి, మెరుగైన సదుపాయాలు అందించలేని పరిస్థితి ఉన్నపుడు, కొత్తగా ఊరికే శాంక్షన్సు చేసుకోవడంలో ప్రయోజనం లేదు. ముందు ఈ 1570 ని ముందు తృప్తికరంగా పని చేయించి, తర్వాత ఫేజ్డ్ మేనర్‌గా నీడ్ బేస్డ్‌గా మరికొన్ని పిహెచ్‌సిలను మన ఆర్థిక తోడ్పాటుతో చేయడానికి ప్రయత్నం చేస్తున్నాము.

## పాఠశాల యాజమాన్య కమిటీల నియామకం

ప్రశ్న నెం. 102(6884)

శ్రీమతి పి. సుజాత(ఆచంట), శ్రీ సిహెచ్. బాబు రమేష్ (ఎల్లవరం), శ్రీ కె. జోగులు(పాలకొండ), శ్రీ పి. కేశవ్(ఉరవకొండ), శ్రీమతి పడాల అరుణ(గజపతినగరం), శ్రీమతి ఎల్. లలిత కుమారి(పలమనేరు), శ్రీ ఎ.ఎస్. మనోహర్(చిత్తూరు) – గౌరవనీయులైన పాఠశాల విద్యా శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ. రాష్ట్రంలో నామినేషన్ పద్ధతి ద్వారా పాఠశాలల యాజమాన్య కమిటీని నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించినదా;

ఆ. విద్యార్థుల తల్లిదండ్రులు ఓటర్లు అయినపుడు ఈ నిర్ణయం ప్రజాస్వామ్య విలువలను దెబ్బ తీయడానికి ఎన్నికల స్థానే నామినేషన్‌గా ప్రవేశించే రాజకీయులను అనుమతించడానికి దారి తీస్తుందా;

ఇ. అయితే, పాఠశాలల నిబంధనలు, ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్య లేమిటి?

**పాఠశాల విద్యాశాఖ మంత్రి (శ్రీమతి ఎస్. రాజ్యలక్ష్మి):**

అ. అవునండీ

ఆ. లేదండీ

ఇ. ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి పి. సుజాత : అధ్యక్షా, మంత్రి గారు ఇచ్చిన సమాధానం చూస్తే చాలా ధైర్యంగా చెప్పినట్లు ఉంది. ఎందుకంటే స్కూలుకు సంబంధించి నామినేషను మీద ఇస్తున్నారని అంటే అవునండీ అని ధైర్యంగా చెప్పినందుకు అభినందనలు. స్కూలు ఎడ్యుకేషనులో రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి అంటే లేదండీ అని చెప్పడం చెప్పుకోదగ్గ విషయం. మూడవది, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదని అన్నారు. అంటే విద్యా ప్రమాణాలను మెరుగుపరచుకోవడానికి ఏ చర్యలూ తీసుకోవడం లేదని అనడంలో ఎంత శోచనీయం?

ఎన్నికల ముందు గౌరవనీయులు రాజశేఖర రెడ్డి గారు అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థలకు అధికారాలు ఇస్తూ సంతకం చేస్తామని అన్నారు. ఎన్నికల తర్వాత ఏరు దాటి తెప్ప తగలబెట్టిన విధంగా చేశారు. అధ్యక్షా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచులను కాదని, ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థులతో, ఎంపిటిసి లతో, కాంగ్రెసు కార్యకర్తలతో సమన్వయ కమిటీలను వేయడం జరిగింది. అధ్యక్షా,

సర్వశిక్షా అభియాన్ గాని, ఇందిరమ్మ గ్రామాలు గాని, ఇందిరమ్మ చెరువులు గాని, పాఠశాల కమిటీలు గానీ ఇవన్నీ స్వంతంగా వేసుకోవడం జరిగింది. వారికి విద్యార్థుల మీద శ్రద్ధ లేదు. సర్వశిక్షా అభియాన్ పాఠశాల కమిటీలు, అదే విధంగా భవన కాంట్రాక్టుల కోసం తీసుకున్నారే తప్ప విద్యార్థుల బాగోగుల కోసం కాదు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచులను కాదని, అప్రజాస్వామికంగా కాంగ్రెసు కార్యకర్తలను వేయడం జరిగింది. కీర్తిశేషులు శ్రీశ్రీ గారు చెప్పినట్లు '' వీరికేదీ అనర్హం కాదు, గుడి, చర్చి, మశీదు, చివరికి బడి'' . దేనినీ వదలడం లేదు. ఇన్ని రకాలుగా వేసుకుంటున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాములో పాఠశాల నిర్వహణ అంతా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేది. పేరెంట్సు , విద్యార్థుల తల్లిదండ్రుల ఏకాభిప్రాయంతో ఈ కమిటీలలో వారిని తీసుకునే వారు. లేదా ఓటింగ్ ద్వారా కమిటీలను తీసుకునేవారు. దాని వల్ల విద్యా ప్రమాణాలు బాగుంటాయని చంద్రబాబు నాయుడు గారు ఒక మంచి ఉద్దేశ్యంతో ఆ విధంగా చేయడం జరిగింది. ఈ ప్రభుత్వంలో కమిటీల నిర్వహణ ఎంత ప్రజాస్వామికంగా ఉందో చూడండి.

ఎడ్యుకేషన్‌కు సంబంధించి కమిటీలు వేస్తున్నట్లు మాకు తెలియదు. నియోజకవర్గ ఎమ్మెల్యేలం మాకు తెలియదు. కాంగ్రెసు ఎమ్మెల్యేలకు ఏమైనా తెలుసేమో. నా నియోజకవర్గ కమిటీల విషయం నాకు తెలియదు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకెవరికీ కూడా తెలియదు. ఎండిఓలకు కూడా ఈ విషయం తెలియదని నాకు వారు చెప్పడం జరిగింది. ఈ విధంగా ఎవరికీ తెలియకుండా స్వంతంగా నామినేషను పద్ధతి మీద ఇచ్చుకోవడం ఎంతవరకూ సమంజసం? ఒకవేళ ఏదైనా వస్తుందేమోనన్న ఆలోచనతో అప్పటికప్పుడు ఎంఇఓలకు ఆర్డరు ఇచ్చారేమో తెలియదు. అదే రోజు కమిటీ వేస్తామని కొంతమంది, వాళ్లకి అనుకూలురైన తల్లిదండ్రులకు కబురు చేసి కమిటీలు వేయడం ఎంతవరకూ సమంజసం? ఆ విధంగా చేస్తే ఎంతమంది తల్లిదండ్రులు వస్తారు దీనికి? విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ రాకపోయినా ఫరవాలేదు, కమిటీలు వేసుకుంటాము మా ఇష్టం అని, కాంగ్రెసు కార్యకర్తలు రాకపోతే కమిటీలు వేయకుండా ఆపివేస్తాం అని నిర్మొహమాటంగా చెబుతున్నారు. ఇది ఎంతవరకూ సమంజసం? స్కూలు కమిటీలలో బయటి వాళ్లు వస్తున్నారు. స్కూలుకు సంబంధించని వారిని, స్కూలు గురించి అవగాహన లేని వారిని తీసుకుంటున్నారు. అవగాహన ఉన్న వారిని తీసుకోవాలి. లేదా తల్లిదండ్రులను తప్పనిసరిగా తీసుకోవాలి. కాంగ్రెసు నాయకులకు పదవులు ఇవ్వాలంటే వేరే పదవులు ఇచ్చుకోవాలి గాని అవగాహన లేని వారికి పదవులు ఇస్తే ఎంతవరకూ న్యాయమని మీ ద్వారా అడుగుతున్నాను.

నామినేషను పద్ధతి మీద ఇవ్వడం వల్ల టీచర్సు, పేరెంట్సు, స్కూలు విద్యార్థులలో రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. దీని వల్ల గ్రూప్సు ఏర్పడి చాలా గొడవలు వచ్చే అవకాశం ఉంది. దాని వల్ల విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయి.

ఉ.9.00

( తెలుగుదేశం సభ్యుల నుంచి అంతరాయం )

శ్రీమతి ఎన్.రాజ్యలక్ష్మి : అధ్యక్షా, విద్యా కమిటీల మీద సభ్యురాలు ఎంత ఎలాబొరేటెడ్‌గా, ఎంత ఆందోళనతో ప్రశ్న వేసారో, నేను అంత వివరంగానూ సమాధానం చెబుతాను, మధ్యలో డిస్టర్బ్ చేయవద్దని వారికి చెప్పండి. నేను చాలా లోతుగా సమాధానం చెబుతాను. కొంచం వారిని ఓపిక పట్టమని చెప్పండి. అధ్యక్షా, నేను పాయింట్ బై పాయింట్ చెబుతాను, ఎక్కడా డీవియేట్ కాను, సభ్యులు కొంచం అర్థం చేసుకోవాలని కోరుతున్నాను.

అధ్యక్షా, 1998 ప్రజల విద్యా భాగస్వామ్య చట్టం లోని నిబంధనల ప్రకారంగా, 2003 జూలై సెప్టెంబరు మాసాల మధ్య విద్యార్థుల తల్లితండ్రుల నుంచి ఎన్నికైన వారితోనే ఆ నాడు పాఠశాల విద్యా నిర్వహణా కమిటీలు ఎన్నుకోబడ్డాయి. వారు చెప్పిన దాంతో మేము ఒప్పుకుంటున్నాము. అయితే ఈ కమిటీల కాల పరిమితి 2005 జూలై నెలతో ముగిసింది. కాల పరిమితి ముగియడంతో వీటి నిర్వహణకు మండల విద్యాధికారులను, హెడ్ మాస్టర్లను పర్సన్స్ ఇన్‌ఛార్జెస్‌గా నియమించడం జరిగింది. తిరిగి ఈ విద్యా కమిటీలకు ఎన్నికలు నిర్వహించడానికి అనేక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తల్లితండ్రుల నుంచి, విద్యార్థుల నుంచి, ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

( తెలుగుదేశం సభ్యుల నుంచి అంతరాయం )

ఈ కమిటీలకు ఎన్నికలు జరగడం వల్ల పాఠశాలల్లో వాతావరణం చెడిపోతోందని, గ్రామాలలో కక్షలు, కార్పణ్యాలు తలెత్తుతున్నాయని చాలా మంది ఈ విద్యా కమిటీల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేసారు. అందుచేత స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులను చెయిర్ పర్సన్స్‌గా, విద్యార్థుల తల్లితండ్రుల భాగస్వామ్యంతో విద్యా నిర్వహణా కమిటీలను నియమించాలని మా ప్రభుత్వం చట్టానికి సవరణలను ప్రతిపాదించింది. ఈ రోజు సభ్యురాలు చాలా ఆరోపణలు చేస్తున్నారు. ఈ రోజు విద్యా కమిటీలకు ఎన్నికైన సర్పంచ్‌లు మాత్రమే అధ్యక్షులుగా వుంటున్నారు. ఇక్కడ ఫలానా పార్టీ సర్పంచే వుండాలని అనడం లేదు. ఏ పార్టీ వారైనా ఎన్నికైన సర్పంచులు మాత్రమే అధ్యక్షులుగా వుంటారు. అట్లాగే వార్డ్ మెంబర్ ఒక సభ్యునిగా వుంటారు. తల్లితండ్రుల నుంచి నామినేట్ చేయబడే నలుగురు సభ్యులు విధిగా సంబంధిత పాఠశాలల్లో చదివే పిల్లల తల్లితండ్రులై వుండాలి.

ఇక కాంగ్రెస్ సభ్యులను మాత్రమే నామినేట్ చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ఆ పాఠశాలల్లో కాంగ్రెస్ విద్యార్థులు మాత్రమే చదువుతారా ? ఇక వేరెవరూ చదవరా ? ఈ నామినేటెడ్ సభ్యులను ఎట్లా పడితే అట్లా కాకుండా వారిని నామినేట్ చేసేందుకు గాను కొన్ని నిర్దిష్టమైన మార్గదర్శక సూత్రాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

( అంతరాయం )

తల్లితండ్రుల నుంచి నామినేట్ అయ్యే సభ్యులకు 3 కండిషన్లు పెట్టాము. శ్రద్ధ, నిబద్ధత, అనుభవం – ఈ మూడూ వుండాలి. ఈ విషయంలో ఎవరిని పడితే వారిని సభ్యులుగా నియమించడానికి వీలు లేదు. ఒకవేళ నామినేట్ అయిన వారి మీద ఏమైనా ఫిర్యాదులు కాని, ఆరోపణలు కాని వస్తే, వాటిని విచారించడానికి అవసరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుంది.

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రికి నామినేషన్ అధికారాన్ని కట్టబెట్టడం అనే విషయం పై వారు ఆందోళన వ్యక్తం చేసారు. ఏదో జరిగిపోతోందని వారు ఆందోళనలో వున్నారు. అయితే ఎటువంటి ఆందోళనా వారికి వుండవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. జిల్లాల వారీగా పాఠశాల విద్యా కమిటీల ఎన్నికల సందర్భంగా గతంలో జరిగిన గొడవలు ఏ ప్రభుత్వ హయాంలో జరిగాయో చెప్పమని కోరుతున్నాను. ఘర్షణల కారణంగా రాష్ట్రంలో 2,415 ప్రాంతాలలో ఆ నాడు ఎన్నికలు వాయిదా పడ్డాయి. రక్తపాతాలు జరిగాయి, కొట్లాటలు కూడా జరిగాయి. తలలు పగిలాయి. అందులో నా నియోజక వర్గం కూడా వుంది. పసిపిల్లలు, పాఠశాల విద్యార్థులు వాటిని చూసి భయపడడం జరిగింది. అందువల్ల ఎలక్షన్లు కాకుండా నామినేషన్ పద్ధతి మీద కమిటీలను

నియమించాలనే ఆలోచన, సమాజంలోని విద్యార్థుల నుంచి, పాఠశాల విద్యార్థుల తల్లితండ్రుల నుంచి, వచ్చిన అభిప్రాయాల ప్రకారంగా చేయడం జరిగింది.

( తెలుగుదేశం సభ్యుల నుంచి అంతరాయం )

అధ్యక్షా, కాంగ్రెస్ సభ్యులకు అధికారాలను కట్టబెట్టడానికే ఈ విధంగా చేసారనే మరొక అభియోగాన్ని కూడా వారు చేయడం జరిగింది. గురివింద గింజ తన నలుపును ఎరుగదన్నట్లుగా మాట్లాడుతూ వుంటే ఏమి చెప్పాలి ? గతంలో నోడల్ అధికారులను నియమించి స్థానిక సంస్థల, ప్రజా ప్రతినిధుల అధికారాలను హరించింది ఎవరు ? తెలుగుదేశం ప్రభుత్వమా, కాంగ్రెస్ ప్రభుత్వమా ?

( తిరిగి అంతరాయం )

సర్, నేను ఖచ్చితంగా చెబుతున్నాను, నా దగ్గర సమాధానం స్పష్టంగా వుంది. ఈ రోజు సవరించబడిన నిబంధనల ప్రకారం గ్రామ స్థాయిలో ఏడుగురు సభ్యులతో కూడిన పాఠశాల నిర్వహణ కమిటీ ఏర్పాటవుతోంది, ఇది ఎవరికీ తెలియకుండా చేసారని ఆరోపణ చేసారు. జి.ఒ. నెం.95, తేదీ 2-12-2006 ప్రకారంగా పాఠశాల విద్యా నిర్వహణ కమిటీలో నలుగురు విద్యార్థుల తల్లితండ్రులను, సంబంధిత జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నామినేట్ చేస్తారని ఒక బిల్లును కూడా మా ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. ఆ చర్చలో అందరూ పాల్గొన్నారు. వారు చివరి వరకూ ఓర్పు వహించకుండా వాకౌట్ చేసారు. మనకు స్పష్టమైన నియమ నిబంధనలు వున్నాయి. ఎటువంటి భయాందోళనలూ పడవలసిన అవసరం లేదు. ఎటువంటి పొరబాట్లు కాని, అవకతవకలు కాని జరిగినట్లుగా తెలిస్తే, ఆ కమిటీ మీద యాక్షన్ తీసుకోవడం జరుగుతుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

( తెలుగుదేశం సభ్యుల నుంచి అంతరాయం )

మిస్టర్ స్పీకర్ : సుజాత గారూ, మీరు రెయిజ్ చేసిన సప్లిమెంటరీల మీద మంత్రి గారు స్పెసిఫిక్‌గా గవర్నమెంట్ పాలసీ ప్రకారం చెప్పారు. దానిపైన అభ్యంతరాలు, సూచనలు ఏమైనా వుంటే స్పెసిఫిక్‌గా సబ్జెక్ట్‌కు కన్‌ఫైన్ అయి మాత్రమే చెప్పండి.

శ్రీమతి పి.సుజాత : అధ్యక్షా, గౌరవ మంత్రి గారికి అసెంబ్లీలో చాలా మంచి పేరు వుంది. దయచేసి ఈ సమాధానంతో చెడ్డ పేరు తెచ్చుకోవద్దని తమరి ద్వారా వారిని కోరుతున్నాను. కొన్ని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని వారు చెప్పడం జరిగింది ? ఎవరి ద్వారా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి ? వారి కార్యకర్తల ద్వారానా ? వాటిని చూపించమనండి ? గ్రామ సర్పంచ్‌లను చెయిర్మన్‌లుగా పెడుతున్నామని అన్నారు. సర్పంచ్‌లు అంటే కాంగ్రెస్ సర్పంచ్‌లను పెడుతున్నారా ? మా ప్రాంతాలలో ఆ విధంగా మా పార్టీలకు సంబంధించిన సర్పంచ్‌లను పెట్టడం లేదు. అట్లాగే ఎన్నికలలో తలలు పగులుతున్నాయి కాబట్టి ఆపి వేసామంటున్నారు. మరి అనేక ఎన్నికలలో తలలు పగులుతున్నాయి, వాటిని అన్నిటినీ ఆపివేస్తున్నారా ?

సర్, ఈ సందర్భంగా నేను కొన్ని సూచనలు చేయాలనుకుంటున్నాను. విద్యా కమిటీలలో వుండే వారు ఎడ్యుకేటెడ్ పీపుల్ అయి వుండాలి. ఎడ్యుకేషన్ మీద ఇంటరెస్ట్ వుండే వారినే విద్యా కమిటీలలో తీసుకుంటే బాగుంటుంది. అందువల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపడే అవకాశాలు వుంటాయి. విద్యా కమిటీలలో వుండే

వారికి స్కూల్ మీదా, పరిసరాల మీదా అవగాహనా కలిగి వుంటే మంచిది. ఈ కమిటీల చైర్మన్, మెంబర్లు లోకల్స్ అయి వుండాలి. పేరెంట్స్, టీచర్స్, ఈ కమిటీలలో వుండే మెంబర్స్, మరియు చైర్మన్‌ల మధ్య కోఆర్డినేషన్ వున్నట్లయితే రెస్పాన్సిబిలిటీ వస్తుంది. డవలప్‌మెంటల్ యాక్టివిటీస్ కాని, ఎకనామిక్ యాక్టివిటీలు కాని మెరుగుపడతాయి. ఒక రిటైర్డ్ టీచర్‌కు ఈ కమిటీలో స్థానం కల్పించినట్లయితే బాగుంటుంది, స్కిల్స్ కూడా డవలప్ అయ్యే అవకాశం వుంటుంది.

ఉ.9.10

(తెలుగుదేశం పార్టీకి చెందిన గౌ.సభ్యుల నుండి తీవ్ర అంతరాయం)

ఈ రోజు తొమ్మిదన్నర కల్లా క్వశ్చన్ అవర్ క్లోజ్ అవుతుంది. ఎస్....మినిస్టర్ గారూ....

శ్రీమతి ఎన్. రాజ్యలక్ష్మి : నేను చాలా స్పష్టంగా తెలియచేయడం జరిగింది అధ్యక్షా. తల్లిదండ్రుల నుండి నామినేట్ చేయబడే వారి విషయంలో మూడు మార్గదర్శక సూత్రాల్ని అమలుపరుస్తున్నాము. శ్రద్ధ, నిబద్ధత, అనుభవం కల్గిన వారై ఉండాలని మా నార్మ్స్‌లో పెట్టడం జరిగింది. ఎవర్ని పడితే వారిని నామినేట్ చేయడం లేదు. పైగా ఎం.ఇ.ఓ.లు ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌కు తల్లిదండ్రుల నామినేషన్‌కు సంబంధించి జాబితాను సమర్పించడం జరుగుతుంది. అదే విధంగా డిప్యూటీ డిఇఓలు హైస్కూల్స్‌కు సంబంధించిన జాబితా అందిస్తారు. ఈ జాబితాల్ని పరిశీలించి, సభ్యుల అర్హతల్ని డిఇఓ స్థాయిలో పరిశీలించి, ఈ జాబితాను జిల్లా కలెక్టర్లకు అందచేయడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్లు ఈ జాబితాను పున:పరిశీలించి, జిల్లా ఇన్‌ఛార్జ్ మినిస్టర్‌గారికి సిఫార్సు చేస్తారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మినిస్టర్‌గారు ఆమోదం తెల్పిన తర్వాత, డిఇఓ గారు నామినేషన్ ఆదేశాలు జారీ చేస్తారు. ఈ విధంగా పాయింట్ బై పాయింట్ ప్రాసెస్ జరుగుతుంది. కాబట్టి ఎవర్ని పడితే వారిని సభ్యులుగా నామినేట్ చేసే అవకాశం ఇందులో ఎంత మాత్రం ఉండదని నేను మీ ద్వారా సభ్యులకు తెలియచేస్తున్నాను. పైగా నేను మొదటే చెప్పడం జరిగింది. సర్పంచ్ దీనికి అధ్యక్షులుగా ఉంటారు. పార్టీ రహితంగా ఎన్నుకోబడిన ప్రతి సర్పంచ్ అధ్యక్షులుగా ఉంటారు. అలాగే వార్డ్ మెంబర్ కూడా కమిటీలో సభ్యులుగా ఉంటారు....

మిస్టర్ స్పీకర్ : సుజాతగారు ఏమంటున్నారంటే, వారి నియోజకవర్గంలో వారి సర్పంచ్ ఆ విధంగా అపాయింట్ కాలేదు అని చెపుతున్నారు....

శ్రీమతి ఎన్.రాజ్యలక్ష్మి : తప్పనిసరిగా నియమించి తీరుతాము. ఒకవేళ అటువంటిది ఏదైనా జరిగితే, వెంటనే రిపోర్టు తెప్పించుకుని నేను సవరించడం జరుగుతుందని మీ ద్వారా గౌ.సభ్యురాలకు తెలియచేస్తున్నాను.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

MR.SPEAKER: Please bear with me. నేను మొదటే చెప్పాను, తొమ్మిదన్నర కల్లా క్వశ్చన్ అవర్ పూర్తవుతుంది.

(అంతరాయం)

I am very clear అనేకమైన ప్రశ్నలు ఉన్నాయి. ఇంకా తొమ్మిది ప్రశ్నలు ఉన్నాయి. ఇప్పుడు ఈ ప్రశ్న 8.50కి మొదలయింది. ఇప్పుడు 9.15 అవుతోంది. ఒక్క ప్రశ్నకే 25 నిమిషాలు అయితే మిగతా ప్రశ్నల్ని ఏమి

చేయమంటారు చెప్పండి. మీకు ఇంకా అనేక మార్గాలు వస్తాయి. అనేక అవకాశాలు వస్తాయి. You cannot insist all the time like this. Please cooperate with the Chair.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

ఇంకా మనకు 15 నిమిషాలే ఉంది. ఇంకా తొమ్మిది ప్రశ్నలు ఉన్నాయి. దయచేసి గమనించాలి. మీరు అడిగారు, వారు చెప్పారు. Question No. 103(7135) is postponed at the request of the Member. Now. Question No. 104 (6810).

ప్రశ్న నంబరు 104 (6810)

శ్రీ శత్రుచర్ల విజయరామరాజు : అధ్యక్షా, ఎ ప్రశ్నకు సమాధానం --గోదావరి బేసిన్ నుండి 130 టిఎంసిల నీటిని .....

( ఈ దశలో తెలుగుదేశం పార్టీకి చెందిన గౌ.సభ్యులు వెల్ దగ్గరకు వచ్చి అంతరాయం కల్గించసాగారు. శ్రీ కె. అచ్చన్నాయుడు తనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వవలసిందిగా కోరసాగారు)

MR.SPEAKER: We will leave it there. I will close the Question Hour at 9.30 a.m.

శ్రీ కె. అచ్చన్నాయుడు : అధ్యక్షా, విద్యా కమిటీలు విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ఉపయోగపడేలా ఉండాలని ఆ రోజున ఒక నిర్ణయం తీసుకుని కమిటీలు వేశాము. మంత్రిగారు చాలా స్వీట్‌గా కబుర్లన్నీ చెపుతున్నారు. కాని జిల్లాలో అమలుజరుగుతున్న తీరును పరిశీలించడం లేదని ఈ రోజు వారి ఇచ్చిన సమాధానంలో మాకు అర్థమయింది. నేను ఉపన్యాసాలివ్వను, నాలుగైదు ప్రశ్నలు అడుగుతాను, మంత్రిగారిని స్పష్టంగా చెప్పమనండి.

గతంలో విద్యా కమిటీల ఎన్నికలు జరిగినపుడు, గొడవలు జరిగాయి, తలలు పగిలాయని అందుకే మేము నామినేట్ చేశామని మంత్రిగారు చెప్పారు. అలా అయితే ఈరోజున గ్రామ సర్పంచ్, లోకల్ బాడీస్ ఎన్నికలు, ఎమ్.ఎల్.ఏ.లు, ఎం.పి.ల ఎన్నికలన్నీ వివాదస్పదంగా మారి తలలు పగులుతున్న సంగతి మీకు తెలుసు. మరి వాటన్నింటికి కూడా మీరు నామినేట్ చేసే అవకాశం ఉందా? రెండవది, ఈ రోజు కమిటీల ఏర్పాటు గురించి మంత్రిగారు చెపుతున్నారు. సర్పంచ్ అధ్యక్షులుగా ఉంటారని, ఆ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులుగా ఉంటారని మంత్రిగారు చెపుతున్నారు. అయితే అధ్యక్షా, ఇక్కడ ఎంత దారుణం అంటే, ఆ కమిటీల్లో మందు బాబులు ఉన్నారు, రౌడీ షీటర్లు ఉన్నారు, కంట్రాక్టర్లు ఉన్నారు. వీరందర్నీ మీరు నియమిస్తే, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని మీరు భావిస్తున్నారా? దానికి మంత్రిగారు స్పష్టంగా సమాధానం చెప్పాలి. మూడవది, మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత, రెండున్నర ఏళ్లు ఏ కమిటీలు వేయలేదు. ఈ రోజున కేంద్ర ప్రభుత్వం సర్వ శిక్షా అభియాన్ పథకం కింద ఇచ్చిన రూ.500 కోట్లు మీరు ఖర్చు పెట్టలేకపోతున్నారు కాబట్టి, మేము వెనక్కి తీసుకొంటామని చెప్పితే, ఆదరాబాదరాగా మీరు విద్యా కమిటీల్ని వేసి, ఆ రూ.500 కోట్లు దోపిడీ చేయడానికే ఈ కమిటీలు వేశారు తప్ప, విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కాదు. ఒకవేళ డిఇఓ నామినేట్ చేస్తారని చెపుతున్నారు కాబట్టి, ఒక జిల్లాలో మూడు వేల దాకా పాఠశాలలు ఉంటాయి. ఏ విద్యా శాఖాధికారి ఏ గ్రామానికి వెళ్లి కమిటీ వేస్తారు? మీరు ఒకవేళ గొడవలు జరుగుతాయని ఆలోచిస్తే, ప్రతి పాఠశాలలో ఒక మంచి ఉత్తమ విద్యార్థి ఉంటాడు, అతని తల్లిదండ్రుల్ని కమిటీలో వేయండి. ఎక్కడయితే క్రీడల్లో మంచి రాణింపు తెచ్చుకుంటున్న విద్యార్థి ఉంటాడో,

అతని తల్లిదండ్రుల్ని వేయండి. ఇప్పటికే విద్యా వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. నిన్ననే కోర్టు కూడా తీర్పు ఇచ్చింది. మొన్న జరిగిన డిఎస్‌సి-2006 కూడా రద్దు కాబోతున్నది...

మిస్టర్ స్పీకర్ : కొంచెం ఆవేశం తగ్గించి చెప్పండి.

శ్రీ కె. అచ్చన్నాయుడు(హరిశ్చంద్రపురం) : విద్యా విధానం అంతా అస్తవ్యస్థం అయింది. దాని గురించి సరైన చర్యలు తీసుకోవాలి. మీ కార్యకర్తలకు మంచి చేయడం కోసం, మొత్తం విద్యా వ్యవస్థనే ఛిన్నాభిన్నం చేస్తున్నారు. దయచేసి దీని గురించి పునఃఆలోచించమని కోరుతున్నాను.

శ్రీమతి ఎన్. రాజ్యలక్ష్మి : అధ్యక్షా, సభ్యుల ఆవేదన చూస్తే, పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది అన్నట్లుగా ఉంది. వారు ఏ తప్పు అయితే చేశారో, ఆ తప్పే వీరు ఎందుకు చేయకూడదు, ఆస్కారం ఉంది కదా అని ఆలోచిస్తున్నారు తప్పిస్తే, మంచిని తీసుకుని వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు వీళ్లు అని ఏమాత్రం ఆలోచించడం లేదు. స్థానిక సంస్థల్లో జరిగే గొడవల్ని విద్యా వ్యవస్థల్లోకి తీసుకుని వస్తే ఎలా అధ్యక్షా? విద్యా సంస్థలు అనేవి పవిత్ర దేవాలయాలు ........

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

మురికి, మాలిన్యం ఉండకూడదు, పిల్లలు స్వచ్ఛంగా ఉండాలి, మంచి వాతావరణంలో ఉండాలనే ఆలోచనతో అక్కడ గొడవలకు ఆస్కారం లేకుండా చూడాలనే ఉద్దేశ్యంతోనే తీసుకున్న నిర్ణయం ఇది. అక్కడ నామినేట్ చేస్తున్నప్పుడు ఇక్కడ ఎందుకు చేయరని అని అడిగితే ఎట్లా అధ్యక్షా? రూ.500 కోట్లు జేబులో వేసుకోవడానికే కమిటీలు వేశామని అంటున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం జేబుల్లో వేసుకునే ప్రభుత్వం ఎంత మాత్రం కాదు. ఏదైనా ఒక మంచి పని చేయాలనే ఆలోచనతో, పార్టీలకతీతంగా తీసుకున్న నిర్ణయం ఇది. కమిటీలో సర్పంచ్‌ను ఎక్స్ అఫీషియో మెంబరుగా పెడుతున్నాము. ఎందుకంటే సర్పంచ్ అయితే స్థానికంగా ఏ కార్యక్రమం జరిగినా ఆయన పర్యవేక్షణలో జరుగుతుందని. అదే విధంగా వార్డు మెంబర్లు కూడా ఇందులో సభ్యులుగా ఉంటారు. వారి పర్యవేక్షణ కూడా ఉంటుంది. కాబట్టి ఇక్కడ ఎవరికీ తినే అవకాశం రాదు. మేము కేవలం పనులు చేసే వాళ్లమే తప్ప, తినే వాళ్లం కాదని మీ ద్వారా గౌ.సభ్యులకు తెలియచేస్తున్నాను. సర్పంచ్‌కు ఎటువంటి అధికారం ఇవ్వవద్దని చెపుతారా వీళ్లు? సర్పంచ్, వార్డు మెంబర్లతోపాటు, విద్యా కమిటీలో హెడ్ మాస్టర్ గాని, సీనియర్ అసిస్టెంట్ గాని ఒక మెంబరుగా ఉంటారు. ఈ విధంగా అందరి పర్యవేక్షణలో విద్యా కమిటీలు సక్రమంగా పని చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాము. అంతే తప్ప విద్యా కమిటీల వ్యవస్థను వక్రీకరించే దానికో, దుర్వినియోగం చేసే దానికో కాదని మీ ద్వారా గౌ.సభ్యులకు తెలియచేస్తున్నాను.

MR.SPEAKER: O.K. Now Question No.104( 6810), Minster for Minor Irrigation.

శ్రీ శత్రుచర్ల విజయరామరాజు : అధ్యక్షా, ఎ ప్రశ్నకు సమాధానం -- గోదావరి బేసిన్ నుండి 130 టిఎంసిల నీటిని, కృష్ణా బేసిన్ నుండి ........

(తెలుగుదేశం పార్టీకి చెందిన గౌ.సభ్యులు వెల్ దగ్గర నిలబడి అంతరాయం కల్గించసాగారు)

ఉ.9.20

ఈ రోజు ఉ.9.30ని.లకు క్వశ్చన్ అవర్‌ని ముగిస్తాను. మిగతా సభ్యులు అడగాల్సిన ప్రశ్నలు ఉన్నాయి. అచ్చన్నాయుడు గారు నిరసన తెలియజేస్తానని చెప్పి మూడు సప్లమెంటరీలు అడిగారు. ఈ రోజు బడ్జెటుపై వైండింగ్ అప్ మరియు రిప్లై ఉంది. ప్రతి ప్రశ్నకూ ప్రాధాన్యత ఉంటుంది. ఈ ప్రశ్నకు అత్యంత ప్రాధాన్యత ఉందంటే, దాన్ని వేరే విధంగా చర్చించాల్సిన అవకాశాలు ఉంటాయి. మీరు వేరే రూల్ క్రింద వస్తే డిస్కస్ చేయవచ్చు. ఒకే ప్రశ్నపై నాలుగు గంటలు మాట్లాడడం కాదు.

శ్రీ ఎమ్.ఏ. గఫూర్ (కర్నూలు) :- మీరు రెగ్యులేట్ చేయండి.

మిస్టర్ స్పీకర్ :- I am trying to regulate the time. నేను క్వశ్చన్ అవర్‌ని 9.30ని.లకు ముగిస్తాను. ఇదే ప్రశ్న ముఖ్యమనుకొంటే you come in a different manner. క్వశ్చన్ అవర్‌ని మనం డిబేట్ క్రింద మారుస్తే ఈ రూల్స్ ఎందుకు, రోజూ మనం ఇది, ఇది మాట్లాడుకొందామని అనుకొని, అనుకొంటే సరిపోతుంది. మా ప్రింటింగ్ కాస్ట్ అయినా సేవ్ అవుతుంది. What is this, Please register you protest.

శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు(కుప్పం) :- అధ్యక్షా, పాఠశాల విద్యా కమిటీలను మంచి పర్పస్ కోసం పెట్టాము. అటువంటిది మీరు ఈ రోజు డీవియేట్ అవుతున్నారు. నామినేషన్ విషయాన్ని చూస్తే, శ్రద్ధ, నిబద్ధత మరియు అనుభవం వీటిని మీరు ఏ విధంగా జడ్జి చేస్తారు. మీకు ఎవరు మంచిగా కనిపిస్తే, వారికి శ్రద్ధ ఉంటుంది, నిబద్ధత ఉంటుంది, అనుభవం ఉంటుంది. కాని మెరిట్ రాదు. మంత్రి గారు ఏదో ఊహించుకొని చాలా తెలివిగా సమాధానాలు చెపుతున్నారు తప్ప, వ్యవస్థని బాగు చేయాలనే ఉద్దేశ్యం మీకు లేదు. దేశం, రాష్ట్రం ప్రపంచమంతా నాలెడ్జ్ సొసైటీకి ప్రాధాన్యత ఇస్తున్నది. చదువుకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రైమరీ విద్యను భ్రష్టు పట్టించారు. ఒక్క టీచర్‌ని కూడా రిక్రూట్ చేయలేకపోయారు. విద్యా వాలెంటీర్స్‌ని సరిగా వేయలేకపోయారు. నా నియోజకవర్గంలో 800 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర మొత్తం మీదా చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 1989-94 మధ్య ఒక్క టీచర్‌ని నియమించలేదు. ఇప్పుడు మళ్లీ మీరు అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఒక్క టీచర్‌ని నియమించలేదు. విద్యా సంస్థల పరిమాణాలు పడిపోతున్నాయి. ఎన్నికల్లో క్లాషెస్ వస్తాయని మా సభ్యుడు ఇప్పుడు చెప్పారు. కాబట్టి, మీకు ఏ మాత్రం సిన్సియారిటీ ఉన్నా, మొదటి ర్యాంకు పొందిన విద్యార్థి తల్లిని గానీ తండ్రిని గానీ మీరు విద్యా కమిటీలో పెట్టండి. వారి కంటే మీరు రికమండ్ చేసే వారు గొప్పవారని అనుకొంటున్నారా. మీరు బెస్ట్ స్టూడెంట్ పేరంట్స్‌ని పెట్టకుండా, కావాలని నామినేషన్‌పై నియమించుకొంటున్నారని తెలియజేస్తున్నాను. ఈ రోజు ఎమ్.డి.ఓ. డి.ఇ.ఓ. వీరందరూ నామినేట్ చేస్తారని అంటున్నారు. ఆలిస్ట్‌ని ప్లానింగ్ బోర్డు మినిస్టర్‌కి పంపిస్తారని అంటున్నారు. ఇవన్నీ చూస్తే, సర్వశిక్షా అభియాన్ క్రింద ఐదు వందల కోట్ల రూపాయల విలువగల పనులు వస్తున్నాయి. అవన్నీ ఈ కమిటీలకు అప్పగించబోతున్నారు. వాటిని మీ మీ కార్యకర్తలకు అప్పగించడానికి చూస్తున్నారే తప్ప, విద్యా ప్రమాణాలు

పెంచడానికి కాదని తెలియజేస్తున్నాను. దయచేసి మీ కళ్లను విద్యా సంస్థలపై పడనీయ వద్దు. విద్యాసంస్థలను కాపాడండి. ఇప్పటికైనా మీ మనసు మార్చుకొని స్కూల్ కమిటిలో, పిల్లలు ఎవరైతే ఫస్ట్ ర్యాంకు సంపాదిస్తారో, వారి తల్లిదండ్రులను పెట్టి ఈ కమిటిలను వేయండని కోరుతున్నాను. వీటిలోకి రాజకీయాలు తేవద్దు. కాంగ్రేస్ కార్యకర్తలను వేసి విద్యా సంస్థలను కాంగ్రేస్ కార్యాలయాలుగా, సంస్థలుగా తయారు చేయవద్దని మంత్రి గార్ని కోరుతున్నాను. మీరు నేడు రూ.500కోట్లు ఖర్చు చేయబోతున్నారు. పనులను నామినేషన్‌పై ఇస్తున్నారు. రు.5 లక్షల విలువగల పనులను నామినేషన్‌పై ఇచ్చి కేంద్రం నుండి వచ్చే సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు. మధ్యాహ్నభోజన పథకం లో కూడా మీ వారినే వేసుకొంటున్నారు. అక్కడ స్టాండర్డ్స్ పడిపోయాయి. దయచేసి ఇప్పటికైనా ఆలోచించండి. మంత్రి గారు మీరేదో తెలివిగా చెపుతున్నారు. మీ తెలివి ఎంతవరకు వచ్చిందంటే, మూడు సంవత్సరాల నుండి టీచర్స్‌ని రిక్రూట్ చేయలేకపోయారు. కోర్టు ఏకీకృత సర్వీస్ రూల్స్‌ని కొట్టివేసింది, దీనివల్ల మొత్తం డి.ఎ.సి. కూడా పోతుందని అంటున్నారు. కాబట్టి, దయచేసి ఇక్కడ రాజకీయాలు తేవద్దు. విద్యాసంస్థల మార్పు చేయడానికి, మంచి చేయడానికి కృషి చేయాలని మంత్రి గార్ని కోరుతున్నాను.

MR.SPEAKER : Yes the protest is over. Now on the next question.

శ్రీ ఇ. రాజేందర్(కమలాపూర్) :- అధ్యక్షా, తెలంగాణా ప్రాంతం, మైనర్ ఇరిగేషన్ రంగంలో అత్యంత ప్రాధాన్యత కూడుకొంది. మంత్రి గారు సమాధానం చాలా కాంట్రడిక్ట్‌గా చెప్పారు.

MR. SPEAKER: Now as it is already 9.30 a.m. this question may take a lot of time to complete. Therefore, I will postpone it to a later date and I will see that it would be posted at an early date in view of its importance.

(Interruptions)

ఉ.9.30

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వ్రాతపూర్వక సమాధానములు(అనుబంధము-1)

MR. SPEAKER : Now, the rest of the Questions are deemed to have been answered except the Questions requested for postponement.

(Interruptions)

Yes, we will list it shortly. It will be considered and taken up at a later date. I have an announcement to make:

## ప్రకటన

I am to announce to the House that the Members of the Norwegian Parliamentary Standing Committee on Education, Research, etc., along with the Ambassador of Norway in India, have come to witness the Proceedings of our House. It is a great privilege and honour to have them here. On behalf of this august House, I extend them a hearty welcome. Their visit will go a long way in strengthening bonds of friendship between the people of Norway and India, especially Andhra Pradesh.

Now we will go on to the Budget. Ramnarayana Reddy garu, you please close in half an hour.

(Interruptions from Sri Akbarruddin Owaisi)

Owaisi sahab, I do understand and I totally agree with you. We can also have one more meeting and try to sort it out. We will try to see that we are not struck up on one particular Question. We will ensure that 8 to 9 minutes will be the maximum time given to each Member and, if the Members want any further discussion they can use the other opportunities. This way, we will try to give equitable time for all the Questions listed.

(Interruptions)

He is frustrated because he did not get the opportunity and he did not get the opportunity because the Question Hour had to be closed at 9.30 am. From tomorrow I will prepare every Member as to how to maintain time.

## 2007-2008 సం.పు వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్ ) పై - సాధారణ చర్చ (కొనసాగింపు)

శ్రీ ఆనం రామ నారాయణ రెడ్డి (రాపూరు): అధ్యక్షా, ఈ రోజు రాష్ట్ర బడ్జెట్ ప్రసంగం చర్చలో పాల్గొనేటువంటి అవకాశం తమరు నాకు ఇచ్చినందుకు తొలుతగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ నాడు ప్రవేశపెట్టిన ఈ బడ్జెటు ప్రధానంగా వ్యవసాయ రంగం, సాగు నీటి రంగం, సంక్షేమం, భూ యజ్ఞం, ఇందిరమ్మ, రాజీవ్ గృహ కల్ప, ఐ.టి రంగాలు వీటన్నింటికీ ప్రాధాన్యత ఇస్తున్నది. దీనిని ప్రజా సంక్షేమ బడ్జెటుగా, ప్రగతికి పెద్ద పీట వేసినటువంటి 2007-08 బడ్జెటుగా చెప్పవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. అదే విధంగా ఈ నాడు ఆర్థిక మంత్రి శ్రీ కొణిజేటి రోశయ్య గారు ఈ రాష్ట్రంలో ఈ నాడు ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్సులో దాదాపు 12 బడ్జెట్లు ఆయన ప్రవేశ పెడితే , అందులో 9 సాధారణ, 3 ఓటాన్ అకౌంటు బడ్జెట్సు ప్రవేశ పెట్టారు. ఈ రాష్ట్రంలో అత్యధికమైన బడ్జెట్సును ప్రవేశ పెట్టినటువంటి ఆర్థిక శాఖా మంత్రిగా వారు గుర్తింపు పొందడం, ఆర్థిక మేధావులు, పెద్దలు, వివిధ దినపత్రికలు అన్నీ కూడా ఈవేళ కీర్తిస్తున్న విషయం మనం గమనంలోకి తీసుకోవలసిన అవసరం ఉంది. అదే విధంగా ఈ రోజు భారత ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆలోచనల మేరకు భారత సమగ్రాభివృద్ధి, అలాగే ప్రధాని శ్రీమతి ఇందిరమ్మ గరీబీ హఠావో, రాజీవ్ గాంధీ సాంకేతికాభివృద్ధి - వీటి ద్వారా నిరుద్యోగ నిర్మూలన, ఆలోచనలతో కాంగ్రెసు ముందుకు నడుస్తూ, ఈ రోజు శ్రీమతి సోనియా గాంధీ గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ను సమగ్ర అభివృద్ధి దిశలో నడిపించాలని, సత్యంగా ఆలోచించి, ప్రజాసేవ ఋషిగా ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారి సేవా తపస్సుకు ప్రతిరూపమే ఈ 2007-08 బడ్జెట్ అని నేను మీ ద్వారా తెలియజేస్తున్నాను.

ఈ సందర్భంగా ఈ బడ్జెట్ విషయంలో వ్యవసాయం, వైద్యం, విద్య, నీటి పారుదల, సాంఘిక సంక్షేమ రంగాలకు అత్యంత ప్రోత్సాహం ఇచ్చి, తద్వారా పేద, మధ్య తరగతి ప్రజా జీవన సరళిని పెంచేందుకు కావలసిన అన్ని మౌలిక వసతులను కల్పించడమే కాకుండా అభివృద్ధిని పెంపొందించాలన్న, వారి జీవన సరళిని పటిష్టం చేయడం వంటి వాటికి తగిన మార్గాలను ఈ బడ్జెటులో చెప్పడం జరిగిందని చెప్పకతప్పదు. అదే విధంగా ఆర్థిక మంత్రి గారు గత 3 బడ్జెట్లను ప్రతిపాదించి, ఈ రోజు 4వ బడ్జెటును ఈ శాసన సభలో ప్రవేశ పెట్టే పరిస్థితిలో తెలుగుదేశం గత ప్రభుత్వం నుంచి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం అయిన పరిస్థితిలో ఈ వ్యవస్థను చేతబట్టి, దానిని చక్కదిద్దే దిశలో మా ముఖ్యమంత్రి గారు పర్యవేక్షించి, 2004-05, 2005-06 బడ్జెట్లతో

ఆర్థిక పరిస్థితులను చక్కదిద్ది, మూడవ బడ్జెటు ద్వారా 2006-07లో అన్ని రంగాలలో పరిపుష్టిని సాధించి, 2007-08 బడ్జెటులో ప్రజలందరికీ పరిపూర్ణమైన జీవితాన్ని ప్రసాదించే దిశగా , ప్రగతి దిశగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోంది అనడానికి ఇది ఒక నిదర్శనం.

ఉ.9.40

అదే విధంగా ఈ రోజు బడ్జెట్ ప్రతిపాదనలు జరిగినా, బడ్జెటు మీద చర్చలు జరిగినా ప్రతి ఒక్కరికీ కొన్ని సిద్ధాంతాలు ఉంటాయి. ఈ రోజు ప్రపంచ దేశాలు కూడా ఈ సిద్ధాంతాలను అమలు చేస్తూ, సిద్ధాంతాలను పరిశీలనలోనికి తీసుకుంటూ, ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే దిశలో ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త రాగ్నర్‌నర్ సంతులిత వృద్ధి సిద్ధాంతం అంటే, అధ్యక్షా , సంతులిత వృద్ధి సిద్ధాంతం అంటే, గ్రాస్ బేలన్స్‌డ్ గ్రోత్, ఈ రోజు మన రాష్ట్ర ఆర్థిక బడ్జెటుకు పునాది వేశారు. దీనిని తీసుకుని 4 విధాల మూల ధనాన్ని ఆర్థిక శాఖ సేకరించుకోవాలని మనవి చేస్తున్నాను. నాలుగు రకాలుగా చెప్పినటువంటి స్వచ్ఛంద పొదుపు, పరోక్ష పన్నులను విదేశీ పెట్టుబడులు, వివిధ సంస్థల నుంచి తెచ్చిన అప్పుల మీద ఆధారపడి ఉంటుంది. కాని మన దేశ పరిస్థితులను బట్టి ఈ రోజు వినియోగ రేఖ consumption line పెరిగి పొదుపు స్థాయి తగ్గింది కాబట్టి, ఈ రోజు పొదుపులో మనం కేపిటల్ ఫార్మేషను చేయడంలో వెనకబడిపోతున్న విషయం మనం గమనంలోకి తీసుకోవాలి. అదే విధంగా పన్నుల మార్గం, పన్నులు వేయడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా లేదు. కొత్త పన్నులు వేయబోమని ముఖ్యమంత్రి గారు మొట్ట మొదట ప్రమాణ స్వీకారం చేసిన రోజు తీసుకున్న ఆలోచన ఈ 4వ బడ్జెటులో కూడా ప్రవేశ పెట్టి, కొత్త పన్నులను రాష్ట్ర ప్రజల మీద వేయబోమని చెప్పారు. రెండు విధాలుగా ఈ పన్నుల మార్గాన్ని మేము ఎంచుకోలేదు. ఈ నాడు మిగిలిన రెండు మార్గాలలో ఒకటి విదేశీ మూల ధనం, ఆస్థులు, అప్పుల సేకరణ ఈ దేశం గాని, రాష్ట్రం గాని సమగ్ర సంతులిత అభివృద్ధి కోసం విదేశీ పెట్టుబడులు పెట్టడం, అప్పులను చేయడం తప్పుదు. ఈ రోజు అప్పులు చేయడం తప్పు కాదు. కాని చేసిన అప్పులు తెచ్చిన నిధులు సక్రమ రీతిలో ఖర్చు పెడుతున్నామా లేదా అన్నది ముఖ్యం . పెట్టిన పెట్టుబడికి సరైన రాబడి ఈ రాష్ట్ర ప్రజలకు అందుతోందా లేదా , ఆ ఫలితాలు ఈ రాష్ట్ర ప్రజానీకం పొందుతోందా లేదాన్న ఆలోచనతో, ఎంచుకునేటువంటి పథకాలు ఈ రోజు ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారి నాయకత్వంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని చెప్పక తప్పదు.

'వెల్త్ కన్నా వెల్ఫేర్ ' ముఖ్యమని ఈ రోజు ఎందరో ఆర్థిక శాస్త్రవేత్తలు అంటున్నారు. అందువల్ల ఈ రోజు మాన్యువల్ , పొలిటికల్ ఎకానమీ సిద్ధాంత కర్త అయిన విల్ ఫ్రెడో ఫెరిడో చెప్పిన సంచలనాత్మకమైన వెల్ఫేర్ ఎకనమిక్ కాన్సెప్ట్. ఈ రోజు అత్యంత ప్రాధాన్యతను అది సంతరించుకుంది. ఈ రాష్ట్ర బడ్జెటు దానిపై రూపకల్పన చేయబడి ముందుకు పోతున్నదని మనవి చేస్తున్నాను. ఫెరిడో సిద్ధాంతాన్ని మనం చూసుకోవలసిన అవసరం ఉంది. నేను ఒక వాక్యం మీ ముందుంచి మిగతా వివరాలలోకి వెళతాను. వెల్ ఫ్రెడో ఫెరిటో సిద్ధాంతం "Any change that makes atleast one person better without making any person worse makes definitely an improvement in social welfare". ..... అనేటువంటి వాక్యాన్ని ఆయన సిద్ధాంతంలో పొందుపరచి, ఈ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి, మెరుగుపరచడానికి ఈ సిద్ధాంతాన్ని మనం ఈ బడ్జెటులో రూపకల్పనలో తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అదే విధంగా ఈ రోజు ఎలకేటివ్ ఎఫిషియన్సీ అని చెప్పడం జరిగింది. వివిధ వనరులు సమకూర్చుకుని వాటిని సమగ్ర రాష్ట్ర అభివృద్ధికి ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి పేద,

బడుగు వర్గాల ప్రజల ప్రయోజనాలకు అన్ని విధాలుగా , అన్ని విభాగాలకు ఖర్చు చేయడానికి ఎలకేటివ్ ఎఫిషియన్సీ ద్వారా ఈ బడ్జెట్‌ను మనం ముందుకు తీసుకు వెళుతున్నాము.

అదే విధంగా మన ఆర్థిక మంత్రి రోశయ్య గారు ఈ రోజు ఎలకేటివ్ ఎఫిషియన్సీతో మరొక ఆలోచన వారు జ్ఞప్తికి తీసుకుని ఆ ఆలోచనతో వారు ఈ రోజు .... Let us be wise witnessing the changes ..... అని స్వామి వివేకానంద గారి ఆలోచన కూడా ఈ బడ్జెటు తయారు చేయడంలో పొందుపరచాలన్న ఆలోచనతో వారు సమగ్ర అభివృద్ధికి పెద్ద బాట వేయడం జరిగింది.

అదే విదాంగా 2007-08 సంవత్సరానికి రూ. 8,220 కోట్ల లోటుతో ఈ బడ్జెటును , రూ. 80 కోట్ల భారీ బడ్జెటు సమర్పించడం జరిగింది. విశదంగా చెప్పాలంటే 2006-07 లో బడ్జెటు దాదాపు 30 శాతం అధికంగా ఇతర రాష్ట్రాలు విస్తుపోయే విధంగా అభివృద్ధి పథంలోకి రాష్ట్రాన్ని శరవేగంగా రికార్డు స్థాయిలో బడ్జెటును రూపొందించి ఈ రోజు మన ముందుంచడం జరిగింది. రెవిన్యూ, రాబడులు తెలుగు దేశం ప్రభుత్వంలో ప్రజలపై ఎన్నో రకాలుగా పన్నుల భారాన్ని మోపారు. ఆ నాడు ప్రతిపక్షంలో ఉండి ఆ నాడు ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న ఆయన ఈ నాటి ముఖ్య మంత్రి రాజశేఖర రెడ్డి గారి నాయకత్వంలో నాడు పన్నుల భారాన్ని ఈ రాష్ట్ర ప్రజలు మోయలేరని చెప్పి మనం ఎన్నో విధాలుగా ఈనాడు ప్రభుత్వానికి వివరించి చెప్పడానికి ప్రయత్నం చేయడం జరిగింది. ఎన్ని పన్నులు వేసినా 2003-04 లో ఆ నాటి స్టేట్ ఎక్సైజ్ వస్తువాహనాలలో దాదాపు రూ. 12,488.32 కోట్ల పన్నులు వేసి, కేవలం 58 శాతం పన్నులు మాత్రమే వాళ్లు వసూలు చేయడం జరిగింది. 58 శాతం పన్నులు వసూలు చేస్తే మిగతా 42 శాతం పన్నులు రాబట్టలేక పోయిన వాళ్ల ఆర్థిక పరిస్థితి, వాళ్ల ఎడ్మినిస్ట్రేషన్ అని ఈ రోజు మనం చెప్పక తప్పదు. ఫెయిల్యూర్ ఆఫ్ ఫైనాన్షియల్ అడ్మినిస్ట్రేషన్ ఆ నాటి తెలుగు దేశం ప్రభుత్వానికి అన్వయించక తప్పదని మనవి చేస్తున్నాను. ఇదే విధంగా 2006-07 లో ఆ ప్రభుత్వం కన్నా ఈ నాడు ఉన్న ప్రభుత్వం రూ. 22,282.8 కోట్లు వసూలు చేసి 78 శాతం ఆదాయాన్ని ఈ రాష్ట్రానికి సమకూర్చుకోవడం జరిగింది. అదే విధంగా ఈ రోజు 2007-08 లో ఆంధ్ర రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కొరకు రూ. 27,121.65 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకునే దిశలో బడ్జెటు ప్రవేశ పెట్టడం జరిగిందని తమ దృష్టికి తెస్తున్నాను. రాష్ట్రంలో మొత్తం రెవిన్యూ రాబడులు సరిసీలిస్తే 2005-06 సంవత్సరంలో రూ. 34,851.19 కోట్ల గాను, 2006-07 సంవత్సరంలో రూ. 45,145.98 కోట్ల గానూ సమోదై వసూలు కావడం జరిగింది. అదే స్ఫూర్తితో 2007-08 సంవత్సరంలో రూ. 54,949.57 కోట్లు అంటే దాదాపు రూ. 55 వేల కోట్లు సవర్థవంతంగా వసూలు చేయగలమనే ఆలోచనను ఈ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, గత మూడు సంవత్సరాలలో రెవిన్యూ రాబడులు చూసినట్లయితే రాష్ట్ర ప్రజానీకం మీద ఏమాత్రం పన్నుల భారం వేసిన దాఖలాలు ఈ నాటి రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వం మీద లేవని తమరి ద్వారా తెలియజేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌కు వ్యాట్ ఒక వరం లాగా ఉంది. గత సంవత్సరం వ్యాట్ ఆదాయం రు.16,839 కోట్లు రాగా రాబోయే సంవత్సరంలో రు.20,568 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసుకోవటం జరిగింది. హేతుబద్ధంగా పన్నులు రాబట్టుకుంటూ ప్రజల మీద పన్నుల భారం లేకుండా చక్కగా రెవిన్యూ రిసీట్స్‌ను ఇవ్వాళ తీసుకోవటానికి అన్ని రకాలుగా ప్రయత్నం చేయటం జరుగుతున్నది. ఇవ్వాళ రాష్ట్రంలో రెవిన్యూ రిసీట్స్ చూసినట్లయితే 2003-04లో 26, 868.49 కోట్లు. 2004-05 లో 28,749 కోట్లు, 2006-07లో 45,145.98 కోట్లు, 2007-08లో 54,841.57 కోట్లు నికరంగా సేకరించగలమని అంచనాలు ఇవ్వాళ

మనకున్నాయి. దానితో ఈ రాష్ట్రం యొక్క ప్రగతికి మార్గాలు సుగమం చేసుకుంటామని మనవి చేస్తున్నాను. అదేవిధంగా ఇవ్వాళ ఎన్నోరకాలుగా నిరర్థకంగా వున్న ప్రభుత్వ ఆస్తులు రు. 8700 కోట్లు మరియు ఆర్థిక మంత్రి గారు క్రమశిక్షణ పాటించటం వల్ల, వారి పర్యవేక్షణ వల్ల ఇవ్వాళ ఆర్‌బిఐ ఇన్సెంటివ్స్ రూపంలో రు. 1800 కోట్లు రాబట్టుకోగలిగాము. చిన్నతరహా డిపాజిట్లపైన రు. 13.25 శాతం వడ్డీ చెల్లించాలన్న ఒప్పందం ప్రకారం పది శాతానికి ఆర్‌బిఐ తగ్గించేవిధంగా ఇవ్వాళ చర్చలు కొనసాగుతున్నాయి. తద్వారా మరో రు. 400 కోట్లు ఆదాయం పెంచుకోవటానికి అవకాశముంది. అదేవిధంగా ఇవ్వాళ రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ప్రాథమిక, ద్వితీయ మరియు సర్వీస్ ఈ మూడు రంగాల ద్వారా రాష్ట్ర స్థూల ఆదాయం ప్రస్తుత ధరల్లో 2006 - 07 సంవత్సరపు ముందస్తు అంచనాల ప్రకారం రెండు లక్షల 60 వేల 734 కోట్లు. 2005 - 06 త్వరిత అంచనాలతో పోలిస్తే 12.2 శాతం అధికం కాగా 2005 - 06 స్థూల రాష్ట్ర ఆదాయం క్రితం ఏడాదితో పోలిస్తే 11.6 శాతం అధికం. అదేవిధంగా ప్రాథమిక రంగం స్థూల రాష్ట్ర ఆదాయం 2006 - 07 ముందస్తు అంచనాల ప్రకారం 2005 - 06 త్వరిత అంచనాలతో పోలిస్తే 4.4 శాతం తగ్గింది. 2005 - 06 సంవత్సరంలో నమోదైన 10.96 శాతం కంటే తక్కువ అయినప్పటికీ అందుకు ప్రధాన కారణం రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఈ సంవత్సరం కొంత వెనుకబడిందన్నది వాస్తవమని చెప్పకతప్పదు. ముఖ్యమంత్రి గారు ఈ రాష్ట్రంలో జలయజ్ఞం వల్ల కాని వ్యవసాయం మీద వున్న ప్రత్యేక పరిస్థితుల వల్ల కాని 2005 - 06లో ఈ రాష్ట్రంలో అత్యధికమైన దిగుబడులను సాధించటం జరిగింది.అది 169.5 లక్షల మెట్రిక్ టన్నులుండగా 2006 - 07లో కొంత తగ్గి ఇవ్వాళ వ్యవసాయ రంగం నుండి అభివృద్ధి రేటును కొంత చేజార్చుకోవటం జరిగింది. దానికి కారణం మనందరికీ తెలుసు. ఈ రాష్ట్రంలోని దాదాపు 16 జిల్లాలలో వరదల వల్ల పైర్లు నష్టపోయాము. 8 జిల్లాలలో పూరిగా కరువుకాటకాలు రావటం వల్ల వ్యవసాయ దిగుబడి తగ్గిందని మనవిచేస్తున్నాను. అదేవిధంగా ద్వితీయరంగంలో ఈనాడున్న ధరల ప్రకారం స్థూల రాష్ట్ర ఆదాయం 15.5 శాతం 2006 - 07తో పోలిస్తే అధికంగా ఉంది. సర్వీస్ రంగంలో 2006 - 07 ముందస్తు అంచనాల ప్రకారం 2005 - 06 త్వరిత అంచనాలతో పోలిస్తే ఇది 5.2 శాతం అధికం. 2005 - 06లో 2004 - 05 సంవత్సరాన్ని పోలిస్తే 11.8 శాతం అధికంగా ఉంది. దీనినిబట్టి చూస్తే ద్వితీయ, సర్వీస్ రంగాలలో పెరుగుదల ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మొత్తం స్థూల రాష్ట్ర ఆదాయం ప్రస్తుత ధరల ప్రకారం 2006 - 07లో సర్వీస్ రంగం వాటా 51.2 శాతం కాగా, ప్రాథమిక రంగం వాటా 26.9 శాతం. ద్వితీయ రంగం వాటా 21.9 శాతంగా ఉందని మీ ముందు వివరాలను తెలియజేస్తున్నాను. అదేవిధంగా ఇవ్వాళ నిలకడ ధరల ప్రకారం చూస్తే రాష్ట్ర స్థూల ఆదాయం 2006 - 07 ముందస్తు అంచనాల ప్రకారం రెండు లక్షల రెండు వేల 117 కోట్లు . 2005 - 06 త్వరిత అంచనాలతో పోలిస్తే 7.2 శాతం అధికమైంది. 2005 - 06లో స్థూల రాష్ట్ర ఆదాయంలో మొత్తం 8.2 శాతం పెరుగుదల నమోదైంది. 2006 - 07లో తక్కువ పెరుగుదల నమోదు కావటానికి ప్రధాన కారణం నేను ఇంతకుముందే మనవి చేశాను. వ్యవసాయ రంగంలో 6.6 శాతం వ్యతిరేక వృద్ధి రేటు నమోదు కావటమే. వివిధ రంగాలవారీగా చూస్తే నిలకడ ధరల్లో స్థూల రాష్ట్ర ఆదాయం కార్మిక రంగంలో 2006 - 07లో 2005 - 06 త్వరిత అంచనాలతో 1.4 శాతం వ్యతిరేక వృద్ధిరేటు నమోదు కాగా సర్వీస్ రంగంలో 10.2 శాతం, ద్వితీయ రంగంలో 11.6 శాతం పెరుగుదల నమోదైంది. కమ్యూనికేషన్స్ రంగంలో 32.7 శాతం, ద్వితీయ రంగంలో ఉప రంగమైన నిర్మాణ రంగంలో 14.1 శాతం పెరుగుదల నమోదైంది. 2006 - 07లో నిలకడ ధరల ప్రకారం సర్వీస్ రంగం వాటా 51.8 శాతం కాగా, ప్రాథమిక రంగం వాటా 26.6 శాతం, ద్వితీయ రంగం వాటా 21.6 శాతంగా నమోదైన విషయాన్ని ఈ సందర్భంగా మీ ముందుంచుతున్నాను.

ఉ.9.50

అదేవిధంగా, ఈనాడు రాష్ట్రంలో తలసరి ఆదాయం ప్రస్తుత ధరల ప్రకారం 2005-06లో త్వరిత అంచనాల ప్రకారం రూ.26,211 ఉండగా 2006-07లో ముందస్తు అంచనాల ప్రకారం రూ.29,074కు పెరిగింది. 2006-07లో దేశం మొత్తం మీద తలసరి ఆదాయం రూ.29,069. నిలకడ ధరలలో రాష్ట్రంలో తలసరి ఆదాయం 2005-06లో రూ.21,277 ఉండగా 2006-07లో ముందస్తు అంచనాల ప్రకారం రూ.22,521 కావటం జరిగింది. ఈనాడు ఉన్న వాస్తవాలను మీ ముందు పెడుతున్నాను తప్ప వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం ఏ మాత్రం చేయటంలేదు.

శ్రీ ఎమ్.ఎ. గఫూర్: అధ్యక్షా, ఆనం రామనారాయణరెడ్డిగారు మంచి స్పీకర్. ఇక్కడ ఉన్న సభ్యులలో సభ్యతగా ఉండి వాస్తవాలు చెప్పేవారు చాలా తక్కువమంది. వారిలో రామనారాయణరెడ్డిగారు ఒకరు. రాష్ట్రం చాలా వేగంగా ముందుకుపోతుందని అంటున్నారు కదా! తలసరి ఆదాయంలో దేశంయొక్క యావరేజ్‌కంటే ఎక్కువలో ఉన్నామా, తక్కువలో ఉన్నామా? తక్కువలో ఉంటే ఎక్కువలోకి వెళ్లటానికి ఏమిచేయాలో అది చెప్పాలి.

శ్రీ జి. కిషన్‌రెడ్డి (హిమాయత్‌నగర్): ప్రక్కనే ఉన్న తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర , చత్తీస్‌గఢ్‌లలో తలసరి ఆదాయం శాతం ఎంత ఉంది, మన రాష్ట్రంలో ఎంత ఉందనేది చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ ఆనం రామనారాయణరెడ్డి: అధ్యక్షా, ఈనాడు మసిపూసి మారేడుకాయను చేయాలనో, వాస్తవాలను వక్రీకరించాలనో లేక మరొక రకంగానే సభను తప్పుదోవ పట్టించాలనే ప్రయత్నం చేయటానికి మేము సిద్ధంగా లేము. ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం మన ముందు ఎకనమిక్ సర్వే రిపోర్ట్‌ను పెట్టటం జరిగింది. వాటిల్లో అన్నీ వాస్తవ విషయాలే ఉన్నాయి. ఇందులో దాపరికం ఏమీలేదు. వాటినే ఈరోజు మరల వామపక్షాలు, బి.జె.పి.వారు ప్రస్తావన చేయటానికి ప్రయత్నిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక నూతన కలయికతో వీరు ఈనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించటానికి ప్రయత్నం చేయటం జరుగుతోంది. ఈవిధంగా వీరిద్దరూ కలసిపోయి ఈ దేశంలోనే ఒక క్రొత్త అధ్యాయానికి, ఒక క్రొత్త రాజకీయ విధానానికి శ్రీకారం చుట్టారేమో, దానికి ఇక్కడే పునాది వేశారేమో అని అనుకోవలసి వస్తోంది. ఆంధ్రప్రదేశ్ పర్‌క్యాపిటా ఇన్‌కమ్ 2005-06లో 10.46% నుండి 10.92%కు నమోదుకాబడింది. ఇదే కాలంలో ఆల్ ఇండియా పర్‌క్యాపిటా ఇన్‌కమ్ 12.07% నుండి 13.4%కు పెరగటం జరిగింది. ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం పెరిగిన ఆల్ ఇండియా తలసరి ఆదాయంకంటే కొంత వెనుకబడిపోవటం ఇక్కడ స్పష్టంగా అర్థమౌతోంది. దీనికి కారణాలు వ్యవసాయరంగంలో ఉత్పత్తి తగ్గటం, గ్రామీణ ప్రజల ఆదాయం తగ్గటం మొదలగున్నవి. ఆల్ ఇండియా స్థాయిలో పర్‌క్యాపిటా ఇన్‌కమ్ పెరగటానికి అధిక ఎగుమతులు, అభివృద్ధి, వాణిజ్య రంగాలలో లాభాలవలన, ఆదాయం పెరిగినందువల్ల ఈ వ్యత్యాసం మనకు కనపడుతోంది.

ఈ రాష్ట్రానికి ప్రధాన జీవనాధారం వ్యవసాయ రంగం. వ్యవసాయరంగంగురించి నిన్ననే చాలా చర్చ జరిగింది. ఈ వ్యవసాయరంగంపట్ల గత ప్రభుత్వాల విధానాలు, ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వం పెద్దయెత్తున చేపట్టబోతోన్న కార్యక్రమాలను చెప్పటం జరిగింది. నిన్న జరిగిన చర్చే వ్యవసాయరంగంపై ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు సరైన సమాధానం. వ్యవసాయరంగంగురించిన కొన్ని విషయాలను మాత్రం మీ ముందు ఉంచి వేరే రంగంగురించి మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. తొమ్మిదేళ్ల పాలనలో వ్యవసాయరంగానికి కేటాయించిన నిధులను పరిశీలిస్తే మన ముందు ఎన్నో నిష్ఠుర సత్యాలు

ప్రత్యక్షమవుతాయి. అవి విని తట్టుకునే మనస్థైర్యం, ఈ నిష్ఠుర సత్యాలను ఒప్పుకునే సహనం ప్రతిపక్షానికి ఉండదు. భగవంతుడు వారికి ఆ సహనం ఇవ్వాలని, ముఖ్యంగా మా సోదరి అరుణకు ఎక్కువ సహనం ఇవ్వాలని నేను కోరుతున్నాను. వీరు చెప్పేది ఎలా ఉంటుందంటే మంచి మాటలు వారికి వినపడవు. మంచి కార్యక్రమం చేయాలంటే వారికి మనసు రాదు. అందుకనే ''హితం మనోహరిచ దుర్లభం వచహః'' అన్నారు. అర్ధంకాకపోతే మరలా చెబుతాను, ''హితం మనోహరిచ దుర్లభం వచహః'' అన్నారు. మీ మనసుకు నచ్చిన మాట దుర్లభమని చెప్పక తప్పదు.

వ్యవసాయరంగం గురించి భగవద్గీతలో ఒక ప్రధానమైన సూక్తి చెప్పటం జరిగింది, ''అన్నాద్భవంతి భూతాని, పర్జన్యాత్ అన్న సంభవః.'' జీవ కోటి అంతా అన్నము వలననే ఉత్పత్తి అవుతోంది. ఈ అన్నము వ్యవసాయంవలననే మనకు లభ్యమౌతుంది. కాబట్టి దీనికి మూలము వ్యవసాయమే. ఈ రాష్ట్ర ప్రగతికి మూలం వ్యవసాయం. రైతే ఆధారం అన్న ముఖ్యమంత్రిగారి ఆలోచనకు ఈ భగవద్గీతలోని వాక్యాలే అక్షర సత్యాలని నేను మీకు మనవిచేస్తున్నాను. కాబట్టి ఈరోజు వ్యవసాయంగురించి మాట్లాడాలంటే బహుశా ఈ రెండు వాక్యాలే ఈ రాష్ట్రప్రజలు ప్రతిపక్షానికి ఇచ్చే ధీటైన జవాబుగా చెప్పకతప్పదు. 2006-07లో రూ.1701.98 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయిస్తే 2007-08లో రూ.2,198.82 కోట్లు కేటాయించటం జరిగింది. పంట ఋణాలపై వడ్డీరేటు 12% నుండి 14% వరకు తెలుగుదేశం పరిపాలన హయాంలో పెంచితే దానిని 7%నికి తగ్గించటమే కాకుండా ఇంకా తగ్గించాలనే ప్రయత్నంలో ఈనాటి రాజశేఖరరెడ్డిగారి ప్రభుత్వం ఉన్నదా, లేదా అనేది ఒక్కసారి ఆలోచన చేయండని ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను. అదేవిధంగా నిన్న చర్చ జరిగినప్పుడు ఎంత ఇన్‌పుట్ సబ్సిడిక్రింద ఇచ్చారని అడిగారు. గత ప్రభుత్వంలో తామేమి చేశారో, ఈ ప్రభుత్వంలో మేమేమి చేస్తున్నామో చర్చకు సిద్ధమా అని ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించటం జరిగింది. 9 సంవత్సరాల మీ పాలనలో ఇన్‌పుట్ సబ్సిడి క్రింద కేవలం రూ.261 కోట్లు మీరు కేటాయిస్తే రెండున్నర సంవత్సరాల్లో ఈ ప్రభుత్వం, రాజశేఖరరెడ్డిగారి నాయకత్వంలో రూ.190 కోట్లు మంజూరుచేసి ఖర్చు చేసిందని మనవిచేస్తున్నాను.

ఉ.10.00

అదే విధంగా మీ తొమ్మిదేళ్ల పాలనలో రూ. 38178 కోట్ల పంట రుణాలు మంజూరు చేస్తే, మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో 18,35,031 మంది కౌలుదారులకు రూ. 155 కోట్ల పంట రుణాలు మంజూరు చేసిన ఘనత రాజశేఖర్‌రెడ్డిగారి ప్రభుత్వానిదే. ఇవన్నీ అక్షర సత్యాలు అధ్యక్షా . ఇవన్నీ రికార్డుల్లో ఉన్నవే గాని నేను కొత్తగా ఈ సభలో చెప్పడానికి ప్రయత్నం చేయడం లేదు. అలాగే 22156 రైతు మిత్ర సంఘాలను ఏర్పాటు చేసింది మా ప్రభుత్వం . గతంలో మీ హయాంలో బి.టి. పత్తి విత్తనాలు 450 గ్రాములు రూ. 1850 నుంచి రూ. 1950 లకు అమ్మితే, మీప్రభుత్వం దాని గురించి నిర్లక్ష్యం చేస్తే, ఈదేశంలో మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారు న్యాయస్థానాలకు వెళ్లి కూడా దాన్ని రూ. 750 లకు తగ్గించి దాదాపు రూ. 200 కోట్లు ఈ పత్తి రైతులకు ఆదాయం చేకూర్చిన విషయాన్ని మనం మరచిపోలేం . రైతుల ఆత్మహత్యల నివారణ కొరకు, వారి పునరావాస నిమిత్తం ప్రధానమంత్రి ప్రత్యేక ప్యాకేజీ క్రింద కేంద్రప్రభుత్వం కేటాయించిన రూ. 8650.55 కోట్లు ఖర్చు చేసిన రైతు ప్రభుత్వం మాది. ప్రతి బాధితునికి, ప్రభుత్వ లెక్కల ప్రకారం, ప్రభుత్వంలో ఉన్న అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం నిజమైన ఆత్మహత్యలు చేసుకున్న ప్రతి రైతుకూ రూ. 1.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మేము చెల్లిస్తే, మీరు చేసిందేమిటి? తిన్నది అరగక ఆత్యహత్య చేసుకున్నారని ఒకరంటే, వారికి పొద్దుబోక లేక మానసిక పరిస్థితులు బాగాలేకో ఆత్యహత్యలు

చేసుకుంటున్నారని ఇంకొకరంటే, అసలు వ్యవసాయమే శుద్ధ దండగ అన్న నాయకుని నీడలో ఉన్న మీరా మమ్ముమలను విమర్శించేది? ఈరోజు రైతులే సొంతంగా విత్తనాలు తయారుచేసుకోవాలనే ఉద్దేశ్యంతో సీడ్ విలేజెస్‌ను ప్రారంభిస్తున్నాం . వ్యవసాయ పనిముట్ల యాంత్రీకరణ, పొలం బాట కార్యక్రమాలకు 40 శాతం మేర నిధులను పెంచిన ఘనత మా ప్రభుత్వానిదని మనవి చేస్తున్నాను.

ఈరోజు వైద్యనాథన్ సిఫారసులను అమలుపరచడానికి దాదాపు రూ. 100 కోట్లు కేటాయించిన ప్రభుత్వం సహకార రంగాన్ని పరిపుష్టం చేయడానికి ప్రయత్నం చేస్తోంది. ఈరోజు పాడిపరిశ్రమాభివృద్ధికి వెటర్నరీ యూనివర్శిటీని స్థాపించి, వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిగారు ఆలోచన చేసి, నా నియోజకవర్గంలో కూడా వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీని ఈ అకాడమిక్ ఇయర్ నుంచే ప్రారంభిస్తున్నామని హామీ ఇచ్చి దానికి శంకుస్థాపన చేయడం జరిగిందని మనవి చేస్తున్నాను. వ్యవసాయానికి సంబంధించిన లెక్కల వ్యత్యాసాలు చూస్తే, 2003-04 సంవత్సరంలో ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీకి అప్పజెప్పిన రోజుకు మీ బడ్జెటు ప్లాన్ అంచనాలు 655.60 కోట్లయితే, 2007-08 లో ఈ ప్రభుత్వం అంచనాలను రూ. 1116.40 కోట్లకు పెంచి, ప్లాన్ మరియు నాన్‌ప్లాను కలిపి మొత్తం రూ. 2141 కోట్లకు ఈ బడ్జెటును ఈరోజు మనముందు ఉంచడం జరిగింది. ఈరోజు అగ్రిబిజినెస్‌లో, వ్యవసాయ రంగంలో వ్యాపార రంగాన్ని తీసుకరావడానికి కేంద్రప్రభుత్వ సహకారంతో Food Streets ను ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నాం . దీంట్లో టూరిజం ఎట్రాక్షన్ తీసుకరావాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనతో సమానంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతూ ప్రయత్నం చేస్తున్నది.

అధ్యక్షా, 2005-06 లో జిడిపి 8.4 శాతం ఉందని అంచనా వేయగా, వ్యవసాయంలో అంచనాలు వేసిన 3.9 శాతం కన్నా జిడిపి 6శాతం పెరుగుదల నమోదు చేసినందువల్ల జిడిపి జాతీయ స్థాయిలో 9శాతానికి చేరుకోగలిగింది. అందువల్ల కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం గారు నిన్న ప్రతిపాదించిన 2007-08 బడ్జెటులో it is agriculture to fore అంటూ వ్యవసాయానికి పెద్ద పీట వేసి ఈ దేశంలో ఉన్న రైతాంగం ఆశలు నెరవేర్చే విధంగా బడ్జెటులో ప్రతిపాదించి సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధించడానికి కావలసిన అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగింది. అధ్యక్షా, ఈరోజు మేము వ్యవసాయం గురించి ఎన్ని మాట్లాడినా ప్రతిపక్షాల వాళ్లు అర్థం చేసుకోలేరో లేక అర్థం చేసుకున్నా అర్థం చేసుకోనట్లుగా నటిస్తున్నారో తెలియదు గాని దానికి ఒక చిన్న సూక్తి చెప్పవలసిన అవసరం వుంది. 'అనురాగం లేని మనసుకు సుజ్ఞానం రాదు, మంచి మనసు లేని వ్యక్తులకు విజ్ఞతతో కూడిన ఆలోచన రాదు ' . కాబట్టి ఎన్ని చెప్పినా కూడా అవి వీళ్ల తలకు ఎక్కదు. అలాగే అరవిందఘోష్ చెప్పిందేమంటే - learn to welcom the criticism and pointing out the imperfections - the more you do so, the more rapidly you will advance. సహృదయంతో, మరింత పరిపూర్ణ హృదయంతో వ్యవసాయ రంగ అభ్యున్నతికి తీసుకున్న కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పునరంకితమవుతుందని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈరోజు మిగతా కార్యక్రమాల గురించి కొద్ది వాక్యాలతో మీముందు చెప్పవలసిన బాధ్యత ఎంతైనా వుంది. ఈరోజు సాగునీటి రంగం గురించి రాష్ట్రంలో అతి పెద్ద బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో తీసుకుంది. జలయజ్ఞం పేరుతో , కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు, కృషి చేసి ఈ రాష్ట్రంలో దుర్భిక్షాన్ని పొలదోలితో ప్రయోజనకరంగా ఉంటుందని, ఆ దిశలో ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈరోజు రాష్ట్రంలో చాలా పెద్ద ఎత్తున ఇరిగేషన్ రంగానికి దాదాపు రూ. 13 వేల కోట్లు

కేటాయించి, రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని ప్రాంతాలలో సమగ్రాభివృద్ధి సాధించడానికి అన్ని కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. కోస్తా, ఆంధ్ర ప్రాంతంలో 25 ప్రాజెక్టులతో 36,37,179 ఎకరాలు, రాయలసీమ ప్రాంతంలో 11 ప్రాజెక్టులతో 17,60,500 ఎకరాలు, తెలంగాణా ప్రాంతంలో 26 ప్రాజెక్టులో 2911638 ఎకరాలు – దాదాపుగా 83,09,000 ఎకరాలకు ఇప్పుడు పనులు మొదలుపెట్టాలని ఆలోచన చేస్తూ ఈ రాష్ట్రంలో ఐదు సంవత్సరాలలో లక్ష కోట్ల రూపాయలతో కోటి ఎకరాల భూమిని సాగులోకి తీసుకరావాలనే లక్ష్యాన్ని మన ముందు పెట్టుకుని ప్రయత్నం చేస్తున్నాం .

అధ్యక్షా, ఈ సందర్భంలో మాజిల్లాకు సంబంధించి రెండు, మూడు విషయాలు చెప్పకతప్పదు. నెల్లూరు జిల్లాలో పెన్నార్ డెల్టా ఆధునీకరణ 128 సంవత్సరాలు దాటినా జరగలేదు . కృష్ణా గోదావరి డెల్టాలతో సమానంగా, పెన్నార్ డెల్టాను సర్ ఆర్థర్ కాటన్ నిర్మాణం చేస్తే, కృష్ణా, గోదావరి డెల్టాలను రెండు దఫాలుగా పునర్నిర్మాణం జరిగితే, ఇప్పటి వరకు పెన్నార్ డెల్టా పునర్నిర్మాణ కార్యక్రమాన్ని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే, ఈ ముఖ్యమంత్రిగారు వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లాలో చేపట్టిన రాజీవ్ పల్లెబాట, రాజీవ్ నగర బాటలో చేసిన అభ్యర్థనలను మననం చేసుకుని పెన్నార్ డెల్టా మోడ్రనైజ్ చేయడానికి సంగం–నెల్లూరు బ్యారేజీలను నిర్మాణం చేయడానికి, సోమశిల–స్వర్ణముఖి కాలువను నిర్మాణం చేసి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల రైతాంగానికి సాగునీరందించే కార్యక్రమానికి నిధులు ఇచ్చి మంజూరు చేయడం జరిగింది. పనులు ప్రారంభమయ్యే దశలో ఉన్నాయి. ఈ సంవత్సరం ఆ పనులను ప్రారంభించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. 1999 లో ఎన్నికలకు ముందు, ఆనాడున్న తెలుగుదేశం ప్రభుత్వంలో సోమశిల–స్వర్ణముఖి లింకు కాలువకు రూ. 250 కోట్లు ఇస్తూ జీ.ఓ. జారీ చేయడం జరిగింది. ఆ సభ్యులు ఈరోజు ఇక్కడ లేరు. ఆనాడు నా నియోజకవర్గంలో మాట్లాడుతూ – అయ్యా, రూ. 250 కోట్లతో సోమశిల–స్వర్ణముఖి కాలువను మీ ప్రాంతంలో తవ్వుతున్నాం, రాపూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు కృష్ణా నీరు ఇస్తున్నామని చెప్పి ఆ ప్రాంత ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నం చేశారు. కాని వారి మాటలకు ఆ ప్రాంత ప్రజలు మోసపోలేదు. రాపూర్‌లో నేను, వెంకటగిరిలో శ్రీమతి రాజ్యలక్ష్మిగారు, శ్రీకాళహస్తిలో గోపాల కృష్ణారెడ్డిగారు, ఈవిధంగా మేమంతా గెలవడం జరిగింది. ఆనాడు గోపాలకృష్ణారెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా విలువ ఇవ్వలేదు మాప్రాంత ప్రజలని మనవి చేస్తున్నాను. 1999 ఎన్నికల తర్వాత అధికారంలోకి ఆ ప్రభుత్వమే వచ్చినా, మళ్లీ నాలుగు సంవత్సరాలపాటు సోమశిల–స్వర్ణముఖి కాలువ విషయం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వుండి పోయింది , తర్వాత ఆ జీ.ఓ. ను రద్దు చేసిన ఘనత కూడా వారికే దక్కింది. ఈరోజు మా ప్రభుత్వం వచ్చింది, రూ. 400 కోట్లకు జీ.ఓ. ఇచ్చాం, అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చాం, ఎస్టిమేషన్స్ అయిపోయాయి. టెండర్లు పిలిచి రాబోయే మాసంలో టెండరు తీసుకున్న ఏజన్సీకి పనులు అప్పజెప్పి ప్రారంభించమని ముఖ్య మంత్రిగారు ఆదేశాలు ఇచ్చారు. నెల్లూరు జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన రాపూరు, వెంకటగిరి అలాగే శ్రీకాళహస్తి ప్రాంతాలకు మేలైన సాగునీటి రంగాన్ని అందించిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానిది, అందుకు మేమందరమూ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారికి ధన్యవాదాలు తెలియజేయవలసిన అవసరం వుంది.
ఉ.10 .10

అదేవిధంగా ఇరిగేషన్ అండ్ ఫ్లడ్ కంట్రోల్‌కు మీరు ఇచ్చిన బడ్జెట్ కేటాయింపులు చూస్తే ప్లాన్ బడ్జెట్‌లో రు.1764.68కోట్లు అయితే 2007–8 సంవత్సరానికి ఈనాడు కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో ఆర్థికమంత్రిగారి ఆలోచనతో రు. 13013.80కోట్లు అత్యధికంగా బడ్జెట్‌లో సాగునీటి రంగానికి కేటాయించిన

ఘనత మా ప్రభుత్వానికే దక్కింది. ఇరిగేషన్‌కు పెద్దపీట వేసిన ఘనత ఈ ప్రభుత్వానిదని మనవి చేస్తున్నాను. పేద ప్రజల యొక్క ఆశలను చిగురింప చేయాలి.

ఈ రాష్ట్రంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నిరుపేదలైన దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారికి 58లక్షల ఎకరాలు గతంలో శ్రీమతి ఇందిరాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ , రాజీవ్‌గాంధీ ఈనాటి రాజశేఖకర్ రెడ్డి వరకు భూపంపిణీ చేస్తే, ఇటీవల వచ్చిన సర్వేల ప్రకారం అంచనాల ప్రకారం ఈ భూమి సరిగా ఉపయోగపడడం లేదు. ఈ భూమి పేదవాడి చేతిలో లేదని అన్యాక్రాంతం అయిందని ఆలోచన చేసి పేద రైతుకు, నిరుపేదకు భూమిని అప్పచెప్పాలని ఈ రాష్ట్రంలో భూయజ్ఞ కార్యక్రమం చేపట్టబడింది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు విడదల 4లక్షల34వేల ఎకరాలు భూపంపిణీ కార్యక్రమం జరిగింది. అందులో 3లక్షలఎకరాల వరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు పంపిణీ చేసిన ఘనత మా ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారికే దక్కింది. భూ యజ్ఞం గురించి చాలామంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు. మా ఆలోచన ఒకటే. స్వామి వివేకానంద చెప్పినట్లుగా దినదిన క్షీణత నొందుచున్న ఈ పేదలకై ఎవరి హృదయం పరితపించునో వానిని నేను మహాత్ముడందును అన్నారు. వివేకానందస్వామి వచోరత్నం మానవ రూపాన్ని ధరించిన ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారు అని చెప్పడంలో అతిశయోక్తి కాదు.

రజతము కాంచనంబు నవరత్నములున్ వనముల్ తటాకముల్
గజతురగాది జంతువులు గంధము, పువ్వులు పండ్లు తేనియల్
ప్రజకు వేరు వేర కడునేడక ఇచ్చుట కంటే ప్రీతి తత్
ప్రజనన కారణంబగు ధరాస్థల మిచ్చుట యిచ్చుటన్నియున్

తరతరాలుగా భూమికోసం పోరాడే పేదల ఆర్తికి స్వస్తి వచనం పలకడానికి దేశ చరిత్రలో ఎవరైనా పూలు, పండ్లు, గంధం, తేనె ఇస్తామనేకంటే భూమిని ఇచ్చి ఆదుకోమని శ్రీనాధుడు చెప్పి న పద్య తాత్పర్యము అని మనవి చేస్తున్నాను. ఏమాత్రం పనికిరాని భూములను సారవంతం చేసి వాటి ఫలాలు చేతికి అందే సమయంలో పేదల సంక్షేమానికి తన కుటుంబసభ్యుల యొక్క ఆస్తులు ఈ రోజు ప్రభుత్వానికి అప్పగించి ఎప్పుడో ఎక్కడో జరిగిన పొరపాటును సరిచేసి ఆ భూమి పేద ప్రజలకు పంపిణీ చేసిన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదర్శప్రాయుడు కాడా? నిజాయితీతో చేసి భాదానానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నారా? కాని దేశంలో ఉన్న చాలామంది పెద్దలు విజ్ఞులు రకరకాలుగా పొగుడుతున్నారు. 1910 సంవత్సరానికి ముందు రష్యాలో బోల్షివిక్ విప్లవము వచ్చింది. ఆ రోజు విప్లవం కారణంగా టాల్‌స్టాయ్ అనే రచయిత కౌలుదార్ల వద్ద ఉన్న తన యావదాస్థిని వారికే అప్పచెప్పిన సంగతి మనం ఇక్కడ గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. యావత్ ప్రపంచంలోనే అతి పెద్ద గొప్పవ్యక్తిగా టాల్‌స్టాయ్‌ని గుర్తించడం జరిగింది. మహాత్మాగాంధీలాంటి వాడు అతనికి చెప్పులు కుట్టి ఇవ్వడం జరిగింది. అంటే మహాత్మాగాంధీగారిని కించపరచడం కాదు. మహాత్మాగాంధీ లాంటి వ్యక్తి టాల్‌స్టాయ్‌ని గౌరవప్రదంగా ఎన్నుకున్నాడంటే అతని యొక్క ఉన్నత ఆశయాలను కొనియాడాలి. రాజశేఖర్ రెడ్డిగారిని వినోబాబావే, టాల్‌స్టాయ్, సర్ ఆర్థర్ కాటన్‌తో పోలుస్తారా? అని అడుగుతున్నారు. ఏమి ఈ వైపరీత్యమని అంటున్నారు. తనకు, తన కుటుంబసభ్యులకు ఉన్న భూమి ప్రభుత్వానికి ఇచ్చి పేద ప్రజలకు పంపిణీ చేసిన ముఖ్యమంత్రితో మీకు సాంగత్యమా? అని అన్నారు. మీ నాయకుడికి వందల వేల ఎకరాలు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఉన్నాయి. అవి వారి కుటుంబసభ్యుల ఆధీనంలో ఉన్నాయి. వాటిని పేదలకు దళితులకు ఇవ్వమని అంటే నా దగ్గర

భూములు ఎక్కడున్నాయి? వాటిని ఎప్పుడో అమ్మేశాను అని అన్నారు. ఇతరులకు అమ్మిన వ్యక్తి గొప్పవాడా? తనకున్న దానిని పొరపాటు జరిగింది మీరు తీసుకోండని ప్రభుత్వానికి అప్పచెప్పిన వ్యక్తి గొప్పవాడా? ప్రభుత్వానికి అప్పచెప్పడం గొప్పతనం కాదా? ముఖ్యమంత్రిగారిని వినోబాబావేతో, టాల్‌స్టాయ్‌తో, సర్ ఆర్థర్ కాటన్‌తో పోల్చమని చెప్పలేదు. అయ్యా ఈ రాష్ట్రంలో అన్యాక్రాంతం అయిన భూమిని, సీలింగ్ చట్టానికి, అసైన్‌మెంట్ చట్టానికి వ్యతిరేకంగా ఉన్న భూమిని హరిజనులకు, గిరిజనులకు ఇవ్వమని ప్రభుత్వం అడిగితే ఆ భూమిని అమ్మివేశామని చెబితే , అటువంటి వారిని ఎవరితో పోల్చాలో మీరే చెప్పండి. మా నాయకుడిని మేము పోల్చాము. మీ నాయకుడిని ఎవరితో పోల్చాలో చెప్పవలసిన బాధ్యత మీ మీద ఉంది. ఈ రోజు మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు. భూయజ్ఞాన్ని ఈ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నదని ఈ సంధర్భంలో సభకు మనవి చేస్తున్నాను. భూయజ్ఞంలో చాలా ఒత్తిళ్ళు, చాలా పెద్దలు ఇందులో ఇన్‌వాల్వ్ అయిన ఉన్నాసరే ఒక నిబద్ధతతో, నిజాయితీతో ఈ రాష్ట్రంలో భూయజ్ఞాన్ని కొనసాగించాలనే ముఖ్యమంత్రిగారి ఆలోచనకు ఈ ప్రభుత్వం పనిచేస్తుందని మనవి చేస్తున్నాను. ముఖ్యమంత్రిగారిని విమర్శించేవారిని ఒక మాట అడగాలనుకుంటున్నాను.

భాగీరథి లోన బాపమున్నదా?<br>
పుణ్య వేదములలో బొంకులున్నవా?<br>
సాగరపుటమృతపు చవిలో జేదున్నదా?<br>
రాజశేఖరుని భూదానమందు అపరాధమున్నదా?<br>
ఆలోచించండి . ఆశీర్వదించండి.

అని ఈ సభలో ఉన్న ప్రతిఒక్కరిని కోరుతున్నాను.

ఈ రోజు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భూయజ్ఞం, జలయజ్ఞంతో పాటు ఇందిరమ్మ పథకాన్ని మూడవ వంతు గ్రామాలలో తొలి విడత పూర్తి చేశారు. రెండవ విడతకు శ్రీకారం చుట్టారు. గతంలో ఎన్నో రకాలుగా పేదవారికి ఇళ్లు లేని వారికి, అర్హులైన పేదలకు పెన్షన్ రాని పరిస్థితి ఏర్పడింది. కాని ఇందిరమ్మ పథకం ద్వారా గ్రామంలో ఉన్న ప్రతిఒక్కరికీ పార్టీ రహితంగా, కుల రహితంగా, మత రహితంగా అభివృద్ధి సాధించాలని వారికి నిలువ నీడకల్పించాలని, పేదవారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రిగారి మదిలో మెరిసిన ఆలోచనను ఆచరణలో పెడుతుంటే ఇటీవల దానిని కూడా ఎగతాళి చేస్తున్నారు.
ఉ.10. 20

ముఖ్యమంత్రిగారికి బ్రహ్మ మూహూర్తంలో ఆలోచన వస్తే అది చేస్తారు. ఇది కూడా అంటే, ముఖ్యమంత్రిగారు బ్రహ్మ మూహూర్తంలోనే ఈ ఇందిరమ్మ పథకానికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈరోజు ఈ పథకంలో మూడవ వంతు గ్రామాలను తీసుకుని తొలి విడతగా పూర్తి చేశారు. వాటిని వీరి ముందు చెప్పవలసిన అవసరం ఉంది. ' వట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేలు తలపెట్టువోయ్ అని గురజాడ సూక్తి ' ఈ సందర్భంగా గుర్తు చేయాలి. అదే విధంగా జాతిపిత మహాత్మాగాంధి ఇచ్చిన సందేశం, ప్రభుత్వాలు చేపట్టే ఏ పథకం లక్ష్యమైనా పేదవాడి పెదవిపై చిరునవ్వును చిందించాలన్నదే. ఆ సందేశాన్ని మననం చేసుకుంటే ఈ రాష్ట్రంలో ఈ పథకం ముఖ్యమంత్రిగారి ఆలోచన మేరకు ప్రవేశపెట్టడం జరిగింది.

ఈ రోజు ఇందిరమ్మ పథకంలో పెన్షన్‌కి సంబంధించి ఒక్కసారి చూసినట్లయితే, 2003-04 నాడు తెలుగుదేశం ప్రభుత్వం ఈ రాష్ట్రంలో కేవలం 16,97,016 పెన్షన్స్ పేదవారికి రు.50, రు.75 ఇచ్చే పరిస్థితి ఉండింది. ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పార్టీ చెప్పిన మేరకు 2005-06లో దానిని 20,97,014కి పెంచడం జరిగింది. 2006-07లో ఇందిరమ్మ పథకం క్రింద ఇచ్చిన 8,69,447 పెన్షన్స్‌ని కలుపుకొని ఈనాడు రాష్ట్రంలో మొత్తం మీద 30,66,461 పేద కుటుంబాలకు ఇందిరమ్మ పెన్షన్ రు.200 ఇవ్వడం జరిగింది. రు.200 మేము ఇస్తూ ఉంటే, వీరు రు.50 ఇచ్చిన రోజులు మర్చిపోయారా? వారు రు.75 ఇచ్చిన రోజులు మరచిపోయారు. ఆరుమాసాలకు జన్మ భూమి సభ కూడా మర్చిపోయారు. ఒకటి, రెండు చోట్ల గ్రామాల్లో సంఘాలు, సంఘ మిత్రాల ద్వారా నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పంపిణీ చేయడం జరిగింది అది ఈ ప్రభుత్వ ఆలోచనా విధానము.

ఇక పక్కా ఇళ్ల నిర్మాణ కార్యక్రమం 2003-04 లో మొత్తం ఏర్పాటు చేసి కట్టించిన ఇళ్లు 3,72,000. 2004-05లో 5,28,000 ఇళ్లు కట్టడం జరిగింది. 2005-06లో 6,83,000 ఇళ్ల నిర్మాణం చేయడం జరిగింది. ఈరోజు ఇందిరమ్మ పథకం వచ్చి ఈ రాష్ట్రంలో మూడవ వంతు గ్రామాలు తీసుకొని 2006-07 నాటికి 19,88,605 ఇళ్లు మంజూరు చేసి పూర్తి చేయడానికి అన్ని కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. దానిని నెరవేరుస్తున్నాము. ఈ రోజు ఇందిరమ్మ కార్యక్రమం పూర్తి చేయబోతున్నాము. రెండవ విడత కార్యక్రమం తీసుకోబోతున్నాము.

ఈ రోజు ఈ మూడు సంవత్సరాల పరిపాలనా కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సుభిక్ష స్థితికి చేర్చి ప్రజల అవసరాలను తీర్చి మా ప్రభుత్వం విజయం సాధించామన్నది నిజం. బడ్జెట్‌లో వివిధ రంగాలకి ప్రాధాన్యతా క్రమంలో కేటాయింపులు చేసి రాష్ట్ర ప్రగతిని ముందుకు నడిపించటంలో నడుం బిగించాము. ఈ బడ్జెట్‌లో దేశంలో మరే రాష్ట్రము సాహసించని విధంగా కనీ వినీ ఎరుగనంత భారీ కేటాయింపులు చేసినందులకు సర్వత్రా అభినందనలు వెల్లువెత్తటం మా ప్రభుత్వానికి గర్వకారణం. 2007-08 బడ్జెట్‌లో 100 శాతం వ్యయికరణ జరిగే దిశలో మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మేము గత కొన్ని రోజులుగా చెప్పినట్లు పన్ను రేట్లు పెంచకుండానే కేవలం పన్ను వసూళ్లు పెంచుకోవటం ద్వారా ఆదాయాన్ని సమకూర్చటం మా బడ్జెట్‌లో ప్రస్ఫుటమయ్యే ముఖ్య అంశం.

రోజువారీ అవసరాలకు, ఆపదలకు నగదు కొరత ఏర్పడక పోవటం ఆర్.బి.ఐ., నుండి ఏ ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోకపోవడం మా ప్రభుత్వ ద్రవ్య నిర్వహణా దక్షతకు కొలమానం. సమాజంలో ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల వారికి గృహం, ఉపాధి, ఆహారం, భూమి, విద్య, వంటి కనీస సౌకర్యాలు అందించి రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాల్లో, విధాన నిర్ణయాల్లో వారిని భాగస్వాములను చేయడంలో మా ప్రభుత్వం సఫలీకృతమైంది. అందుకు ఈ రోజు ప్రతిపక్షాలకు ఎన్ని రకాలుగా చెప్పినా, సరిచేసినా లాభం లేదు. కళ్లున్న గుడ్డివారు ఉన్నారు. ప్రభుత్వం వాస్తవాలను చెప్పినా కూడా అర్థం చేసుకోరు. ఆ ఆలోచన వారికీ, ప్రతిపక్షనేతకు లేదని మనవిచేస్తున్నాను. ఈ రోజు మన కళ్ల ముందు కనిపించినా దానిని కాదుఅనే వీరిని సంతృప్తి పరచడం భగవంతుని తరం కాదు. అందుకే భర్తృహరి చెప్పినట్లు

‘ తివిరి యిసుమునం దైలంబు దీయవచ్చు
దవిలి మృగతృష్ణలో నీరు త్రావవచ్చు

దిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు
జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు '

ఈ విధంగా మూర్ఖుల మనస్సును రంజింపచేయలేము.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రు, ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధి, అమర్త్యసేన్‌లాంటి మేధావుల ఆలోచనలను, సాంప్రదాయ సిద్ధాంతకర్తలైన వివేకానందుడు, అంవిందుడు, వేమన, గురజాడ, కందుకూరులాంటివారు అందించిన ప్రజాహిత ఆలోచనలను సమీక్షించి ఈ బృహత్తర బడ్జట్‌లో ప్రజా సంక్షేమానికి పెద్ద పీఠ వేసి తద్వారా సమగ్రాభివృద్ధికి కంకణబద్దులమై ఉన్నాము. ఆఖరుగా నేనురెండు మూడు మాటలు చెప్పదలచాను. అధికార తృష్ణతో జరుగుతున్న అభివృద్ధిని నిరోధించాలనే తిరోగామి మనస్కులను చూస్తే అరవిందుడు మాటలు గుర్తుకొస్తాయి.

"He who puts on the yellow robe while he is yet impure,
lacking in self-control and lacking in loyalty, truly he is
unworthy to wear the yellow robe of the monk"

నీతి, నిబద్ధత, అదే విధంగా ప్రజలకు సేవ చేయాలనే అంకిత భావంలేని వారు ఈ పసుపు అంగీలు కట్టుకున్నంతమాత్రాన పవిత్రత రాదు. పేద ప్రజల అభివృద్ధికోరే వారు పసుపు అంగీలు వేస్తే వారికి అప్పుడు నిజాయితీ, నిబద్ధత వస్తుందని మనవిచేస్తూ ఆఖరుగా ఇంత సహనం పాటించి, ఎంతో ఓపికతో నాకు తమరు ఇచ్చిన అమూల్యమైన సమయానికిగాను ప్రత్యేకంగా తమరికి ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. నరేంద్రకుమార్ (పొన్నూరు)ః చాలా మంది మాట్లాడుతూ చెప్పారు. రోశయ్యగారు బడ్జట్ ప్రవేశపెట్టడంలో అపారమైన అనుభవం ఉందన్నారు. కాబట్టి మేము ఒక ప్రతిపక్షంగా, ఈరాష్ట్రంలో పేద, అణగారిన వర్గాల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రోశయ్యగారి బడ్జట్ ఉంటుందని ఆశించాము. వారికున్న అపారమైన అనుభవాన్ని ఈ రాష్ట్రంలో ప్రజానీక సమస్యలు తీర్చడానికిగాను ఈ రాష్ట్ర ప్రగతికి తోడ్పడే విధంగా చేస్తారని ఆశించినప్పుడు ఈ బడ్జట్ చూస్తే మాకు చాలా నిరాశ కలిగించిందని తెలియచేస్తున్నాను.

ఉ. 10.30

ఇవ్వాళ సంఖ్యా పరంగా వేల కోట్ల రూపాయలకు బడ్జెట్ తీసుకెళ్లబోతున్నామని చెబుతున్న పరిస్థితులలో ఒకసారి బడ్జెట్ అంతా చూసినప్పుడు వేమన శతకంలో నాకు ఒక పద్యం గుర్తుకు వచ్చింది. అది ఏమిటంటే, "మేడిపండు చూడు మేలిమై యుండు, పొట్ట విప్పి చూడు పురుగులుండు " అని వేమన చెప్పారు. అమార్త్య సేన్ స్ఫూర్తి అని చెప్పారు. ఏమి చెప్పారు అధ్యక్షా, అట్టడుగున, అణగారిన వర్గాలకు ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం అంటున్నారు, సామాజికాభివృద్ధి అంటున్నారు. ఆహారం, ఉపాధి, విద్య, వైద్యం కల్పిస్తామన్నారు. ఖర్చు పెట్టే ప్రతి రూపాయిలో బడుగు, బలహీన వర్గాలకు మొదటి పెట్టుబడిదారులుగా చేస్తామని చెప్పి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు కాని ఆచరణలో మాత్రం వారిని హక్కుదారులు చేసే దాంట్లో, దానికి అనుగుణంగా రూపకల్పన చెయ్యకపోవడం చాలా బాధకరమని నేను చెబుతున్నాను. అధ్యక్షా, ఒకసారి కేటాయింపులు చూస్తే

గత సంవత్సరం 19 వేల కోట్ల రూపాయలున్న ప్లాన్ బడ్జెట్‌ను ఇవ్వాళ 30 వేల కోట్ల రూపాయలకు పైగా మేము తీసుకె ళ్లామని చెబుతున్నారు. దాంట్లో మౌళిక రంగాలకు ఇచ్చిన కేటాయింపులు ఎంత, సంఖ్యా పరమైన కేటాయింపులు తప్పితే, పెరిగిన ప్లాన్ బడ్జెట్‌కు అనుగుణంగా, అణగారిన వర్గాలకు, దళిత, గిరిజన వర్గాలకు ఈ రాష్ట్రంలో మౌళిక సదుపాలు కల్పించే దాంట్లో దానికి అనుగుణంగా కేటాయింపులు ప్లాన్ బడ్జెట్‌లో పెంచలేదు. ఇది ఈ రాష్ట్రాన్ని రాబోయే రోజులలో అదోగతికి తీసుకెళ్తుందని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, చాలా మంది కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన శాసనసభ్యులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వ ప్రాధాన్యత వ్యవసాయం అని చెబుతున్నారు. వాళ్లు నిద్ర లేవగానే మాది రైతు ప్రభుత్వమని చెబుతున్నాను. గత సంవత్సరం అగ్రికల్చర్ అండ్ అలైడ్ సెక్టార్‌కు 3.01 శాతంగా ఉన్న కేటాయింపులు ఇప్పుడు 2.3 శాతానికి పడిపోయిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. అదే విధంగా గ్రామీణాభివృద్ధిలో గత సంవత్సరం 5.6 శాతం ఉంటే, ఈ సంవత్సరం 5 శాతానికి తగ్గింది. వాళ్ల యొక్క మానస పుత్రిక అని చెప్పుకునే ఇరిగేషన్‌కు గత సంవత్సరం 50 శాతం ఉన్న కేటాయింపులు ఈ సంవత్సరం 42.23 శాతానికి తగ్గిపోయింది. యువతకు ప్రాధాన్యత కల్పించే విద్య, సాం స్కృతిక రంగం, స్పోర్ట్స్‌కి గత సంవత్సరం 3.80 శాతం ఉన్న కేటాయింపులు ఈ సంవత్సరం 3.15 శాతానికి తగ్గిపోయింది. స్వయాన ఆర్థిక మంత్రి గారు సారథ్యం వహిస్తున్న వైద్య, ఆరోగ్యానికి గత సంవత్సరం 2.72 శాతం ఉంటే ఈ సంవత్సరం 2.53 శాతానికి తగ్గిపోయింది. గ్రామీణ ప్రాంతాలలో వాటర్ సప్లై సానిటేషన్ చూసుకుంటే 2.84 శాతం నుండి 2.77 శాతానికి తగ్గిపోవడం జరిగింది. గతంలో 0.03 ఉన్న పబ్లిసిటీ శాతాన్ని ఈ సంవత్సరం 0.05 శాతానికి పెంచారు. పెద్ద పెద్ద హోర్డింగ్స్ పెట్టుకోడానికో, ఈ సభలో ముఖ్యమంత్రి గారి చేసిన ప్రసంగాలను పేపర్స్‌లో పెద్ద పెద్ద యాడ్స్ రూపేణా ఇవ్వడానికో లేక నీటిపారుదల శాఖమంత్రి చేసిన వాటిని పెద్ద పెద్ద పత్రికలలో వేయించుకోడానికో, ఈ యొక్క ప్రచార ఖర్చులను పెంచుకుంటుంది ఈ ప్రభుత్వం, ఇంతకంటే నిదర్శనం అవసరం లేదని నేను తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, అలాగే సంక్షేమ గురించి చెప్పారు. వెల్ఫేర్ ఆఫ్ ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీల కేటాయింపులు గత సంవత్సరం 7.9 శాతం ఉంటే ఈ సంవత్సరం 4.87 శాతానికి గణనీయంగా తగ్గిన మాట వాస్తవం కాదా? అదే విధంగా స్పెషల్ సెక్యూరిటీ వెల్ఫేర్ చూసుకుంటే, గత సంవత్సరం 0.84 ఉన్న కేటాయింపులు ఈ సంవత్సరం 0.72 శాతానికి తగ్గిన మాట వాస్తవం కాదా? పెరిగిందల్లా మనం చూసుకుంటే, హౌసింగ్‌లో మాత్రం గణనీయంగా పెరిగింది. దాదాపు పది ప్రధానమైన శాఖలుంటే ఏడెనిమిది శాఖలకు ఈ ప్రభుత్వం, అరవై అయిదు శాతం ప్రజానీకం ఉన్న పేద ప్రజల అవసరాలకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు గణనియంగా తగ్గించిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. అధ్యక్షా నేను ఎక్కడో చదివాను. రోశయ్య గారు చెప్పారు, ఈ బడ్జెట్ అనేది అధికారులు, ముఖ్యమంత్రి గారు కసరత్తు చేశారు, నేను మట్టుకు చదివానని చెప్పారు. రాజశేఖర రెడ్డి గారు ప్రతిపక్షనాయకుడిగా ఉన్నప్పుడు, రాష్ట్రం మొత్తం ఆయన పాదయాత్ర చేసినప్పుడు, అట్టడుగు, బలహీన, దళిత, గిరిజన వర్గాలు, గీత కార్మికులు, కమ్మరి, కుమ్మరి, బలిజ, చేనేత కార్మికులెవరైతే ఉన్నారో, రైతులు, రైతు కూలీలు ఎవరైతే ఉన్నారో వారి దగ్గరకు వెళ్లి ఎన్నో హామీలిచ్చారు. మాకు కష్టం ఉంది, మీరు ఈ సహాయం చెయ్యండి అంటే, మీరు ఒక సంవత్సరం ఆగండి, మీకెందుకు ఈ రాష్ట్రాన్ని ఎటో తీసుకెళ్తాను, మీ సమస్యలను పరిష్కారం చేస్తాను అని చెప్పిన ఆనాటి ప్రతిపక్ష నాయకుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రవేశపెట్టిన నాల్గవ బడ్జెట్ చూస్తే కనీసం ఆనాడు ఆయన చెప్పిన మాటలు, పేద ప్రజానీకానికి ఇచ్చిన హామీలు, ఆయన పాదయాత్రలో

ఇచ్చిన లెక్కలేనన్ని హామీలు అవేవి ఈ బడ్జెట్‌లో రూపకల్పన చేసుకోకపోవడం చాలా దురదృష్టమని తెలియజేస్తున్నాను. అధ్యక్షా, మారింది ఒక్కటే. ఆనాటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాజశేఖర రెడ్డి గారికి ముఖ్యమంత్రిగా పదవి దక్కింది గాని ఈ రాష్ట్రంలో పేద ప్రజానీకానికి ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత న్యాయం జరగలేదని వాస్తవాలు చెబుతున్న సత్యమని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, రోశయ్య గారు అబివృద్ధి, సంక్షేమం బొమ్మాబొరుసని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సుషుప్తావస్థ నుండి సుభిక్షకు వెళ్లిపోయిందని ఆయన చెప్పారు. ఏమి సుభిక్షిత ఈ రాష్ట్రంలో సాధించారని నేను అడుగుతున్నాను. ఈ రాష్ట్రంలో పేదవాడు సరుకులను ఆకాశం వైపు చూస్తుంటే, వాళ్ల అవసరాలు తీర్చగలిగారా? పేదవాడు ఒక పట్టా ఇవ్వమని తిరుగుతుంటే, వాడి అవసరం తీర్చగలిగారా? రైతుల ఆత్మహత్యలు పెరుగుతుంటే వాటిని ఆపగలిగే విధంగా మీ ప్రభుత్వ విధానాలున్నాయా, ఏ విధంగా రైతులకు గిట్టుబాటు ధరలిచ్చారు? ఏ విధమైన సుభిక్షత ఈ రాష్ట్రంలో ఉందని నేను అడుగుతున్నాను. ఇంకొక మాట చెప్పారు. చాలా విజయాలు సాధించామని చెప్పారు. ఏ విజయాలు సాధించారు? ఈ రాష్ట్రంలో ద్రవ్య లోటు లేక దీనికి సంబంధించి నిఖర లోటు తగ్గిస్తే విజయం సాధించినట్లు కాదు అధ్యక్షా. ఎవరి మీద విజయం సాధించారు? ఈ రాష్ట్రంలో ఉన్న ప్రజాసమస్యలను తీర్చి ఈ రాష్ట్రంలో ఉన్న ప్రజానీకం సంతోషంగా ఉంటే ఖచ్చితంగా వారు చెప్పిన మాటను అంగీకరించేవాళ్లం. రాష్ట్రంలో ప్రజానీకం నిత్యం, నిరంతరం సమస్యలతో జీవనం గడుపుతుంటే, వాళ్లు విజయం సాధించారని చెప్పుకోవడం చాలా బాధకరమని తెలియజేస్తున్నాను. ద్రవ్య లోటు వీటికి సంబంధించిన అంశాలే కాకుండా ఆర్థిక పరమైన అంశాలు ఇంకా చాలా ఉన్నాయి. గౌరవసభ్యులు ఇందాక చెప్పారు. రాబోయే రోజులలో ఎన్నో రకాల కష్టాలను ఈ ప్రజానీకానికి వచ్చే విధంగా ఈ ప్రభుత్వం యొక్క ఆర్థిక నిర్ణయాలు, ఆర్థిక ప్రగతి చూస్తే వాటినే సూచిస్తాయని నేను తెలియజేస్తున్నాను. ఆర్థిక క్రమశిక్షణలు పాటించాము, మాకు రేటింగ్ సంస్థలు మన్ననలిచ్చాయని చెప్పారు. నిన్న గాక మొన్న జరిగిన మున్సిపల్ ఎలక్షన్స్‌లో ప్రజలు ఏ విధంగా రేటింగ్ ఇచ్చారో గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఉంది. ఒకటో, రెండో ఇండిపెండెంట్లను కొనుక్కొని వాళ్లకు ఒక కోటి లేక రెండు కోట్ల రూపాయలిచ్చి మేయర్లుగా చేసుకుంటే చేసుకోవచ్చు గాని ఈ రాష్ట్రంలో ప్రభుత్వం పట్ల ప్రజానీకానికున్న ఆలోచనలు నిన్న గాక మొన్న వచ్చిన మున్సిపల్ఎలక్షన్స్‌లో ప్రజల యొక్క ఆలోచన సరళిని సూచిస్తాయని ప్రభుత్వం గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఉంది. రోశయ్య గారు ఇక్కడ లేరు, వారిని ఒకటి అడగవలసిన అవసరం ఉంది. ఎకనామిక్ సర్వే అనేది నిన్న మనం సెంట్రల్ గవర్నమెంట్ దాంట్లో చూసాము. బడ్జెట్ ప్రవేశపెట్టేముందు ఒకరోజు ఈ సభలో ఉంచుతారు. కాని ఈ సారి, ఈ ఎకనామిక్ సర్వే పుస్తకాలు బడ్జెట్‌తోబాటు ఇచ్చారు. ఈ సభలో ఒక రోజు ముందు పెట్టకపోవడానికి కారణం ఏమిటని అడుగుతున్నాను. ఎక్కడైనా, ఏ రాష్ట్రంలోనైనా చూసినప్పుడు ఎకనామిక్ సర్వే అంటున్నారు. కాని ఈ ప్రభుత్వం సోషియో ఎకనామిక్ సర్వేని చేసింది. ఏ సామాజిక అంశాలు రూపొందించారని, ఏ సామాజిక అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారని వారు పేరు మార్చారో, ఈ రాష్ట్రంలో మనం చూసాము. ఇందిరాగాంధి , రాజీవ్ గాంధి పేరుతో ప్రభుత్వ పథకాలకు చాలా పేర్లు పెట్టారు. చివరికి ఎకనామిక్ సర్వేను కూడా సోషియో ఎకనామిక్ సర్వేగా పేరు మార్చడానికి కారణం ఏమిటో ఆర్థిక మంత్రి గారు చెప్పాలి. అధ్యక్షా, ఈనాడు మనం చూసినప్పుడు ఈ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి చాలా బాగుంది, ఆర్థికంగా రాష్ట్రం ముందుకు వెళ్తుంది సుభిక్ష స్థితిలో అని చెప్పినప్పుడు మీ యొక్క ఆర్థిక ఫలితాలు ఒకసారి చూసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

ఉ.10-40

ఎందుకంటే ఇప్పుడు మీరు ఒకసారి భారతదేశ జీఎస్‌డీపితో రాష్ట్ర జీఎస్‌డీపీని పోల్చుకుంటే ఇవాళ ఈ ప్రభుత్వం వచ్చిన మూడు సంవత్సరాలలో జాతీయ స్థాయిలో ఉన్న జీఎస్‌డీపి కంటే మన రాష్ట్ర జీఎస్‌డీపీ ఎందుకు తక్కువగా పడిపోయిందని ఆర్థిక శాఖామంత్రి రోశయ్యగారు సమాధానం చెప్పాలి. 2004-05 సంవత్సరంలో ఈ రాష్ట్రంలో జీఎస్‌డీపీ 6.19 శాతం ఉంటే ఆల్ ఇండియా లెవెల్‌లో 8.54 శాతం ఉంది. 2005-06 సంవత్సరంలో ఈ రాష్ట్రంలో 8.17 శాతం ఉంటే ఆల్ ఇండియా లెవెల్‌లో 8.99 శాతం ఉంది. 2006-07 సంవత్సరంలో రాష్ట్రంలో 7.15 శాతం ఉంటే భారతదేశ స్థాయిలో 9.24 శాతం ఉంది. మీరు సాధిస్తామన్న విజయం భారతదేశంలో ఉన్న సగటు స్థాయికంటె ఈ రాష్ట్రంలో తక్కువగా ఉండడానికి కారణాలేమిటో చెప్పాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉంది. అలాగే మా ప్రభుత్వం అధికారంలో ఉన్న 2000 నుంచి 2004 వ సంవత్సరం వరకు కరవు ఉన్న రెండు సంవత్సరాలు మినహాయిస్తే ఈ రాష్ట్రంలో స్థూల జాతీయోత్పత్తి జాతీయస్థాయి కంటె ఎక్కువగా ఉన్న మాట వాస్తవం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. 2003-04 సంవత్సరంలో ఈ రాష్ట్రంలో 9.27 శాతం ఉంటే జాతీయస్థాయిలో 8.54 శాతం ఉంది. 2000-01 సంవత్సరంలో 7.94 శాతం ఉంటే జాతీయస్థాయిలో కేవలం 4.38 శాతం ఉన్న విషయం వాస్తవం కాదా అని అడుగుతున్నాను. అదే విధంగా పర్ కాపిటా ఇన్‌కం మేం సాధించామని వారు చెబుతున్నారు కానీ వాటియొక్క వృద్ధిశాతాన్ని చూసినా, జాతీయా స్థాయితో పోల్చుకుంటే ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అనగా 2004-05లో 7.66 శాతం రాష్ట్రంలో ఉంటే జాతీయ స్థాయిలో 9.6 శాతం ఉంది. 2005-06లో రాష్ట్రంలో 10.46 శాతం ఉంటే జాతీయ స్థాయిలో 12.7 శాతం ఉంది. 2006-07లో రాష్ట్రంలో 10.2 శాతం ఉంటే జాతీయ స్థాయిలో 13.4 శాతం ఉంది. మేం అధికారంలో ఉన్న 2000-01 సంవత్సరంలో రాష్ట్రంలో 11.19 శాతం ఉంటే జాతీయ స్థాయిలో 5.11 శాతం మాత్రమే ఉంది. 2001-02లో 8.4 శాతం జాతీయ స్థాయిలో ఉంటే రాష్ట్రంలో 8.69 శాతం ఉంది ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూడు సంవత్సరాల పాలనతో పోల్చుకుంటే గతంలో మేం సాధించిన కనీసమైన అభివృద్ధిని కూడా ఈ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో సాధించలేకపోయింది. దానికి మీ ముందున్న అంకెలు నిదర్శనం కాదా అని నేను అడుగుతున్నాను.

ఈ రాష్ట్రంలో గ్రాస్ ఫిక్స్‌డ్ ఫార్మేషన్ అనేది తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత గణనీయంగా పడిపోయిందని అదే విధంగా చాలా మంది సభ్యులు కూడా చెప్పారు. దానిని బట్టి రాష్ట్ర ఆర్థిక ప్రగతి ఉందని కాంగ్రెస్ పార్టీకి చెందిన గౌరవసభ్యులు చాలా మంది చెప్పారు. ఈ నాడు ఈ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత పర్సెంటేజీ తీసుకున్నా చాలా ఆందోళన కలిగించే అంశం ఉంది.

(తెలుగుదేశం సభ్యులు ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి సభలో లేని విషయాన్ని ప్రస్తావించగా అధికార పక్ష సభ్యులు అంతరాయం కలిగించారు.)

గ్రాస్ ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఫార్మేషన్ ఒకసారి చూసుకుంటే 1999-2000లో ప్రభుత్వం తరపున పబ్లిక్ సెక్టార్ తరపున 32.82 శాతం రాష్ట్రంలో జరిగితే, ప్రైవేట్ రంగంలో 67.18 శాతం జరిగింది. అయితే, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2004-05లో గ్రాస్ ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఫార్మేషన్‌లో ప్రభుత్వ పెట్టుబడులు 29.54 శాతానికి తగ్గిపోయాయి. అదే ప్రైవేట్ రంగానికి సంబంధించి క్యాపిటల్ ఫార్మేషన్‌లో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఈ విషయం రాష్ట్రంలో ఆందోళన కలిగించే అంశం . ఇది ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ విధానానికి నిదర్శనం . ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రాస్ ఫిక్స్‌డ్ ఫార్మేషన్‌లో ప్రభుత్వ పెట్టుబడులు గణనీయంగా తగ్గిపోయాయనే మాట వాస్తవం కాదా? ప్రైవేట్ రంగంలో

వస్తున్న పెట్టుబడుల గురించి తమ ఘనతగా చెప్పుకోవడం సరైనది కాదని ఈ ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. ఈ విషయాలన్నీ మనం ఈనాడు ఆలోచించవలసిన అవసరముంది.

ఈరోజు రోశయ్యగారు చెప్పారు, ఇంకా కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మంది గౌరవసభ్యులు చెప్పారు. వారేమి చెబుతున్నారంటే రాజశేఖరరెడ్డిగారి ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పన్నులు పెంచము అని చెప్పారు. ఇందాక ఆనం రామనారాయణరెడ్డిగారు కూడా చెప్పారు. ఈ ప్రభుత్వం ప్రత్యక్షంగా పన్నులు పెంచకపోయినా పరోక్షంగా వేల కోట్ల రూపాయలు సామాన్య ప్రజానీకం మీద భారం వేస్తున్న విషయం వాస్తవం కాదా?

నిన్న గాక మొన్న మనమందరం చూశాం . కేంద్ర రైల్వే మంత్రి శ్రీ లాలూ ప్రసాద్ యాదవ్‌గారి వద్దకు హార్వర్డ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు వచ్చి మీరు ఏవిధంగా రైల్వేల ప్రగతిని సాధించారని వారిని అడుగుతున్నారు. కానీ రోశయ్యగారిని కాంగ్రెస్ అధికారంలో ఉన్న మిగతా రాష్ట్రాలకు పంపిస్తే పన్నులు పెంచుకుండా ఆర్థికాదాయం పెంచుకోనే విధానం ఏదైనా గొప్ప అద్భుత దీపంలాగా ఏమైనా ఉంటే వారికి కూడా సలహా ఇవ్వండి. ఆ రాష్ట్రాలకు మార్గదర్శకం కండి అని విజ్ఞప్తి చేస్తున్నాను. కానీ వారు ఇక్కడ పన్నులు వేయడంలేదని చెప్పినా పరోక్షంగా వేల కోట్ల రూపాయలు ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలమీద వేస్తున్నది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత సగటు మానవుడి మీద 2006-07లో సగటు మానవుడి మీద ఎనిమిది రూపాయలు యాభై రెండు పైసలుంటే ప్రస్తుత సంవత్సరంమైన 2007-07 నాటికి పది రూపాయల నలభై ఐదు రూపాయలు సగటు జీవి మీద పన్ను భారం ఉంది. 2003-04లో కేవలం నాలుగు రూపాయల ఎనభై ఒక్క పైసలు ఉన్న పన్ను భారం ఇవాళ పది రూపాయలకు పైగా ఉందనేది వాస్తవం కాదా అని తెలియజేయవలసిన అవసరముంది. రోశయ్యగారు ఇక్కడ ఈ విషయం వివరించవలసిన అవసరముంది. రోశయ్యగారు పన్నులు వేయలేదని చెబుతున్నారు. కానీ పన్నుల భారం ఏవిధంగా పెరిగిందో చూస్తే దొడ్డిదారిన ప్రభుత్వం పేద ప్రజలపైన విపరీతమైన పన్నుల భారం మోపింది. ఇది వాస్తవం కాదా అని మంత్రిగారిని అడుగుతున్నాను.

మూడు, నాలుగు శాఖలను ఉదాహరణగా మనం తీసుకుంటే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డిపార్టుమెంట్‌లో 2007లో బడ్జెట్ అంచనాలు 250 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందంటే రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో 2500 కోట్ల రూపాయలు ఉంది. ఆ శాఖలో 250 కోట్ల రూపాయల అదనపు ఆదాయాన్ని ప్రభుత్వం సాధించింది. ఆ విధంగా ఈ సంవత్సరం ఆ శాఖ నుంచి 3750 కోట్ల రూపాయలు అంటే గత సంవత్సరంకంటె అదనంగా 1250 కోట్ల రూపాయల ఆర్థిక ఆదాయం పెంచుకునే విధంగా బడ్జెట్ రూపొందించారు. ఏవిధంగా ఇంత ఆదాయం వస్తుందని అడుగుతున్నా. ప్రభుత్వం భూముల ధరలు రాత్రికి రాత్రి పెంచి సామాన్య మానవుడు, పేదవాడు పట్టణాల్లో కాదు మారుమూల పల్లెలో కూడా ఒక గజం ఇంటి స్థలం కొనుక్కోవాలంటే కొనుక్కోలేని పరిస్థితి వచ్చింది. పేదవాడు సొంత స్థలమో, సొంత ఇల్లో రాబోయే రోజుల్లో హైదరాబాదు లాంటి నగరంలో, రాష్ట్రంలోని మిగతా పట్టణాల్లో కావాలంటే అది ఒక స్వప్నంలాగా ఉండే పరిస్థితి ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది. కానీ మంత్రిగారు నిన్న, మొన్న ఎవరో అడిగితే మేం పన్నులు తగ్గించామని చెబుతున్నారు. ఏ రాయైతే ఏమిటి? భూముల విలువ పది రూపాయలుంటే దానిని వెయ్యి రూపాయలకు పెంచి పన్ను ఎనిమిది శాతం నుంచి ఆరు శాతానికి తగ్గించామని చెప్పడంలో అర్థం, పరమార్థం

ప్రభుత్వానికి తెలియాలి. ఇవాళ సామాన్య మానవుడు విపరీతమైన ఇబ్బందులకు గురౌతున్నారని తెలియజేస్తున్నాను.

ఇంకొక అత్యంత ప్రధానమైనది ఎక్సైజ్ శాఖ. ఆ రోజు 1800 కోట్ల రూపాయల ఆదాయముంటే రాజశేఖరరెడ్డిగారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇక్కడ కూర్చుని చెప్పారు. రోశయ్యగారు కూడా ఎక్కడో మీటింగులో చెప్పారు. పిల్లవాడికి ఉగ్గుపాలకు బదులు బ్రాందీయో, సారానో త్రాగిస్తున్నారు. అదే రోశయ్యగారు ఇదే సభలో వారు ఆర్థిక మంత్రి అయిన తరువాత ఆ శాఖ ఆదాయాన్ని దాదాపు 4165 కోట్ల రూపాయలు ఈ ప్రభుత్వం వచ్చిన మూడు సంవత్సరాలలో అత్యధికంగా అంటే దాదాపు 1500 కోట్ల రూపాయల అదనపు రాబడి ఈ శాఖలో సాధించారు. ఆర్థిక శాఖామంత్రిగారికి ఇంత ఆదాయం ఎట్లా వస్తుంది? మీరు ఎప్పుడైతే రేట్లు పెంచుతున్నారో మరలా ఆ షాపులవారు మరలా పేద వాడి దగ్గర అమ్మాల్సిందే. ఈ రాష్ట్రంలో గ్రామాల్లో ప్రజానీకం మైళ్ల దూరంనుంచి మంచినీరు తీసుకొచ్చుకుంటున్న పరిస్థితి ఉంది. కానీ మందు మాత్రం గ్రామాల్లో అందుబాటులో ఉంది. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం విధానంలాగా ప్రభుత్వం ముందుకు పోతున్నది. నేను రోశయ్యగారిని ఒకటి అడుగుతున్నాను. ఈ ప్రభుత్వానికి సామాజికమైన బాధ్యత ఉందా? లేదా? సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలను తగ్గించవలసిన బాధ్యత ఈ ప్రభుత్వంమీద ఉంటే అదే ప్రభుత్వం ఈరోజు మీరు బ్రహ్మాండంగా మందు తాగండి, మందు తాగి మాకు ఆదాయం ఇవ్వండి అనే నినాదంతో ఈ ప్రభుత్వం ముందుకు పోవడం చాలా దురదృష్టకరం .

(ప్రతిపక్ష సభ్యులు షేమ్ షేమ్ అని అన్నారు)

ఇదెంత దారుణమంటే పేదవాడి కష్టాలను ప్రభుత్వం దోచుకుంటుంది. సామాన్యుడి రక్తాన్ని పిండుతున్నది ఈ ప్రభుత్వం . గ్రామాల్లోని సామాన్య కుంటుంబాలను చూస్తే మద్యం బారిన పడి ఆ కుటుంబాలు చిన్నాభిన్నమైపోయి ఆ కుటుంబాలలోని పిల్లలు విద్య, ఆరోగ్యం దొరక్క ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అటువంటి పరిస్థితి ప్రభుత్వం తీసుకొస్తున్నది.

ఉ. 10.50

మొన్న ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ తాము మహాత్మా గాంధీ వారసులమని చెప్పారు. మా సభ్యులు ఏదో చెబితే వారు కూర్చున్నారు. అధ్యక్షా, నేను సూటిగా ముఖ్యమంత్రిగారిని అడుగుతున్నాను. మహాత్మా గాంధీ వారసులం అని చెప్పుకున్న మీరు ఈ రాష్ట్రంలో మద్యాన్ని ప్రోత్సహించి పేదప్రజలను త్రాగుబోతులను చేస్తున్నారు. ఇది మహాత్మా గాంధీ వారసత్వమా అని నేను అడుగుతున్నాను.

( షేమ్, షేమ్ అంటూ టిడిపి సభ్యుల నుండి కేకలు)

అధ్యక్షా, మరొక అత్యంత ప్రధానమైన విషయం అమ్మకం పన్ను. మిగతా రాష్ట్రాల్లో చాలా వాటి మీద పన్నులు ఎత్తి వేస్తే ఈ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో వాటిపై పన్నులను అట్లాగే వుంచింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి మీయొక్క పన్నుల విధానం కారణమని తెలియజేస్తున్నాను. ఈనాడు పప్పు దినుసులు తీసుకున్నా, ఎగ్రికల్చరల్ ప్రొడ్యూస్ తీసుకున్నా , ఫెర్టిలైజర్స్ తీసుకున్నా, మిగతా రాష్ట్రాలలో ఎక్కడా లేనివిధంగా ఈ రాష్ట్రంలో చాలా అంశాల మీద వ్యాట్ అమలుచేస్తున్నారు. రాష్ట్ర ఆదాయం పెంచడానికి చూస్తున్నారు తప్ప వ్యాట్ తీసివేయడం లేదు. వ్యాట్ తీసివేస్తారని మేము ఆశించాము. మేము అధికారంలో వున్నప్పుడు వ్యాట్ రావడానికి సహకరించాము. మేము పేద ప్రజల మీద పన్నుల భారం తగ్గుతుందని ఆశించాము. కానీ పేద

ప్రజలపై పన్నుల భారం తగ్గకపోగా మరింత పెరుగుతున్న విషయం వాస్తవం కాదా? ట్యాక్సెస్ ద్వారా మీ ఆదాయం గత సంవత్సరం రు. 16 వేల కోట్లు కాగా ఈనాడు రు. 20 వేల కోట్లకు పెరుగుతూ వుంది. ఇది ఎలా సాధ్యం అని అడుగుతున్నాను. రోశయ్యగారు తామేదో అడ్డుకట్ట వేయడం వల్ల వస్తున్నాయని మనలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సరియైనది కాదు. వారు మిగతా రాష్ట్రాలకు సలహా కూడా యిస్తున్నారు మీరు కూడా పన్నులు వేసుకోండి అని. మిగతా రాష్ట్రాల్లో పప్పు దినుసుల మీద పన్ను లేదు, పసుపు మీద, ఫెర్టిలైజర్స్ మీద పన్ను వుంది. వీటిని ఎత్తివేయడానికి ప్రభుత్వం ఎందుకు ఆలోచన చేయలేదు అని అడుగుతున్నాను.

నిరర్థక ఆస్థుల అమ్మకం గురించి కొందరు గౌరవసభ్యులు మాట్లాడుతూ చెప్పారు. పేదవర్గాలు, దళితులు, అణగారిన వర్గాలు, సంవత్సరాల తరబడి ఆక్రమించిన భూములను, సాగు చేస్తున్న భూములను ఈ ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడంలో భాగంగా వాటిని తొలగిస్తూ ఆ భూములను ఆక్షన్ పెట్టి సొమ్ము చేసుకునే దౌర్భాగ్య స్థితికి వచ్చింది. ప్రభుత్వ ఆస్థులను, ప్రభుత్వ భూములను పరిరక్షించడానికి గాను ప్రభుత్వం కస్టోడియన్‌గా వ్యవహరించవలసివుండగా , అట్లా చేయకపోగా ఆ ఆస్థులను హరించే విధంగా , ధనిక భూస్వాములకు కొమ్ముకాసే విధంగా వాటిని అమ్మి ఆ వర్గాలకు కట్టబెట్టి వేల కోట్ల రూపాయలు సొమ్ము చేసుకునే ఆలోచనను తెలుగుదేశం పార్టీ పరంగా వ్యతిరేకిస్తున్నాము. ఇటువంటి విధానాలు రాష్ట్ర ప్రగతికి, రాష్ట్ర ప్రజల పురోగతికి మంచిది కాదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

జలయజ్ఞం గురించి చాలా చెప్పారు. అధ్యక్షా, నేను ఒకటే అడుగుతున్నాను ఈ ప్రభుత్వాన్ని . ప్రభుత్వానికి సమగ్రమైన జల విధానం వుండడం అవసరం . గతంలో ఏ ప్రాజెక్టులు వున్నాయి? ఏ ప్రాజెక్టులను తీసుకున్నాము? భవిష్యత్తులో తీసుకోవలసిన ప్రాజెక్టులు ఏవి? వీటికి ఎంత కేటాయింపులు యివ్వాలి? ఏ ప్రాజెక్టుకు ఎంత కేటాయింపులు యిస్తున్నాము అనే దానిలో స్పష్టమైన విధానం ప్రభుత్వం దగ్గర వుండవలసిన అవసరం వుంది. దురదృష్టం, ఈ ప్రభుత్వంలో రాత్రికి రాత్రి జీవోలు వస్తాయి. ఎవరికోసం యిస్తారో, ఎందుకు యిస్తారో తెలియదు. ఒక స్పష్టత లేని పద్ధతిలో ఈ ప్రభుత్వం జలయజ్ఞాన్ని తీసుకుపోతున్నది. జలయజ్ఞంలో జరుగుతున్న అవినీతికి ఖచ్చితంగా తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం అధ్యక్షా. జలయజ్ఞంలో జరుగుతున్న అవినీతిని వ్యతిరేకిస్తున్నాము తప్ప జలయజ్ఞాన్ని కాదని అధికార పార్టీ సభ్యులు గుర్తు వుంచుకోవలసిన అవసరం వుంది. ఒక్క ఉదాహరణ.. పులిచింతల ప్రాజెక్టు తీసుకుంటే, కాంట్రాక్టర్ 18 శాతం లెస్ టెండర్ వేస్తే ఇపిసి సిస్టం క్రింద ప్రాజెక్ట్ డిజైన్స్ మార్చడం వల్ల రు. 50 కోట్లు ఆదా అవుతే, దాని వల్ల కాంట్రాక్టర్‌కు లాభం చేకూరుతోంది. డిజైన్స్ మార్చడం వల్ల వచ్చే ఆదా విషయంలో ఒక్క రూపాయి అయినా మీరు రాష్ట్ర ఖజానాకు జమ చేసే శక్తి వుందా అని అడుగుతున్నాను. ఆ ఆదాని ప్రభుత్వ ఖాతాకు జమ చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అధ్యక్షా? లాభాన్ని కాంట్రాక్టర్‌కి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దాన్ని వ్యతిరేకిస్తున్నాము, నిరసిస్తున్నాము అని గుర్తు పెట్టుకోవలసిన అవసరం వుంది. నీటిలో చేపలు నీరు త్రాగడం మనకు తెలియదు. ఈ ప్రభుత్వం జలయజ్ఞం పేరుతో వేల కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లకు , వారికి సంబంధించిన సన్నిహితులకు, మిత్రులకు కట్టబెట్టే విధంగా వుండడాన్ని మేము నిరసిస్తున్నామని గుర్తు పెట్టుకోవలసిన అవసరం వుందని తెలియజేస్తున్నాను. అదే విధంగా ఈ రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితి వుంది. ఈనాడు మనం చూస్తున్నాము. ఈ ప్రభుత్వంలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత జల వివాదాలు ఎక్కువ అయినాయి. అవి ఏ ప్రాంతాలు అయినప్పటికీ ప్రాంతాల మధ్య విబేధాలు ఎక్కువైనాయి. ప్రజలను కొట్టుకునే పరిస్థితికి ఈ ప్రభుత్వం తీసుకుపోతున్నది. ఆయా ప్రాంతాల ప్రజల అపోహలను పోగొట్టి

ఒక ధైర్యం యిచ్చి ముందుకు తీసుకుపోవలసిన ప్రభుత్వం చేస్తున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల జిల్లాల మధ్య తగాదాలు పెరుగుతున్నాయి. నిన్న, మొన్న ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను గురించి, దుమ్ముగూడెం గురించి ఆలోచన చేశాము. మీరు దుమ్ముగూడెం ప్రాజెక్టుకు సాగర్ నుండి టెయిల్ పాయింట్‌కు నీరు తీసుకువెళ్లడానికి డిపిఆర్ పిలిచారు. మీకు సమగ్ర జల విధానం లేనందువల్ల మీ యిష్టారాజ్యంగా చేస్తున్నందువల్ల జిల్లాల మధ్య తగాదాలు వస్తున్నాయి. కృష్ణా డెల్టాలో పోతిరెడ్డి పాడు గురించి మేము మాట్లాడుతే , మేము రాయలసీమకు వ్యతిరేకం అంటారు. మిగతా ప్రాంతాలకు నీరు తీసుకుపోతూవుంటే వ్యతిరేకిస్తున్నారని అంటున్నారు. మేము చేసినతప్పు ఏమిటి? మహారాష్ట్ర, కర్నాటక నీటి వనరుల విషయంలో కమిటీ వేయవలసిందిగా రాజశేఖర రెడ్డి ట్రిబ్యునల్ ముందు అడిగారు. వారు బయట రాష్ట్రాల మీద నిపుణుల కమిటీని వేయమంటే తప్పులేదు. కృష్ణా మిగులు జలాల లభ్యత తగ్గుతున్నందువల్ల నిపుణుల కమిటీ వేయవలసిందిగా మేము అడిగాము. వరద నీరు లభ్యం కావడం లేదు. గతంలో ప్రాజెక్టులు వున్నాయి. ఇప్పటికీ చాలా ప్రాజెక్టులు తీసుకుంటున్నాము. నిపుణుల కమిటీని వేసి, కృష్ణా నదిలో లభ్యం అవుతున్న నీటి వివరాలను సేకరించి , కేటాయించిన ప్రాజెక్టులు, తీసుకుపోతున్న ప్రాజెక్టుల వివరాలను తీసివేసి, మిగులు జలాల లెక్క తేల్చండి. లెక్క తేల్చి తెలంగాణా, ఆంధ్ర, రాయలసీమలకు ఎంత యిస్తారు అని అడుగుతే మేము పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకం అని అంటారు. ఇది తప్పా? నాగార్జున సాగర్ డెల్టా క్రింద 33 లక్షల ఎకరాల భూమికి సంబంధించిన రైతులు ఆధారపడి వున్నారు. కాల్వ గేట్లు తీస్తే నీరు వస్తుంది. దుమ్ముగూడెం నుండి తెస్తే లిఫ్టల ద్వారా నీరు తీసుకురావాలి. గేట్లు తెరుస్తే నీరు వచ్చే మార్గం వొదిలిపెట్టి లిఫ్టుల ద్వారా యిస్తామంటే నమ్మమంటారా అధ్యక్షా? మీరు సమర్థవంతంగా వుండకపోవడం వల్ల , సమర్థ విధా98నం లేకపోవడం వల్ల కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి జిల్లాల మధ్య తగాదాలు, ప్రాంతాల మధ్య విబేధాలు వచ్చే పరిస్థితి ఏర్పడుతోందని తెలియజేస్తున్నాను. ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర జలవిధానం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాను.

ఉ 11.00

అధ్యక్షా, ఈనాడు హరితాంధ్రప్రదేశ్ అని చెబుతున్నారు. హరితాంధ్ర ప్రదేశ్ సాధించడం ఏమో కానీ ఈ ప్రభుత్వం యొక్క అస్తవ్యస్థ పాలన వల్ల ఈ రాష్ట్రం ఎప్పుడో హత్యాంధ్ర ప్రదేశ్‌గా అయిపోయింది. ఇంతకు ముందు కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతూ మేము వ్యవసాయానికి చాలా ప్రాధాన్యత ఇస్తున్నామని బల్ల గుద్ది చెప్పారు. ఈ రాష్ట్రంలో వ్యవసాయం పురోగతి వైపు వెళుతోంది. ఎప్పుడూ లేని కేటాయింపులు అడిగిందీ అడ గందీ అన్నీ ఇచ్చామని చెబుతున్నారు. నేను ఒకటే అడుగుతున్నాను. ప్రధానమైన శాఖలు ఉన్న మంత్రులు కూడా ఆ శాఖల పట్ల సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల వ్యవసాయం ఇవ్వాళ అధోగతి వైపు వెళుతోంది.ఈ రాష్ట్రంలో మీ అసమర్థత వల్ల రైతు దగా పడ్డాడు. ఈ అస్తవ్యస్థ పరిపాలన వల్ల రాష్ట్రంలో రైతు దగా పడ్డాడని గుర్తు పెట్టుకోవలసిన అవసరం ఉంది. జల యజ్ఞం చేస్తున్నామని మీరు చెబుతున్నారు. ఈ మధ్య ఎప్పుడో కాంగ్రెస్ పార్టీ సభ్యులు చెబుతున్నారు. వరుణదేవుడు మా వైపు ఉన్నారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు ఉన్నాయి అన్నారు. వర్షాలు పడ్డాయి. వాతావరణం అనుకూలించింది. ఆర్థిక ప్రగతి బ్రహ్మాండంగా ఉంది. ఇవన్నీ ప్రధానంగా ఈ రాష్ట్రంలో ఉన్నప్పుడు వ్యవసాయం ఎందుకు వెనుకబడిపోయిందీ అని అడుగుతున్నాను. ఒకసారి మనం చూస్తే 2005-2006 లో ఆహార ధాన్యాల క్రింద ఉన్న ఏరియా చూస్తే 71.68 లక్షల హెక్టార్లు ఉంటే 2006-2007 వచ్చేసరికి 67.43 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది ఈ సంవత్సరం. దాదాపు 25 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఆహారధాన్యాలు తగ్గిపోయిన మాట వాస్తవం కాదా? నిన్న కూడా ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఫుడ్‌గ్రెయిన్స్ 169 లక్షల టన్నులు సాధించామని చెప్పారు. నేను ఒక్కటే ఈ ప్రభుత్వాన్ని అడుగు

తున్నాను. అయ్యా మీరు ఏ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శిస్తున్నారో మేము అధికారంలో ఉన్నప్పుడు 2000-2001 లో 160 లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఈ రాష్ట్రంలో పండించాము. మీ యొక్క రికార్డులు తెలియజేస్తున్నాయి. ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి ఇంత ప్రాధాన్యత ఇస్తు న్నప్పుడు మీరు సాధించింది ఎంత అంటే కేవలం 9 లక్షల టన్నులు మాత్రమే గత సంవత్సరం పండించారు. ఈ సంవత్సరానికి వస్తూనే 166 టన్నులు ఉన్నదల్లా 147 కు పడిపోయి 21 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి ఈ రాష్ట్రంలో తగ్గిపోయిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. రైతు పరిస్థితి ఏ విధంగా ఉందంటే పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉంది. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా 7 వేల మంది ఎమ్‌పిఇఓలను మంత్రిగారు ఒక్క కలం పోటుతో తీసి వేశారు. వ్యవసాయ విస్తీర్ణం అందించేదానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనందువల్ల ఈ వ్యవసాయం అధోగతి పాలయింది. వ్యవసాయం సంక్షోభం వైపు వెళుతోంది. నేను ఒక విషయం మంత్రి గారిని అడుగుతున్నాను. మీరు ఇంత ప్రాధాన్యం ఇస్తున్న వ్యవసాయ రంగం ఎందుకు వెనుకబడిపోయింది?

డా. జి. చిన్నారెడ్డి (వనపర్తి):- ఒక చిన్న క్లారిఫికేషన్ సార్. వెనకబడి పోయిందీ, వెనకబడిపోయిందీ అని తప్పుడు లెక్కలు చెబుతున్నారు సార్.

శ్రీ డి. నరేంద్ర కుమార్:- అయ్యా ఇవి ఆర్థిక సర్వేలో ఉన్న వివరాలు. నేను రోశయ్య గారిని ఒకటి అడుగుతున్నాను. ఈ సంవత్సరం ఒకసారి ఆర్థికపరమైన లెక్కలు తీసుకోండి. మీ దగ్గర ఎకనామిక్ సర్వే పుస్తకం తీయండి. ఎకనామిక్ సర్వే బుక్‌లో పేజ్ నెంబరు 166. అగ్రికల్చర్ అధ్యక్షా - percentage changeover previous year 2006-2007 వచ్చేసరికి మైనస్ 6.56 శాతం నెగటివ్ గ్రోత్ రేట్ వ్యవసాయంలో చూపెట్టారు. అదే ప్రాధాన్యత ఉన్న ప్రైమరీ సెక్టార్ మొత్తం చూసుకుంటే అగ్రికల్చర్ కానీ, లైవ్ స్టాక్ కానీ ఫారెస్ట్ కానీ తీసుకుంటే మైనస్ 1.37 శాతం నెగటివ్ గ్రోత్ ప్రైమరీ సెక్టార్‌లోవచ్చింది ఆర్థికమంత్రి గారూ. మీరు సుభిక్షంగా ఉందని చెబుతున్నారు. ఈ సుభిక్షతకు అద్దం ఈ యొక్క వాస్తవాలు అని చెప్పి కూడా తెలియజేస్తున్నాను. ఇంత ఖర్చు పెట్టినా, ఇంత మీరు చేసినప్పుడు మైనస్ 6 శాతం నెగటివ్ గ్రోత్ వ్యవసాయంలో రావలసిన అవసరం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తునానను. ఎక్కడా కూడా రోశయ్య గారు తమ ప్రసంగంలో దానిని ప్రస్తావించకపోవడం చాలా దురదృష్టకరం అని తెలియజేస్తున్నాను. అదే విధంగా ఇంకో మాట చెబుతున్నారు. మేము వచ్చిన మూడు సంవత్సరాలలో జలయజ్ఞం చేశాము. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టుకు నీరు ఇచ్చామని చెబుతున్నారు. అయ్యా మీరు ఒక్కసారి వివరించాలి. ఎక్కడెక్కడ 12 లక్షల ఎకరాలకు ఇచ్చారో చెప్పవలసిన అవసరం ఉంది. నేను ఒకసారి ప్రభుత్వం దృష్టికి తెస్తున్నాను. ఎందుకంటే ఇవ్వాళ ఈ రాష్ట్రంలో 1998-99 లో 22.86 శాతం కెనాల్ ఇరిగేషన్ జరిగింది. 2005-2006 లో కేవలం 22.31 లక్షల హెక్టార్లలో మాత్రమే కెనాల్ ఇరిగేషన్ జరిగింది. జలయజ్ఞం లక్షల హెక్టార్లలో తీసుకువచ్చినప్పుడు అది ఎక్కడా పుస్తకాలలో కనపడడం లేదు. కాగితాల పైన కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ యొక్క నాయకుల మాటలలో కనపడుతోంది తప్ప ఎక్కడా రైతాంగానికి ప్రజానీకానికి కనపడని పరిస్థితి అని చెప్పి కూడా నేను తెలియజేస్తున్నాను. ఇంకొక ఆందోళన కరమైన అంశం ఉంది. భూముల మీద ఆధారపడే విస్తీర్ణం పెరుగుతోంది. అది 27.96 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఈ ప్రభుత్వం మీడియం, మైనర్ ఇరిగేషన్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల గతంలో 9.28 లక్షలు ఉన్న విస్తీర్ణం 7.62 శాతానికి తగ్గిపోయిన మా వాస్తవం కాదా? మీ యొక్క జలయజ్ఞం ఫలాలు, ఫలితాలు ఏమయ్యాయి అని చెప్పి నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత చాలా కమిషన్స్ వేశారు. ఆత్మహత్యల మీద రామచంద్రా రెడ్డి గారి కమిషన్, కమిషన్ ఫర్ ఫార్మర్స్ వెల్ఫేర్‌కు జయతిఘోష్ కమిషన్ వేశారు. ముఖ్యమంత్రి గారు, రోశయ్య

గారు గత జనవరిలో మేము అగ్రికల్చర్ టెక్నాలజీ మెషిన్ ప్రారంభించామని చెప్పారు. నేను ఒక్కటే అడుగుతున్నాను. మీరు ప్రారంభించిన సంవత్సరంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మెషిన్ క్రిందరైతాంగానికి ఏమి సేవలు అందించారు? ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు? మీరు ఈ రికమెండేషన్స్, ఈ యొక్క కమిషన్స్‌ను కనుక సమర్థవంతంగా పని చేయించి ఉంటే వ్యవసాయం అధోగతి పాలు అయ్యేదా అని అడుగుతున్నాను. **W.T.O cell** పెట్టారు. ఒడంబడిక అంటున్నారు. ముఖ్యమంత్రి గారు కూడా చెప్పారు. నిన్న మిత్ర పురుగులు, శతృ పురుగులు అని చాలా రకరకాలుగా చెప్పారు. కనీసం వ్యవసాయ శాఖ మంత్రి గారు ఆయన నియోజక వర్గంలో ఆయన పొలాల్లో కార్యక్రమాలకు వెళ్లారా? అనంతపురం జిల్లాలో రెండు రోజులు మేము తిరిగాము. వ్యవసాయ శాఖమంత్రి గారి నియోజక వర్గంలో కరవు వల్ల, నీళ్లు లేక వేల ఎకరాలలో దానిమ్మ తోటలు ఎండిపోయాయి. వేల ఎకరాలలో వేరుశనగ వేసిన రైతులు నష్టపోయారు. తోటలు కొట్టేసిన సందర్భాలు న్నాయి. మంత్రి గారు ఆయన నియోజక వర్గానికే న్యాయం చేయలేనప్పుడు ఈ రాష్ట్రానికి ఏమి న్యాయం చేస్తారు?

చైర్మన్:– కన్‌క్లూడ్ చేయండి.

శ్రీ డి. నరేంద్ర కుమార్:– రైతు చైతన్య యాత్రలు అన్నారు. రైతులు లేని చైతన్య యాత్రలు. ఈనాడు వరదలు వచ్చి రైతు నష్టపోతే మంత్రులు ఆస్ట్రేలియా వెళ్లారు. రైతులను ఆదుకునే విధంగా ఇవ్వరు. 50 శాతం సబ్సిడీ అనేది పేపర్ మీద తప్పితే మొక్కజొన్న వేసుకున్న రైతులకు గానీ ఇతర పంటలు వేసుకున్న వారికి కానీ ఈ రాష్ట్రంలో 50 శాతం సబ్సిడీ మీద విత్తనాలు ఇచ్చిన పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వం చాలా గొప్పగా చెబుతోంది. నిన్న ముఖ్యమంత్రి గారు కూడాచెప్పారు. సెంట్రల్ గవర్నమెంట్ నుంచి ఈ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ తెచ్చామని చెప్పి ఆయన ఈ సభలో చాలా గట్టిగా ఆయన వాణి వినిపించారు. రు.9650 కోట్లు. మీ ముఖ్యమంత్రి గారు ప్రధానమంత్రి గారిని అడిగింది ఎంతో తెలుసా? రు.51 వేల కోట్లు ఈ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ క్రింద అడిగితే రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రప్రభుత్వం ఇచ్చింది కేవలం రు.9150 కోట్లు అని గుర్తు పెట్టుకోవాలి. అడిగేది కొండంత. దానిలో కూడా చాలా అంశాలు ఉన్నాయి. డ్రిప్ ఇరిగేషన్ ఉంది. వాటర్ షెడ్స్ ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ ఉంది. ఈ కాంపొనెంట్స్‌కు అన్నిటికీ కలిపి వచ్చింది తప్ప ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం నుంచీ ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఏమీ లేదని గుర్తు పెట్టుకోవలసిన అవసరం ఉంది.
ఉ.11.10

మాటల్లో కోరేది కొండంత, వచ్చేది మాత్రం వాళ్లకే తెలియాలి. ప్రధానమంత్రికి ఇచ్చిన రిప్రజెంటేషన్‌లో స్వయంగా ముఖ్యమంత్రిగారే చెప్పారు ఈ రాష్ట్రంలో 4 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని. ఈ ఆత్మహత్యల్ని నివారించేందుకు రైతుల్ని ఋణ విమోచన చేసేందుకు ఈ ప్రభుత్వం ఏదైనా చర్యలు తీసుకునేందుకు ఆలోచిస్తున్నదా అంటే, ఎక్కడా అటువంటి చర్యలు కనబడటం లేదు.

అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం యొక్క ప్యాకేజ్ వల్ల సహకార రంగంలో రైతాంగానికి దక్కవలసిన వడ్డీ మాఫీ దక్కకపోవడం దురదృష్టకరం. ఈ రాష్ట్రానికి పదహారు, పదిహేడు వందల కోట్లు రూ.లు వస్తుందని మీరు అనుకుంటే, అందులో 14 వందల కోట్ల రూ.లు కమర్షియల్ బ్యాంకులకు పోతే, సహకార రంగం ద్వారా రుణాలు తీసుకున్న వారికి కేవలం రూ.250 నుండి 300 కోట్లకు మించి రావడం లేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవలసిన అవసరం ఉంది. అధ్యక్షా, ఈనాడు ఈ ప్రభుత్వం యొక్క నిర్వాహకం వల్ల 2004లో ఏదయితే

రుణాల రీ–షెడ్యూల్ చేయడం జరిగిందో, అప్పుడు వడ్డీని తీసుకుని వచ్చి అసల్లో కలిపి చూపించడం వల్ల ఈ రాష్ట్రంలో రైతాంగానికి దక్కవలసిన రూ.1400 కోట్లు దక్కకపోవడానికి ఈ ప్రభుత్వం చేసిన నిర్వాహకం కాదా అని నేను అడుగుతున్నాను. ముఖ్యమంత్రిగారు ఉత్తరం వ్రాశారని అంటున్నారు. కేంద్రంలో మీ ప్రభుత్వమే ఉంది. మీరు ఎప్పుడు వెళ్లి అడిగినా సోనియా గాంధీగారు కరుణిస్తారని చెప్పుకుంటారు. మరి ఆ ఆమె మిమ్మల్ని ఎందుకు కరుణించలేదు? ఆ రూ.1400 కోట్లు రైతాంగానికి వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఎందుకు ఒత్తిడి తీసుకుని రాలేకపోతున్నారని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాను.

అధ్యక్షా, ఇంకొకటి కూడా చెప్పారు. మేమేదో సహకార రంగాన్ని అధోగతిపాలు చేశామని, వీరు ఏదో బ్రహ్మాండంగా చేస్తున్నామని చెపుతున్నారు. అధ్యక్షా, ఒకసారి ప్రభుత్వం చెప్పవలసిన అవసరం ఉంది.

( శ్రీ నాదెండ్ల మనోహర్ అధ్యక్షస్థానం వహించారు)

ఎందుకంటే ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత, సహకార రంగం ద్వారా ఇచ్చిన రుణాల్ని ఒకసారి చూస్తే, సభ్యులు చాలా గట్టిగా చెప్పారు మేము రూ.14 వేల కోట్లను వ్యవసాయ రుణాల కింద ఇచ్చామని. నేను ఒకటే సూటిగా అడుగుతున్నాను అధికార పార్టీ సభ్యుల్ని -- ఈ 14 వేల కోట్ల రూ.లు సహకార రంగం ద్వారా మీరు ఇచ్చిన రుణాలా అని. అధ్యక్షా, 2002-03 సం.లో ఈ రాష్ట్రంలో రూ.10 వేల కోట్ల మేరకు వ్యవసాయ రుణాలు ఇస్తే, అందులో సహకార రంగం వాట 36 నుండి 37 శాతం ఉంది. అదే 2005-06 సం. వచ్చేటప్పటికి, రూ.15 వేల కోట్ల ఋణాల్ని ఇచ్చారని చెపుతుంటే, దాంట్లో సహకార రంగం ద్వారా రైతాంగానికి ఇచ్చిన ఋణాల శాతం 20కు తగ్గిన మాట వాస్తవమా కాదా అని నేను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. మీరేదో సహకార రంగం ద్వారా ఋణాలిచ్చి, రైతాంగాన్ని ఆదుకుంటున్నామని చెపుతున్నారు. మీరు రాష్ట్రంలో ఇచ్చిన వ్యవసాయ ఋణాల్లో సహకార రంగం యొక్క వాటా గణనీయంగా తగ్గిపోయి, రైతాంగం ప్రయివేటు బ్యాంకుల వైపు నెట్టివేస్తున్న విషయం వాస్తవం కాదా అని ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

అధ్యక్షా, ఇంకొకటి మంత్రిగారు చెప్పవలసిన అవసరం ఉంది. సహకార రంగం యొక్క లోన్స్ అండ్ అడ్వాన్సెస్ విషయం చూస్తే, 2001-02 సం.లో రూ. 7 కోట్ల 89 లక్షల్ని లోన్స్ అండ్ అడ్వెన్సెస్ గా మేము అధికారంలో ఉన్నప్పుడు ఇస్తే, 2005-06 సంవత్సరం వచ్చేటప్పటికి రూ. 3919 కోట్లకు తగ్గిపోయిన మాట వాస్తవమా కాదా అని చెప్పి నేను అడుగుతున్నాను. ఈవేళ ఋణగ్రస్తులైన రైతాంగాన్ని ఆదుకొంటామని చెప్పిన మాటలు, సహకార రంగం ద్వారా రైతాంగానికి న్యాయం చేస్తామనే మాటలు కేవలం నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఎక్కడ కూడా సహకార రంగం ద్వారా రైతాంగాన్ని ఆదుకునే విధంగా ఈ ప్రభుత్వం యొక్క నిర్ణయాలు లేవు, ఈ ప్రభుత్వం ఆచరణలో ఏ మాత్రం కార్యక్రమాలు తీసుకోవడం లేదు అనడానికి ఇంత కంటే నిదర్శనం ఏమి కావాలి అని నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

అధ్యక్షా, మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు గురించి నిన్న మనం చాలా విస్తృతంగా చర్చించాము. కాని మాకు చివర్లో బాధ కల్గింది. ఇంత చర్చించిన తర్వాత కూడా, ఇందాకే రామనారాయణరెడ్డిగారు చెప్పారు--అనురాగమైన మనస్సు ఉండాలని చెప్పి. అటువంటి మనస్సు మా ముఖ్యమంత్రికి ఉందని చెప్పాడు. నిన్న అన్ని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినా, ముఖ్యమంత్రి స్పందించలేదు. పసుపుకు గిట్టుబాటు ధర లేదు, రైతులు రోడ్డుఎక్కారు అని మాట్లాడినా, ముఖ్యమంత్రిగారు కనీసం నోరు తెరిచి, మీరు అడిగింది న్యాయంగా ఉంది, నేను పరిశీలిస్తాను, నేను న్యాయం చేస్తాను, నేను కొనుగోలు చేస్తాననే మాట ఎందుకు

చెప్పలేదని అడుగుతున్నాను. ముఖ్యమంత్రిగారు రైతాంగం పట్ల ఇంత నిర్దయగా ఉండటం మంచిది కాదు అని వారికి తెలియచేస్తున్నాను. ఈరోజున రైతులు రోడ్డెక్కి ధర కావాలంటే, కనీసం స్పందించలేని ముఖ్యమంత్రిని ఈవేళ పదాలతో, పద్యాలతో ఆకాశానికి ఎత్తేస్తే, ప్రజలు విశ్వసిస్తారని మీరు అనుకుంటున్నారా అని అడుగుతున్నాను.

ఇక గిరిజనుల విషయానికి వస్తే అధ్యక్షా, ఈ ప్రభుత్వం దళారీ పాత్ర పోషిస్తోంది. నిన్న కూడా మేము చెప్పాము. పత్తి ధరల విషయంలో, పత్తి రైతులకు న్యాయం జరిగే విషయంలో ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది, దళారీ పాత్ర పోషిస్తుందని. ఈ రోజున గిరిజన ఉత్పత్తుల విషయాన్ని చూస్తే, మార్కెట్‌లో చింతపండు ధర ఎంత ఉంది అధ్యక్షా? దాదాపుగా కిలో 40 నుండి 60 రూ.లకు అమ్ముతున్నారు. అదే మీరు గిరిజనుల నుండి కిలో 6 నుండి 8 రూ.లకు కొని, బయట 40, 60 రూ.లకు ప్రభుత్వం అమ్ముకుంటున్నది. ఆ లాభాన్ని గిరిజనులకు కాని, గిరిజన సహకార సంస్థకు కాని ఇవ్వకుండా, జి.సి.సి. అధికారుల జీతాలకు వాడుకుంటున్నది. గిరిజనుల్ని కాపాడవలసిన ప్రభుత్వం, గిరిజన రైతుల్ని ఆదుకోవలసిన జి.సి.సి. యంత్రాంగం గిరిజనుల్ని దోపిడీ చేస్తోంది. ఇక వాళ్లు ఎవరికి మొర పెట్టుకోవాలి? అందుకే నేను డిమాండ్ చేస్తున్నాను--మీరు ఖచ్చితంగా రూ. 25 వరకు పెంచవలసిన వసరం ఉంది. ఆ విధంగా పెంచాలని చెప్పి నేను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

అధ్యక్షా, వ్యవసాయం గురించి చాలా చెప్పారు. నేను ఒకటే అడుగుతున్నాను. మీరు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న వ్యవసయ రంగానికి చెందిన ఎగుమతుల్ని ఒకసారి మీరు చూసుకుంటే, 2001-02లో మేము అధికారంలో ఉన్నప్పుడు రూ. 2891 కోట్లు విలువైన అగ్రికల్చర్ కాని, ఆగ్రో బేస్డ్ గాని, ఫారెస్టు ప్రాడక్ట్సు గాని మేము ఎక్స్‌పోర్టు చేస్తే, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత, 2004-05లో రూ. 1152 కోట్లు. 2005-06 లో రూ. 1200 కోట్లు. ఎందుకు వ్యవసాయ ఎగుమతులు ఈ రాష్ట్రం నుండి పడిపోయాయో సమాధానం చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. వ్యవసాయాన్ని బ్రహ్మాండంగా చేస్తున్నామని చెప్పి, రైతుకు అరచేతిలో వైకుంఠం చూపించే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోంది. అది సరైంది కాదని మీకు తెలియచేస్తున్నాను.

ఇక అధ్యక్షా, మహిళా సంక్షేమ విషయానికి వస్తే, మహిళలకు మేము బ్రహ్మాండంగా చేస్తున్నామని ఈ ప్రభుత్వం చాలా గొప్పగా చెపుతోంది. ఈ రాష్ట్రంలో 85 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారు. ఈ సంవత్సరం రూ. 5 వేల కోట్లు ఇస్తామంటున్నారు. రూ. 100 కోట్ల సబ్సిడీ ఇస్తామని చెపుతున్నారు. అధ్యక్షా, 5 వేల కోట్ల రూ.ల రుణాలు మీరు ఇస్తే, 80 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఈ రాష్ట్రంలో ఉంటే, వాళ్లు బ్యాంకు నుండి తీసుకునే రుణం రూ. 6500, ప్రభుత్వం ఇస్తున్న రూ. 100 కోట్ల సబ్సిడీ లెక్క వేసుకుంటే, ఈ 80 లక్షల మందికి వచ్చేది మూడు రోజుల కూలీ. ఒక మహిళ ఒక రోజు కూలీకి వెళ్లితే వచ్చేది 40,45 రూ.లు, కాబట్టి మూడు రోజులకు కలిపి రూ. 125 లు మాత్రమే ఒక్కొక్క మహిళకు వస్తుంది. మరి మీరు చెప్పే మహిళా సాధికారత ఏ విధంగా ఉపయోగపడుతున్నది అని అడుగుతున్నాను....

(పావలా వడ్డీ ఇస్తున్నామని డా.జి. చిన్నారెడ్డి అన్నారు)

పావలా వడ్డీ గురించే చెపుతున్నది. బ్యాంకులు ఇచ్చేది 5 వేల కోట్ల రూ.లు, మీరు ఇచ్చేది రూ.125 లు మాత్రమే. ఏమి భిక్షం వేస్తున్నారా మహిళలకు? జనాభాలో సగం శాతం మహిళలు ఉన్నారు. అటువంటి వారికి

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రివాల్వింగ్ ఫండ్ కాని, వుమెన్ ఫండ్ అని కాని లేదు. మీరు ఏదో మొక్కజొన్నలు కొనిపించామని చెప్పి మరిపించడానికి ప్రయత్నం చేస్తున్నారు తప్ప, వాస్తవానికి మహిళలకు ఈ ప్రభుత్వం ఏమి చేయడం లేదు. రాజశేఖర్‌రెడ్డిగారు ప్రతిపక్ష నాయకులుగా ఉన్నప్పుడు, మేము అధికారంలోకి వస్తే, వారికి స్వర్గమే చూపిస్తామన్నారు. తీరా వెనక్కి తిరిగి చూసుకుంటే వారికి ఏమి మిగిలింది? ఏమీ లేదు. కాబట్టి మహిళలకు న్యాయం చేయాలనే విషయాన్ని గుర్తు పెట్టుకోవలసిన అవసరం ఉంది. వాళ్లు తీసుకుంటున్న అప్పులో రెండు శాతం మాత్రమే ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం మహిళల్ని ఆదుకోవడమా అని తెలియచేస్తున్నాను....

(షేమ్ షేమ్ అని తెలుగుదేశం పార్టీకి చెందిన గౌ.సభ్యులు నినాదాలిచ్చారు)

అధ్యక్షా, రోశయ్యగారు యువత గురించి ఒక మాట చెప్పారు. స్వామి వివేకానంద మాటల్ని వారు ఉదహరించారు. ***" నేటి యువతరంపైన నాకు అచంచల విశ్వాసం ఉంది, వారే నా ఆశయ సాధకులు, సమస్య సాధన కోసం వారు సింహాల్లాగా పోరాడగలరు "*** అని చెప్పారు. పాపం, ఈ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బి.సి. విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు లేవు, వాళ్ల హాస్టళ్లో సౌకర్యాలు లేవు అని చెప్పి తెలియచేసుకుంటున్నాను.
ఉ.11.20

సౌకర్యాలు లేవని, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తే, పోలీసులు వాళ్ల రక్తం కళ్లజూస్తారు. హైదరాబాదు నగరంలో ఆందోళన చేస్తే, వాళ్లు మహిళలని కూడా చూడకుండా పోలీసుల చేత లాఠీలతో కొట్టిస్తారు. నిన్నే, మొన్నే అనంతపురంలో పోలీసు అధికారుల బూట్లతో తన్నులు తినిపించి, సింహాల వలె పోరాడండి అంటే ఎట్లా? పోలీసుల దమన నీతి విద్యార్థుల మీద ప్రదర్శించడం వాస్తవం కాదా? పోలీసుల బూట్ల కింద, లాఠీల కింద వాళ్లు, వాళ్ల శరీరాలు నృత్యం చేస్తున్నాయి. వాళ్లు ఆ రకంగా రోడ్ల మీద పడుతూ వుంటే వారిని మీరు స్వామీ వివేకానంద అంటూ మాట లు చెబితే ఏ విధంగా నమ్మమంటారు? మీరు చెప్పేవన్నీ మాటలకే పరిమితం అయ్యాయి. ఎక్కడా మీ నిజాయితీ, నిష్కళంకమైన ఆలోచనలూ ఆచరణలో కన్పించడం లేదు, ఇది చాలా బాధాకరం.

ఉపాధి కల్పన గురించి ఈ రాష్ట్రంలో చూస్తే చాలా తగ్గిపోయింది. నిరుద్యోగులు ఆందోళనకర పరిస్థితులలో ఉన్నారు. ఈ ప్రభుత్వం గతంలో చెప్పింది, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని. ఎస్‌సి లకు 70 వేలు, బిసిలకు 50 వేల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేస్తామని అన్నారు. ఒక్క ఉద్యోగం కూడా ఫిలప్ చేయలేదు. ఒక్కగానొక్క డిఎస్‌సి పెట్టక పెట్టక పెట్టి, అమ్ముకునే పరిస్థితి ఈ రాష్ట్రంలో వచ్చింది. ఇంతకన్న దురదృష్టకరమైన పరిస్థితి మరొకటి ఉండదు. కేవలం కడపలో టీచర్సు పోస్టుల విషయంలో చిన్న చేపలు బలి అయ్యాయి. ప్రభుత్వ అండలో ఉన్న వ్యక్తులు తప్పించుకున్నారు. వాళ్లు నిర్భయంగా తిరుగుతున్నారు.

ఈ వేళ ఒక విషయం తెలియజేయాలి. ఈ ప్రభుత్వం సామాన్యుడికి సంబంధించిన విద్యను దూరం చేస్తోంది. విద్యను ప్రైవేటీకరణ చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రైమరీ ఎడ్యుకేషన్ చూస్తే, 2003-04లో 63,897 స్కూల్సు ఉంటే, 2004-05 వచ్చేసరికి 61,680 స్కూల్సుకు పడిపోయాయి. 2 వేల స్కూళ్లకు పైగా మూత వేసిన మాట వాస్తవం కాదా? ఒకటే అడుగుతున్నాను, పేద వాడికి విద్య అందించవలసినది పోయి, పేద వాడికి విద్యను దగ్గర చేయాల్సింది పోయి, ప్రభుత్వం ఈవేళ ప్రైవేటీకరణ పేరుతో విద్యారంగంలో ముందుకు పోవడం బాధాకరం. చిన్న చిన్న పట్టణాలలో గ్రామాలలో ఉన్న ఎయిడెడ్ కాలేజీలలో డబ్బును ఆదా చేసుకోడానికి

అక్కడున్న కాలేజీలను మూసి వేసి, ఉపాధ్యాయులను ట్రాన్స్‌ఫర్ చేసి రూ.14 కోట్లు ఆదా చేసుకునే దౌర్భాగ్య స్థితికి ప్రభుత్వం వచ్చింది. కేంద్రంలో విద్యకు వాటా శాతాన్ని పెంచమని అంటారు. ప్రభుత్వం కొత్తగా చెబుతోంది కాన్సెప్టు స్కూల్సు అని. ప్రైవేటు వారికి భూములు ఇస్తారట. ప్రైవేటు రంగంతో కలిపి 294 నియోజకవర్గాలలో స్కూల్సు పెడతారట. లక్షల రూపాయలతో ఎస్‌సి దళితవాడలలో కట్టిన స్కూల్సుకి తాళాలు వేస్తారు. వేల కోట్ల రూపాయలతో ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపే ప్రయత్నం చేస్తారు. కాలేజీ స్థాయిలో గాని, ప్రైమరీ స్థాయిలో గాని విద్యను ప్రైవేటీకరణ చేసే ప్రభుత్వ విధానాన్ని మార్చుకోవలసిన అవసరం ఉంది. పేదవాడికి విద్యను దగ్గర చేయాలి గాని పేద వాడికి విద్య అందని ద్రాక్ష పండుగా చేస్తున్నారు.

ఇబ్బడి ముబ్బడిగా బి.ఎడ్ కాలేజీలు, ఫార్మసీ కాలేజీలు వస్తున్నాయి. ఇతర కాలేజీలు వస్తున్నాయి. ప్రభుత్వానికి వాటి మీద నియంత్రణ లేదు. నిబంధనలు లేవు. అమ్ముకునే వాడు ఉంటే, సీట్లు కొనుక్కునే వాడు ఉంటున్నాడు. పేదవాడికి రాబోయే రోజులలో చదువు అందని ద్రాక్ష పండుగా చేస్తున్న ప్రభుత్వ విధానాలు దారుణం.

ఆదర్శ గ్రామాల గురించి చెబుతున్నారు చాలా గొప్పగా. ఇందిరమ్మ గ్రామాలని. మీరు గ్రామాలలో ఉండే ప్రజలకు రోడ్డు వసతి కల్పించారా? మంచినీళ్ల వసతి కల్పించారా? మౌలిక సదుపాయాలు కల్పించారా? స్కూలు బిల్డింగ్సు కట్టేరా? శానిటేషన్ ఫెసిలిటీస్ కల్పించారా? డ్రైనేజీ వసతి కల్పించారా? ఇవన్నీ ఏమీ లేవు.

పెన్షన్ను విషయంలో ఈ వేళ శాట్యురేషన్ థియరీ అన్నారు. ప్రతి పేదవాడికి పెన్షన్ ఇస్తామని చెప్పారు. ఇది ఇందిరమ్మ గ్రామాలలో అమలు జరగకపోవడం చాలా దారుణం. మా జిల్లాలో 11 వేల పెన్షన్ను రావాల్సినవి రాకపోవడానికి కారణం ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇందిరమ్మ రాజ్యం అని మాటలలో చెబితే సరిపోదు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాల్సిన ప్రభుత్వం ఒక్క పెన్షన్నుతో సరిపెట్టుకోవడం బాధాకరం.

హౌసింగ్ గురించి రోశ య్య గారు చెప్పారు. రూ.4 వేల కోట్లకు పైగా హౌసింగ్‌కు బడ్జెటును తీసుకువచ్చారు. ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. ఆలోచించాల్సిన అవసరం ఉంది. గత సంవత్సరం ప్రగతి చూస్తే, 16.21 లక్షలు కట్టాలని అనుకుంటే, పూర్తి చేసినవి 15 శాతం రూరల్ హౌసింగ్‌లో. అర్బన్ హౌసింగ్‌లో 2.2 లక్షలు కట్టాల్సి వుండగా కేవలం 4 శాతం మాత్రమే పూర్తి చేయగలిగారు. ఇన్ని వేల కోట్లతో 17 లక్షల ఇళ్లు పూర్తి చేయకుండా ఏ విధంగా ప్రాజెక్టులు కడతారు మీరు? ఈ వేళ రేట్సు చూస్తున్నాము రాష్ట్రంలో. రాష్ట్రంలో సిమెంటు ఉత్పత్తిదారులు కుమ్మక్కు అయ్యారు. రూ.100 ఉన్న సిమెంటు ధరను రూ.200కు తీసుకుపోతే ప్రభుత్వం ఏ విధంగానూ నియంత్రించే పరిస్థితి లేదు. ఉత్పత్తిదారుల కొమ్ము కాస్తున్నారు. మెటల్, స్టీల్, ఇసుక రేట్లు పెరిగిపోయాయి. ఈ పరిస్థితులలో సామాన్యుడు ఇల్లు కట్టుకోగలడా? నేను ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాను, ఈ వేళ పెరిగిన ధరలతో సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలనుకునే కల నిజం కాబోదని ప్రభుత్వ దృష్టికి తెస్తున్నాను.

అదే విధంగా ఈ వేళ నిత్యావసర వస్తువులు. ధరలు ఆకాశం వైపు వెడుతున్నాయి. సామాన్యుడు బ్రతకలేని పరిస్థితి. రేషను కార్డులు 39 లక్షలకు పెంచామని చెబుతున్నారు. ఎంత రేషను ఇచ్చారు? ఎంత కిరోసిన్ వాటా పెంచారు? ఒక్క కేజి బియ్యం కోటా పెంచకుండా, కిరోసిన్ ఒక్క లీటరు కూడా పెంచకుండా 39

లక్షలు కార్డులు ఇప్పిస్తున్నాము అంటే ఎంతవరకూ సబబో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయింది. సరుకులన్నీ నల్లబజారుకు తరలిపోతున్నాయి. సామాన్యుడికి సరుకులు అందని పరిస్థితి. నిత్యావసర వస్తువుల ధరలు నూరు శాతం పెరిగితే పట్టించుకునే పరిస్థితి లేదు. ఈ వేళ రెయిడ్సు మొదలు పెట్టారు. ఇన్ని నెలలు ప్రభుత్వం ఏం చేస్తోంది, కుంభకర్ణుడి నిద్ర పోతోందా? ధరలు ఆకాశానికి పెరిగి ప్రజలు బ్రతకలేకపోతున్నారని ఎన్నోసార్లు మేము ప్రభుత్వ దృష్టికి తెస్తే, ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దురదృష్టకరం .

ఈ వేళ ఈ రాష్ట్రంలో మేము ఒక సమతుల్య బడ్జెటును పెట్టామని చెప్పుకుంటున్నారు. ఎస్‌సిలకు రూ.600 కోట్లు అంటూ, రూ.455 కోట్లు పెన్షన్సు ఇచ్చారు. ఎంత దురదృష్టకరం అంటే సాంఘిక సంక్షేమ హాస్టల్సులో గత సంవత్సరం వైద్య సదుపాయం లేక అపరిశుభ్ర వాతావరణంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులు 150 మంది చనిపోతే ప్రభుత్వం కనీసం స్పందించక పోవడం చాలా దారుణం. 150 మంది విద్యార్థులు చనిపోతే, కనీస మానవతా దృక్పథం కూడా చూపకపోవడం చాలా బాధాకరం.

ఈనాడు కేటాయింపులు చూస్తే, ఎస్‌సి, ఎస్‌టిలకు పెంచామని చెబుతున్నారు. ప్లాన్ శాంక్షన్‌కి 2007-08లో రూ.824 కోట్లు మీరు పెడితే, దానిలో రూ.400 ల్యాండ్ ఎక్విజిషన్ కు, రూ.100 కోట్లు ఇందిరమ్మ గురించి పట్టాలు అన్నారు. రూ.500 కోట్లు తీసివేస్తే ప్లానుకి బడ్జెటు కింద ఎస్‌సి లకు ఉండేది కేవలం రూ.324 కోట్లు. రోశయ్య గారి అంకెల గారడీ ఏమిటో దీనిలో తెలుస్తోంది.
ఉ.11.30

ఇందిరమ్మ గ్రామాల క్రింద ఇచ్చిన ఇళ్ల పట్టాలనూ, రాష్ట్రం మొత్తం మీద ఇచ్చిన ఇళ్ల పట్టాలనూ, ఎస్.సి. వెల్ఫేర్ క్రింద చూపించి మేము రు.824 కోట్లను ఇచ్చామని ఘనంగా చెప్పుకోవడం ఎంత వరకూ సమంజసమో రోశయ్య గారి లాంటి పెద్ద మనిషి ఆలోచించుకోవాలి. ఈ రోజు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత సాంఘిక సంక్షేమ రంగానికి కోత పెట్టారు. స్కాలర్‌షిప్పులు లేవు, స్కాలర్‌షిప్‌లు లేక విద్యార్థులు రోడ్డు మీదకు వస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వం యొక్క కళ్లకు కనపడని పరిస్థితి వుంది. విద్యార్థులు రక్తం అమ్ముకుని ఫీజులు కట్టుకున్న పరిస్థితి వుంది.

ఇక ఆరోగ్య శాఖను చూసుకున్నట్లయితే, ఈ రోజు రాష్ట్రంలో ఎన్నో అంటు వ్యాధులు ప్రబలాయి. చికున్ గున్యా వల్ల లక్షలాది మంది పేద ప్రజలు బయటకు రాలేక ఇళ్లలోనే పడుకుని వుండిపోయిన పరిస్థితి. డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు విస్తృతంగా ప్రబలిపోతే, ప్రభుత్వం ఎక్కడా కనీస సౌకర్యాలను కల్పించకపోవడం చాలా దురదృష్టకరమైన విషయం. గౌరవ మంత్రి గారు చెప్పారు, భూదానం, భూ యజ్ఞం కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయని. రాజశేఖర రెడ్డి గారు రాజకీయాలలోకి వచ్చి 30 సంవత్సరాలైంది. ఆయన ఇక్కడ శాసన సభ్యులుగా వున్నారు, మంత్రిగా వున్నారు, పార్లమెంటు సభ్యులుగా వున్నారు, ముఖ్యమంత్రి అయి 3 సంవత్సరాలైంది.

మరి వారు రాజకీయాలలోకి వచ్చి 30 సంవత్సరాలైతే వారికి వున్న అసైన్డ్ భూముల గురించి ఎప్పుడూ వారి దృష్టికి రాలేదా ? ఆయన కుటుంబ ఆధీనంలో వున్న భూములు – అవి వారి తండ్రి గారి నుండి వచ్చాయని అన్నారు, సాధారణంగా అసైన్డ్ భూములు తండ్రి గారి నుంచే సంక్రమిస్తూ తవుంటాయి. మరి అటువంటి భూములలో అసైన్డ్ భూములు వున్నాయా, దేవాదాయ భూమలు వున్నాయా అనేది వారికి

తెలియదా ? ముఖ్యమంత్రి గారు వారి నియోజక వర్గంలో అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా వుండి, వారి దృష్టికి వారి భూముల గురించి తెలియలేదంటే నమ్మమంటారా ?

ఎవరైనా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వుండి, తనకున్న మెజారిటీని ఉపయోగించుకుని తన కోసం చట్టాన్ని సవరించుకుని, తనకు తానే మేలు చేసుకున్న ఘనత వుందీ అంటే అది ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారికే దక్కుతుంది. మన రాష్ట్రం ఏర్పడిన 50 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారికి వున్న ఘన చరిత్ర ఎవరికీ లేదు. అటువంటి ముఖ్యమంత్రి గారి గురించి మమ్మల్ని ఏమి చెప్పమంటారు ? వారు అంటున్నారు, చంద్రబాబు నాయుడు గారికి వందలాది ఎకరాల అసైన్డ్ భూములు వున్నాయని. అయ్యా, వారికి హైదరాబాదులో వారికి ల్యాండ్స్ వున్నాయి, విచారణ జరిపించండి అని వారి సభ్యులు వసంత కుమార్ గారు తెల్ల కాగితం మీద ఒక రిప్రజెంటేషన్ ఇచ్చారు ప్రభుత్వానికి. ముగ్గురు సీనియర్ ఆఫీసర్స్‌తో ఎంక్వైరీ వేసారు. ఏమైంది ?

ప్రభుత్వం మీ దగ్గర వుంది. ఆయన తన దగ్గర వున్న భూమిని అమ్ముకున్నారని చెప్పినపుడు, అందులో అసైన్డ్ ల్యాండ్స్ వుంటే, ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోండి. అవతలి వారు ఎవరైనా కావచ్చు, ఎంత పెద్ద వారైనా కావచ్చు, అటువంటి వారి మీద మాత్రం చర్యలు తీసుకోవాల్సిందే. నాలుగు వేళ్లు తమ వైపు చూస్తున్నాయనే వాస్తవాన్ని ప్రభుత్వం మరచి పోకూడదని నేను ప్రభుత్వానికి చెప్పదలచుకున్నాను. మీకున్న బలంతో, మీకున్న సంఖ్యతో, సవరణ తీసుకొచ్చి లబ్ది పొందాలనుకుంటే అది మంచిది కాదని చెప్పదలచుకున్నాను.

నిన్నా, మొన్నా రెవిన్యూ మంత్రి గారు మాట్లాడుతూ, దీనికి ఒక సవరణ తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నామని అన్నారు. అదీ చూద్దాము. ఆ సవరణల ద్వారా ఎవరికి లబ్ది చేకూర్చాలని అనుకుంటున్నారు ? ధనిక వర్గాల వారికా, పేద, సామాన్య వర్గాల వారికా, పారిశ్రామిక వేత్తలకా, లేక రియల్ ఎస్టేట్ వారికా ? మీరు ఎవరికి ప్రయోజనం చేకూర్చబోతున్నారనేది రాబోయే రోజులలో సభ ముందుకు వస్తుంది. దానికి భూ యజ్ఞమని, భూ దానమని పేర్లు పెట్టి ఆచార్య వినోబా భావే స్థాయిలో మాట్లాడితే ఎట్లా ? అది మీ విజ్ఞతకే వదిలేస్తున్నాను.

ఈనాడు నేను ఒకటే కోరుతున్నాను. ప్రజానీకానికి సంబంధించిన చాలా సమస్యలు వున్నాయి. కాని ప్రభుత్వం ఆలోచనలు చూస్తుంటే, వాటికి దగ్గరగా లేకపోవడం చాలా దురదృష్టకరం. వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు ఇక్కడ వున్నపుడు లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడారు. ఈ రాష్ట్రం ప్రగతి పథం వైపు వెళ్లాలంటే, ఈ రాష్ట్రం అభివృద్ధి పథం వైపు వెళ్లాలంటే, ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుండాలని గుర్తుంచుకోవలసిన అవసరం వుంది. అధ్యక్షా, నేను ఒక్కటే అడుగుతున్నాను. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత తెలుగుదేశం పార్టీకి చెందిన వందలాది మంది కార్యకర్తలు చనిపోయారు. తప్పు చేసిన వారిని శిక్షిస్తామని ముఖ్యమంత్రి గారు అంటారేమోనని మేము ఆశించాము. కాని ఎన్నో సంఘటనలు జరుగుతూ వుంటాయి, దానికి మేము బాధ్యులమా అన్నట్లుగా ముఖ్యమంత్రి గారు మాట్లాడారు తప్ప మరొక విధంగా వారు మాట్లాడ లేదు.

ముఖ్యమంత్రిగారు ఏమి చెబితే అది లా. నియోజక వర్గాలలో శాసన సభ్యులు ఏమి చెబితే అది లా. జిల్లాలలో మంత్రులు ఏమి చెబితే అది అమలవుతోంది తప్ప, పోలీసు అధికారులు లా అండ్ ఆర్డర్‌ను

నియంత్రించేలాగా  పని చేయకపోవడం చాలా అన్యాయం. వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు ప్రతిపక్ష నాయకుడిగా వున్నపుడు ఆ రోజు సమర్ధవంతులైన అధికారులను వేయడం లేదు, ఆ విధంగా వేసినట్లయితే, లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లోకి వస్తుందని అన్నారు. నేను అడుగుతున్నాను, మీరు 3 సంవత్సరాల పరిపాలనను పూర్తి చేసుకోబోతున్నారు. ఈ 3 సంవత్సరాలలో ఎన్ని సార్లు పోలీసు అధికారులకు పోస్టింగులు మార్చారు ? ఎన్నిసార్లు ట్రాన్స్‌ఫర్ చేసారు ? ఎంత మంది డైరక్ట్ రిక్రూట్ ఐ. పి. ఎస్. అధికారులు జిల్లాలలో ఎస్.పి.లుగా వున్నారో చెప్పాలని మంత్రి గారిని కోరుతున్నాను. సమర్ధవంతులైన అధికారులు ఈ రాష్ట్రంలో నిజాయితీగా పని చేస్తే, వారికి మీరు ఇచ్చే బహుమానం ట్రాన్స్‌ఫర్స్. దురదృష్టమేమో గాని, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులుగా డి.జి.పి. వంటి పొజిషన్స్‌లోకి వచ్చిన వ్యక్తులు, ఆ సీట్లో కూర్చోగానే ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడే పరిస్థితి వస్తోంది. అసలు ఈ రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ వుందా అని అడుగుతున్నాను.

ఈ రాష్ట్రంలో మేము చెప్పిందే వేదం, మేము చెప్పిందే కరెక్ట్ అనే విధంగా ఈ రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది ఈ ప్రభుత్వం. ఈ రాష్ట్రంలో నేరాలు జరుగుతున్నాయి, పట్ట పగలే దోపిడీలు జరుగుతున్నాయి, దొంగతనాలు జరుగుతున్నాయి, హత్యలు జరుగుతున్నాయి, హైదరాబాదు నడిబొడ్డున ఇటువంటి నేరాలు జరుగుతూ వుంటే, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించే పరిస్థితి వుంది, ఇది అత్యంత బాధాకరమైన విషయం.

( ట్రెజరీ బెంచెస్ నుంచి అంతరాయం )

అధ్యక్షా, నిన్న మేము వాకౌట్ చేసిన తరువాత ముఖ్యమంత్రి గారు చెప్పారు, ఉచిత విద్యుత్ మీద, విద్యుత్‌ను 7 గంటలు ఇచ్చామా, 9 గంటలు ఇచ్చామా అనే విషయంపై అవసరమైతే ఒక జుడిషియల్ కమీషన్‌ను వేస్తామని అన్నారు. నేను ఛాలెంజ్ చేస్తున్నాను. 8 సంవత్సరాల, 8 నెలల, 13 రోజుల మా పరిపాలనలో మేము ఎన్ని గంటల పాటు విద్యుత్‌ను ఇచ్చాము, ఎన్ని గంటలు ఇవ్వలేదు అనేది తప్పకుండా ఎంక్వైరీ చేయించండి. మీరు అధికారంలోకి వచ్చిన తరువాత ఇస్తున్నదే 7 గంటలు. ఇంకా ఏదో అద్భుతాలు చేస్తున్నామంటే ఎట్లా ? ఉచిత విద్యుత్ పేరు చెప్పి, రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా, ఇతర ఏ రంగాలనూ పట్టించుకోకుండా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అధ్యక్షా, వారు చాలా మాటలు చెప్పారు. రోశయ్య గారు ఆర్థిక మంత్రి. వారి దగ్గర చాణక్యుడి తెలివి తేటలు వున్నాయి, ఆ నైపుణ్యం వుంది. అర్థ శాస్త్రంలో కౌటిల్యుడు చెప్పాడు. "The root of wealth is economic activity and lot of it begins with material distribution and in the absence of fruitful activity both the current prosperity and further growth are in danger or in destruction"

రోశయ్య గారూ, మీరు ప్రవేశ పెట్టిన ఇటువంటి అసమతౌల్య బడ్జెట్, పేద వర్గాలకు న్యాయం చేసే విధంగా లేని బడ్జెట్, పేదలకు వ్యతిరేకంగా వుండే బడ్జెట్, భూస్వామ్య వర్గాలకు అండగా వుండే బడ్జెట్, ప్రైవేటీకరణ పేరుతో డిపోలను మూసివేసి ఉద్యోగులను, ప్రజలనూ రోడ్డున పడవేసే బడ్జెట్, ప్రపంచ బ్యాంకుకు జీతగాడని మా గురించి మాట్లాడి ఈ రోజు ప్రపంచ బ్యాంకుకు తాబేదారుగా వుండి రూపొందించిన బడ్జెట్, ఆర్.టి.సి. లాంటి వ్యవస్థలను ప్రైవేటీకరణ వైపు నెడుతూ సాంఘిక సంక్షేమాన్ని విస్మరిస్తూ, అంకెల గారడీ చేసారు తప్ప, పేద, అట్టడుగు వర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగాలేని ఈ బడ్జెట్‌ను మేము వ్యతిరేకిస్తున్నామని చెబుతూ సెలవు తీసుకుంటున్నాను.

CHAIRMAN: The House is adjourned for tea break for ten minutes.

(The House then adjourned at 11.40 a.m. for tea break for ten minutes)

**(The House re-assembled at 11.57 a.m. after the tea break with the Hon'ble Speaker in the Chair)**

MR.SPEAKER : Now reply on the Budget Speeches. Reply would be by the Finance Minister. After the reply, each one of you from one political party will be given time for clarification, if need be.

శ్రీ కె.రోశయ్య : అధ్యక్షా, ప్రప్రథమంగా బడ్జెట్ ప్రసంగంపై జరిగిన చర్చకు సమాధానం చెప్పేందుకు నాకు ఈ అవకాశం ఇచ్చిన తమకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ బడ్జెట్ పైన 14 మంది గౌరవ సభ్యులు మాట్లాడారు. పెద్దలు దేవేందర్ గౌడ్ గారు, మిత్రులు చిన్నారెడ్డి గారు, కె.ప్రతాప రెడ్డి గారు, చాడా వెంకట రెడ్డి గారు, ఉదయభాను గార్లూ, గఫూర్ గార్లూ, పి.శశిధర్ రెడ్డి గార్లూ, పి.వీరయ్య గారు, కిషన్ రెడ్డి గార్లూ, అక్బరుద్దీన్ ఒవైసీ గారు, జె.కృష్ణా రావు గారు, గుమ్మడి నర్సయ్య గారు, ఎ.రామనారాయణ రెడ్డి గార్లూ మాట్లాడారు. ముగింపు ఉపన్యాసాన్ని యువకుడైన డి.నరేంద్ర కుమార్ గారు ఇప్పుడే చేసారు. అధ్యక్షా, చాలా సూచనలు చేసారు, వారు చేసిన అన్ని సూచనలకూ నా ధన్యవాదాలు.

మ.12.00

మంచి సూచనలను ఎవరు చేసినా అమలు చేయండని అంటున్నారు. తప్పకుండా చేయడానికి ప్రయత్నం చేస్తాము. మంచికి తోడుగా సత్యదూరమైన, అసందర్భమైన, బడ్జెట్‌తో సంబంధం లేని అనేక అనేక ఇతర విషయాలను ప్రస్తావన చేస్తే, వాటిని వేరే రకంగా పరిశీలించవలసి వస్తుంది. మొట్టమొదట ప్రవేశపెట్టేటప్పుడు నేను, గౌరవ ముఖ్యమంత్రిగారు ఒక మాట గత కొన్ని నెలలుగా చెబుతూ వస్తున్నాము. 2007-08 వార్షిక బడ్జెట్, అది గతంలో కన్నా మేము ప్రవేశపెట్టిన మూడు బడ్జట్లకన్నా మెరుగైన బడ్జెట్‌ని ప్రవేశ్టాలని అనుకున్నాము. రెండవది ఇతోధికమయిన అభివృద్ధికి దోహదపడే బడ్జట్ ప్రవేశ పెడతామన్నాము. దాని ప్రకారంగా బడ్జట్ రూపొందించడం జరిగింది. బడ్జట్ ఈరాష్ట్రంలో , ఏ సమస్యలు లేకుండా, అన్నింటికి నివృత్తి దీనిలో ఉన్నాయని నేనుగానీ, మరొకరుగాని ఎవరూ చెప్పలేరు. అది ఎప్పుడూ సాధ్యం కాదు. కోర్కెలు చాలా ఉంటాయి. వాటిలో ప్రాధాన్యతాక్రమంబట్టి మనకు ఉన్న వనరుల అవకాశాలనుబట్టి కేటాయింపులు చేస్తాము. కొన్ని కొన్ని సందర్భాలలోసభలో ఉన్న గౌరవనీయులందరికి తెలుసు. అత్యవసరమైన పరిస్థితి ఏదైనా వస్తే బడ్జట్‌లో ప్రొవిషన్ లేకున్నా కొన్ని ఎక్స్‌ట్రార్డినరి సర్కమ్స్‌టెన్సెస్‌లో కార్యక్రమాలు తీసుకుంటాము. అవి మళ్లీ సభ ఆమోదం కోసం సప్లిమెంటరీ డిమాండ్స్ రూపంలో రావడం జరుగుతుంది. బడ్జట్ సాంప్రదాయబద్ధంగా వస్తున్న పద్ధతి.

దీనిలో వివిధ రంగాలకు కేటాయింపులపై గౌరవ సభ్యులు సహృదయంతో చేసిన విమర్శలు, సూచనలు ఆమోదించాము. కార్యక్రమాల అమలుకు గ్రామస్థాయిలో పరిశీలించే వ్యక్తులు లేరు. ఒక నియోజకవర్గంలో ఓటర్లు కొన్ని చోట్ల లక్షా, లక్షన్నర ఉంటారు. పెద్ద పెద్ద నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉంటారు. ఉదా. మేడ్చల్, ఖైరతాబాద్ కొంచెం ఎక్కువ ఉంటారు. మలక్‌పేటలో దాదాపు 4 లక్షల మంది ఓటర్లున్నారు. పెద్ద పెద్ద నియోజకవర్గాలున్నాయి. మా భావన ఏమంటే, ఒక్కో శాసనసభ్యుడు చేసే సూచన

వారి సూచన కాదు. అలా అనుకోవడం లేదు. వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజలయొక్క ఆలోచనలు, ఆ ప్రజల మాటలు విన్నామని అనుకుంటున్నాము. ఈ సూచనలన్నీ రాష్ట్ర వనరులను సమీకరించుకొని అమలుచేయడానికి ప్రయత్నిస్తాము. మా కృషికి వారందరి సహకారం కూడా కావాలని పదే పదే కోరుతున్నాము. వనరులు లేకుండా సమీకరణ లేకుండా ఊరికేచెప్పడం అనేది ప్రయోజనం లేనిది, అది నా భావన. నేను ముఖ్యంగా కొంచెం ప్రాక్టికల్‌గా ఉందామనుకునేవాడిని. మాటలు పెద్ద పెద్దగా చెప్పి ఆచరణలో పని చేయకపోవడం అంత యోగ్యత కాదని భావించేవారము మేము. వనరుల సమీకరణ కోసం గౌరవ సభ్యులు ఏ ఒక్కరో, ఇద్దరో ఏమైనా మంచి సూచనలు చేస్తారేమో గట్టిగా అవి నోట్ చేసుకొని పరిశీలించవచ్చు, తద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవచ్చుననీ, ఆ ఆదాయంతో మరీ మంచి పని చేసే కోర్కెతో, గంపెడు ఆశతో ఎదురు చూశాను. కానీ, అటువంటి సూచనలు చాలా తక్కువగా వచ్చాయి.

( అంతరాయం )

కిషన్‌రెడ్డిగారు మాట్లాడింది విన్నాను. కొన్ని సూచనలు చేశారు. అవి అమలు చేయడానికి కావలసిన వనరులు సమీకరించుకోవడానికి ప్రయత్నం అమలుచేస్తామన్నాము. సంక్షేమ రంగాన్ని విస్మరించామని ఇటీవల తరచూ ఎక్కువగా వినిపించడం జరుగుతోంది.

( గౌరవ తెలుగుదేశం పార్టీ నుండి శ్రీమతి పి. అరుణ అవునని అన్నారు )

రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉంది. పాపం, అక్కడ దెబ్బతిని తిని వారికి దిగులు కొంచెం , అక్కడ సంక్షోభంలో ఉన్న మాట వాస్తవం .

రాష్ట్రం ఆదాయ వనరుల కోసం పన్నుల మీద ఆధారపడవలసి రావడం బాధాకరం. కేవలం ఉన్న పన్నులు చాలదు, కొత్త పన్నులు వేయడానికి లేదు. పన్నుల శాతం పెంచుకుంటే తద్వారా ఆదాయం పెంచడం గత మూడు సంవత్సరాలూ ఏనాడూ అలా ఆలోచించలేదు. కొత్త పన్నులు వేయడానికి ప్రయత్నించకుండా పన్నుల శాతం పెంచుకోవడానికి ప్రయత్నం చేయకుండా విద్యుత్ టారిఫ్ ఒక్క పైసా కూడా పెంచకపోగా, తగ్గిస్తూ, పరిపాలనలో సంస్కరణలు తీసుకువచ్చి పన్నుల వసూలు పెంచడానికి ప్రయత్నిస్తున్నాము. మిత్రులు ఒకరిద్దరు వ్యాట్ గురించి మాట్లాడారు. వ్యాట్ ద్వారా ఆదాయం పెరిగింది. ఉన్నది లేదన్నారని వారన్నారు. వ్యాట్‌ని ప్రవేశపెట్టాలని 1992-93లో ఈ దేశంలో చర్చ ప్రారంభించడం జరిగింది. పెద్దలు నోముల నర్సింహయ్యగారు, గఫూర్‌గారు మిగిలిన కమ్యూనిస్ట్ అగ్రనాయకులు ఉన్నారు. ఇక్కడ శాసనసభలో తెలుగుదేశం పార్టీ వారు ఏమైనా మాట్లాడితే నాకు ఏమనిపిస్తుందంటే, అసలు వారు దేశంలో అంటే వారి పార్టీ ఎక్కడా లేదు. చిన్న రాష్ట్రంలో ఉన్నా, వారి పరిపాలన అక్కడ ఉందని కంపేర్ చేయడానికి ఉంటుంది, అలా లేదు.

( అంతరాయం )

కేశవ్‌గారు, అటు నుండి వారు మాట్లాడేటప్పుడు మట్లాడకుండా విన్నాము. నేను మాట్లాడేటప్పుడు నాకు ఇలా మాట్లాడాలని చెప్పడానికి ప్రయత్నించవద్దని తమద్వారా వారికి తెలియచేస్తున్నాను. రెండున్నర గంటల సేపు వారి నాయకులు దేవేందర్‌గౌడ్‌గారు మాట్లాడారు. మేమందరం గౌరవించే నాయకులు వారు. యువకులైన నరేందర్‌గారు ఒక గంట సేపు మాట్లాడారు. మిగతా వారు అందరూ కలిపి మాట్లాడారు. ఇంకా మాట్లాడడానికి సమయం అంటే ఎలా? శాసనసభ సమయం మొత్తం వారికి ఇస్తే సరిపోతుందా?

వాట్‌కి సంబంధించినంతవరకూ అప్పట్లో చర్చ ప్రారంభమయింది. అది సాగీ సాగీ సాగీ ఇటీవల వరకూ అలాగే సాగుతూ వచ్చింది. 2003లో వ్యాట్ చట్టం వచ్చింది. అప్పుడు ప్రభుత్వంలో ఎవరున్నారు. తెలుగుదేశం పార్టీ కాదాఅని అడుగుతున్నాను. నర్సింహయ్యగారికి తమ ద్వారా ఒక మాట చెప్పదలచాను. హషిమ్‌దాస్ గుప్తగారు ఈ దేశంలోసీనియర్‌మోస్ట్ నాయకులు. పశ్చిమ బెంగాల్ ఫైనాన్స్ మినిస్టర్. అసలు వారొక ప్రొఫెసర్. 1992-93లో వ్యాట్ ప్రవేశపెట్టాలని అప్పటి ఆర్థిక శాఖామంత్రి మన్‌మోహన్ సింగ్‌గారు, వారూ ఆలోచన ప్రారంభించారు. సమావేశంలో కూర్చున్నప్పుడు అక్కడకు నేనూ వెళ్లాను. హషిమ్‌దాస్ గుప్తగారు దానిని స్ట్రాట్‌గా వ్యతిరేకించారు. క్రితం నెల 22న మరలా ఆర్థిక శాఖామాత్యుల, ముఖ్యమంత్రుల సమావేశం జరిగితే అక్కడ అనుకోని విధంగా లంచ్ టేబుల్ దగ్గర అప్పటి ఆర్థిక శాఖామంత్రి, ఇప్పటి ప్రధాని మన్ మోహన్ సింగ్ గారూ వారి ఎదురుగా నేనూ, నాకు కుడి వైపున హషీమ్ దాస్ గుప్తగారు, నాకు ఎడమ ప్రక్కన హోమ్ మినిస్టర్ శివరాజ్ పాటిల్‌గారు నలుగురము కూర్చున్నాము.

మ.12.10

ఏదో మాటల సందర్భంలో హషీమ్‌దాస్ గుప్తా గారు మన్మోహన్‌సింగ్ గారితో 'మరో రెండు మూడు రాష్ట్రాలే వ్యాట్‌ని అమలు చేయాల్సి ఉంది. తమిళనాడు ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేయడానికి లైన్‌లోకి వచ్చాయని, అలాగే ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలను కూడా ఒప్పించాము. దాదాపుగా అన్ని రాష్ట్రాలు లైన్‌లోకి వచ్చాయని' అన్నారు. అప్పుడు నేను నవ్వుతూ 'హషీమ్‌దాస్‌గుప్తాగారు, మొట్టమొదట వ్యాట్‌ని వ్యతిరేకించింది మీరే, ఇప్పుడు అన్ని రాష్ట్రాల్లో ఉండాల్సిందిగా చెపుతోందీ మీరే' అన్నాను. అప్పుడు 'యస్ అప్పుడు నేను అర్థం చేసుకోలేదు, వ్యాట్ వల్ల ఉన్న ప్రయోజనాలను నేను పూర్తిగా ఇప్పుడు అర్థం చేసుకొన్నానని' చెప్పారు. ఈ రాష్ట్రంలో ' వ్యాట్ ' చట్టాన్ని తెచ్చింది మీరు. వ్యాట్ వల్ల ధరలు పెరగవు. దాదాపు 150 దేశాల్లో వ్యాట్ అమల్లో ఉంది. వ్యాట్ వల్ల ట్యాక్స్ ఎవేజన్ తగ్గుతుంది. ప్రతి ఒక్క వ్యాపారి నెట్‌లోకి రావడానికి ఆస్కారం ఉంటుంది. ఏ వ్యాపారీ తప్పించుకోలేడు. గతంలో జనరల్ సేల్స్ ట్యాక్స్ పన్ను ఎగవేతకు ఎంతో ఆస్కారం ఉండేదన్న విషయం మీకు మాకు అందరికి తెలుసు. అటువంటి దాన్ని నివారించడానికి ఇది ఉపయోగపడుతుంది. 2003వ సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, వ్యాట్ పరిధిలో మూడు లక్షల రూపాయల వరకు వ్యాపారం చేసుకొనే, చిన్న చిన్న వ్యాపారులకు మాత్రమే ఎగ్జంప్షన్ ఇద్దామని, రిజిస్ట్రేషన్ అక్కరలేదని అన్నారు. ఆనాడు నేషనల్ లెవల్లో హషీమ్‌దాస్ గుప్తా నేతృత్వంలో కమిటి 5 లక్షల రూపాయల వరకు చిన్న వ్యాపారులుగా పరిగణించి ఇవ్వవద్దు అని అన్నారు. కానీ రాష్ట్రంలో మూడు లక్షల రూపాయలకు పెట్టారు. మేము అధికారంలోకి వచ్చిన తరువాత, సవరణ తీసుకువచ్చి రూ.5 లక్షల వరకు ఎగ్జంప్షన్ ఇచ్చాము. కిళ్లీ బడ్డీ షాప్ లాంటి చిన్న చిన్న వ్యాపారస్థులపై వ్యాట్ పెడితే కు దరదని, వన్ పర్సంట్ యూనిఫామ్ ట్యాక్స్ పెట్టాము. అది కూడా 20 లక్షలు ఉంటే మేము వచ్చిన తరువాత దేశం మొతం మీద ఉన్న లిమిటేషన్స్‌ని అనుసరించాలని, ఒక లక్ష నుండి 25 లక్షల వరకు పెంచాము. వ్యాపారాలు చేసుకొనే వారు, ఏనాటికి ఆనాడు వ్యాపారం చేసుకొనే అవకాశం ఉండే వారిని దృష్టిలో పెట్టుకొని, జాతీయ స్థాయిలో ఉన్న ఆలోచనను దృష్టిలో పెట్టుకొని, తగు సవరణలను చేశాము. ట్యాక్ ఏవేజన్ ఉంది. పన్నులు ప్రక్కదారి పడుతున్నాయి. దానిని కంట్రోల్ చేసి ఆదాయాన్ని పెంచుకొన్నాము. కొత్త పన్ను వేయకుండా, పన్ను శాతం పెంచుకొంటూ, ఏ మాత్రం కూడా ఆదాయం పెంచుకొనే ప్రయత్నం చేయకుండా, దానికి చాలలేదు, దీనికి చాలలేదు అన్ని శాఖలకు బడెటు పెంచాలని మీరు అంటే, మన దగ్గర కరెన్సీ ముద్రించడానికి ప్రింటింగ్ ప్రెస్ లేదు కదా. ఏదో ఒక గంట ఎక్కువ ప్రింటు చేయించడానికి. ఉన్న డబ్బునే సర్దాలి. మీరు పరిపాలన చేసినప్పుడు కూడా అదే చేశారు. కిషన్‌రెడ్డి గారి పార్టీ అయిన బి.జె.పి. వారు కూడా ఉత్తర ప్రదేశ్‌లో అధికారం

చేశారు. వారికి ఇది తెలుసు. ఉన్న ఆదాయాన్ని పంపిణీ చేయడం, కేంద్ర ప్రభుత్వం నుండి మనకు వచ్చే సహాయన్ని పెంచడానికి ప్రయత్నం చేయడం, లేదూ, కొన్ని నిబంధనలు పెట్టుకొని వెనుకటి రోజుల్లో ఫ్రీగా లోన్స్ తీసుకోవడానికి వీలు ఉండేది. మనం FRBM 2005లో పాస్ చేసిన తరువాత, కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన ఆదేశాల మేరకు 12వ ఆర్థిక సంఘం ఒక సలహా చెప్పింది. ఏ రాష్ట్రమైతే క్రమశిక్షణ పెంచుకొంటుందో, ఏ రాష్ట్రాలైతే డెఫిసిట్‌ని 2009వ సంవత్సరం మార్చి 31 నాటికి సున్నాకి తీసుకువస్తారో , ఏ రాష్ట్రంలోనైతే గ్రాస్ డొమెస్టిక్ ప్రాడక్ట్ (జి.డి.పి.) మూడు శాతం మించకుండా ద్రవ్యలోటు చూసుకొంటుందో, కంట్రోల్ చేసుకొంటుదో, ఈ లక్ష్యంతో ప్రణాళిక అమలు చేసే, ఈ రాష్ట్రానికి మ్యాసీవ్ సపోర్టు 5 సంవత్సరాల పాటు అందస్తామని అన్నారు. అది సుమారు 6వేల కోట్లుగా అంచనాలు చూపించారు. ఇప్పటికి దాని ఫలితాలు అనుభవిస్తున్నాము. మేము అధికారంలోకి వచ్చీ రాగానే ఫిస్కల్ డెఫిసిట్‌ని స్ట్రిక్ట్‌గా యింప్లిమెంట్ చేస్తున్నాము. కాబట్టి కేంద్ర ప్రభుత్వం నుండి సహాయం పొందగల్గుతాము. రెవెన్యూ డెఫిసిట్ క్రమ క్రమంగా తగ్గించగల్గుతున్నాము. గత సంవత్సరం బడ్జెటులో చూపిన రెవెన్యూ డెఫిసిట్ at the end of the Financial year గణనీయంగా తగ్గించాము. 2007-08వ సంవత్సరంలో ప్రజంట్ చేసిన బడ్జెటులో నామినల్‌గా మన రెవెన్యూ డెఫిసిట్ ఉందని with all confidence స్పష్టంగా మనవి చేస్తున్నాను. By 31st March, 2008 నాటికి డెఫిసిట్ అనే పదం మనబడ్జెటులో లేకుండా ఖచ్చితంగా బైపాస్ చేసి, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ లో జి.ఎస్.డి.పి.లో మూడు శాతం, ఇప్పుడు మన అంచనా 3.01శాతంగా ఉంది. దానిని కంట్రోల్ చేస్తాము. ఇలా కేంద్ర ప్రభుత్వం నుండి అదనపు సహాయం పొందగలిగే ప్రయత్నం చేస్తున్నాము. చాలా కాలంగా చిన్నమొత్తాల్లో ప్రజలు పోస్టాఫీసు ద్వారా పొదుపు చేయిస్తున్నారు. మొన్న మొన్నటి వరకు 13.25 శాతం దీని ద్వారా ఉండగా, ఇవే కాకుండా డెవలప్‌మెంట్ బాండ్స్ వచ్చాయి. ఇవన్నీ కూడా మొట్టమొదట ప్రజల్లోపొదుపు చేయాలన్నది నేర్పడానికి ఉద్దేశించినవి కావు. క్రమ క్రమంగా రాష్ట్రంలో కొంత వెసలుబాటు వచ్చింది. ఏ రాష్ట్రాలు ఈ స్మాల్ సేవింగ్స్ క్రింద ఎక్కువ కలక్ట్ చేసుకొంటాయో, ఆ రాష్ట్రాలకు ప్లాన్ అసిస్టెన్స్ క్రింద, మనకు సహాయకారిగా ఉండడానికి 70శాతం తీసుకోడానికి యుటిలిటీ ఇస్తున్నాము. అయితే rate of interest 13.25 ఉంది. ఇటీవల ఎన్.డి.సి.లో ఒక సబ్ కమిటి వేశారు. అదృష్టవశాత్తు మన రాష్ట్రం నుండి నేను సభ్యునిగా ఉన్నాను. వెస్ట్ బెంగాల్ నుండి హషీమ్‌దాస్ గుప్తా ఉన్నారు. తమిళనాడు నుండి కూడా ఉన్నారు. ఈ సబ్ కమిటికి అధ్యక్షునిగా చిదంబరం గారు ఉన్నారు. సమావేశంలో మేమంతా 13.25 శాతం నుండి 9 శాతానికి తగ్గించాలని బేరం పెట్టాము. చివరకు చిదం బరం గారు దాన్ని 10.25శాతానికి తగ్గించడానికి అంగీకరించారు. దాని వల్ల రాష్ట్రానికి గణనీయమైన తోడ్పాటు వస్తుంది. మనం పన్ను ద్వారా రాబట్టుకొనే ఆదాయమే కాకుండా, కేంద్ర ప్రభుత్వానికి, మన క్రమశిక్షణను, ఆచరణను చూపించడం వల్ల వచ్చే సహాయం ప్లస్ ఇటువంటి ఇన్‌సెన్టివ్ ఉంది. నిన్న కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెటులో రాష్ట్రాలకు డివిజబుల్ అమౌంట్ ఉంటుంది. ఇన్‌కంట్యాక్స్, ఎక్సైజ్ డ్యూటీలో ఒక్కో రాష్ట్రానికి ఇంత వాటా వస్తుంది. దీంట్లో 1300 కోట్లు అదనంగ ఆదాయం కలిసి రావాడానికి ఆస్కారం ఉంది. మన బడ్జెటు19.2.2007న పెట్టాము. ఆరోజున దీని విషయం ఆశించలేదు. ఆ రోజు లెక్కలోకి తీసుకోడానికి కూడా వీల్లేదు. నిన్న కే ద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెటు వల్ల అదనపు ఆదాయం రూ.1300కోట్లు వస్తుంది. అన్ని వనరులు సమీకరించుకొని, బడ్జెటు రూపొందించడానికి ప్రయత్నం చేశాము. యాక్చువల్‌గా క్యాపిటల్ ఇన్‌వెస్ట్‌మెంట్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాము. అప్పులు పెరుగుతున్నాయని అందరూ అంటున్నారు. రాష్ట్రం అప్పుల మయం అయిపోయిందని అంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధకారంలో ఉన్నప్పుడు, ఆనాడు ప్రతిపక్షనేతగా ఉన్న రాజశేఖరరెడ్డి గారు, కాంగ్రేస్ పార్టీ కార్యకర్తగా ఉన్న నేనూ మిగిలిన పార్టీల వారం కూడా అన్నాము.

మ. 12.20

అప్పు చేయడం తప్పని ఎప్పుడూ అనలేదు. I want to stand by this. చాలా క్యాటగారికల్‌గా చెప్పాము. ఏమనంటే అప్పు చేయవచ్చు. అది పరిమితికి లోబడి ఉండాలి.

( ప్రధాన ప్రతి పక్షం నుండి అంతరాయం )

నేను వంద సార్లు చెప్పాను కూడా. బహుశా మీకు అటువంటి మాటలు వినబడి ఉండవు మీరు అధికారంలో ఉన్నప్పుడు. అప్పు చేయవచ్చు. అయితే అప్పు చేస్తే అది పరిమితికి లోబడి ఉండాలి. అప్పు ద్వారా తెచ్చే డబ్బును సరదాలకు వాడకూడదని, స్నో, పౌడర్లకు వాడకూడదని, ఆటలు ఆడటానికి వాడకూడని, అనుత్పాదక కార్యక్రమాలకు వాడటం వాంఛనీయం కాదని చెప్పాను. తెచ్చిన అప్పును క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌లో పెట్టి ఆస్తులు పెంపకాన్ని చేసుకోవాలని , మనం ఒక్క రూపాయి అప్పు తెస్తే , రూపాయి విలువ గలిగిన ఆస్తిని పెంచే ప్రయత్నం చేస్తే అప్పు తేవడంలో తప్పు లేదు. అభివృద్ధి చెందే దిశలో చేస్తున్నాము. అభివృద్ధికి ప్రయత్నాలు చేస్తున్న రాష్ట్రాలకు కూడా అప్పు తేవడం తప్పదు. కనుక డెఫిసిట్ ఫైనాన్సు ఒక వైపు ఉన్నా కూడా అప్పులు తెచ్చుకోవచ్చు. కాని తెచ్చే అప్పులు ఎందుకు ఖర్చు పెడుతున్నామనే దగ్గర మేము చాలా స్పష్టమైన వైఖరిని అవలంభించాము.

ఇక్కడ నేను మనవి చేస్తున్నది మనకు ఎఫ్.ఆర్.బి.ఎమి వచ్చిన తర్వాత సాలీనా అప్పు మనం పెట్టుకున్న గీత దాటకుండా, దానికి లోబడి ఉండాలి. వెనుకటి రోజులలో మన స్టేట్ గవర్నమెంట్ ఏదైనా డిపార్టుమెంటుకు గ్యారంటీ ఇస్తే, ఉదాహరణకు పవరొ సెక్టార్‌కు లేకపోతే ఇరిగేషన్ బ్యాండ్సుకు గానీ, రోడ్ డెవలెప్‌మెంట్ బాండ్సుకు గానీ, వారు కూడా వారి పరిపాలనలో ఉన్నప్పుడు ఇచ్చారు. ఆ విధంగా గ్యారంటీ ఉంటే దానిని అప్పుగా పరిగణించే వారు కాదు. ఇ ఎఫ్.ఆర్.బి.ఎమ్. తర్వాత మనం కేంద్ర ప్రభుత్వం తరపు సలహాదారు పెట్టినటువంటి సజెషన్ ఏమంటే క్యాష్ రూపేణా మనం అప్పు తీసుకుని లేదా ఏదైనా మరొక ఆర్గనైజేషన్‌కు గ్యారంటీగా ఉన్నా కూడా సపోజ్ రోడ్ డెవలెప్‌మెంట్ బాండ్సు అమ్మి రూ. 1000 కోట్ల కొరకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తే అది కూడా మనం అప్పు చేసినట్లు అవుతుంది. అప్పులకు పరిమితి ఉంది. దానికి లోబడి వ్యవహరిస్తున్నందు వల్ల మనం ఈ రకమైన ప్రగతిని సాధించగలిగామని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, 2003-04 సంవత్సరంలో రూ. 2,961 కోట్ల రెవిన్యూ లోటు ఉంది. ( అంతరాయం )

శ్రీ ఇ. దయాకర రావు (వర్ధన్నపేట) : చాలా సమర్థులు .

శ్రీ కె. రోశయ్య : దయాకర రావు గారూ కొంచెం వినండి. సమర్థత కాదు. నా సమర్థత ఎప్పుడంటే నేను మాట్లాడే, నేను చెప్పే మాటలు మీరు ఇక్కడ వినేట్లు చేస్తే అది నా సమర్థత అవుతుంది. 2003-04 సంవత్సరంలో రూ. 2,961 కోట్లు రెవిన్యూ లోటు ఉంది. దీనిని క్రమ క్రమంగా తగ్గిస్తున్నాము. 2004-05 సంవత్సరంలో రూ. 2,545 కోట్లకు తగ్గించాము 2005-06 లో రూ. 64 కోట్లకు తగ్గించ గలిగాము. 2007-08 లో అంటే ఇప్పుడు ప్రెజెంట్ బడ్జెట్‌లో అంచనా ప్రకారంగా రూ. 3,648 కోట్లు లోటు మాత్రమే ఉంది. సార్ , ఈ లోటు కూడా లేకుండా చేయడరి కష్టమైనటువంటి మాట కాదు. ఎక్కడైనా

చెబుతున్నాను. ఆ మేరకు తగ్గిస్తే లోటు తగ్గిపోతుంది. మాకు అలా కాదు. వాస్తవంగా ఏ ఉపశాఖ కు కూడా కేటాయింపులు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకున్నాము. మీరు ఇందాక సంక్షేమం అన్నారు. దానికి వస్తాను. వివరాలన్నీ ఇస్తాను. లోటు తగ్గిస్తున్నామని చెబుతున్నాను. అలాగే వడ్డీ రాయితీ, కేంద్ర ప్రభుత్వం నుంచి నేను చెప్పినటువంటి ఎఫ్ఆర్‌బిఎమ్ కండిషన్సు అమలు చేయడం వల్ల వచ్చినటువంటి తోడ్పాటు రూ 1,781 కోట్ల వడ్డీ రాయితీ పొందాము. రూ. 1,183 కోట్లు రుణ మాఫీ పొందాము. 2006-07 లో రెవిన్యూ , ద్రవ్యలోటు ఈఅదుపులో ఉంచగలిగాము. మరొక రూ. 700 కోట్ల రుణం మాఫీ, రూ. 550 కోట్లు వడ్డీ రాయితీ సదుపాయం Next year 2007 లో కూడా రాబోతున్నది . మనం ఏదైతే నిర్దేశించుకున్నామో, ఆ నిర్దేశించుకున్నటువంటి గైడ్‌లైనుకు లోబడి పని చేస్తూ ఉంటే రాష్ట్రానికి వచ్చే మార్గం లాభం . మనం చేసినటువంటి అప్పులన్నీ వార్షిక ఉత్పాదకత పరంగా చూస్తే ప్రతి సంవత్సరం మనం నియంత్రిస్తూనే ఉన్నాము. ఇందులో రెండు రకాలు ఉన్నాయి. మిత్రులు ఇందాక మాట్లాడుతూ చెప్పారు.

మ.12.30

దీంట్లో రెండు రకాలు ఉన్నాయి. మిత్రులు ఇందాక మాట్లాడుతూ చెప్పారు. కొన్ని చోట్ల పర్సంటేజెస్‌కు, కొన్నిచోట్ల యాక్చ్యువల్ ఫిగర్స్‌కు ఎప్పుడూ డిఫరెన్స్ ఉంటుంది. రాష్ట్ర సంపద పెరుగుతున్నప్పుడు ఆ పెరుగుతున్న సంపదలో మనం చేసిన అప్పును, తక్కువగా ఉన్నప్పుడు చేసిన అప్పును చూస్తే అప్పు ఫిగర్ ఒకటేగాని, ఆనాడు పదివేలు తెస్తే, ఈ రోజు పదివేలు తెస్తే నేచురల్‌గా రాష్ట్ర స్థూల ఉత్పత్తి, స్థూల ఆదాయం పెరిగింది కాబట్టి పర్సంటేజ్ తగ్గుతుంది. పర్సంటేజ్ మెయింటైన్ అయ్యేట్లు కొంత ఎక్కువ తీసుకువస్తే అమ్మో, చూశారా అప్పుడు మేము పదివేలు తెచ్చాము, ఇప్పుడు మీరు పదమూడు వేలు తెచ్చారు, ఇది ఎక్కువ అప్పు అంటారు. అలా కాదు, పర్సంటేజ్ ప్రకారంచూస్తే తగ్గుతుంది.

శ్రీ కె. అచ్చన్నాయుడు: మీకు అనుకూలంగా చెప్పుకుంటారు.

శ్రీ కె. రోశయ్య: తప్పకుండా, మాకు అనుకూలమైన మాటలుగాక మీకు అనుకూలమైన మాటలు చెబుతానా? మేము తెచ్చిన ప్రతి రూపాయి అప్పును ఆస్తిగా మలచాము. 2006-07లో సవరించిన అంచనాల ప్రకారం రూ.24,500 కోట్లు అప్పుగా తెచ్చాము. ఇందులో రూ.20,000 కోట్లు సాగునీటి ప్రాజెక్ట్‌లకోసం ఖర్చుపెట్టాము. మిగిలినది గృహాలు, రోడ్లు, భవనాలవంటి ఆస్తులు సృష్టించటానికి ఖర్చుపెట్టాము. 2007-08 సంవత్సరంలో మొత్తం బడ్జెట్ అంచనా రూ.80,996 కోట్లకు వేసుకున్నాము. ఎక్కడైనా, ఏ దేశంలోగాని, రాష్ట్రంలోగాని ప్రణాళిక వ్యయాన్ని పెంచుకుని, ప్రణాళికమీద ఖర్చుపెట్టుకుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అన్ని రకాలుగా బాగుపడుతుంది. రాష్ట్ర అభివృద్ధికి ఆ విధానం దోహదపడుతుంది. ప్రణాళికేతర వ్యయం ఎంత పెంచుకున్నా, నిన్న గఫూర్‌గారు చెప్పినట్లు, బానెడు పొట్ట, సన్నటి చేతులు, వీగిపోయిన కాళ్లులాగా ఉంటుంది. అందువల్లే మేమెప్పుడూ ప్రణాళిక వ్యయంపైనే దృష్టి కేంద్రీకరించాము. నలుగురినీ తృప్తిపరచటానికో, దేశంలో అక్షర క్రమంలో మాత్రమే కాకుండా ఇతరత్రాకూడా మేమే నంబర్.1గా ఉన్నామని చెప్పుకోవటానికో ప్రణాళిక వ్యయాన్ని పెంచి అంకెలగారడి చెయ్యటానికి ప్రయత్నం చేయటంలేదు. మాకు ఒక స్థిరమైన అభిప్రాయం ఉన్నది. ప్రణాళిక వ్యయంలో కేటాయింపులు పెంచుకోవాలి, ప్రణాళికేతర వ్యయాన్ని వీలైనంతవరకు మదుపు చేసుకోవాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన ఆర్థిక నిర్వహణ ఉంటుంది. ఆ సిద్ధాంతంతోనే ప్రణాళిక వ్యయాన్ని రూ.32,973 కోట్లకు, ప్రణాళికేతర వ్యయాన్ని రూ.48,023 కోట్లకు కేటాయించుకోగలిగాము. ఇది ఇంకా తగ్గించాలంటే సాధ్యం కాలేదు. During the course of the year వీలైనంతవరకు ఈ ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించుకోవటానికి ప్రయత్నం చేస్తాను. 2007-08 అంచనాల

ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ.54,949 కోట్లు. ఇందులో కేంద్రప్రభుత్వంవారు మన రాష్ట్రానికి ఇచ్చే వాటా రూ.16,692 కోట్లు. అయితే వచ్చినటువంటి అదనపు సౌకర్యాన్ని బడ్జెట్‌లో కలపలేదు. ఇది అంతకుముందే తయారుచేసింది. రాష్ట్రంలో అమ్మకపు పన్ను, వ్యాట్ ఆదాయం రూ.20,568 కోట్లు, అబ్కారీ ఆదాయం రూ.4,125 కోట్లు ఇక్కడ ఒక మాట చెప్పాలి. మిత్రులందరూ మాట్లాడుతూ తాగుడు బాగా పెంచుతున్నారని అన్నారు. ఒక రకంగా పెరుగుతున్న మాట నిజమే. పెంచక్కర్లేదు, పెంచకుండానే పెరుగుతుంది. కాని ఒక్క విషయం గుర్తుపెట్టుకుంటే గతంలో కర్ణాటకనుండి, తమిళనాడునుండి టాక్స్ ఫ్రీ లారీలు ఫ్లీట్స్, ఫ్లీట్స్ వచ్చి మన రాష్ట్ర ఆదాయానికి గండికొడుతుంటే దానిని చెక్‌చేసి మనకు వచ్చే ఆదాయం పెంచుకుంటే దానిని కూడా తప్పంటే ఎట్లా? మీరు చెప్పండి, ఇదివరలో ఎన్ని లారీలు ఎవరెవరి పేర్లతో ఏయే చెక్‌పోస్టులనుండి వచ్చేవో పత్రికల్లో వచ్చిందా, లేదా? అసెంబ్లీ చర్చకు వచ్చింది.

శ్రీ ఇ. దయాకరరావు: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉగ్గుపాలతో త్రాగిస్తున్నామని అన్నారు కదా?

శ్రీ కె. రోశయ్య: దయాకరరావు, దానికి కూడా జవాబు చెబుతాను, నువ్వు తొందరపడవద్దు.

శ్రీ ఇ. దయాకరరావు: దానికి మీరు సమర్థులే.

శ్రీ కె. రోశయ్య: దానికి సమర్థత అక్కర్లేదు. క్రిందిది పైకి తిప్పను, పైది క్రిందికి తిప్పను. ఉన్నది ఉన్నట్లు చెబుతాను. ఆ మాట గుర్తుపెట్టుకోండి. వారికి టార్గెట్స్‌పెట్టి, ఈ ఎక్సైజ్ స్టేషన్ ఇంత అమ్మి తీరాలని టార్గెట్స్‌పెడితే వారు చచ్చినట్లు అమ్మితీరేవారు. ఇప్పుడు మేము వచ్చిన తరువాత టార్గెట్ సిస్టమ్ లేదు. ఆదాయం పెంచుకోవటానికి కావలసినటువంటి కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేసి ఆదాయం రాబడుతున్నాము. మోటారు వాహనాల పన్ను రూ.1968 కోట్లు. సభలో ఉన్న వారందరినీ పార్టీలతో నిమిత్తం లేకుండా ఆలోచన చేయమని మనవిచేస్తున్నాను. పెద్దలు చంద్రబాబునాయుడుగారిని కూడా కోరుతున్నాను. పార్టీల కోణంలోకాకుండా మీరు కూడా ఆలోచించండి. మోటార్ వెహికిల్స్ ఇదివరకు ఎప్పుడైనా నేషనలైజ్డ్ రూట్లలోకి రావటం చూశామ? గతంలో ఎప్పుడైనా బయటనుండి ప్రైవేటు బస్సులు హైదరాబాద్‌కు రావటం చూశామా? హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-వైజాగ్, హైదరాబాద్-షిర్డీ ఎక్కడైనా చూశామా? ఇటీవల కాలంలో ఎన్నో ప్రైవేటు వాహనాలు టూరిస్ట్ క్యాబ్స్ పేరుతో ఏదో నామినల్ పర్మిషన్ తీసుకుని మామూలు పాసింజెర్ బస్సుల్లాగా తిరుగుతున్నాయి. మా దివాకరరెడ్డిగారికి ఉన్నాయంటే నేను వారిని అడిగాను, ''దివాకర్ నీకు కూడా ఉన్నాయా, దివాకర్ సర్వీస్ అని ఎక్కడో చూశాను'' అని అంటే ''అది పార్ట్ ఆఫ్ మై బిజినెస్, అందరూ చేసేదే నేను చేశాను, నేనే కాదు, మనవారు ఇంకా చాలామంది ఉన్నారు'' అని పేర్లు చెప్పాడు. ఆ పేర్లు ఎందుకు! ఆయన పేరు చెప్పే చనువు నాకు ఉంది కాబట్టే చెప్పాను. ఎన్ని వందల ప్రైవేట్ బస్సులు ఆర్టీసి ఎర్నింగ్స్‌ను తింటున్నాయి? ఆర్టీసి ఆదాయం పడిపోతోందంటే ఇతరత్రా కారణాలు కొన్ని ఉండవచ్చు. ఆక్యుపెన్సీ పడిపోతోందంటే ప్రైవేట్ బస్సుల దాడికి తట్టుకోలేకపోతున్నాయి.

శ్రీ పి. కేశవ్ (ఉరవకొండ): అధ్యక్షా, ................(అంతరాయం)

శ్రీ కె. రోశయ్య: ఎప్పుడైనా కాలంమారి తమరి పార్టీగాని, మీ నాయకులుగాని ఎవరైనా అధికారంలోకి వచ్చినప్పుడు ఆ సలహాలు చెప్పి అట్లానే చేద్దురుగాని........

శ్రీ పి. కేశవ్: రెండేళ్లలో తప్పకుండా వస్తాము.

శ్రీ కె. రోశయ్య: మనుషులు ఎప్పుడూ ఆశాజీవులుగా బ్రతకాలి. ఆశ లేకపోతే కష్టం. రెండు సంవత్సరాలనే మాట మీరు ఇంతకుముందునుండే ఎప్పుడూ చెప్పటం చూస్తున్నాను. ఆ రెండు అట్లానే ఉంది. రెండు దశాబ్దాలేమో నాకు తెలియదు. దాని జోలికి తరువాత వెళ్దాము. ఆ వివరాలలోకి వెళితే మరల డైవర్షన్ వస్తుంది.

శ్రీ పి. కేశవ్: మునిసిపల్ ఎలక్షన్స్‌లో ఏమైనదో చూశారు.

శ్రీ కె. రోశయ్య: మొన్న మునిసిపల్ ఎలక్షన్స్, కోఆపరేటివ్ ఎలక్షన్స్, రైతుసంఘాల ఎలక్షన్స్‌లో ఏమి జరిగిందో కూడా చూశాము. అప్పుడు కూడా మీరు చెప్పారు. మేము వచ్చేశామని చంకలు కొట్టుకున్నారు. ఏమైనది? Let us confine to the subject. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌కు రూ.3,750 కోట్లు కేటాయించాము. రాష్ట్రంలో మొత్తం పన్నుల ఆదాయం రూ.38,256 కోట్లు, ఖనిజాదాయం రూ.1750 కోట్లు, రాష్ట్ర పన్నేతర ఆదాయం రూ.6,857 కోట్లు. అలాగే వీటి కేటాయింపులు కూడా చెప్పాలి. ముఖ్యమైన కేటాయింపులు చెబుతాను. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మేము వెలితిగా ఇచ్చామని ఎవరో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఈ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. వ్యవసాయానికి తగ్గించామని అన్నారు. అది కరెక్ట్ కాదు. వ్యవసాయానికి రూ.1305 కోట్లు ఇచ్చాము. నీటిపారుదల రంగంలో ప్లాన్‌క్రింద రూ.13,013 కోట్లు కేటాయించాము. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.453 కోట్లు కేటాయించాము. గ్రామీణాభివృద్ధికి రూ.4,349 కోట్లు కేటాయించాము.

శ్రీ ఇ. దయాకరరావు: ఎమౌంట్ చెబుతున్నారు, పర్సంటేజ్ ఎంత?

శ్రీ కె. రోశయ్య: నేను ఇందాకే చెప్పాను. మీకు కావలసినదేమంటే కొన్నిచోట్ల పర్సంటేజ్, కొన్నిచోట్ల యాక్చ్యువల్ ఫిగర్స్ కావాలి. మేము ఏ రకంగా చేశామో ఆ రకంగా చెప్పటం మాకు కావాలి. దాంట్లో వేరే వ్యత్యాసం లేదు. అధ్యక్షా, ఓపిక ఉంటే నేను ఇంకొక గంటసేపు డిపార్ట్‌మెంట్‌వైజ్‌గా 2000-01 నుండి ఇప్పటివరకు ఏ డిపార్ట్‌మెంట్‌క్రింద ఏయే సంవత్సరాలలో ఎంతెంత ఇచ్చారనేది అంతా వివరంగా చెబుతాను. ఎక్కడైనా తప్పులు ఉంటే కరెక్ట్ చేద్దురుగాని. I will not go unanswered. I will answer to everything that is being raised in this House. నా రిక్వెస్ట్ ఏమంటే దయచేసి డిస్టర్బ్ చేయకండి, సహకరించమని కోరుతున్నాను. అధ్యక్షా, రూ.4,138 కోట్లు కేటాయించాము. ఇందులో సాంఘిక సంక్షేమానికి రూ.1719 కోట్లు, గిరిజన సంక్షేమానికి రూ.719 కోట్లు, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూ.534 కోట్లు, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి రూ.123 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి రూ.1043 కోట్లు కేటాయించాము. హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కోసం రూ.11,596 కోట్లు కేటాయించాము. దాంట్లో విద్యకు రూ.8,047 కోట్లు, వైద్య ఆరోగ్య రంగానికి రూ.2,726 కోట్లు, పౌష్టికాహారానికి రూ.823 కోట్లు కేటాయించాము. రాష్ట్రం పారిశ్రామికంగా ముందుకు అడుగువేయాలి, మనం కూడా గుజరాత్‌వంటి రాష్ట్రాలతో, అదేవిధంగా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రవంటి రాష్ట్రాలను మించిన పారిశ్రామికీకరణ ఈ రాష్ట్రంలో జరగాలనే భావనతో మౌలిక సదుపాయాల రంగానికి పెద్దయెత్తున కేటాయింపులు చేశాము.

రూ.5,817 కోట్లు కేటాయించాము. ఇందులో పరిశ్రమల కోసం రూ.555 కోట్లు, రహదారుల, భవనాలు, పోర్ట్‌లు, విమానాశ్రయాల కోసం రూ.2,575 కోట్లు, విద్యుత్‌కు రూ.2,687 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.2,438 కోట్లు కేటాయించటం జరిగింది. 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటును 36.48 కోట్లుగా అంచనా వేశాము. బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు, ఫిస్కల్ డెఫిసిట్ రూ.8,640 కోట్లు. ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.01%.

మూడు సంవత్సరాలుగా అత్యధికమైన వార్షిక ప్రణాళికలను అమలుచేస్తున్న రాష్ట్రాలు దేశంలో 34 ఉన్నాయి. వారిలో మనం అగ్రగామిగా ఉన్నాము. అందరూ సంతోషించాలి. ఇది రూలింగ్ పార్టీగా మేమొక్కరమే కాదు రాష్ట్ర ప్రజలు, శాసనసభ, అన్ని పార్టీలవారు సంతోషించదగ్గ పరిణామమని మనవిచేస్తున్నాను. వార్షిక ప్రణాళిక వివరాల్లోకి వెళితే 2003-04లో రూ.11,794 కోట్లుగా ఉన్నదానిని 2007-08 సంవత్సరంనాటికి రూ.32,973 కోట్లకు పెంచాము. నాలుగు సంవత్సరాలలో, అంటే నాల్గవ బడ్జెట్ కూడా ప్రెజెంట్ చేశాను కాబట్టి, ప్రణాళిక వ్యయాన్ని మూడింతలుగా పెంచటం అనేది గతంలో ఎన్నడూ జరగలేదు. ఈ నాలుగేళ్లలోనే జరిగింది. నీటి పారుదల రంగానికి కేటాయింపులను ప్రతి ఏటా రూ.3000 కోట్లు పెంచటంవలన అది రూ.13,000 కోట్లకు చేరింది. సాగునీటి ప్రాజెక్ట్‌ల నిర్మాణం విషయంలో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు అందనంత దూరంలో ముందు భాగాన ఉన్నది. సాగునీటి ప్రాజెక్ట్‌లకు నిధుల కేటాయించేప్పుడు వెనుకబడిన ప్రాంతాలకు, జిల్లాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాము. తెలంగాణా ప్రాంతంలోని ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి రూ.5,911 కోట్లు, రాయలసీమ ప్రాంతంలో రూ.3,101 కోట్లు, ఆంధ్ర ప్రాంతానికి రూ.3,503 కోట్లు కేటాయించాము. గోదావరి జలాలతో తెలంగాణా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్నది మా దృఢ సంకల్పం. గోదావరి నది ఈ ప్రాంతంలో ప్రవహిస్తున్నప్పటికీ ఆ నీటిని ఈనాటివరకు పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోయాము. అది దృష్టిలో పెట్టుకుని ఆ జలాలను సద్వినియోగం చేసుకోవటానికి, ప్రతి నీటి బొట్టు సద్వినియోగం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాము. మెదక్, హైదరాబాద్ జిల్లాలమీదగా రంగారెడ్డి జిల్లా రైతులకు నీరందించాలని సంకల్పించాము. ఇందుకోసం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్‌కు ఊపిరి పోశాము. ఈ ప్రాజెక్ట్ సర్వే పనులు జరుగుతున్నాయి. సర్వే పూర్తి అవగానే ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేనప్పటికీ డబ్బు కేటాయించి సక్రమమైన రీతిలో పనులు మొదలుపెట్టటానికి సిద్ధంగా ఉన్నాము.

మ.12.40

సర్, రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా అయినటువంటి మహబూబ్‌నగర్ జిల్లాకి అత్యధిక నిధులు కేటాయించాం. ఈ జిల్లాకు భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రు. 1436 కోట్లు చేటాయించాం.

శ్రీ టి.దేవేందర్ గౌడ్ (మేడ్చల్): స్పీకర్ సర్, మినిస్టర్ గారు కాస్త అలసిపోయి వుంటారు. కాస్త రిలీఫ్ కోసమని అడుగుతున్నాను. మినిస్టర్ గారు బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పుడు కేటాయింపుల సంగతి జస్టిఫై చేస్తూ మాట్లాడుతున్నారు. వారికొచ్చే పన్నులు, వనరుల గురించి చెప్పేటప్పుడు పర్సెంటేజిల క్రింద చెబుతున్నారు. కాని కేటాయింపులకు వచ్చేసరికి ఫిగర్స్ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఫిగర్స్‌లో వేరియేషన్స్ వస్తుంటాయి. ఎందుకంటే గత సంవత్సరం కంటే పదో పదిహేనో కోట్లు పెంచామని చెప్పే పద్ధతిలో వారు చెబుతున్నారు. కాని పర్సెంటేజి వారీగా చూస్తే చాలా సెక్టార్స్‌కి, అంటే అగ్రికల్చర్, వెల్ఫేర్ లాంటి వాటికి తగ్గాయి. గోదావరి జలాలను వాడుకోవటానికి గాను ప్రాణహిత-చేవెళ్ల ప్రాజక్టుకు కేటాయింపులు లేకున్నా పనులు స్టార్ట్ చేస్తామంటే ఇది

మోసం కాక మరేమిటి? మీరు దయచేసి ఇలా చేయవద్దు. మీరు ప్రతిసారి ఇదే పద్ధతిలో మాట్లాడుతున్నారు. మొత్తం నీళ్లొస్తున్నాయి..... ప్రతి ఎకరాకి కూడా నీళ్లిస్తామని మాట్లాడుతూ రూపాయలు మాత్రం కేటాయింపులు చేయకుండా పూరికే ఈ విధంగా గాలిలోపెడుతున్నారు. అంటే ఈ విధమైన మోసపూరితమైన మాటలతో ఏదో మోసం చేయవచ్చనే తప్ప ఇంకొకటి కాదు. అసలు బడ్జెట్‌లో కేటాయింపులేలేకుండా ఎట్లా చేస్తారు? ఏ ప్రాజెక్టుకు తగ్గించి ఏ ప్రాజెక్టుకు పెడదామనుకుంటున్నారు? కేటాయింపులే లే కుండా మినిస్టర్ గారు నీళ్లు తీసుకొస్తామంటే ఇది మోసం కాక మరేమవుతుందో ఒకసారి క్లారిఫై చేయాలని కోరుతున్నాను. వారికున్న విద్య ఏమిటో మాకూ చెబితే మేము ఇప్పుడే కన్విన్స్ అవుతాము.

శ్రీ కె.రోశయ్య: అధ్యక్షా, బహుశా పెద్దలు దేవేందర్ గౌడ్‌గారు పరిపాలనానుభవం కూడా నిండుగా ఉన్నవారు. రంగారెడ్డి జిల్లా నుండి వచ్చినవారు. పదేళ్ల పదవీకాలంలో చేవెళ్ల - ప్రాణహిత ప్రాజెక్టు గురించి ఎప్పుడూ ఆలోచించిన వారు కారు. కాని ఇప్పుడు ఆలోచన జరుగుతూ వుంటే సర్వే కూడా జరుగుతుంటే బడ్జెట్‌లో లేకుండా ఎట్లా చేస్తారని అడుగుతున్నారు. నేను ఇది దృష్టిలో పెట్టుకునే బిగినింగ్‌లోనే చెప్పాను. బడ్జెట్‌లో ఉన్నటువంటి నిధులను కేటాయించాము. అత్యవసరమైన అవసరం వుంటే సప్లిమెంటరీ డిమాండ్స్ పేరుతో ఆమోదం కోసం వస్తామనే మాట మొట్టమొదటే చెప్పాను. కనుక మీకు డౌట్ అక్కరలేదు. చేవెళ్ల - ప్రాణహిత సర్వే పనులు పూర్తి కాగానే పనులు మొదలుపెట్టడమవుతుంది. డెఫినిట్‌గా మీరు చేవెళ్ల - ప్రాణహిత ప్రాజెక్టు చూస్తారు. నేనంటే మయసు మళ్లిన వాణ్ణి కాబట్టి చూడలేకపోతే చూడలేకపోవచ్చు కాని మీరు తప్పకుండా చూస్తారు. ఆ ఫలితం మీరు కూడా అందుకుంటారు. మీరు ఇంకా ఉన్నతికి వెళతారనే మాట నేను మనవి చేస్తున్నాను.

( తెలుగుదేశం సభ్యుల నుంచి అంతరాయం )

మేం చేయకపోతే మీరే వచ్చి చేస్తామంటారు. సార్, నాకు మిత్రులు చెబుతున్నట్లుగా ..... మా ఊరిలో ఒకాయన ఉండేవారు. ఆ ఊరిలో ఏది మంచి జరిగినా ఇది నేను ఎప్పుడో ఆలోచించానని చెప్పేవారు. మీరు కూడా అట్లా చెప్పుకోండి. నిత్యం కరువుతో అల్లాడుతున్న అనంతపురం జిల్లాకి వరప్రసాదిని అయిన హంద్రీనీవా ప్రాజెక్టుకు రు. 900 కోట్లు కేటాయించాం. నదుల అనుసంధానికి మొదటిమెట్టు అయిన పోలవరం ప్రాజెక్టుకు రు. 1395 కోట్లు కేటాయించాం. వంద మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల కోసం రు. 935 కోట్లు కేటాయించాం. చిన్న నీటి పారుదల రంగానికి రు.737 కోట్లు కేటాయించాం. ఈ కేటాయింపుల వల్ల చెరువుల క్రింద వ్యవసాయం చేసే రైతులకు పూరట కలుగుతుంది. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవటానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ గురించి మీ అందరికీ తెలుసు. వాటిని అమలుపరచటానికి మనం కూడా కొంత వాటా భరించాలి. దాని కోసం రు. 800 కోట్లు మనం ప్రొవైడ్ చేసుకోవటం జరిగింది. అలాగే కోఆపరేటివ్ రంగం కుదేలుపడిపోయిన మాట వాస్తవం. అలాగే దేశంలోని ఇతర రాష్ట్రాలలో కూడా అది దెబ్బతినిపోయింది. నిన్న మొన్న కూడా మనం ఏదో సందర్భంలో చెప్పటం జరిగింది. మన రాష్ట్రంలో కోఆపరేటివ్ రంగంలో ఉన్నటువంటి స్పిన్నింగ్ మిల్స్, సుగర్ మిల్స్ అన్ని ఒకటి తరువాత ఒకటి మూతపడిపోయాయి. చాలా వరకు అమ్మకం జరిగింది. ఇంకా కొన్ని అమ్మకానికి సిద్ధంగా మిగిలితే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమ్మకాలను ఆపివేసి వాటిని కూడా పునరుజ్జీవింప చేయ్యడానికి ప్రయత్నం చేస్తూ వచ్చాము. కోపరేటీవ్ సెంట్రల్ బ్యాంకులు కూడా 9 బ్యాంకులకు ఎలిజిబిలిటీ కోల్పోవటంతో నాబార్డ్ డబ్బు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కోపరేటీవ్ బ్యాంకులు కూడా ఎలిజిబిలిటీని కోల్పేయే ప్రమాదం వస్తే మొత్తం ఆ పదకొండు బ్యాంకులు మూతపడే ప్రమాదం వచ్చినప్పుడు ఆ మూత పడడానికి కారణం ఎవరు అనేది, ఎవరి కాలంలో నిర్లక్ష్యానికి గురయ్యిందనేది ప్రజలెవ్వరూ చూడరు. కనుక, రోశయ్య

గారూ, ఇవి మూత పడితే చెడ్డ పేరు మనకే వస్తుంది, గతంలో జరిగిన లోపాలు ఎవరూ చూడరు కాబట్టి అవి మూత పడడం సబబు కాదని ముఖ్యమంత్రి గారంటే రు.217 కోట్లు ఇచ్చాము. అది బడ్జెట్‌లో లేదు. అవసరాన్ని బట్టి 211 కోట్లు ఇచ్చి ఆ 11 బ్యాంకులకు ఎలిజిబిలిటీ వచ్చేటట్లు చేసాము. అదేవిధంగా కోపరేటీవ్ సెక్టార్‌కి సంబంధించి వైద్యనాధన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సహకార రంగాన్ని బాగుచెయ్యడానికి వంద కోట్లు కేటాయించాము. సార్, పవర్‌కు ఒరిజినల్‌గా బడ్జెట్‌లో ప్రొవైడ్ చేసిన దానికంటే ఎక్కువ కేటాయింపులు చేసిన విషయం గురించి చెబుతాను. అవసరాన్ని బట్టి ఎంతో అదనంగా ఇచ్చాము. గతంలో మీరు కూడా బడ్జెట్‌లో ప్రొవిజన్ పెట్టింది ఎంత, అదనంగా ఇచ్చింది ఎంత అనేది చూస్తే మీరు కూడా ఇచ్చారు. అలా ఇచ్చిన తరువాత సప్లిమెంటరీ డిమాండ్స్ పేరుతో ఈ సభ ముందుకు వచ్చారా లేదా? కనుక ఇదే పద్ధతిలో జరుగుతూ ఉంటుంది. బిందు సేద్యానికి ముఖ్యమంత్రి గారు ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి దీనిని డెవలప్ చేసుకోడానికి 50 కోట్లు కేటాయించాము. వ్యవసాయ విస్తరణ సేవలను అభివృద్ధి పరచడానికి మన రఘువీరా రెడ్డి గారు చేసే కృషికి తోడ్పాటు ఇవ్వాలని మరొక ముప్పై కోట్లు కూడా ఇచ్చాము. గత ప్రభుత్వం హయాంలో మూత పడిన సహకార పాల ఉత్పత్తి కేంద్రాలకు ప్రమాదం జరిగినప్పుడు పాడి రైతులకు, చెరుకు రైతులకు గ్రాడ్యువల్‌గా లాభం కలుగజేసేందుకు, ప్రైవేట్ ఫ్యాక్టరీస్ వాళ్లు రైతులకు సరైన ధర చెల్లించాల్సిన పరిస్థితి కల్పించాలని మా ఉద్దేశ్యం. అన్నీగవర్నమెంటే నడపడం అనేది కాదు కాని కోఆపరేటీవ్ రంగంలో మోనోపలీని లేకుండా చేసి వారి ఇష్టం వచ్చినట్లు రైతులకు ధర చెల్లించే విషయంలో అన్యాయం చేస్తారనేభావంతో అదే విధంగా కుంటినడక నడుస్తున్న, ఇబ్బందులు పడుతున్న కొన్ని పారపాట్ల నుండి బయటపడేసేందుకు రైతులకిచ్చి వాటిని పనిచెయ్యడానికి వీలుగా ఒక హెల్తీ కాంపిటీషన్ ఉంటుందనే ఉద్దేశ్యంతో వాటిని పునరుజ్జీవింప చేయడం జరిగింది. సహకార రంగాన్ని విస్తరించేందుకు 2007-08 లో 75 కోట్లు కేటాయించాము. బీమా ప్రీమియంను బడ్జెట్ కేటాయింపులతో నిమిత్తం లేకుండా ..... ఈ మాట మరొకసారి చెబుతున్నాను. బడ్జెట్ కేటాయింపులు 75 కోట్లు సరిపోతుందా అని అనుకుంటున్నారేమో గతంలో కూడా బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా అవసరమైతే అదనంగా మొత్తాన్ని విడుదల చేసి రైతులకు 493 కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించగలిగాము. బియాండ్ బడ్జెటరీ ప్రొవిజన్ అవసరమైనప్పుడు 493 కోట్లు రైతులకు ఇచ్చి సహాయం చెయ్యడం జరిగింది. అలాగే, తొలిసారిగా ఈ రాష్ట్రంలో గొర్రెల బీమా పంపకాన్ని అమలుచేస్తున్నాము. 2006 - 07లో అందుకోసం 15 కోట్లు విడుదల చేసాము. 2007-08లో కూడా 15 కోట్లు కేటాయించాము. ఇక మహిళా స్వయం సహాయక సంఘాలు సాధిస్తున్న విజయాల స్ఫూర్తితో మహిళల ఆధ్వర్యంలో పాల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాము. ఈ సంవత్సరం 2007-08లో మహబూబ్‌నగర్, కడప, అనంతపూర్ జిల్లాలలో ఆరు కోట్లు కేటాయించాము. ఈ మహిళా స్వయం సహాయక బృందాలు లేక ఇందిరా క్రాంతి పథకం క్రింద జరుగుతున్న కార్యక్రమాలు తమరు కూడా చూస్తున్నారు. మొక్కజొన్న కాని లేదా మార్కెట్‌లోకి వచ్చిన ఇతర వస్తువులు కొనే కార్యక్రమం కాని చెయ్యడం, వారికి అలవాటు లేకపోయినా నైపుణ్యం లేకపోయినా వారికి అప్పగిస్తే వారు సమర్థవంతంగా ప్రయోజనం పొందుతున్నారు.

మ.12.50

పి.వి. నర్సింహరావుగారు ప్రధానమంత్రిగా వున్నపుడు దాన్ని మొదలుపెడితే తర్వాత మీరు అది మాదని అంటున్నారు. మేముఅలా అనడం లేదు. అప్పుడు మొదలైంది, మీరు కూడా కొనసాగించారు,మేము ఇంకా ద్విగుణీకృతంగా మూడు రెట్లు పెంచి చేస్తున్నాం . అధ్యక్షా, బలహీన వర్గాలు సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నది మా లక్ష్యం . అందుకే ఆ వర్గాల వారి కోసం కేటాయింపులు ఎక్కువగా పెంచాం . ప్రతి పేద కుటుంబానికి తెల్లకార్డు ఇచ్చాం . అధ్యక్షా, ఇది వరలో తమరి అనుభవంలో కూడా ఆలోచించండి.

(ఈ దశలో తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఇ . దయాకర్‌రావు మైకు లేకుండా మాట్లాడుతూ – కార్డులు ఇస్తున్నారు గాని మరి రేషన్ ఇస్తున్నారా? అని అడిగారు. )

ఇదివరలో కార్డులు ఉంటే చాలనుకుంటే, వాడు చచ్చేంత వరకు కూడా కార్డు వచ్చేది కాదు. కార్డు ఇచ్చిన తర్వాత బియ్యం వస్తాయి . అంతేగాని పనికి ఆహారం పథకంలో లాగా, ఇంకొక పథకం లో లాగా ముందే బియ్యం ఇచ్చి తర్వాత కార్డులు ఇవ్వరు. జన్మభూమి పథకంలో పని లేకుండా బియ్యం ఇవ్వడం కుదరదు. ముందు కార్డులు ఇస్తాం, తర్వాత కేటాయింపులు వస్తాయి. ప్రతి పేద వాడి ఇంటికి వెళ్లి తలుపు తట్టి, ప్రతి బిపిఎల్ కుటుంబానికి తెల్లకార్డులు ఇస్తున్నాం, దానికి మీనుంచి ప్రశం లు వస్తాయని మేము అనుకోవడం లేదు.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం .)

కార్డు ఇస్తే తప్పంటారు, దయాకర్‌రావుగారు అన్నీ వస్తాయి, దయచేసి కూర్చోండి. ఇందిరమ్మ పథకం క్రింద ప్రతి ఒక్కరికి ఇళ్లు కట్టిస్తున్నాం . Weaker Sections Housing Programme - It is a prioritized programme. బడ్జెటు ప్రవేశపెట్టేంత వరకూ వాళ్లు మాట్లాడుతూ వచ్చారు, దీనికి ఎంత కేటాయించారు, రిక్వైర్‌మెంటు రూ. 4500 కోట్లు, 4600 కోట్లుంది, పెట్టారా? అన్నారు. ఈ బడ్జెటులో తగిన రీతిలో ప్రొవిజను పెట్టి మీరు చేస్తున్న విమర్శలు అర్థం లేనివి, ఆధారం లేనివి, ఊరకే గాలిలో కబుర్లు చెబుతున్నారని రుజువు చేశాం . సార్, నేను కూడా పల్లెటూరు నుంచి వచ్చిన వాణ్ణే . అమెరికానో, లేక మరొక సంపన్న దేశం నుంచి వచ్చిన వాణ్ణి కాదు. ఇదివరకు ఒక ఇళ్లు కావలసి వస్తే, ఎంఎల్ఏల చుట్టూ తిరగవలసి వచ్చేది, అధికార పార్టీ ఎంఎల్ఏ లే కాదు, అందరి ఎంఎల్ఏ ల చుట్టూ తిరగవలసి వచ్చేది. అధ్యక్షా, ఒకసారి నేను చెప్పినట్లు గుర్తు, రిపిటిషన్ అయినప్పటికీ నా మాట వింటారని అనుకుంటున్నాను. మా గ్రామంలో ఒక ముసలమ్మ ఉండేది, ఆమెకు 75 ఏళ్లు దాటాయి. ఆమె పొద్దున లేవంగానే తన ఇళ్లు వదలిపెట్టి, అవతల వుండే నాలుగో ఇంటి అరుగు మీద కూర్చునేది. ఆరోడ్డున వెళ్లే వెంకటరెడ్డిలాంటి వారు ఒకటి, రెండు రోజులు ఆమెను చూసి, ఏంటీ ఈ ముసలమ్మ తన ఇంటిని వదలిపెట్టి ఇక్కడ కూర్చుంటోందనుకునేవాడు . చివరికి మూడో రోజు ఆయన ఉండబట్టలేక వెళ్లి అడిగాడు. అమ్మా, ఏమిటి, నిద్ర లేచి లేవగానే మీ ఇళ్లు వదలిపెట్టి రోజూ ఇక్కడికి వచ్చి కూర్చుంటున్నావు, ఎందుకు ఇలా కూర్చుంటున్నావని అడిగాడు. అప్పుడు ఆమె – అయ్యా, నేను వృద్ధాప్య పింఛను కోసం ఎంఎల్ఏ గారి దగ్గరికి వెళ్లాను, ఎవరైనా ఊర్లో చచ్చిపోతే ఆ పేరు తీసుకరమ్మన్నారు, ఈ ఇంట్లో వున్నావిడ సుస్తీగా వుంది గనుక ఆవిడ ఏదైనా కాలగర్భంలో కలిసిపోయినట్లయితే మరెవరైనా వచ్చి ఆ పేరు వ్రాయించుకుంటారేమో,అందుకని వాకిట్లో కాపలా కాస్తున్నానని చెప్పింది. అలాంటి పరిస్థితి నుంచి ఈరోజు అధికారులు వెళ్లి తలుపు తట్టి మీకు ఇళ్లు కావాలా, అక్కర్లేదా అని అడుగుతుంటే...........

(అంతరాయం)

ఇది చిదంబర రహస్యమేమీ కాదు, దాచిపెట్టేది కాదు. చీఫ్ మినిష్టర్‌గారు ఇటీవల కలెక్టర్స్ కాన్ఫరెన్స్‌లో టార్గెట్స్ ఇచ్చి మీరు గ్రౌండ్ చేయాలి, చేసి తీరాలి, ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి, టార్గెట్స్ పూర్తి చేయకపోతే మీమీద చర్యలు తీసుకుంటామని కలెక్టర్లను , అధికారులను ఈ రాష్ట్రంలో భయపెట్టింది రాజశేఖర్ రెడ్డిగారి ప్రభుత్వం తప్ప మరొకరు ఎవరైనా చేశారా? రహస్యమేమీ లేదు, ముఖ్యమంత్రిగారు కూడా ఇక్కడే ఉన్నారు. నేను చాలాసార్లు వారితో చెబుతుంటాను, సార్ మీరు చాలా లిబరల్‌గా ఉంటున్నారు, కార్డు కావాలని వచ్చినపుడు ఇస్తే బాగుంటుందని. అలాగాకుండా ఆఫీసర్స్‌ను పంపించి ఇంట్లో ఎంతమంది ఉన్నారో కనుక్కుని కార్డులు

ఇవ్వమని చెబుతున్నారు ముఖ్యమంత్రిగారు. ఒక కుటుంబంలో నలుగురు కూతుళ్లుంటే వారికి పెళ్లిళ్లు అయ్యాయి, ఒక కొడకుకు ఇంకా పెళ్లి కాలేదు. ఎప్పుడు చేస్తారని అడిగితే, ఈ ఏడాది చేస్తామంటున్నారు...........

(అంతరాయం)

అచ్చన్నాయుడు గారూ, మీరు చెప్పింది మూడున్నర గంటలు విన్నాం, నేను మొదలుపెట్టి అరగంట కూడా కాలేదు, అప్పుడే ఇలా మాట్లాడితే ఎలా? చెప్పవలసింది చాలా వుంది. దయచేసి కూర్చోండి. నేను ముఖ్యమంత్రిగారి ధోరణిని స్పష్టంగా చెబుతున్నాను. వారేమంటారంటే, ఇప్పుడు కాకపోయినా మరో ఆరు నెలలకైనా అతనికి పెళ్లి చే స్తారు కదా, వారికి కూడా ఒక ఇళ్లు ఇవ్వండంటారు. నేను ఏమంటానంటే, పెళ్లి అయిన తర్వాత ఇద్దాం, పెళ్లి కానీయండి ఇద్దామంటాను. వృద్ధాప్య పింఛన్ల విషయంలో కూడా – really speaking, నన్ను మైజర్ అనుకోండీ, నా స్వభావం అనుకోండీ, నా రక్తంలో ఉందనుకోండీ, నేను అనేదేమంటే అర్హత ఉన్న వారికి ఇద్దామంటాను. ఒక ముసలామెకు నలుగురు పిల్లలుండి, వాళ్లు మంచి మంచి ఉద్యోగాలు చేస్తూ సంపన్నంగా ఉంటే , ముఖ్యమంత్రిగారు ఏమంటారంటే ఆవిడకు కూడా ఇవ్వమంటారు. నేను అంటాను – ఆమెకున్న నలుగురు కొడుకులు బాగా సంపాదిస్తున్నారు, ఆమెకెందుకని. వారు సంపాదిస్తున్నది నిజమే, కాని వారు ఆమెను సరిగా చూస్తే మన దగ్గరికి ఎందుకు వస్తుంది, కుటుంబ సభ్యులు చూడలేదు కాబట్టి మనం చూడాలంటారు ముఖ్యమంత్రిగారు. So, he is very very liberal, nobody...............

(INTERRUPTIONS)

వారు నా ఆలోచన అంగీకరించకపోయినా, నా ఆలోచనను పక్కన పెట్టినా, నాకు గ్రౌజ్ లేదు. Really, I feel that here is one Chief Minister who has got abundant sympathy for the weaker sections అని ఫీల్ అయ్యాను. అయ్యో, నా మాట వినలేదే, డబ్బు ఖర్చు అయిపోతుందే అని ఫీల్ కాలేదు.

సార్, వెల్ఫేర్ గురించి మన దేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడైనా సంక్షేమం కోసం ఇంత భారీ స్థాయిలో కార్యక్రమాలు అమలుజేసిన ప్రభుత్వాన్ని మీరు చూపించగలిగితే మేము కూడా ఆయా పథకాలను పరిశీలిస్తామని, సాధ్యాసాధ్యాలనుబట్టి అమలుపరచడానికి ప్రయత్నం చేస్తామని మాట ఇస్తున్నాను. వెల్ఫేర్‌కు సంబంధించినంత వరకు .......

(అంతరాయం)

దయాకర్‌రావుగారూ, మీముందున్న దేవేందర్‌గౌడుగారు రెండున్నర గంటలు మాట్లాడితే నేను మధ్యలో లేచి ఒక్క మాటైనా అన్నానా? అన్నీ విన్నాం కదా, నన్ను జవాబు చెప్పమని అడిగితే జవాబు చెబుతున్నాను. పద్ధతిగా మాట్లాడే అవకాశం వచ్చినపుడు మీరు దాన్ని సద్వినియోగం చేసుకోండి, ఇప్పుడు దయచేసి కూర్చోండి.

అధ్యక్షా, మిత్రులు గఫూర్‌గారు, నోముల నర్సింహయ్యగారికి ప్రత్యేకంగా మనవి చేస్తున్నాను. మిగిలిన రాష్ట్రాలతో పోల్చడానికి నేను ప్రయత్నం చేయడం లేదు. అయితే మీరు(కమ్యూనిస్టులు) కూడా గవర్నమెంటులో ఉన్నారు కాబట్టి, మంచి పురోగతి కోసం ఖర్చు చేస్తున్న పెద్ద రాష్ట్రం కాబట్టి, పశ్చిమ బెంగాల్ వ్యవహారం గురించి కూడా ఒక మాట చెబుతాను. పదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఎస్‌సి, ఎస్‌టి,బిసి ల వెల్ఫేర్ యాక్టివిటీస్‌కు మన రాష్ట్రంలో రూ. 3914 కోట్లు ఖర్చు చేశాం, నర్సింహయ్యగారూ, దయచేసి నోట్

చేసుకోండి.  అలాగే సోషల్ సెక్యూరిటీ, సోషల్ వెల్ఫేర్‌కు మన రాష్ట్రంలో రూ. 385 కోట్లు ఖర్చు పెట్టాం .  వెస్ట్ బెంగాల్‌లో సహజంగా ప్రోగ్రెసివ్ ఆలోచనలున్న ఆ పార్టీకి వీకర్ సెక్షన్స్ పట్ల సానుభూతి ఎక్కువగానే ఉంటుంది, కానీ వాళ్లు పదవ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఎస్‌టి, ఎస్‌సి, ఓబిసిల వెల్ఫేర్ యాక్టివిటీస్‌కు రూ. 410 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు.  అలాగే సోషల్ సెక్యూరిటీ, సోషల్ వెల్ఫేర్‌కు వాళ్లు రూ. 467కోట్లు ఖర్చు చేయడం జరిగింది.  దీంట్లో కొంచెం ఎక్కువగానే ఉంది.

మ. 1.00

దానిలో కొంచెం ఎక్కువ ఉంది.  2006-7లో మనం ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిలకు రు.1561కోట్లు కేటాయించాము.  బెంగాల్‌లో వారు రు.112కోట్లు మాత్రమే కేటాయించారు.  సోషల్ సెక్యూరిటీ, సోషల్ వెల్ఫేర్‌కు రు.164కోట్లు మనం ఇచ్చాము, వారు రు.171కోట్లు ఇచ్చారు.  మనకంటే రు.7 కోట్లు ఎక్కువ ఇచ్చారు.  వారిని మనం కాపీ చేయాలని కాని బెంగాల్‌లో ఉన్న బుద్ధదేవ్‌గారు మమ్ములను ఎందుకు కాపీ చేయలేదని కాదు.  కంపారిటివ్ స్టడీ మీకు అవసరం . కాబట్టి నోట్ చేసుకుని వెరిఫై చేసుకోండి. If anything is wrong, I offer apology and stand corrected. అఫీషియల్‌గా ఇంటర్నెట్‌లో బెంగాల్ గవర్నమెంట్ నుండి డౌన్ లోడ్ చేసుకుని చెబుతున్న వివరాలు .

శ్రీ ఎమ్.ఎ.గఫూర్ః  బెంగాల్‌లో కాంగ్రెసు వారికి పంపాలి.  గౌరవ ఆర్థిక మంత్రిగారికి చిన్న విన్నపము.  మేము మాట్లాడుతూ ఎప్పుడూ బెంగాల్‌ను రిఫర్ చేయలేదు.  మీరు ఫిగర్ తెచ్చి ఇస్తున్నారు.  బెంగాల్‌లో మా పార్టీ ఉంది.  మీపార్టీ వారికి పంపితే అక్కడ మాట్లాడడానికి బాగా ఉపయోగపడుతుంది.  వారికి పంపకుండా మాకు చెబితే ఏమి ఉపయోగము?

శ్రీ కె. రోశయ్యః  20 ఏళ్లు మీరే అధికారంలో ఉంటే కాంగ్రెసు ఎక్కడ ఉంది?  టిడిపి గురించి మాట్లాడుదామంటే కంపారిటివ్‌గా ఇంకొక స్టేట్ లేదు.  మన రాష్ట్రానికే పరిమితమైన పార్టీ.  మీరు జాతీయ పార్టీకి చెందిన వారు కాబట్టి కేంద్రంలో ఈ రోజు యుపిఎ గవర్నమెంట్‌కు సపోర్టు ఇస్తున్నవారు.  మమ్ములను గురించి మీరేమి మాట్లాడినా సంపూర్ణమైన సానుభూతితో , గౌరవము చూపేవారము.  బెంగాల్‌లోని ప్రభుత్వం పట్ల మాకు గౌరవము ఉంది.  ఇంకొక రకమైన బావన కాదు.  నిరాహారదీక్షబూని వెల్ఫేర్ మరచిపోయారని అంటే వాస్తవ పరిస్థితులు ఇలా ఉన్నాయని డేటా చెబుతున్నాము.  కాని అక్కడున్న కాంగ్రెసును అడగమని, ఉప్పందించి గోల చేయమని చెప్పడానికి కాదు.  ఇక్కడ ఉన్న పరిస్థితిని మీకు వివరిస్తున్నాను.

శ్రీ నోముల నర్సింహయ్యః అధ్యక్షా, మా సోదరుడు గఫూర్, ఆర్థిక మంత్రిగారు చెప్పిన దానికి జవాబు చెప్పారు.  12సార్లు బడ్జెట్ పెట్టిన మన ఆర్థిక మంత్రిగారు ఇంతకుముందు హషీమ్‌దాస్ గుప్తా గురించి చెప్పారు.  ఆయన చాలా అనుభవం ఉన్నవారు.  నేను వారిని కొన్నింటిలో అనుకరించానని చెబుతున్నారు.  బాగుంది.  ఎస్‌సిలకు, ఎస్‌టిలకు సంబంధించిన పదవ ప్లాన్‌లో రు.3918కోట్లు ఉన్నా, వారిది రు.410 కోట్లు ఉన్నా ఏది ఉన్నా ఒక్కటే చెప్పదలచుకున్నాను.  దేశం మొత్తంలో 18లక్షల ఎకరాల భూములు పంచితే 12 లక్షల ఎకరాలు ఒక్క బెంగాల్‌లోనే ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు మాత్రమే ఇచ్చారు.  అందుకే 30 సంవత్సరాలు అధికారంలో ఉన్నారు.  మరొక 5 సంవత్సరాలు ఇచ్చారు.  మీరు భూములు పంచమంటే పంచారా?  ఎస్‌సి, ఎస్‌టిలకు భూమి ప్రధానం . 4లక్షల మంది బలిదానమైన 10లక్షలు ఎకరాలు పంచిన చరిత్ర కలిగిన పార్టీ .

అందుకని ఈ ఇన్‌స్పిరేషన్‌తో బెంగాల్‌లోనే విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. భూములు పంచాలంటే పంచరు. అభివృద్ధి చేయమంటే చేయరు.

శ్రీ కె. రోశయ్యః నర్సింహయ్యగారి సూచనను మనస్సులో పెట్టుకుంటాను. భూముల చట్టాన్ని మన రాష్ట్రంలో తెచ్చామని అన్నారు. ధన్యవాదాలు. ఏ రాష్ట్రంలో, ఏ పార్టీ ఆధ్వర్యంలో అయినా చేసిన మంచిని స్వీకరిస్తాము. మీకు నచ్చిన ఒక ఏరియా తీసుకొని దాని గురించి చెబుతున్నారు. మీకు కన్‌వీనియంట్‌గా ఉన్నట్టు చెబుతున్నారు. మాకు కన్‌వీనియంట్‌గా కాకుండా మీకు కన్‌వీనియంట్‌గా ఉండేట్టుగా చెబుతానా?

శ్రీ పి. కేశవ్ః ప్రజలకు కన్‌వీనియంట్‌గా ఉండేలా చెప్పాలి.

శ్రీ కె. రోశయ్యః ప్రజలను రిప్రజంట్ చేసే పార్టీ మాది . వెస్ట్‌బెంగాల్‌లో ముస్లిమ్స్ 25.2 శాతం మంది ఉన్నారు. The share of muslims in the State employment is 2.1%. దయచేసి గుర్తు పెట్టుకోండి. ఆంధ్రప్రదేశ్‌లో మన పాపులేషన్ లెక్కల ప్రకారం 9.2 కాని స్టేట్ ఎంప్లాయ్‌మెంట్‌లో 8.8 శాతం మన రాష్ట్రంలో ఉంది. దయచేసి రెండు రాష్ట్రాల తేడా గమనించండి.

(అంతరాయం)

బలహీన వర్గాల వారి ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని వృద్ధులకు ఇచ్చే పెన్షన్ ఎవరికి ఇస్తాము? సంపన్న వర్గాలకు కాదు కదా. సమాజంలో అట్టడుగు వర్గాలకు ఆధారం లేని వారు, వయో వృద్ధులు అయిన వారు, నిరాధారమైన వారు మొదలైన వారిని దృష్టిలో పెట్టుకొని గతంలో రు.75లు ఇచ్చారు. మేము ఎన్నికల ముందు వాగ్దానం చేసిన మాట వాస్తము. వీలైతే రు.225లకు పెంచుతామని అన్నాము. కాని ఇప్పుడు నెలకు రు.200 వరకు పెంచాము. మేము వచ్చిన తరువాత 9లక్షల68 వేల మందికి అదనంగా వృద్ధాప్య పెన్షన్ను ఇస్తున్నాము సంవత్సరానికి . గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మీ రాష్ట్రం అభివృద్ధి పధాన నడుస్తుంది. మీ రాష్ట్రం వెనుకబడి ఉన్నప్పుడు 4లక్షల 46 వేల మందికి పెన్షన్ను ఇస్తున్నాము. మనం ఇంకా పెంచమని కేంద్రాన్ని అడిగితే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుంది కాబట్టి సగానికి తగ్గిస్తామని చెప్పింది. అభివృద్ధి అంటే కొన్ని కోణాలలో చూసి చెప్పడం కాదు, ఇంకా సమాజంలో బలహీనులున్నారు. వారికి ఇంకా ఎక్కువ ఇవ్వాలి అంటే అది మీ రాష్ట్రం భరించవలసింది తప్ప కేంద్ర ం నుండి మా గైడ్ లైన్సు ప్రకారం 4.46 లక్షలలో సగానికి తగ్గిసామని అంటే మహానుభావా, పెంచకపోయినా ఫరవాలేదు కాని తగ్గించకండని అడుగుతున్నాను. మన రాష్ట్రంలో ఇప్పుడు సుమారు 30 లక్షల మందికి ఇస్తున్నాము. వచ్చే సంవత్సరం 31 లక్షల మందికి ఇస్తాము. ఆపై వచ్చే సంవత్సరంలో మరొక 8 లక్షలమందికి తక్కువ కాకుండా పెన్షన్ను ఇవ్వాలని అనుకుంటున్నాము. కార్మికులకు పని భద్రత కల్పించడానికి రైట్ ఫర్ ఎంప్లాయ్‌మెంట్‌లో రు.1000కోట్లు విలువైన పనులతో 16 లక్షల మంది ఉపాధి కల్పిస్తున్నాము.

మ. 1.10

రాబోయే సంవత్స రంలో రు. 1660 కోట్ల విలువైన పనులతో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలనేది సంకల్పం . ఇచ్చిన మాట ప్రకారం మహిళా సహాయక సంఘాలకు పావలా వడ్డీకి రుణాలు యిస్తున్నాము. ఎక్కడ యిస్తారు ఎంత యిస్తారు అని వారు అన్నారు.

శ్రీ ఇ. దయాకర్‌రావు: మార్జిన్ మనీ యిదివరకు యిచ్చే వారము.

శ్రీ కె. రోశయ్య: 2003-04 సంవత్సరంలో రు. 754 కోట్లు రుణంగా ఈ సంఘాలకు యిచ్చాము. ఈ సంవత్సరం ఇప్పటికి – దయచేసి నోట్ చేసుకోండి – రు. 2204 కోట్లు రుణంగా యిచ్చాము. ఎన్ని రెట్లు పెరిగిందో ఆలోచించండి. ఈ మూడు సంవత్సరాల్లో మూడు రెట్లు అధికంగా రుణాలు యిప్పించాము ప్లస్ వడ్డీకి సంబంధించినంతవరకు గతంలో వారికి అడ్వాన్స్ చేసిన లోన్స్ మీద 14 శాతం నుండి 15 శాతం వరకు ఛార్జ్ చేసేవారు. సేవింగ్స్ మీద మూడు శాతం వడ్డీ యిచ్చేవారు. మేము వారికి అడ్వాన్స్ చేస్తున్న లోన్ కి సంబంధించి పావలా వడ్డీకే లోన్ యిస్తున్నాము. లోన్ ఎమవుంట్ పెంచాము, సభ్యుల సంఖ్య పెంచాము.

ఈ సంవత్సరం రు. 10 కోట్లు వున్న అల్ప సంఖ్యాక వర్గాల స్కాలర్‌షిప్స్ రాబోయే సంవత్సరంలో రు. 80 కోట్లకు పెంచాము.

( ఇంటరప్షన్స్ )

అధ్యక్షా, వారు వినాలి. 2007- 08 సంవత్సరంలో అర్హతగల ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ అందించాలనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాము. స్కాలర్‌షిప్స్, ఫీజ్ రియంబర్స్‌మెంట్ కోసం అవసరమైతే రానున్న ఒకటిన్నర సంవత్సరం కాలంలో కేటాయించిన మొత్తానికి అదనంగా నిధులను గౌరవ సభ అనుమతితో యివ్వడానికి సంసిద్ధంగా వున్నాము.

పేదలు, బడుగు, బలహీన వర్గాల వారికి ఆపదలో అవసరమైన వైద్య సేవలు అందించడం కోసం రు. 50 కోట్లతో ఆరోగ్య భీమా పథకాన్ని అమలు చేస్తున్నాము. సంతోషం ఏమంటే నిన్న కేంద్రం దేశానికి యిచ్చిన బడ్జెట్‌లో కూడా వైద్య రంగానికి, విద్యా రంగానికి యితోధిక ప్రోత్సాహం యిచ్చారు. ఆరోగ్య భీమా పథకానికి కానీయండి మిగతా వైద్య రంగానికి తోడ్పాటు కూడా లెక్కలు వేసుకున్న దానికంటే కొంత అదనంగా వస్తుందని ఆశపడుతున్నాము. మేము యివన్నీ చేస్తూ వుంటే ఒక మంచి మాట మీ నుండి వస్తుందని ఆశిస్తే – బహుశా దురాశ అని నేను అనుకోను – అలాంటి ఆశకు ఆస్కారం లేకుండా దీనికి అడ్డు తగలడం, చేస్తున్నారు. నిరాశ అని కాదు, ఈ పద్ధతి సవ్యంగా లేదు.

అధ్యక్షా, చేనేత కార్మికులకు సంబంధించినంతవరకు పెట్టుబడిపై వడ్డీ రాయితీని కల్పిస్తున్నాము. 2005-06 సంవత్సరంలో రు. 3 కోట్లు కాగా, 2006- 07 సంవత్సరంలో రు. 7 కోట్ల 50 లక్షలకు పెంచాము. రు. 1 కోటి 40 వేల రూపాయలతో 17 వేల వర్క్ షెడ్స్ నిర్మిస్తున్నాము. ఇందులోనే గృహవసతి సదుపాయం కూడా వుంటుంది. విద్యుచ్ఛక్తితో నడిచే యంత్రాలకు సంబంధించి , విద్యుత్తుపై రు. 87 పైసల నుండి రు. 1.74 పైసల వరకు రాయితీ కల్పిస్తున్నాము. దీనివల్ల ప్రతి సంవత్సరం 20 వేలమంది చేనేత కార్మికులు లబ్దిచెందుతున్నారు. చేనేత పరిధి విస్తరింపజేయడం కోసం నేత బజార్లు ఏర్పాటు చేస్తున్నాము. మీరు మాటల్లో మొదలుపెట్టారు. మేము క్రియాత్మకంగా గ్రౌండ్ మీద మొదలుపెట్టాము. ఆరు చేనేత బజార్లు మొదలుపెట్టాము. రెండు కన్‌స్ట్రక్షన్ పూర్తి అయి ప్రారంభానికి సిద్ధంగా వున్నాయి. రెండు నిర్మాణంలో వున్నాయి.

( చేనేత కార్మికులను మోసం చేయవద్దు అంటూ టిడిపి సభ్యుల నుండి కామెంట్స్ )

68 వేల మంది చేనేత కార్మికులను మోసం చేయగలుగుతే , వారందరినీ మోసం చేసే తెలివితేటలు దేవుడు నాకిస్తే పయ్యావుల కేశవ్‌ను మోసం చేయలేనా?

( మీ కాన్స్టిట్యుయెన్సీలోనే చేనేత కార్మికులు లెటర్ వ్రాసిపెట్టి చనిపోయారు అంటూ టిడిపి సభ్యుల నుండి కామెంట్స్ )

అధ్యక్షా, నేను యిందాకే చెప్పాను.

శ్రీ పి. కేశవ్: అందరినీ అన్నిసార్లు మోసం చేయలేరు. కొందరిని కొన్నిసార్లు మాత్రమే మోసం చేయగలరు.

శ్రీ కె. రోశయ్య : 68 వేలమంది చేనేత కార్మికులకు ఆరోగ్య భీమా సదుపాయం కల్పించాము. 64 వేలమందికి మహాత్మా గాంధీ బంకర్ యోజన పేరిట భీమా సదుపాయం కల్పించాము. ఆత్మహత్య చేసుకున్న నేతకారుల కుటుంబాలకు రు. 1 లక్షా 50 వేలు పరిహారంగా యిస్తున్నాము. ఎక్కడ యిచ్చారు అంటూ నిన్న, మొన్న మాట్లాడుతూ అడిగారు. రు. 1 లక్షా 50 వేల చొప్పున 154 కుటుంబాలకు యిచ్చాము.

( ఎంతమంది చనిపోయారు అంటూ టిడిపి సభ్యుల నుండి కామెంట్స్ )

ఎంత మంది చనిపోయారు అనేది నిర్ణయం కాకుండానే అయిన వాడికి, కానివాడికి, మన చొక్కాలకు, సహజంగా మరణించిన వారికి, రికార్డులో ఏమీ లేకపోయినా, పోలీస్ స్టేషన్‌లో ఏమీ లేకపోయినా, పోస్ట్‌మార్టం రిపోర్టు కూడా లేకుండా పంచడం మాకు చేతకాదు.

( ఇంటరప్షన్స్ )

గతంలో వారు పది సంవత్సరాల్లో చేయలేక పోయారు. ఇది నూతన ప్రయోగం . ఈ ప్రభుత్వం 65 ఏళ్ల వయసుకు కాకుండా 50 ఏళ్ల వయసుకే చేనేత కార్మికులకు ప్రత్యేక పరిస్థితుల్లో పెన్షన్ యిస్తోంది అనేది మంచి మాట.

శ్రీ పి. కేశవ్: స్థానిక సంస్థల ఎలక్షన్స్‌కు ముందు యిచ్చారు.

శ్రీ కె. రోశయ్య: పదేళ్లు పరిపాలన చేసిన మీకు ఆ ఆలోచన రాలేదు. కడుపేద చేనేత కుటుంబాలకు నెలకు 25 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. 50 సంవత్సరాల చేనేతకారులకు నెలకు రు. 500 పెన్షన్ యిస్తున్నాము.

విద్యకు సంబంధించి చాలామంది సభ్యులు మాట్లాడుతూ విద్యారంగానికి కేటాయింపులు తగ్గించినట్లుగా చెప్పారు. కానీ అది వాస్తవం కాదు. కొత్తగా నాలుగు విశ్వవిద్యాలయాలు, నాలుగు మెడికల్ కాలేజెస్ స్థాపించాము. ఇంజనీరింగ్ విద్యను మారుమూల గ్రామాలకు కూడా విస్తరింపజేయడం కోసం మారుమూల ప్రాంతాలలో జెయన్‌టియు కాలేజెస్‌ఏర్పాటు చేస్తున్నాము. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా 4 డిగ్రీ కళాశాలలు, 5 జూనియర్ కళాశాలలునిర్మిస్తున్నాము. ఐఐటి తీసుకువచ్చాము. జాతీయ

ప్రాముఖ్యత కలిగిన పలు విద్యా సంస్థలు రాష్ట్రంలో అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నాము. విద్యాభివృద్ధి కొసం సర్వ శిక్షా అభియాన్ ద్వారా ప్రాథమిక విద్యకోసం రు. 837 కోట్లు ఖర్చు చేస్తున్నాము. మధ్యాహ్న భోజన పథకం క్రింద 60 లక్షలమందికి భోజన సదుపాయం కల్పిస్తున్నాము.
మ. 1.20

మధ్యాహ్న భోజన పథకానికి ఈ సంవత్సరం అదనంగా గతంలో కంటే రు. 25 కోట్లు ఎక్కువ కేటాయించాము. విద్యా రంగానికి కేటాయింపులు తగ్గించామని కొందరు సభ్యులు అనడం బాధాకరం . విద్యా రంగానికి 2007-08 సంవత్సరపు బడ్జెట్ కేటాయింపులు ప్లాన్‌లో 45 శాతం, మొత్తం వ్యయంలో 29 శాతం పెంచాము. విద్యా రంగానికి ఏటా ఎంత మొత్తం పెంచుతున్నామో గమనించండి. మొత్తం బడ్జెట్ వ్యయాన్ని విద్యా రంగం వ్యయంతో పోల్చి శాతంగా చెప్పడం సరి కాదు. ఇంత కాలంగా నిర్లక్ష్యానికి గురియైన సాగునీరు, గృహనిర్మాణం వంటి రంగాలకు కేటాయింపులను కనీవినీ ఎరుగని రీతిలో పెంచాము. మొత్తం బడ్జెట్ వ్యయం పెరిగిందే గాని విద్య, వైద్యం, సంక్షేమం వంటి రంగాలకు కేటాయింపులు తగ్గలేదు.

వైద్య రంగానికి సంబంధించినంతవరకు డిమాండ్స్‌పై మాట్లాడే సందర్భంలో చాలా వివరంగా, వారికి ఓపిక వుంటే, నాకు అవకాశం యిస్తే చెబుతాను. ఎప్పటికప్పుడు వారితో కూడా మాట్లాడుతున్నాము. వైద్య విద్య అభివృద్ధికి ప్రాధాన్యత యిచ్చాము. కొత్తగా నాలుగు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆశపడుతున్నాము. వెనుకబడిన ప్రాంతాలైన శ్రీకాకుళం, అదిలాబాద్, కడప, ప్రకాశం జిల్లాలలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం మేము ఆశిస్తున్న అతి ముఖ్య ప్రయోజనం . ఈ కాలేజీల ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రాంతాలలో వైద్యుల సంఖ్య పెరిగి గ్రామీణులకు సేవలు అందించడానికి తగు వైద్యులు లభిస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నాము. మీ అందరి సహకారంతో ఆ ఆశలు నెరవేరే ప్రయత్నం చేస్తాము. 2007-08 బడ్జెట్‌లో శ్రీకాకుళం, అదిలాబాద్, కడప, ప్రకాశం జిల్లాలలో ఏర్పాటు చేసే వైద్య కళాశాలలలో పరికరాల కొనుగోలు కోసం రు. 75 కోట్లు కేటాయించాము. వైద్య కళాశాలల భవనాల నిర్మాణం కోసం రు. 100 కోట్లు 2007-08 బడ్జెట్‌లో కేటాయించాము. నిమ్స్ అభివృద్ధి కోసం 2007-08 బడ్జెట్‌లో రు. 20 కోట్లు కేటాయించాము. నిమ్స్‌లో అత్యాధునిక పరికరాల కొనుగోలు కోసం రు.12 కోట్ల 50 లక్షలు కేటాయించాము. బాలింత మరణాల నివారణకు రు. 20 కోట్లతో సుఖీభవ ఏర్పాటు చేస్తున్నాము. ప్రసూతి కేంద్రాలలో మెరుగైన సేవల కోసం రు. 65 కోట్లు కేటాయించాము. పేద పిల్లలకు గుండె ఆపరేషన్ ప్రక్రియ మన రాష్ట్రంలో మొదలుపెట్టాము. 2004 ఆగస్టులో యువకులను, చిన్నారి పిల్లలను చేర్చి ఒక ఒక సమావేశం ఏర్పాటు చేస్తే మంద కృష్ణ గారు, కిషన్‌రెడ్డి లాంటి వారు ముఖ్యమంత్రితో మాట్లాడారు. వారు యిమీడియేట్‌గా ' ఇది సామాజిక బాధ్యత. గత ప్రభుత్వాలు ఈ బాధ్యత స్వీకరించకపోయినా , ఏ రాష్ట్రంలో వుందో, లేదో అంటూ మనం మీన మేషాలు లెక్కించడం కాకుండా ఈ కార్యక్రమం చేపడదాము ' అనే వుద్దేశంతో , పెద్ద మనసుతో 12 సంవత్సరాలలోపు చిన్నారులకు హృద్రోగ పరీక్షలు చేయించి ఉచితంగా ఆపరేషన్స్, యింటర్‌వెన్షన్స్ చేయించడానికి వారు అంగీకరించారు.

( అధికార పార్టీ సభ్యుల నుండి హర్షధ్వానాలు )

2006-07 సంవత్సరంలో ఎంతమందికి ఆపరేషన్స్ చేశారనేది, 2007- 08 సంవత్సరంలో స్క్రీనింగ్ అయి ఎంతమంది వున్నారనే వివరాలు వేరే సందర్భంలో మనవి చేస్తాను. ఇది దేశంలో ఎక్కడా లేనటువంటిది. దీని నిమిత్తం 2007-08 బడ్జెట్‌లో రు. 25 కోట్లు కేటాయించాము.

ధరల నియంత్రణ విషయంలో ప్రజలు చాలా ఆందోళన పడుతున్నారు, ప్రభుత్వాలు ఆందోళనపడుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యలు కొంత సత్ఫలితాలను యిస్తున్నాయి.. మెరుగైన ఫలితాల సాధనకోసం యింకా ప్రయత్నం చేస్తాము. కేంద్ర ప్రభుత్వం ఈ దిశలోనే సీరియస్‌గా ఆలోచిస్తోందనే మాట తెలిసి ఆ మాట మీకు కన్వే చేయడానికి సంతోషపడుతున్నాను. ధరల పెరుగుదల నిజమే. ఈ ధరల పెరుగుదల దేశం మొత్తాన్ని బాధిస్తోంది. అన్ని రాష్ట్రాల్లో వున్నది ఎక్కడా ఎగ్జమ్షన్ లేకుండా. అందరూ బాధపడుతున్నారు కాబట్టి మనం బాధపడితే ఫరవాలేదని భావించే వారము కాదు. మనకున్న పరిధిలో రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ ద్వారా 7570 క్వింటాల్స్ ఉల్లిపాయ కొని రైతు బజార్ల ద్వారా కిలో రు. 6 కి అమ్మించాము. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా 22 వేల క్వింటాళ్ల ఉల్లిపాయలను నాశిక్ నుండి దిగుమతి చేసుకొని రైతు బజార్ల ద్వారా రు. 7 కి అమ్మించాము. మార్క్‌ఫెడ్ ద్వారా కిలో కందిపప్పు రెండో రకం, రు. 30 కి మొదటి రకం అమ్మించాము. అక్రమ ధాన్యాల నిల్వలపై దాడులు నిర్వహించి 32 వేల టన్నుల పప్పు ధాన్యాల నిల్వలను సీజ్ చేశాము. ఈ దాడుల వల్ల ధరలు తగ్గి పరిస్థితులు మెరుగుపడుతున్నట్లుగా జిల్లాల నుండి లెక్కలు అందుతున్నాయి. మరొక పది రోజుల్లో రబీ పంట మార్కెట్‌కు వస్తే పప్పు ధాన్యాల ధరలు సాధారణ స్థితికి వస్తాయని ఆశిస్తున్నాము. అందరం కలిసి ఆలోచన చేద్దాము. గిరిజన సహకార సమాఖ్య ద్వారా చింతపండు కిలోరు. 30 కి విక్రయిస్తున్నాము. ప్రభుత్వ సంప్రదింపుల వల్ల మిల్స్ సమాఖ్య ప్రత్యేక కౌంటర్ల ద్వారా పప్పు ధాన్యాలను మార్కెట్ రేటు కంటే కిలోకి రు. 2 నుండి రు. 5 దాకా తక్కువకు విక్రయించడానికి ముందుకు వచ్చారు. రైస్ మిల్లర్స్ రైతు బజార్లలో కిలో బియ్యం మార్కెట్ రేటు కంటే ఒక రూపాయి తక్కువకు విక్రయించడానికి ముందుకు వచ్చారు. ధరల నియంత్రణకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసి 102 కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు ధరల సమస్యను కలెక్టర్లకు చేరవేసి తగు నిల్వలు అందుబాటులో వుండే విధంగా చర్యలు చేపట్టాము. ప్రభుత్వ చర్యల వల్ల ధరలు పూర్తిగా కాకపోయినా కొంచెం మెరుగ్గా కనబడుతున్నాయి. అతి త్వరలో ధరలు సాధారణ స్థాయికి తీసుకురావడానికి సకల విధాలా ప్రయత్నిస్తామని మనవి చేస్తున్నాను. అధ్యక్షా, యిది స్థూలంగా మాకు వున్న మెషినరీ .

కొన్ని ప్రధాన హెడ్స్ క్రింద కేటాయింపులు ఏవిధంగా జరిగాయనే డిటెయిల్స్ లోకి పోవాలి. నేను కంపేరిటివ్ స్టేట్‌మెంట్ యివ్వడానికి ప్రయిత్నిస్తాను. స్కాలర్‌షిప్స్, స్టైఫండ్స్, యస్‌సి, యస్‌టి, బిసి, మైనారిటీస్‌కు 2001-02 సంవత్సరంలొ రు. 219 కోట్లు ఖర్చు చేశాము. 2002-03 సంవత్సరంలొ రు. 237 కోట్లు, 2003-04 సంవత్సరంలో రు. 256 కోట్లు , 2004-05 సంవత్సరంలొ రు. 263 కోట్లు, అంటే క్రమక్రమంగా కొద్ది కొద్దిగా పెరుగుతూ వచ్చింది. 2005-06 సంవత్సరంలో రు. 320 కోట్లకు పెరిగింది. 2007 బడ్జెట్ ఎస్టిమేట్స్ ప్రకారం రు. 348 కోట్లు. 2008 బడ్జెట్ ఎస్టిమేట్స్ ప్రకారం రు. 913 కోట్లు కేటాయించాము. 2001-02లో రు. 219 కోట్లతో ప్రారంభం అవుతే యిప్పుడు రు. 913 కోట్లు కేటాయించాము. ఇది సరిపోతుందని నూటికి నూరు మందికి యిస్తున్నామని అనడం లేదు. ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకొని క్రమక్రమంగా వీరికి చదువులకోసం స్కాలర్‌షిప్స్, స్టైఫండ్స్ యివ్వవలసిన అవసరాన్ని గుర్తించి చేస్తూ వున్నాము. అదే విధంగా పెన్షన్స్‌కు సంబంధించినంతవరకు 2000-01లో రు. 2377 కోట్ల 85 లక్షలు , 2001-02లో రు. రు. 2321 కోట్ల 10 లక్షలు, అంటే 2.39 శాతం తగ్గింది. 2002-03

సంవత్సరంలొ రు. 2363 కోట్ల 90 లక్షలు, అంటే అంతకుముందు సంవత్సరం కంటే 1.84 శాతం పెరిగింది. 2003-04 సంవత్సరంలో రు. 2500 కోట్ల 26 లక్షలు, అంటే అంతకుముందు సంవత్సరం కంటే 2.60 శాతం పెరిగింది. 2004-05 సంవత్సరంలో , పై మూడు సంవత్సరాలు మైనస్ 2.39, ప్లస్ 1.84, ప్లస్ 2.60 కాగా 2004-05 సంవత్సరంలో రు. 3016 కోట్ల 77 లక్షలు యివ్వడం ద్వారా 24.39 శాతం పెరిగింది. 2005-06లో రు. 3196 కోట్ల 96 లక్షలు, అంటే 4.97 శాతం పెరిగింది. 2006-07 సంవత్సరంలో రు. 3394 కోట్ల 3 లక్షలు కేటాయించాము. పర్సెంటేజ్‌లో 23.06 శాతం అంతకుముందు సంవత్సరం కంటే పెరిగింది. 2007-08 బడ్జెట్ అంచనాలలో రు. 4524 కోట్ల 13 లక్షలు కేటాయించాము అంటే It will be an addition of 15 crores.

అగ్రికల్చర్ అండ్ ఎలీడ్ సర్వీసెస్‌కి సంబంధించి 2001-02 సంవత్సరంలో రు. 795 కోట్లు, 2002-03 సంవత్సరంలో రు. 907 కోట్లు, 2003-04 సంవత్సరంలొ రు. 1242 కోట్లు, 2004-05 సంవత్సరంలో రు. 1764 కోట్లు, 2005-06 సంవత్సరంలో రు. 1327 కోట్లు, 2007 బడ్జెట్ ఎస్టిమేట్స్ ప్రకారం రు. 1785 కోట్లు, 2008 కిగాను రు. 2142 కోట్లు. దీని మీద చర్చ కూడా జరిగింది. ప్రొడక్షన్ తగ్గిందని అన్నారు. 1984-85 నుండి డేటా చదివి వినిపించమంటే వినిపించుతాను. ఒకటి మాత్రం పర్టినెంట్‌గా గుర్తు పెట్టుకోవలసిందిగా కోరుతున్నాను. 2000-01లో 160 లక్షల 27 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వుంది. అది టిడిపి హయాంలో రికార్డు. పైనుండి క్రిందివరకు చూస్తే ఒక్కొక్క సంవత్సరం కొంత పెరుగుదల వుంటుంది, ఒక్కొక్క సంవత్సరం తగ్గుతుంది. కొన్ని సంవత్సరాలు పెరుగుదల, కొన్ని సంవత్సరాలు తరుగుదల వుంది. అదేవిధంగా ఈసారి 2005-06లో 169 లక్షల 24 వేల మెట్రిక్ టన్స్ వున్నది. 2006-07 సంవత్సరంలో రబీ ఫిగర్ కరెక్ట్‌గా రాకపోయినా 159.99 లక్షల మెట్రిక్ టన్స్ వుంటుందని అంచనా.

( ఎన్ని లక్షల ఎకరాలకు నీరు యిచ్చారు అంటూ టిడిపి సభ్యుల నుండి కామెంట్స్ )

మ.1-30

మీలాంటి సమర్థత కలిగిన ఆదర్శ రైతు ఎకరాకు 35 బస్తాలు పండిస్తాడు. నాలాంటి చేతకానివాడు 12 బస్తాలు పండిస్తాడు. కానీ ఎన్ని ఎకరాలకు ఇస్తే ఏమవుతుంది. సంవత్సరం మొత్తంలో ఎంత పంట వచ్చిందో అడుగుతుంటే నీవు ఎన్ని ఎకరాలకు ఇచ్చావని అడుగుతున్నారు.

(తెలుగుదేశం గౌరవసభ్యులు శ్రీ ఇ.దయాకరరావునుంచి అంతరాయం)

దయాకరరావుగారూ, రాష్ట్రంలో వచ్చిన ఉత్పత్తి సంగతి చెప్పాను. దీనిలో ప్రొడక్షన్ ఒక్కటే కాకుండా యాక్టువల్‌గా ఈ ట్రెండ్ భారత ప్రభుత్వ స్థాయిలో కూడా చూడండి. మన రాష్ట్రంలో రబీతో కలుపుకోకుండా ఉంటే కొంచెం ఉత్పత్తి తగ్గినట్లు కనిపిస్తుంది. గత సంవత్సరం ఎన్ని జిల్లాలో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి? ఎన్ని జిల్లాల్లో అధిక వర్షపాతం వల్ల డెల్టా ప్రాంతంలో కూడా ఎన్ని లక్షల ఎకరాలు ముంపుకు గురైంది? ఎన్ని ఎకరాలు అధిక వర్షాల వల్ల, వరదల వల్ల దెబ్బతిన్నాయి. అయినా ఫర్వాలేదు కానీ దేశం మొత్తంమీద కుడా భారత ప్రభుత్వం వారి ఎకనామిక్ సర్వేలో చూడండి. దేశం మొత్తం మీద మన రాష్ట్రాన్ని మినహాయిస్తే మిగిలిన రాష్ట్రాల్లో కూడా కోటి టన్నుల ఉత్పత్తి పడిపోయినట్లుగా ఆర్థిక సర్వేలు తెలియపరుస్తున్నాయి.

అలాగే వీటిలో ఫైనల్ ఎస్టిమేట్స్ ఉంటాయి, క్విక్ ఎస్టిమేట్స్ ఉంటాయి. అడ్వాన్సు ఎస్టిమేట్స్ ఉంటాయి. అందువల్ల ఫిగర్‌లో కొంచెం ఎక్కువగా రావడం, తక్కువ రావచ్చు కొంచెం మార్జినల్‌గా, కానీ

ఎస్టిమేట్స్ మాత్రం ఇలా ఉన్నాయని వినయపూర్వకంగా తెలియజేస్తున్నాను. వ్యవసాయమే కాకుండా దాని అనుబంధ సబ్జెక్స్ కాకుండా వార్షిక ప్రణాళికలు చాలా ప్రధానమైనవి. ఏ రాష్ట్ర ప్రగతికి అయినా ప్రణాళికలే దోహదకారి.

2001/02లో ప్లాన్ ఔట్‌లే 7708 కోట్లు కానీ యాక్చువల్ ఎక్స్‌పెండిచర్ 6531 కోట్లు. 2001-02లో ప్లాన్ ఔట్‌లే 8378 కోట్లు అయితే ఖర్చు 8171 కోట్లు. 2002-03లో ప్లాన్ ఔట్‌లే 10100 కోట్లు అయితే ఖర్చు 8310 కోట్లు. 2003-04లో ప్లాన్ ఔట్‌లే 10970 కోట్లు అయితే ఖర్చు 10758 కోట్లు. 2004-05లో ప్లాన్ సైజ్ 12790 కోట్లు అయితే ఖర్చు 11456 కోట్లు. అలాగే 2005-06లో ప్లాన్ ఔట్‌లే 15650 కోట్లు అయితే ఖర్చు 13439 కోట్లు. 2006-07లో ప్రణాళికా సంఘం ఆమోదించిన బడ్జెట్ అంచనాలు 20 వేల కోట్ల రూపాయలు, కానీ వాస్తవ ఖర్చు ఇంకా రాలేదు. మార్చి నాటికి గానీ రాదు. 2007-08లో ప్రణాళికా అంచనాల పరిమాణం 30013 కోట్లుగా అంచనా వేశాం .

హౌసింగ్‌కు సంబంధించినంతవరకు మన రాష్ట్రంలో ప్రఖ్యాతి వహించిన ఘనమైన కార్యక్రమం . 2001-02లో దాని మీద రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చు నాలుగు వందల ఇరవై ఒక్క కోట్లు, 2002-03లో ఒక కోటి రూపాయలు పెంచి 422 కోట్ల రూపాయలు చేశారు. 2003-04లో 722 కోట్ల రూపాయలు. 2004-05లో 901 కోట్ల రూపాయలు. 2006-07లో అంచనాలు 1824 కోట్ల రూపాయలు. 2007-08లో మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 5445 కోట్లు కేటాయించడం బడ్జెట్‌లో మీరు చూరు. అలాగే నీటిపారుదలశాఖకు సంబంధించిన సంవత్సరంవారీగా ప్రణాళికలు తీసుకొందాం . 2001-02లో నీటిపారుదల రంగంమీద ఖర్చు 603 కోట్లు, 2001-02లో 574 కోట్లు, 2002-03లో 669 కోట్లు, 2003-04లో 1747 కోట్లు, 2004-05లో దీనిని రెట్టింపు చేసి 3456 కోట్లు, 2005-06లో 6690 కోట్లు, 2006-07లో సవరించిన అంశాల ప్రకారం బడ్జెట్‌లో 10042 కోట్లు, 2007-08లో బడ్జెట్ అంచనాలు 13014 కోట్లు.

అలాగే విద్యకు సంబంధించిన ప్రాధాన్యత ప్రాథమిక విద్యతో ప్రారంభమవుతుంది. 2001-02లో 2025 కోట్లు, 2002-03లో 2304 కోట్లు, 2003-04లో 2931 కోట్లు, 2004-05లో 3195 కోట్లు, 2005-06లో 3441 కోట్లు, 2006-07 సవరించిన అంచనాల ప్రకారం 5294 కోట్లు, 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం 5743 కోట్లు.

అలాగే ప్రాథమిక విద్య తరువాత వైద్య, ఆరోగ్య రంగం చాలా ప్రధానమైనది. 2001-02లో 781 కోట్లు, 2002-03లో 837 కోట్లు, 2003-04లో 926 కోట్లు, 2004-05లో 901 కోట్లు, 2005-06లో 973 కోట్లు, 2006-07లో సవరించిన అంచనాల ప్రకారం 1266 కోట్లు, 2007-08లో బడ్జెట్ అంచనాలు 1536 కోట్లు.

Rural Development is another important aspect for the State of Andhra Pradesh. 2001-02లో 2307 కోట్లు, 2001-02లో 2767 కోట్లు, 2002-03లో 2799 కోట్లు........

శ్రీ టి.దేవేందర్ గౌడ్ః అధ్యక్షా, ఎకనామిక్ సర్వేలో అవన్నీ ఉన్నాయి సార్.

శ్రీ కె.రోశయ్య: దేవేందర్‌గౌడ్‌గారూ, అవన్నీ అక్కరలేదంటారా. నేనెందుకు చెబుతున్నానంటే ఉన్నటువంటి వాటినే మీరు ఆధారం చేసుకొని చెప్పారు. నేను కూడా ఉన్న వాటిని బేస్ చేసుకొని చెబుతున్నాను. లేనివి చెప్పడంలేదు. ఎకనామిక్ సర్వేలో ఉన్నా కూడా మీరు చాలా స్ట్రెస్ చేసి చెప్పారు. నేను కేవలం మీరు ప్రస్తావించినటువంటి విషయాలకు జవాబు చెప్పవలసి వస్తే బహుశా సభ్యులు ప్రస్తావించిన విషయాలు కూడా కొన్ని అయినా ప్రధానంగా చెప్పవలలసిన అవసరముందని నేను అనుకొన్నాను.

సాధారణంగా బడ్జెట్ మీద సాధారణ చర్చ జరిగేటప్పుడు చాలా విషయాలు చెబుతారు. వాటిలో అన్నీ కాకపోయినా కొన్నింటికైనా జవాబు చెప్పడానికి ప్రయత్నం చేస్తాను. మరి కొన్ని ఇష్యూస్ ఏమైనా ఉంటే సభ ముందు డిమాండ్స్ మూవ్ చేసినప్పుడు మాట్లాడడానికి కానీ లేక ఏమైనా రాసి పంపించవలసి ఉంటే దానికి కూడా ప్రయత్నం చేస్తాను.

మిత్రులు దేవేందర్‌గౌడ్‌గారు మాట్లాడుతూ production came down due to non-distributing seeds in time in nearly 10 lack acres అన్నారు. 2005 ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం 80.5 లక్షల హెక్టార్లు కాగా 2006 ఖరీఫ్‌లో విస్తీర్ణం 73.52 లక్షల ఎకరాలకు తగ్గింది. ఇందుకు కారణం కొన్ని ప్రాంతాల్లో వరదలు, కొన్ని ప్రాంతాల్లో కరవు వల్ల ఆ పరిస్థితి వచ్చింది. అంతేగానీ ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేయక కాదు. ఈ సంవత్సరం 103 కోట్ల రూపాయల సబ్సిడీతో 11 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశాం. అలాగే 2001నుంచి 2006-07 వరకు బాగా తగ్గిందని సుమారు 5.2 లక్షలు తగ్గిందన్నారు. తగ్గింది అనడం వాస్తవం కాదు. 2005-06లో రికార్డు స్థాయిలో 169 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి సాధించాం . 2006-07లో ముందస్తు అంచనాల ప్రకారం అంటే రబీతో ఇప్పుడు వేసిన క్విక్ ఎస్టిమేట్స్ ప్రకారం లెక్క వేసుకొంటే ఉత్పత్తి 180 లక్షల మెట్రిక్ టన్నులు. 2001-02లో 160 లక్షల మెట్రిక్ టన్నులు అన్నా దాదాపు పన్నెండు శాతం ఎక్కువ.
మ. 1.40

ఇరిగేషన్‌కు సంబంధించి అలీసాగర్ ప్రాజెక్టు అంచనా వ్యయం 261 కోట్ల రూపాయలు కాగా ఇప్పటివరకూ 211 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాము. గుత్పా ప్రాజెక్టు అంచనా వ్యయం 204 కోట్ల రూపాయలు కాగా ఇప్పటివరకూ 138 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాము. అతి త్వరలో ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. అలాగే బాబ్లి ప్రాజెక్టును అడ్డుకోడానికి అన్ని ప్రయత్నాలు చేసాము. అందరికీ తెలుసు, రాష్ట్రప్రభుత్వం అనేక విధాలుగా కేంద్రప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడం ద్వారా, కోర్టుల ద్వారా అన్ని ప్రయత్నాలు చేస్తున్నాము. మన ప్రయత్నంలో లోపం లేదు. అడ్డుకోడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు పనులను ఆపు చేయించాము. సుప్రీంకోర్టులో కేసు ఫైల్ చేయించాము. అధ్యక్షా, ప్రాణహిత చేవెళ్ల గురించి నేను ఇందాకే చెప్పాను. ఏ.ఐ.బి.పి గత ప్రభుత్వ హయాంలో 2001 నుండి 2003 - 2004 వరకు ఒక రూపాయి గ్రాంటు కూడా రాష్ట్రానికి లభించలేదు. మేము అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలలో 730 కోట్ల రూపాయల గ్రాంటు కేంద్రప్రభుత్వం నుండి తెచ్చాము. వారేమి అలక్ష్యం చేశారని నా ఆరోపణ కాదు. ఆనాడు ప్రాజెక్టు రిపోర్టులు తయారుచెయ్యడంలో కాని, కావలసిన క్లియరెన్సులు లేకపోవడం, సక్రమంగా వాటిని ప్రెజెంట్ చెయ్యడంలో సాధ్యం కాలేదేమో! ఏ కారణమైనా అప్పట్లో ఇది రాలేదు. మేము వచ్చిన తరువాత we were able to get an assistance of Rs.737 crores. ఇంకా ఎక్కువ తేవడానికి ప్రయత్నం చేసాము. సాధ్యం కాలేదు.

సార్, సమయానికి ఖచ్చితంగా రుణాలు చెల్లించే సంఘాలన్నిటికీ పావలా వడ్డీకి రుణాలు ఇస్తున్నాము. ఈ సంవత్సరం ఇప్పటివరకూ 2204 కోట్ల రూపాయల రుణాన్ని స్వయం సహాయక సంఘాలు పొందాయి. 2003-04 సంవత్సరానికి ఇచ్చిన 753 కోట్ల రూపాయలకు దాదాపు మూడు రెట్లకు పైగా ఇచ్చాము. అక్రమంగా మద్యం వస్తుంటే అరికట్టి మనం ఆదాయం పెంచుకుంటున్నామని నేను ఇందాకే చెప్పాను. షాప్స్ పెంచారని అన్నారు, ఒక్కటి కూడా పెంచలేదు.

(తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రీ పి. కేశవ్ చే అంతరాయం)

నా దగ్గర ఉన్న సమాచారం చెబుతానని నేను ముందే చెప్పాను కదా కేశవ్ గారు! ఇంకా ఏదైనా ఉంటే రాసి పంపిస్తాను. లేదా డిమాండ్స్ పైన డిస్కషన్ వచ్చినప్పుడు ఇంకా ఎక్కువ మాట్లాడడానికి వీలు ఉంటుంది.

అధ్యక్షా, హ్యాండ్‌లూమ్ వీవర్స్‌కి సంబంధించి నేను ఇప్పుడే చెప్పాను. సూసైడ్ చేసుకున్నట్లుగా సరైన రుజువులు, ఆధారాలు ఉన్నప్పుడు లక్షా యాభై వేల రూపాయలు ఇవ్వగలుగుతున్నాము. ఏ పత్రికలోనైనా సూసైడ్ అని వస్తే, దానిని యాజిటీజ్‌గా, గవర్నమెంట్‌లో మీరందరూ ఉన్న రోజులలో కాని, ఇవ్వాళ గాని రేపు గాని, ఎవరైనా, ఏ రాష్ట్రంలోనైనా ఏదైనా ఇచ్చేటప్పుడు దానికి కావలసిన పక్కా డాక్యుమెంటరీ ఎవిడెన్స్ లేకుండా ఇస్తే, డబ్బును స్క్వాండర్ చేస్తున్నారనో, మిస్‌యూజ్ చేస్తున్నారనో, బంధువులకిస్తున్నారనే తప్పుడు ఆరోపణలు వస్తాయి. గీత కార్మికుల బీమా సౌకర్యం కోసం ఒక కోటి డెబ్బై లక్షల రూపాయలు కేటాయించాము. సంక్షేమ రంగానికి ఎప్పుడూ లేని విధంగా 4057 కోట్ల రూపాయలు 2007-08 బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. ధరల నియంత్రణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి 102 కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు ధరల సమాచారాన్ని కలెక్టర్లకు చేర వేసే విధంగా, తగినంత నిల్వలు ఉండేలా ఏర్పాటు చేస్తున్నాము. హౌసింగ్ గురించి చెప్పాను.

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే అంతరాయం)

ఓ.కె ఇవి అక్కరలేదు, కావలసింది మాట్లాడమంటే మాట్లాడుతాను. మీరు అడిగిన దానికి చెబుతుంటే, చెప్పిందే చెబుతున్నారని అంటున్నారు. మీకు కావలసింది చెబుతుంటే, ఇది అక్కరలేదని అంటున్నారు. ఎట్లా అండి?

నేను సాధ్యమైనంతవరకూ సరైన సమాచారం చెప్పి తృప్తి పరచడానికి నాకు చేతనైనంత ప్రయత్నం చేస్తున్నాను. వారికి కొన్ని మాటలు ఇంకా చెప్పలేదు కాబట్టి చెబుతున్నాను. వ్యాట్ ఎట్లా వచ్చింది, చట్టం ఎవరు చేశారు అన్నీ చెప్పాను. కలెక్షన్స్ బాగా పెంచి, ఆదాయాన్ని పెంచుకుంటున్నాము. ఎవరో మిత్రులు మాట్లాడుతూ ఏ జిల్లాకు ఎంత నీళ్లు ఇస్తారో తేల్చి చెప్పండి అని అన్నారు. నాకు తెలియదు. తెలిస్తే I will stand correct. జిల్లాకు ఇన్ని నీళ్లని క్వాంటిఫై చేసి ఇచ్చే జల విధానం ఎక్కడైనా ఉంటుందా? నాకు తెలియదు. Yet to know. ఎవరైనా నిపుణులైన మిత్రులు చెబితే ....

(తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రీ పి. కేశవ్ చే అంతరాయం)

కేశవ్ గారు మీరు మాట్లాడలేదు. నేను మిమ్మల్ని కోట్ చెయ్యలేదు. ఎవరో మిత్రులు అన్నారు అని అన్నాను. నువ్వు ఎందుకు ఉలిక్కి పడతావు? అక్కరలేదు.

విద్యను ప్రైవేటీకరిస్తున్నారని ఇప్పుడే నరేంద్రకుమార్ గారు అన్నారు. వారు మాట్లాడడం సముచితమేనా? వారి విధానం ఏమిటి? ఒకప్పుడు కొన్ని మెడికల్ కళాశాలలు, నాలుగు ఇంజనీరింగ్ కళాశాలలు ఇస్తే విద్యను బజారులో అమ్ముతున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్ని ఇంజనీరింగ్ కళాశాలలు ఇచ్చారు. సబ్జెక్ట్ టు కరెక్షన్ 218 లేక 220 ఉన్నాయి. వాటిల్లో ఎన్ని పనిచేస్తున్నాయి. పిల్లల అడ్మిషన్స్ లేకుండా ఎన్ని ఇంజనీరింగ్ కళాశాలలు మూత పడి గోడౌన్స్ క్రింద ఉపాయెగించుకుంటున్నారు. ఎన్ని మెడికల్ కళాశాలలిచ్చారు? ఇక్కడ కూర్చున్నప్పుడు ఒక మాట మాట్లాడి సిద్ధాంతం ఇచ్చారు. అక్కడకు వెళ్లిన తరువాత కంప్లీట్‌గా మారిపోయి ఒక నాడు వ్యతిరేకించడం జరిగింది. పైపెచ్చు చంద్రబాబు నాయుడు గారు అంటే నాకు ఆశ్చర్యం కలిగింది. ప్రతిపక్ష నాయకులు కాబట్టి ఇమ్మీడియేట్‌గా జవాబు చెబితే బాగుండదని చెప్పలేదు. ఆయన ఏమన్నారంటే, నిజమే, అప్పుడు కాదని అన్నా, ఇప్పుడు ధైర్యం ఉంది అన్నారు. ఇదెక్కడి ధైర్యం సార్?

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే అంతరాయం)

ధైర్యం కాదు సాహసం ఉంది అని అన్నారు. చంద్రబాబు నాయుడు గారికి, మీ పార్టీకి ఉన్న సాహసాలు చాలా ఉన్నాయి. వాటి జోలికి వెళ్తే మళ్లీ లేనిపోని కొత్త వివాదాలు వస్తాయి. అవి తీసుకురాదలచుకోలేదు. వాళ్లు సాహసంతో చేసే పనులు చాలా ఉన్నాయి. ఒకటేమిటంటే, ఎన్.టి. రామారావు గారు తెలుగుదేశం పార్టీ స్థాపకుడు. అవును కదా! వారి నాయకత్వాన గెలిచి వారిని ఏమి చేశారు? కాంగ్రెస్ పార్టీ లో ముఖ్యమంత్రులు మారలేదని నేను అనడం లేదు.

(తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రీ ఇ. దయాకర్ రావుచే అంతరాయం)

దయాకర్ రావు గారు! మీరు మాట్లాడినటువంటి మాటకు నేను చెప్పాను. నిన్ననే రియాక్ట్ అయి ఉంటే బాగుండదు, పెద్ద మనిషి గౌరవించాలనే ఉద్దేశ్యంతో నేను మాట్లాడలేదు. ఇప్పుడు కూడా అవి ఎత్తుబాకండి.

(తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రీ ఇ. దయాకర్ రావుచే అంతరాయం)

దయాకర్ రావు గారు, ఇది మర్యాద కాదు. మీ పార్టీ నుండి మాట్లాడినప్పుడు నేను విన్నాను. నేను మాట్లాడేటప్పుడు మీరు వినాలి. సంపూర్ణమైన వాస్తవాలు తప్ప అవాస్తవాలు నేను చెప్పడం లేదు.

కాంగ్రెస్ పార్టీలో చీలిక వచ్చినప్పుడు, నేను కొంత కాలం కాంగ్రెస్‌లో ఉండి తరువాత ఈ దేశమంతా ఇందిరాగాంధి మాత్రమే నాయకురాలు ఆవిడ అధ్యక్షతన ఉన్న పార్టీయే కాంగ్రెస్ పార్టీ అని అంటే నేను మారాను. ఎన్.టి.రామారావు గారి లాంటి పెద్ద మనిషిని కుదేసి, కింద పడేసేటట్లు చేశారు. ఈ రెండిటికి సంబంధం ఏమిటి?

(అంతరాయం)

I am not yielding. You said some thing. You demanded me to reply. అవన్నీ ఎందుకు, చెప్పిందే ఎందుకు అనంటే ....

(అంతరాయం)

దేవేందర్ గౌడ్ గారు నన్ను సరైనటువంటి పెద్ద గుమస్తా అని అన్నారు. నాకేమి తప్పుగా అనిపించడం లేదు. నన్ను గుమాస్తా అంటే నేనేమి చిన్నబుచ్చుకోలేదు.

(అంతరాయం)

కేశవ్ ! నువ్వు అప్పుడు ఇంకా నిక్కర్లు వేసుకొని ఉన్నావు. నీకు తెలియదు. దేవేందర్ గౌడ్ గారు పెద్ద గుమాస్తాగా పనిచేస్తున్నావని ఒక మాట అన్నారు. నేను గుమాస్తాగా ఉన్నా అది నామోషీగా ఫీల్ అవడం లేదు. నిజాయితీగా ఉండి ఎవరు ముఖ్యమంత్రిగా ఉంటే వారికి సరైన సలహాలిస్తూ, వారిచ్చిన గైడెన్స్‌లో నడవడానికి అలవాటు పడ్డాను. నా గుమాస్తాగిరిని ముఖ్యమంత్రులు మారినా నన్ను కంటిన్యూ చేస్తున్నారు. ఎవరిని గుమాస్తాగా పెట్టుకున్నా వాడి క్యారెక్టర్ చూసి పెట్టుకుంటారు. ఊరికే లెక్కలు రాయడం కాదు. తాళాలు ఇచ్చేటప్పుడు, కొంప ముంచుతాడనుకుంటే ఏ ప్రభుత్వమైనా వాడిని పెట్టుకుంటుందా అండి? నేను నిజాయితీతో పనిచేసాను కాబట్టి ఇంత మంది ముఖ్యమంత్రులు దగ్గర పనిచేసే సావకాశం కలిగింది. దయాకర్ రావు గారు ఏదో మాట్లాడుతున్నారు.

మ 1.50

సర్ నేను పార్టీ మారితే నేను పార్టీ మారానా లేదా అని చెప్పమని అడుగుతున్నారు. కానీ పార్టీ మార డం వేరు. స్థాపించిన పార్టీ నాయకుడిని దగా చేయడం వేరు.

(అంతరాయం)

సర్ నేను దేవేందర్ గౌడ్ గారికి చెబుతున్నా. దేవేందర్ గౌడ్ గారూ మీరు కూడా ఆనాడు జరిగిన కుట్రలో భాగ స్వామే. కనుక మిమ్ములను ఎవరైనా గుమస్తాగా పెట్టుకోవాలంటే ఆలోచించాలి. నాది ఏముంది? నా గురించి ఎవరూ ఆలోచించనక్కర్లేదు.

(అంతరాయం)

శ్రీ ఇ. దయాకర రావు:- స్పీకర్ సార్. మాకు మైకు ఇవ్వాలి సార్.

శ్రీ కె. రోశయ్య:- మీరు 2.30, 3.30 గంటలు మాట్లాడారు. నేను 1.30 గంటలు కూడా మాట్లాడ లేదు. మీకు మైకు ఇవ్వడం ఏమిటి?

(అంతరాయం)

`ఎస్. స్పీకర్ గారి అనుమతితో చర్చకు సమాధానం చెబుతున్నాను.

మిస్టర్ స్పీకర్:- కూర్చోండి. Let him complete.

శ్రీ కె. రోశయ్య:- మీరు ఒక మాట చెప్పండి. ఇవన్నీ వద్దండీ ---

(అంతరాయం)

దేవేందర్ గౌడ్ గారు ఒక మాట చెప్పారు. ఫిగర్స్ వద్దండీ అంటే ఆపాను. వారు చెప్పిన ప్రసంగంలో కొన్ని మాటలకు జవాబు చెబుతుంటే అవన్నీ అయిపోయినాయి లెండి. వద్దులెండి అన్నారు. ఓ.కె అన్నాను. నేను ఏమీ అనలేదే. Out of respect మీరు చెప్పిన మాట వింటున్నాను. ఇప్పుడు కూడా మేము మాట్లాడింది మేము మాట్లాడాము. వాటికి జవాబు చెప్పవద్దు అంటే మాత్రం మానివేస్తాను. నాకు ఏమీ అభ్యంతరం లేదు.

(అంతరాయం)

శ్రీ పి. కేశవ్:- మాకు క్లారిఫికేషన్‌కు అవకాశం ఇవ్వండి.

శ్రీ కె. రోశయ్య:- ఏ గవర్నమెంట్ అయినా అభివృద్ధిని కాంక్షిస్తు కార్యక్రమాలు చేపడుతుంది.

MR. SPEAKER:-ఆ మ్యాటర్ అక్కడికి వదిలేయండి. No more

శ్రీ కె. రోశయ్య:- మా ప్రభుత్వం ప్రాక్టికల్‌గా గ్రౌండ్ రియాలిటీస్ చూసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లడానికి పది కాలాలపాటు ఈ రాష్ట్రంలో మంచి పనులు చేసి ప్రజలకు పదిమందికి ఉపయుక్తంగా ఉండేలా వ్యవహరించడానికి వచ్చిన ప్రభుత్వం. సార్ నేను ప్రతి మాట మాట్లాడితే మళ్లీ ఇలాగే లెగుస్తారు.

(అంతరాయం)

కేశవరావు గారూ మీరు విజన్ 2020 డాక్యుమెంట్ తయారు చేశారు. ఆనాడు అది ప్రాక్టికల్ ఔనా కాదా అని మీరు ఆలోచించారా? ఒక మోడెస్ట్ ఎస్టిమేట్ ప్రకారంగా వారి లక్ష్యం 20 సంవత్సరాల కాలంలో రు.37 లక్షల కోట్లు కాన్‌స్టంట్ ప్రైస్ మీద ఖర్చు పెట్టాలి. ధరల పెరుగుదలను తీసుకుంటే రు.74 లక్షల కోట్లు కావాలి. ఎక్కడ నుంచి వస్తుందని మేము ఎవరమైనా అడిగితే ఒకటే జవాబు చెప్పారు. Wher there is a will – thers is a way అని. మమ్ములను ఇప్పుడు ఏమంటున్నారు – Most practical గా బడ్జెట్ తయారు చేస్తే డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి అంటున్నారు. తరువాత చాలా చెప్పారు. ప్రాజెక్టులకు మేము అడ్డం రావడం లేదు. ప్రాజెక్టుల పేరుతో జరిగే అవినీతికి అడ్డం వస్తున్నాము అంటున్నారు. అవినీతిని అరికట్టేదానికి మీరు ప్రయత్నం చేస్తే అభినందిస్తాము. తప్పు లేదు. కానీ సుప్రీం కోర్టు వరకు వెళ్లింది అవినీతిని అరికట్టడానికా? పనులు మొదలు పెట్టారా? ఎందుకు వెళ్లారు? ఎవరు వెనుక ఉండి నడిపించారు? పబ్లిక్ లిటిగేషన్ ఇంటరెస్టుతో సుప్రీం కోర్టుకు వెళితే ఏమి తీర్పు చెప్పింది?

(అంతరాయం)

కేశవ్ గారూ. నీవు ఎందుకు భుజాలు తడుముకుంటావు? నేను చెప్పానా టిడిపి పంపించింది అని. నేను అనలేదు కదాయ్యా? ఎవరు పంపించారో లోకానికి అంతా తెలుసు. నా నోటిమీదుగా నేను ఏమీ రిపీట్ చేయనక్కర్లేదు. కనుక మేము ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదు అంటూనే ప్రాజెక్టులను స్టాప్ చేయడానికి ఎన్ని రకాలైన ప్రయత్నాలు జరిగాయి అధ్యక్షా.. But still ఈ ప్రభుత్వం కమిటెడ్‌గా పని చేయాలనుకున్నాం. వచ్చే అడ్డంకులు సహజం. ఈ అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు వెళదాము. ఈ రాష్ట్రంలో ఉత్తమోత్తమమైన నీటిపారుదల రంగాన్ని దేశంలో ఎక్కడా ఏ రాష్ట్రంలో చేపట్టని తరహాలో అనేకమైన భారీ ప్రాజెక్టులు చేపట్టి మధ్య తరహా ప్రాజెక్టులు తలపెట్టి అన్ని ప్రాంతాలలో మరీ వెనుకబడిన తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో కానీ

నీటి   కొరత ఉన్న ప్రాంతాలలో ప్రాధాన్యత ఇచ్చి ప్రాజెక్టులు టేకప్ చేయాలని అనుకున్నాము. దీనికి నిధుల కొరత కష్టం అవుతుంది అన్నా, లేదా అవరోధాలు వస్తాయి అన్నా ఇతర రాష్ట్రాలతో నీటి తగాదాలు వస్తాయి అన్నా – సార్ ఇందాక ఎవరో చెప్పారు. రాజశేఖర రెడ్డి గారు వచ్చిన తరువాత నీళ్ల కోసం కొట్లాట ఉందీ అన్నారు. బహుశా నరేంద్రకు తెలియదేమో. చాలా రోజుల నుంచీ ఉన్నాయి. రాజశేఖర రెడ్డి గారు వచ్చిన మూడు సంవత్సరాలలో కాదు. అంతకు ముందు గ్రామానికి గ్రామానికి ఉన్నాయి. సర్ ఒకప్పుడు రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య నీళ్ల తగాతా ఉంది. రాను రాను జిల్లాకు జిల్లాకు మధ్య వచ్చింది. ఇంకా మీ భిక్ష వల్ల గ్రామానికి గ్రామానికి వచ్చింది. బంధువుల మధ్య ఒకరినొకరు పలుగుపట్టుకుని పొడుచుకున్న సందర్భాలు ఉన్నాయి. ఎవరి కాలంలో జరిగింది?

శ్రీ కె. అచ్చన్నాయుడు:– మీ కాలంలోనే జరిగింది.

శ్రీ కె. రోశయ్య:– అచ్చన్నాయుడు గారూ అన్ని పాపాలు వదిలేసి మా ఖాతా లోనే రాస్తా ము అంటే ఎట్లా? వాస్తవాలను అంగీకరించడం నేర్చుకోండి. నీటి తగాదాలు మీరు పెట్టారు అనడం లేదు. వస్తున్నాయి. కొరత వస్తుంది. ఎప్పుడైనా సరే నీటికి రాబోయే రోజులలో నిపుణులు ఏమి చెబుతున్నారు అధ్యక్షా దేశ దేశాల మధ్య తగాదాలు వస్తాయి అంటున్నారు. రాబోయే యుద్ధాలు నీటికోసం వస్తాయి అంటున్నారు. వీటిని అన్ని టినీ దృష్టిలో పెట్టుకుని మనం కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్ర ఇలాంటి జీవనదులలో ఉన్నటువంటి నీటిని ప్రతి ఒక్క చుక్కను సద్వినియోగం చేసుకుందాం అన్న భావనతో దానికి ఎవరు ఎన్ని మాట్లాడినా ఎవరు ఎన్ని అడ్డంకులు కలిగించినా ---

(అంతరాయం)

ఎవరు ఎన్ని మాట్లాడినా ఆ రంగంలో కట్టుదిట్టమైన ఏర్పాటు చేసుకుంటూ ఎక్కడైనా అవినీతి చేస్తుంటే అరికట్టే దానికి ప్రయత్నం చేస్తూన్నాము. సర్. ఎక్కడైనా మీరు విన్నారా ఈ దేశంలో. ప్రతి ప్రాజెక్టు దగ్గర అవినీతి అని అంటే ఆ ప్రాజెక్టు సైట్‌కు వెళ్లి ఆల్ పార్టీస్ వారిని పిలిచి, నిపుణులను పిలిచి 41చోట్ల ప్రాజెక్టుల సైట్లలో డిస్కషన్ ఓపెన్‌గా పెట్టిన ఉదంతం ఎక్కడన్నా విన్నారా? ఏ రాష్ట్రంలో అయినా చేశారా? మీరు పరిపాలనలో ఉన్నటు వంటి 10, 15 సంవత్సరాలలో ఎప్పుడైనా ఒక్క దాని మీద విచ్చారణ కావాలంటే అంగీకరించిన పాపాన పోయారా?

(అంతరాయం)

శ్రీ ఇ. దయాకర రావు:– ఫైల్స్ పెట్టలేదు.

శ్రీ కె. రోశయ్య:– ఏదన్నా అంటే అప్పుడు జరిగిన దానికి ఇప్పుడు ఎందుకు అంటారు? కనుక మీకు కొన్ని లోపాలు ఉన్నాయి కాబట్టి మీకు ఆ సాహసం లేదు. లోపరహితంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతు న్నాము కాబట్టి, చేస్తున్నాము కాబట్టి ముందుకు వెళుతున్నాము కాబట్టి మాకు ఆ ధైర్యం ఉంది అనే మాట మనవి చేస్తున్నాను.

శ్రీ ఇ. దయాకర రావు:– ఫైల్స్ బయట పెట్టండి. మీ భాగవతం బయటకు వస్తుంది. ఎల్లంపల్లి ఫైల్ బయట పెట్టండి. మీ అవినీతి చూపిస్తాము.

(అంతరాయం)

శ్రీ కె. రోశయ్య:- మీరు భాగవతాలు బయట పెట్టారు. కొన్ని డాక్యుమెంట్స్ తీసుకువచ్చి పెట్టి చివ రకు కావాలని స్ట్రాటజిక్‌గా తప్పుడు అంకెలతో పెట్టాము నిజం బయటకు వస్తుందని అన్నారు. ఈ కబుర్లన్నీ ఎందుకు? దయాకర రావు గారు మీకు ఇచ్చే గౌరవం నిలుపుకోండి.

శ్రీ ఇ. దయాకర రావు:- మా మీద బురద చల్లే ప్రయత్నం చేయకండి. మీరు చేసేవి అన్నీ మా పైన చెప్పకండి.

మిస్టర్ స్పీకర్:- ఎస్. పూర్తికానివ్వండి.

(అంతరాయం)

శ్రీ కె.రోశయ్య:- సార్. సభలో ఒక్క తెలుగు దేశం పార్టీ మాత్రమే కాదు. దయచేసి గుర్తుపెట్టుకోవాలి.

మిస్టర్ స్పీకర్:- దయాకర రావుగారు. Let him complete now. వారిని కంప్లీట్ చేయనివ్వండి. మీరు కూర్చోండి.

శ్రీ ఇ. దయాకర రావు:- దయచేసి మాకు మైకు ఇవ్వండి సార్.

శ్రీ కె. రోశయ్య:- వారికి మైకు ఇచ్చే సమయం కాదు స్పీకర్ గారూ, నాకు మైకు ఇచ్చారు. నన్ను మాట్లాడమన్నారు. నన్ను జవాబు చెప్పమన్నారు. జవాబు చెప్పే రైట్ నాకు ఉంది. నా రైట్ ప్రకారం నేను మాట్లాడుతున్నాను. మీకు అవకాశం వచ్చినప్పుడు మీరు మాట్లాడండి.

శ్రీ ఇ. దయాకర రావు:- మీరు మా మీద ఆరోపణలు చేసినప్పుడు మేము చెప్పక్కర్లేదా?

శ్రీ కె.రోశయ్య:- మీరు ఆరోపణలు చేస్తే ప్రత్యారోపణలు చేయకుండా ఆపళంగా చేతులు ముడుచు కుని కూర్చుంటాము అనుకున్నారా? మా మీద బురద చల్లితే ఆ బురద కడుక్కోనవసరం లేదా? నేనేమీ చేయడం లేదే.. మీరు మాట్లాడితే మాట్లాడాలి.

MR. SPEAKER: Dayakar Rao garu – you please sitdown first.

మ.2.00

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుండి తీవ్ర అంతరాయం)

అధ్యక్షా, మాట్లాడిన గౌ.శాసనసభ్యులు, మిత్రులకు కొంత స్థూలంగా జవాబు చెప్పడానికి ప్రయత్నం చేద్దామని నేను రిపోర్టు కూడా తెచ్చాను. కాని జవాబు చెప్పడానికి అవకాశం లేకుండా చేస్తున్నారు. బహుశా ఇప్పటికే రెండు అయిపోయింది. కాబట్టి మిత్రులు నరేంద్ర కుమార్ కానివ్వండి, రామనారాయణరెడ్డి కానివ్వండి, అక్బర్ కానివ్వండి ఎవరయితే మాట్లాడారో, వాటన్నింటికి నా దగ్గర సమాధానాలు ఉన్నాయి. తమరు అనుమతి ఇస్తే, వాటిని వారికి పంపిస్తాను....

మిస్టర్ స్పీకర్ : ఎస్.

శ్రీ కె.రోశయ్య : అధ్యక్షా, ఇంకా వారికి ఏదైనా స్పెసిఫిక్‌గా సమాచారం కావాలంటే, ఈ రోజే డిమాండ్స్ ప్రవేశపెట్టబోతున్నాము. అందులో వారు మాట్లాడవచ్చు. ఇప్పటికే రెండు గంటలయింది కాబట్టి ఇంకా ఎక్కువ టైమ్ తీసుకోను. మాట్లాడిన ప్రతి వారికి జవాబు చెప్పడానికి ప్రయత్నిస్తుంటే వారికి కోపం వచ్చేటట్లుగా ఉంది. కాబట్టి నా ఈ ప్రసంగాన్ని ఇంతటితో ఆపి, ఈ బడ్జెట్‌ను సభ ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

(అధికార పక్ష సభ్యులు బల్లలు చరిచారు)

మిస్టర్ స్పీకర్ : దాదాపుగా ఆరు రోజుల నుండి బడ్జెట్ మీద చర్చ జరిగింది. ఆ చర్చ సందర్భంగా మీ మీ అభిప్రాయాలు తెలిపారు. అదే విధంగా కొన్ని అభ్యంతరాలు తెలిపారు. మీ మీ ఆలోచనలు చెప్పారు. అంతేకాకుండా రాజకీయ సంబంధమైన ఇష్యూస్‌ను కూడా మీరు లేవనెత్తారు. దానికి ఆర్థిక మంత్రిగారు రిప్లయ్ ఇచ్చారు. అయితే వారు చెప్పినట్లుగా to the maximum extent possible I have replied to all the questions అన్నారు. అంతేకాకుండా, ఇంకా సమాచారం కావాలంటే, మాట్లాడిన వారికి వ్రాసి పంపుతామని చెప్పారు. అయితే అటు సైడ్, ఇటు సైడ్ విమర్శలు చేసుకోవడం జరిగింది. My only request is that you may seek clarifications.

(అంతరాయం)

చర్చ పొలిటికల్‌గా జరిగింది. దాన్ని నేను కాదనడం లేదు. అయితే scores are settled. Let us leave it there. You only seek clarifications on the main Budget. వివరంగా ఇవ్వాలంటే, మినిస్టర్‌గారు చెప్పినట్లుగా డిమాండ్స్ స్టార్ట్ అవబోతున్నాయి ఈ రోజు నుండి. ఆ సందర్భంగా మీకు ఫర్దర్‌గా ఇన్‌ఫర్మేషన్ కావాలంటే, తెలుసుకోవడానికి స్కోప్స్ ఉన్నాయి.

శ్రీ టి. దేవేందర్ గౌడ్ : స్పీకర్‌గారూ, రోశయ్యగారు బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత, ఆ బడ్జెట్‌ను చాలా లోతుగా పరిశీలన చేసి, ప్రతి ఒక్క అంశాన్ని బాగా స్టడీ చేసి మాట్లాడేందుకు ప్రయత్నించాను. ఆ రోజున మీరు ఛైర్‌లో లేరు. రెండున్నర గంటల సేపు మాట్లాడేందుకు నాకు అవకాశం ఇచ్చారు. అందుకు చాలా కృతజ్ఞతలు. నేను expect చేశాను, కొంతైనా సరే, కొన్ని విషయాల్లో అయినా సరే మంత్రిగారి నుండి మనం ఇన్‌ఫర్మేషన్ రాబట్టుకోవచ్చునని. వారు మంచి వక్త, బ్రహ్మాండంగా, చాకచక్యంగా ప్రజంటేషన్ చేయగల్గుతారు. దానికి వారిని నేను అభినందిస్తున్నాను. కాని వారిని ఒక మంచి ఫైనాన్స్ మినిస్టర్‌గా అంగీకరించడానికి నాకు ఎందుకో మనసు ఒప్పుకోవడం లేదు. నేను పెద్దగా మళ్లీ ఉపన్యాసాలివ్వను, ఎందుకంటే టైమ్ లేదంటున్నారు. నాలుగైదు పాయింట్స్ మాత్రమే అడుగుతాను.

ఈరోజున బడ్జెట్ సైజ్ చూసినట్లయితే, దాదాపుగా 80 వేల కోట్ల రూ.లతో బడ్జెట్ రూపొందించారు. ఇందులో ప్లాన్ మరియు నాన్ ప్లాన్ బడ్జెట్‌లు కూడా చేరి ఉన్నాయి. ప్లాన్ బడ్జెట్ కింద రూ. 32 వేల కోట్లు చూపించారు. అయితే ఈరోజు మీరు వనరుల్ని సమీకరించడంలో ప్రధానంగా భూముల అమ్మకం పైనే ఆధారపడ్డారు. భూముల అమ్మకం ద్వారా 8700 కోట్ల రూ.లు సమీకరిస్తామని చెప్పి తమరు ఇందులో

సెలవిచ్చారు. అయితే ఏ భూముల్ని మీరు అమ్మదలచుకున్నారు? ఎక్కడ, ఎంత extent లో భూములు అమ్మదలచుకున్నారు? ఎందుకంటే మీరు ఇప్పటికే ఒక figure arrive అయ్యారు కదా! కాబట్టి మీరు తప్పనిసరిగా అమ్మదలచిన భూముల్ని ఐడెంటిఫై చేసి ఉండాలి. చేసి ఉంటే, ఆ వివరాలు చెప్పండి. ఎందుకంటే, లాస్ట్ టైమ్ కూడా భూముల అమ్మకం ద్వారా వనరులు సమీకరించుకుంటామని చెప్పారు. కాని మీరు 1300 కోట్ల రూ.లు మాత్రమే తెచ్చుకోగలిగారు. కనుక మీరు చూపించిన 8700 కోట్ల రూ.ల ఆదాయాన్ని ఏ విధంగా సమీకరించుకోగల్గుతారు. ఎందుకంటే, ఈ రూ.8700 కోట్ల ఆదాయాన్ని ఆసరాగా చేసుకునే మీరు ప్లాన్ బడ్జెట్ అంతగా పెంచారు. కాబట్టి దానిని క్లారిఫై చేయాలని కోరుతున్నాను.

తరువాత, ఎక్సైజ్ శాఖ ద్వారా అదనంగా రూ. 700 కోట్లు సమీకరించుకుంటామని చెప్పారు. వనరుల సమీకరణలో ప్రధానంగా మీరు భూముల అమ్మకం, మరియు ఎక్సైజ్ మీదే ఆధారపడ్డారు. కాబట్టి ఒకవేళ ఈ రెండు ఐటెమ్స్ తగ్గిపోయినట్లయితే, మొత్తం మీ ప్లాన్ సైజే పోతుంది. లాస్ట్ టైమ్ రూ. 20 వేల కోట్లు ప్రాజక్టు చేశారు. కాని చివరకు దాదాపుగా రూ.18 వేల కోట్ల వరకు మాత్రమే ఖర్చు పెట్టారు. ఈ సంవత్సరం ప్లాన్ బడ్జెట్ కింద రూ.32 వేల కోట్లు చూపించారు. అందులో రూ.8700 కోట్లను కేవలం భూముల అమ్మకం ద్వారా వస్తుందని చూపిస్తున్నారు. కాబట్టి ఎక్సైజ్ శాఖ నుండి ఇంకా అదనంగా రూ.700 కోట్లను ఎట్లా సమీకరించుకుంటారు? అది చెప్పవలసిందిగా రిక్వెస్టు చేస్తున్నాను. ఇప్పటికే రూ. 4100 కోట్లు ఎక్సైజ్ ఆదాయంగా మీరు చూపిస్తున్నారు. ఇంకా అదనంగా రూ.700 కోట్లు మేము తీసుకుని వస్తామని అంటున్నారు. ఎట్లా వస్తాయో చెప్పాలి. ఎక్కువ షాపులు పెడతారా? ఉన్న షాపుల సంఖ్య పెంచుతారా? ఏ పద్ధతిలో ఈ అదనపు 700 కోట్ల రూ.లు సమీకరిస్తారో చెప్పవలసిందిగా కోరుతున్నాను.

అధ్యక్షా, ఇక కేటాయింపులు చూసినట్లయితే, డ్వాక్రా గ్రూపులకు, మహిళా సంఘాలకు పావలా వడ్డీ అమలు చేస్తామని మీరు బడ్జెట్‌లో రూ. 100 కోట్లు చూపించారు. ఒకవైపు మీరు బ్యాంకుల ద్వారా రూ.5 వేల కోట్ల రుణాల్ని వాళ్లకు ఇవ్వదలచుకున్నారు. అటువంటప్పుడు పావలా వడ్డీకి ఈ రూ.100 కోట్లు సరిపోతుందా? వివరణ ఇవ్వాలి. మీరు ఇప్పటికే ఇవ్వవలసిన రివాల్వింగ్ ఫండ్ ఇవ్వడం లేదు. దాన్ని మొత్తానికి మొత్తమే ఎత్తివేశారా, లేక ఇవ్వదలచుకున్నారా? ఆ స్కీమ్ సంగతి ఏమిటో చెప్పాలి.

ఇక యూత్ గురించి మాట్లాడుతూ, మా రోశయ్యగారు వివేకనందుని కొటేషన్ ఒకటి ఇందులో ప్రస్తావించారు. **" నేటి యువతరంపైన నాకు అచంచల విశ్వాసం ఉంది, వారే నా ఆశయ సాధకులు, సమస్య సాధన కోసం వారు సింహాల్లాగా పోరాడగలరు "** అని చెప్పారు. మీరు యూత్ కోసం గత సంవత్సరం బడ్జెట్‌లో రూ. 191 కోట్లు కేటాయించి, ఈ సంవత్సరం రూ.60 కోట్లు తగ్గించి, రూ.133 కోట్లు కేటాయించారు. అటువంటప్పుడు, వాళ్లను సింహాల్లాగా పోరాడమంటే ఎట్లా అధ్యక్షా? వాళ్లు సింహాలు అవుతారా, పిల్లులు అవుతారా? ఈనాడు రాష్ట్ర జనాభాలో యువత జనాభా 30 నుండి 35 శాతం వరకు ఉంది. అటువంటి పరిస్థితుల్లో వాళ్లు ఏ విధంగా పోరాడాలి? ఏ విధంగా విజృంభించాలి? కొంత వివరించాలి. యూత్ బడ్జెట్‌ను ఈ సంవత్సరం చూసినట్లయితే మొత్తం బడ్జెట్ కేటాయింపులో కేవలం 0.16 శాతం మాత్రమే. అటువంటప్పుడు మీ కేటాయింపుల్ని ఏ విధంగా జస్టిఫై చేసుకుంటారో చెప్పాలని నేను రిక్వెస్టు చేస్తున్నాను.

2005 సం.లో FRBM అనే ఒక చట్టాన్ని తీసుకుని వచ్చాము. దాని ప్రకారం ద్రవ్య నిర్వహణ గురించి, ఆర్థిక పరిస్థితి గురించి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎప్పటికప్పుడు మీరు చెపుతూ ఉండాలి. అధ్యక్షా, నాకు ఇంటర్‌నెట్‌లో ఒకే ఒక పేపర్ దొరికింది. దానిని ఈరోజు తీసుకుని రావడం మరచిపోయాను. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కూడా చాలా వివరణాత్మకంగా వెబ్‌లో దాదాపు 70 పేజీలు పెట్టారు. మీరు కూడా ఏదో ఒక స్టేట్‌మెంట్ రూపంలో వ్రాసి పెట్టారు తప్ప, వివరణాత్మకంగా లేదు. ఒకవేళ మీరు పెట్టి ఉండి ఉంటే, కొంచెం దాన్ని మాకు ఎలాబరేట్ చేసి చెప్పండి. ఒకవేళ పెట్టకపోతే, వచ్చే సంవత్సరం నుండి అయినా చట్టం ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి రాష్ట్ర ఆర్థిక పరిసిత్థి, ద్రవ్య నిర్వహణ గురించి ఓపెన్‌గా పెట్టమని రెక్వెస్టు చేస్తున్నాను.

అధ్యక్షా, నిన్ననే మనం కేంద్ర బడ్జెట్ కూడా చూశాము. వాళ్లు ఎడ్యుకేషన్ సెస్‌ను 2 నుండి 3 శాతానికి పెంచి, తద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రైమరీ, సెకండరీ ఎడ్యుకేషన్ రంగాలకు తరలించి, బడ్జెట్ కేటాయింపులు పెంచారు. మనమందరం చూశాము. అయితే కేంద్ర ప్రభుత్వం నుండి సర్వ శిక్షా అభియాన్, మధ్యాహ్న భోజన పథకం వంటి పథకాల కింద అదనంగా రాష్ట్రానికి వచ్చే కేటాయింపుల్నే మీరు అదనంగా ఇందులో చూపించుకుంటున్నారు తప్ప, మీ కేటాయింపులు ఇందులో కనిపించడం లేదు. మధ్యాహ్న భోజన పథకానికి కేంద్రం నిధులు పెంచింది. ఆ డబ్బులు మీకు వస్తాయి కాబట్టి, ఆ డబ్బుల్ని అయినా మన రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం పథకం కింద సక్రమంగా ఖర్చు పెట్టండి. కేంద్రం నుండి ఎప్పుడయితే funds వస్తాయో అప్పుడు మన ఫైనాన్స్ డిపార్టుమెంట్ వాళ్లు తమ కేటాయింపుల్ని తగ్గించుకుంటారు.

మ.2.10

ఆ విధంగా కాకుండా మధ్యాహ్న భోజన పథకానికి క్వాలిటీ ఫుడ్‌ను ఇవ్వాలి. దీనికి వేల కోట్లు ఖర్చు కాదు. రూ.200 కోట్లు లేక 300 కోట్లు అదనంగా ఖర్చు చేస్తే చాలు . ఎలాగూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి ఫండ్సు వస్తున్నాయి. మీరు కొంచెం ఖర్చు చేస్తే 10వ తరగతి వరకూ దానిని ఎక్స్‌టెండ్ చేస్తే, క్వాలిటీ పెంచితే కోటి మంది పిల్లలు తింటారు. It is my request to the Government. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా ఇంప్లిమెంట్ చేయడానికి చర్య తీసుకోండి. రూ.200 కోట్లు నుంచి రూ.300 కోట్లు పెంచండి. After all they are our generation. తర్వాతి తరాల వారికి పౌష్టికాహారం దొరుకుతుంది. డ్రాపవుట్స్ తగ్గుతాయి. నాకు సంతోషం కలిగింది, నిన్న సెంట్రల్ మినిస్టరు గారు పర్సంటేజ్ ఆఫ్ డ్రాపవుట్స్ తగ్గించడానికి 7 నుంచి 12వ తరగతి వరకూ అనుకుంటాను, చిదంబరం గారు రూ.6000 ప్రతి సంవత్సరం ఇస్తామని ప్రకటన చేశారు. భారత దేశంలో లక్షమంది. ఇంత పెద్ద దేశంలో లక్ష మందికి. డ్రాపవుట్స్ తగ్గడానికి కనీసం దయచేసి మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా చేయడానికి కేటాయింపులు పెంచాల్సిందిగా నేను ఇంతకు ముందు కోరాను. రియాక్టు కాలేదు. రియాక్టు కావాలని కోరుతున్నాను.

తర్వాత, ఆర్ అండ్ బి కి సంబంధించి 63 వేల కిలోమీటర్ల రోడ్సు ఉన్నాయి. ఎంత దౌర్భాగ్యం అంటే అవి పాడవుతున్నాయి. పంచాయతీ రోడ్సుకు కేటాయింపులు చాలా తక్కువ. రూరల్ వెల్ఫేర్‌కు పెంచుతామని అంటున్నారు. ఇంతకు ముందు పెంచినవి, అబ్సల్యూట్ ఫిగర్స్ పెంచారు. పర్సంటేజ్ చూస్తే రూరల్ డెవలప్‌మెంట్‌లో తగ్గించారు. వాటి పైన కేటాయింపులు పెంచలేదు. వాటిని పెంచడానికి ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలి.

చివరగా, ఇరిగేషనులో ప్రాణహిత చేవెళ్ల. ఇది చేవెళ్లకే సంబంధించింది కాదు. మొత్తం తెలంగాణాకే సంబంధించిన అతి కీలకమైన ప్రాజెక్టు. ఈ రోజు తెలంగాణాలో రూ.5 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామంటున్నారు. ఇవి నీళ్లు లేని ప్రాజెక్టులకు వస్తోంది. ఇంతకు ముందు చెప్పినట్లు ఫ్లడ్‌ఫ్లో కెనాల్ అంటున్నారు. ఎస్ఆర్ఎస్‌పికి నీళ్లు రాని పరిస్థితి ఈ రోజు ఉంది. ఫ్లడ్‌ఫ్లోకి నీళ్లు రావడం లేదు. అదే విధంగా కింద ఉన్న శ్రీరాంసాగర్ సెకండ్ ఫేజ్‌కు నీళ్లు లేవు. అక్కడ ఖర్చు చేస్తున్నారు. ప్రాణహిత వస్తే తప్ప సెకండ్ ఫేజ్‌కి నీళ్లు రావు. ఫ్లడ్‌ఫ్లో వాడుకలోకి రాదు. ప్రాణహిత కీలకమైన ప్రాజెక్టు. ఈ బడ్జెట్‌లో మాటలు చెప్పారు. సర్వే అంటున్నారు. మా ఆలోచన అంటున్నారు. రోశయ్య గారు, ముఖ్యమంత్రి గారు చెబుతున్నారు. మా ఆలోచన కాదు, మీ ఆలోచనే, మీరే ఆ క్రెడిట్ తీసుకోండి. తీసుకుని, మాకు నీళ్లు ఇవ్వండి. రిక్వెస్టు చేస్తున్నాము, కేటాయింపులు పెంచండి. నీళ్లు వచ్చే ప్రాజెక్టుకు పెట్టండి. తెలంగాణా ప్రాంతంలో ఈ ప్రాజెక్టు రాకుండా ఏ ఒక్క ఎకరానికి నీళ్లు రావు. వస్తాయనుకుంటే అది భ్రమ, మోసం అవుతుంది. కనుక ఎలా కేటాయిస్తారో, ఎంత కేటాయిస్తారో చెప్పాలని మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, దేవేందర్ గౌడ్ గారు 4 పాయింట్సు చెప్పారు. రూ.8,700 కోట్ల భూములను అమ్మే ప్రపోజల్ పెట్టారు. ఏ విధంగా అమ్ముతారన్నారు. ఎలా అమ్ముతారని అడిగేరు. ఒకటే అధ్యక్షా, మేము బడ్జెట్ ప్రిపేర్ చేసి, ఎక్సర్‌సైజ్ చేసేటప్పుడు సహజంగా ఏ ప్రభుత్వాని కైనా కొన్ని అంచనాలు ఉంటాయి. ఉదాహరణకు, ఇదివరలో మన రాష్ట్రంలోనే నలుగురు స్పోర్ట్సుమెన్‌ను తయారు చేయాలనే ఉద్దేశ్యంతో వెయ్యి ఎకరాలను రూ.25 వేలు చొప్పున ఒక సంస్థకు ఇవ్వడం జరిగింది. 7 స్టేడియాలను ఫ్రీ ఆఫ్ ఛార్జ్ , ఫ్రీ పవర్ ఇచ్చేరు. సదుద్దేశంతోనే చేశారు, నేను వేరేగా అంటగట్టడం లేదు. నలుగురు స్పోర్ట్స్‌మెన్‌ను తయారు చేయడానికి చేశారు. మేము అనుకునేది, నలుగురు స్పోర్ట్స్‌మెన్ కాదు మనకు చాలమంది ఉన్నారు. ఇంకా వస్తే వాళ్లంతట వాళ్లే వస్తారు. ఆ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడి, అమ్మితే తగిన మొత్తం వస్తుంది అనే ఈ సమీకరణ కష్టం కాదని అనుకున్నాము.

నిన్న సెంట్రల్ బడ్జెట్‌లో రూ.1300 కోట్లు అంచనా వెయ్యని ఆదాయం కలిసి వచ్చింది. కాబట్టి, దాని ద్వారా కొంత తగ్గుతుంది. ఇదివరలో విషయం గుర్తు చేస్తున్నాను. స్పోర్ట్సు అయినపుడు మంచి మెరిటోరియస్ స్పోర్ట్సుమెన్‌ను మనం ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకుని పారితోషికం ఇచ్చి, మన రాష్ట్రం తరపున ఆడించాము. ఎన్నో మెడల్సు వచ్చాయని చెప్పుకున్నాము. అట్లా కాకుండా వాళ్లకు ఇవ్వవలసిన ఫెసిలిటీస్ ఇచ్చి, ఐడెంటిఫై చేసి ప్రోత్సహించడం వేరు. వాళ్లను తయారు చేయడం కోసం ఏదో సంస్థకి ఇవ్వడం అని కాదు.

ఎక్సైజు ఆదాయం రూ.700 కోట్లు పెరిగింది. బయటి నుంచి అక్రమంగా వస్తాయి. త్రాగుడు అలవాటు లేనివారు ఇంకా తాగాలని కాదు. మామూలుగా తాగి, డబ్బు ఖర్చు చేస్తున్న ఆ డబ్బు కర్ణాటకకు, తమిళనాడుకు, ఒరిస్సాకు పోకుండా అడ్డుకట్ట వేసి, కొంత పకడ్బందీగా చేసుకుంటే మంచిది. ఎఫ్ఆర్‌బిఎం రిపోర్ట్సు ప్రతి 3 నెలలకు అసెంబ్లీ ఉన్నపుడు పెడుతున్నాం. అసెంబ్లీ లేకపోతే వెబ్‌సైటులో పెడుతున్నాం. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన నిధులు ఇస్తున్నాం. మన బడ్జెటులో కేటాయింపులు ఉన్నాయి. ఇంకా పెంచండి అని చెప్పారు. లేటర్ స్టేజ్‌లో వెసులుబాటును బట్టి ఆలోచించాలి.

స్కూల్ ఎడ్యుకేషన్ బడ్జెట్‌లో స్టేట్ ప్లాను రూ.330 కోట్ల నుంచి రూ.390 కోట్లుకు పెంచాము.

శ్రీ కె. అచ్చన్నాయుడు : ఏ భూములు అమ్మితే వస్తాయి? అసెంబ్లీని కూడా అమ్ముతారా?

శ్రీ కె. రోశయ్య : 'ఐఎన్‌జి భారత్'భూముల్ని అమ్మితే రూ.5 వేల కోట్లు వస్తుంది. అసెంబ్లీని అమ్మడమా? మీరు రెండేళ్లలో వస్తామంటున్నారు కదా. అప్పుడు వస్తే, అవసరమైతే, ఎటుతిరిగీ మీరు ఇంత చక్కగా నిర్వహించడం సాధ్యం కాదు కాబట్టి, అసెంబ్లీని అమ్మి, అద్దెకు తీసుకుంటారా? మన రాష్ట్రంలోనే ప్రముఖమైన 7 స్టేడియాలను ఎవరికో ఇచ్చి, మనం ఈవెంట్సు చేసుకునేటప్పుడు మనం అద్దెకు తీసుకోవాలట. కరెంటు, అన్ని ఫెసిలిటీస్ ఇచ్చి. ఇదెక్కడి పద్ధతి?

శ్రీ కె. ప్రతాపరెడ్డి : అధ్యక్షా, బడ్జెట్ పైన జరుగుతున్న సాధారణ చర్చపై మంత్రి గారు చాలా చమత్కారంగా జవాబు ఇచ్చారు. ఈ భారీ బడ్జెటుకు క్యాపిటల్ రిసీట్స్ కింద దాదాపు రూ.8,700 కోట్లు భూములను అమ్ముతామని మంత్రి గారు చెప్పారు. దేవేందర్ గౌడ్ గారు కూడా అడిగేరు. ఏ ప్రాంతం భూములు అమ్మి ఆదాయం సమకూర్చుకుంటారని మంత్రి గారిని క్లియర్‌గా అడగటం జరిగింది. మంత్రి గారు చెప్పలేదు. రూ.8,700 నుంచి రూ.9 వేల కోట్ల భూమి తెలంగాణా ప్రాంతంలో అమ్మివేస్తే అది తెలంగాణా ప్రాజెక్టులకు ఖర్చు చేయాలని కోరుతున్నాను. మంత్రి గారి వద్ద రెడీగా జవాబు లేకపోతే ఎక్కడెక్కడి భూములు అమ్ముతున్నారో వివరాలు చెప్పాలి. గోదావరి పైన కొన్ని, కృష్ణా పైన కొన్ని ప్రాజెక్టులను 2 సంవత్సరాలలో పూర్తి చేసే వాటికి ఇచ్చిన నిధులు తక్కువ ఉన్నాయి. వాటిని పెంచాలని కోరుతున్నాను. ఉదాహరణకు, గోదావరి వాటర్ యుటిలైజేషన్ అథారిటీకి మొదట రూ.1500 కోట్లు కేటాయించి, తర్వాత రూ.300 కోట్లు పెంచి, రూ.2 వేల కోట్లు చేశారు. ఈ వాటర్ యుటిలైజేషన్ అథారిటీ కింద ఉన్న ప్రాజెక్టులకు ఇది సరిపోదు. ఇంకా పెంచాలని కోరుతున్నాను.

ముఖ్యమంత్రి గారు చొరవ తీసుకుని, చేర్యాల గోదావరికి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఇచ్చారు. గతంలో వారికి కృత జ్ఞతలు తెలియజేశాను. ఈ సారి అడుగుతున్నాను., ఈ బడ్జెటులో పెట్టిన నిధులు ఒప్పుకున్న ప్రకారం 2008 మార్చి లోపున పనులు అయ్యేట్లు కనబడటం లేదు. దాదాపు రూ.600 కోట్లు పెడుతున్నట్లు చెప్పారు. నిధులు పెంచాలని కోరడం జరిగింది. పెంచలేదు. 2008లో ఏ విధంగా పూర్తి చేస్తారు?
మ.2.20

ఈ ప్రాజక్ట్ పూర్తయి, అందరిలాగానే మాకు కూడా కాల్వల ద్వారా నీరు వచ్చి, మా ప్రాంత పొలాలు సస్యశ్యామలంగా మారతాయని మేమందరమూ భావించాము కాని ప్రభుత్వం తుంపర సేద్యం, బిందు సేద్యం ద్వారా నీరు ఇస్తామని అంటున్నది. ఒక టి.ఎం.సి. నీరు 35000, 40,000 ఎకరాలకు వచ్చేలాగ నీరు ఇస్తామంటున్నారు, దాని వల్ల మాకు లాభం లేదు కాబట్టి మాకు కాల్వల ద్వారానే నీరు అందించాలని కోరుతున్నాను. అదే విధంగా వరంగల్లు జిల్లాలో దాదాపు 70 శాతం గ్రామాలు ఫ్లోరైడ్‌తో వుండి, మంచి నీటికి ఇబ్బంది ఏర్పడుతోంది కాబట్టి డ్రింకింగ్ వాటర్‌కు 2 టి.ఎం.సి.ల నీటిని కేటాయించాలని, రు.300 కోట్లను అందుకు ఏర్పాటు చేయాలని నేను కోరాను, కాని మంత్రి గారు దాని గురించి ఏమీ సమాధానం చెప్పలేదు. అందువల్ల మాకు డ్రింకింగ్ వాటర్ కోసం రు.300 కోట్లు కేటాయించాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని మరొకసారి కోరుతున్నాను.

అదే విధంగా తెలంగాణా ప్రాంతంలో వుండే భూములను అమ్మడం వల్ల వచ్చే డబ్బును తెలంగాణా ప్రాంతం యొక్క అభివృద్ధికే ఖర్చు చేయాలని కోరుతున్నాను. ఫార్మర్స్‌కు లోన్స్ ఇచ్చే విషయంలో సరియైన విధంగా ఇస్తామని, వారిని ఆదుకుంటామని మంత్రి గారు చెప్పారు, చాలా సంతోషం. కాని ఈ విషయంలో తెలంగాణా రైతులకు అన్యాయం జరుగుతోంది. స్టాటిస్టికల్ రిపోర్ట్ 2006 ప్రకారం మొత్తం అందించిన రుణాలు రు.10,780 కోట్లు కాగా, అందులో హైదరాబాదు తప్ప మిగిలిన అన్ని తెలంగాణా జిల్లాలకూ రు.2,674 కోట్లు మాత్రమే ఇవ్వడం జరిగింది. పి.ఎ.సి.ఎస్. ల ద్వారా మొత్తం రాష్ట్రంలో రు.3360 కోట్ల రుణాలను అందిస్తే, తెలంగాణాలోని 8 జిల్లాలకూ రు.720 కోట్లను మాత్రమే ఇచ్చారు. కనీసం 40 శాతం ప్రపోర్షనేట్‌గా ఇవ్వాల్సి వుండగా ఆ విధంగా ఇవ్వలేదు. తెలంగాణా రైతులు వ్యవసాయం మీద ఎక్కువ పెట్టుబడి పెట్టాలి. బోర్లు వేసుకోవ్వాలి, బావులు త్రవ్వుకోవాలి, కరెంటు మోటారు పెట్టుకోవాలి, ఎక్కువ ఫెర్టిలైజర్ వేసుకోవాలి అందువల్ల ఎక్కువ రుణాలను కూడా వారికి అందజేయాలి. చిన్న, మధ్య తరహా నీటి పారుదల శాఖకు సంబంధించి, చాలా తక్కువ నిధులను కేటాయించారు. తెలంగాణాలో చిన్న నీటి పారుదల మీద ఆధారపడి చేసే వ్యవసాయం ఎక్కువ వుంది కాబట్టి, దానికి ఎక్కువ నిధులను కేటాయించాలని నా స్పీచ్‌లో కూడా మంత్రి గారిని కోరడం జరిగింది, అయినా తమరి ద్వారా మంత్రి గారిని మరొకసారి కోరుతున్నాను.

శ్రీ ఎస్.సంతోష్ రెడ్డి : సర్, నేను మంత్రిగారు చెప్పిన తరువాత నా క్లారిఫికేషన్‌ను అడుగుతాను కాని నా ధర్మ సందేహం మరొకటుంది. మిత్రులు దయాకర రావు గారు ఇంతకు ముందు మాట్లాడుతూ నీ భాగవతం బయట పెడతానని అన్నారు. తెలంగాణాలో బాగోతం అంటే చాలా మంచిదే, కాని భాగవతం బయటపెడతానంటే మాత్రం చెడు మీనింగ్ వస్తుంది కాబట్టి దానిని పరిశీలించి రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నాను.

MR.SPEAKER: It is a very good observation. If any un-parliamentary words are found in the proceedings, they will be definitely expunged from the records.

శ్రీ కె.రోశయ్య : అధ్యక్షా, మిత్రులు ప్రతాపరెడ్డి గారు కొన్ని మంచి సలహాలు ఇచ్చారు. దానికి ఇమ్మీడియట్‌గా అయితే 1, 2 విషయాలు చెప్పవచ్చు కాని అన్నీ అయిన తరువాతనైతే చాలా కష్టం. దేవేందర్ గౌడ్ గారు చెప్పింది, ప్రాణహిత, చేవెళ్ల ప్రాజక్ట్‌కు సంబంధించినంత వరకూ, ఏప్రిల్‌లో సర్వే పూర్తి చేసి టెండర్లను పిలుస్తాము. దానికి డబ్బు కూడా ప్రొవైడ్ చేస్తామని మొదట్లోనే చెప్పాను. మనకు ఆ ప్రొవిజన్ వుంది.

అట్లాగే ప్రతాపరెడ్డి గారు మాట్లాడుతూ ఒక మాట చెప్పారు. వారి మాటతో నేను నూటికి నూరు శాతం ఏకీభవిస్తున్నాను. తెలంగాణా ప్రాంతంలో భూములను అమ్మినట్లయితే, ఆ డబ్బును తెలంగాణ ప్రాంతాభివృద్ధికే ఖర్చు పెట్టాలని కోరారు. అది చాలా రీజనబుల్ డిమాండ్. ఎక్కడ అవకాశం వుందో చూచి, ఎవరో ఆ భూములను ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తూ వుంటే గవర్నమెంట్ వదిలిపెట్టకుండా వాటిని ప్రొటెక్ట్ చేసుకునేందుకు ఎట్లా చేస్తే బాగుంటుందో చూచి అట్లా చేద్దాము. తెలంగాణా ప్రాంతంలో భూములను అమ్మినట్లయితే, ఆ డబ్బును తెలంగాణ ప్రాంతాభివృద్ధికే ఖర్చు పెట్టాలని వారు చేసిన సూచనను మనసులో పెట్టుకుంటాము.

ఇక కేటాయింపులు పెంచాలని కోరారు. ఉన్నంతలో ఇరిగేషన్‌కు మాగ్జిమమ్ పెట్టాము. ఇంకా ఏమైనా వుంటే, మనకు అదనపు వనరులు చేకూరితే, తప్పకుండా ఆలోచిద్దాము. డ్రిప్ ఇరిగేషన్ కాకుండా కాల్వల ద్వారా వ్యవసాయానికి నీరందించాలని, వరంగల్ జిల్లాలో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు మంచి నీరు సరఫరా చేయాలని కోరారు. పీరియాడికల్‌గా బ్యాంకర్లతో మీటింగులు జరుగుతూ వుంటాయి. ముఖ్యమంత్రి గారు కూడా ఇక్కడే వుండి వింటున్నారు. వారితో మాట్లాడేటపుడు వున్న బ్యాంకింగ్ ఫెసిలిటీస్‌ను పరిగణనలోకి తీసుకుని, రైతులకు అదనపు సౌకర్యం కల్పించమనే ఒక మాట తప్పకుండా చెబుతాను.

ఈ స్కీమ్స్ టేకప్ చేసినవి ఒక టైమ్ బౌండ్ ప్రోగ్రామ్‌గా పెట్టుకుని వాటికి కావలసిన రిసోర్సెస్‌ను ఐడెంటిఫై చేసుకుని, ఇంకా అవసరమైతే వర్క్స్ ప్రోగ్రెస్‌ను బట్టి మరొక చోట నుంచి కొంత అమౌంట్ డైవర్ట్ చేసైనా సరే, త్వరగా యాకరేజ్‌ను ఆయకట్‌లోకి తీసుకువచ్చే కార్యక్రమాలు తప్పకుండా చేద్దాము.

## 2007-2008 సం.పు వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్) పై

గ్రాంట్ల కొరకు అభ్యర్థన

1. అభ్యర్థన నెం. **XXIV (24) -** అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం
2. అభ్యర్థన నెం. **XVIII (18) -** గృహ నిర్మాణం
3. అభ్యర్థన నెం. **XXV (25) -** మహిళ, శిశు, వికలాంగుల సంక్షేమం
4. అభ్యర్థన నెం. **XXI (21) -** సాంఘిక సంక్షేమం
5. అభ్యర్థన నెం. **XXII (22) -** గిరిజన సంక్షేమం
6. అభ్యర్థన నెం. **XXII (23) -** వెనుకబడిన తరగతుల సంక్షేమం

(ప్రతిపాదించబడినవి)

SRI MOHAMMED FAREEDUDDIN: Mr. Speaker, Sir, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs. 123,66,76,000/- under Demand No. XXIV (24) - Minority Welfare"

SRI K. JANA REDDY: Mr. Speaker, Sir, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs. 5444,89,71,000/- under Demand No. XVIII (18) - Housing"

SMT. N. RAJYALAKSHMI: Mr. Speaker, Sir, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs. 1043,00,22,000/- under Demand No. XXV (25) - Women, Child and Disabled Welfare"

SRI D.S. REDYA NAIK: Mr. Speaker, Sir, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs. 1719,10,09,000/- under Demand No. XXI (21) - Social Welfare"

"That the Government be granted a sum not exceeding Rs. 719,24,14,000/- under Demand No. XXII (22) - Tribal Welfare"

SRI D. SRINIVAS: Mr. Speaker, Sir, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs. 533,95,41,000/- under Demand No. XXIII (23) - Backward Classes Welfare"

MR.SPEAKER: Cut Motions from 1 to 86 are deemed to have been moved. Now continuation of the clarifications on the reply given by the Minister for Finance on the Budget.

శ్రీ నోముల నర్సింహయ్య (నకిరేకల్) : అధ్యక్షా, రోశయ్య గారు మాట్లాడుతూ మంచి సలహాలూ, సూచనలూ రాలేదని, అందుకు కొంత విచారిస్తున్నానని అంటున్నారు. మీకు మంచి సూచనలూ, సలహాలూ వచ్చిన వాటిని స్వీకరించి కూడా ఏమి చేస్తారు, ఏమీ చేయలేకపోయారు. రెండోది ఒక అటానమస్ బాడీ అయిన కాగ్ చెప్పిన వాస్తవాలను, ఎత్తి చూపిన లోపాలను ఈ రకంగా సరి చేసుకోవచ్చునని బడ్జెట్‌లో ఏమైనా వుందా సర్ ?

మ.2.30

ప్రతిపక్షాలను వారు విమర్శించ నివ్వండి. పశ్చిమ బెంగాల్ విషయం మాట్లాడినా ఫరవాలేదు. వద్దనడం లేదు. మన దగ్గర చెప్పిన 2005 మే నెలలో సభ ముందు ఉంచిన కాగ్ నివేదిక లోని అంశాలను దృష్టిలోపంతో ఉంటే ఎలా అవుతుంది. పెద్దాయన, ఆ విషయం ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఇవి తీసుకోలేకపోయాము, విఫలమయ్యామని అనుకోవలసిన అవసరం ఉంది. రెండవ అంశం, నేను చెప్పదలచినదేమంటే, అన్నింటికి మేము చాలా బాగా ఎఫెక్టివ్‌గా ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌తో ద్రవ్య లోటు తగ్గిస్తామన్నారు. ఆర్థిక శాఖామంత్రిగారిని తమ ద్వారా ఒకసారి పరిశీలించమంటున్నాను. ఇది నా ఫిగర్స్ కాదు. సోషియో ఎకనామిక్ సర్వే రిపోర్ట్ 2006-07 చివరి పేజీ చూడమనండి. అగ్రికల్చరల్ అండ్ అలైడ్ సర్వీసెస్ 2004-05కి రు. 671.79 కోట్లు కేటాయించి ఖర్చు పెట్టింది రు. 477.91 కోట్లు మాత్రమే. మరీ అధ్వాన్నం ఏమంటే 2006-07కి రు. 594 కోట్లని రు.530 కోట్లు. 0.13 శాతం వ్యవసాయం రేటు ఉందని వారన్నారు. ఎందుకంటే ఏమీ పెరగకుండా 66 శాతం ప్రజలు ఆధారపడిన ఈ వ్యవసాయానికి దాని అలైడ్ సెక్షన్స్‌కి ఏ విధంగా పెంచుతామంటున్నారు. సోషియో ఎకనామిక్ సర్వేని పరిగణనలోకి తీసుకున్నారా? ఎనర్జీకి సంబంధించి చూసే, అత్యంత బాధాకరము. ఉచిత కరెంటు ఇస్తున్నారా, అదీ కాదు. రు.515.5 కోట్లు 2005-06కి కేటాయించి ఇచ్చింది రు.56 కోట్లు 2006-07 కి కేటాయించింది రు.226 కోట్లు కేటాయించి ఖర్చు పెట్టింది రు.47.02 కోట్లు ఖర్చుపెట్టారు. ఎస్.సి, ఏస్.టి, బిసి వెల్ఫేర్‌కి సంబంధించి వారు ఇచ్చిన లెక్క రు.1,561.53 కోట్లు అయితే ఖర్చు పెట్టింది రు.443.32 కోట్లు. వీరు ఇచ్చిన లెక్క సోషియో సెక్యూరిటికి సంబంధించి రు.164.95 కోట్లయితే ఖర్చు పెట్టింది రు.68.76 కోట్లు. 26 రాష్ట్రాల గురించి చెప్పడం లేదు. వారు ఇచ్చిన ఎకనామిక్ సర్వే ఈ విదంగా ఉంటే ఎలా? మంత్రాల బలం లేకుండా తుప్పిర్ల బలంతో వేసి పారేయరా నువ్వు పెద్ద మంత్రగాడివి అన్నట్లు మా రోశయ్యగారి సమాధానం ఉంది. వేరే రకంగా చెప్పదలచుకోలేదు. ఎకనామిక్ సర్వే ఈ విధంగా ఉంటే, ఎస్.సి., ఎస్.టి., బిసి, మైనారిటీలను ఉద్ధరిస్తున్నామని చెబుతూ, నోటితో మాట్లాడి నొసటితో వెక్కిరిస్తారా వీరు, ఆ వివరాలు చెప్పాలని కోరుతున్నాను. మేము చాలా వనరులను సమీకరించి చాలా ఖర్చు పెట్టామన్నారు. రోషయ్యగారికి రెండు చేతులూ జోడించి నమస్కరిస్తున్నాను. కేటాయించింది ఏమిటి? ఖర్చు పెట్టింది ఏమిటి? నేను మొత్తం బల్క్‌గా చెప్పాను. పోయినసారి రు.1100 కోట్లు, నల్గొండ అభివృద్ధికి సంబంధించి ఒక్కసారి జానారెడ్డిగారిని నెమరువేసుకోమంటున్నాను. వారి ఖజానా నుండి వచ్చింది రు.402 కోట్లు. నాగార్జునసాగర్‌కి రు.150 కోట్లు ఖర్చుపెడతామని అన్నారు. కానీ ఖర్చు పెట్టింది రు.3 కోట్లు మాత్రమే. వారు ఇచ్చిన లెక్కలే.సారంగం

గురించి వారు ఇంతకుముందు మార్చ్ అన్నారు. డిసెంబర్ అన్నారు. ఇంతవరకూ దిక్కు లేదు. కేటాయించింది ఎంత? ఖర్చు పెట్టింది ఎంత? ద్రవ్య లోటు తగ్గదా? అరచేతిలో బెల్లం పెట్టి మోచేతితో నాకిస్తే ఆ బెల్లం మోచేతికి అందుతుందా? అందుకే నేను చెబుతాను, పురుషోత్తం రెడ్డిగారి పిల్లి కథ. దయచేసి ఖర్చు పెట్టడంలో ఇంత లోపం ఉంటే , ఇంక మేము ఖర్చుపెట్టాము, ద్రవ్య లోటు తగ్గించాము అంటే ఎలా? ' కాగ్' చెప్పింది రు.9,000 పైచిలుకు కోట్లు ఎందుకు ఖర్చు పెట్టలేదో, మీ అభిప్రాయం ఏమిటని చెప్పడం జరిగింది? ఖర్చు పెట్టకుండా ఎస్.సి., ఎస్.టి, వైద్యం కోసం ఎంతగా అల్లాడుతున్నారో చూస్తున్నారు కదా? వైద్యం, విద్య, ఉపాధికి దేనికీ పెట్టరు? ఉపాధికి సంబంధించి చాలా పెట్టామంటున్నారు. ఒకసారి ఎకనామిక్ సర్వే చూసుకోమనండి రోశయ్యగారిని. కాంపౌండ్ యాన్యుయల్ గ్రోత్ రేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ 1993-1994 - 2000 వరకు ఎకనమిక్ సర్వే ఆల్ ఇండియాది 1.07 శాతం ఉంటే మనం 0.35 శాతం ఎంత అధ్వాన్నంగా ఉందో చూడండి. తరువాత కాంపౌండ్ యాన్యుల్ గ్రోత్ రేట్ ఎంత అధ్వాన్నంగా ఉన్నామో అంటే, ఎంప్లాయిమెంట్ వెలాసిటి 1999-2004 వరకూ ఆల్ ఇండియా రేట్ 0.74 శాతం అయితే మనం .41 శాతం. వారు ఉపాధి ఎక్కడ సృష్టిస్తున్నారు? జాబ్‌లెస్ గ్రోత్ ఎవరికి కావాలి? ఎవరు అనుభవిస్తున్నారు? దీనిని దిక్సూచిగా తీసుకోవాలి. వీరికి ఏ విధంగా ఉపాధి ఇవ్వబోతున్నారో చెప్పమనండి. వారంటున్నారు సంపన్న దేశాలలాగా మనం చేయాలన్నారు. వ్యాట్‌కి సంబంధించి పాపం, మా హషిన్ దాస్ గుప్త గారు అన్నారన్నారు, మేము కాదనడం లేదు. వారి కమిట్‌మెంట్ ప్రకారంగా వారు చెప్పి డబ్బులు రాబట్టుతున్నారు, ఖర్చు పెడుతున్నారు. ఈ వైద్యానికి సంబంధించి ఈ క్వార్టర్‌ది రెండవ క్వార్టర్‌కో, మూడవ క్వార్టర్‌కో వస్తోంది. డాక్టర్లు ఎక్కడ వైద్యం చేస్తారు? ఎప్పుడు ఇచ్చేది? తరువాత ఇస్తే ఎమర్జెన్సీసర్వీసెస్ చేయలేని పరిస్థితి ఉంది. వాటిని ఏ విధంగా ఖర్చు పెడతారు. ఎవరికి ఖర్చు పెడతారు? సంపన్నుల మీద వచ్చే అదనపు ఆధాయం మీద ఖర్చు పెట్టడానికి వీరికి ఏమైనా ఆలోచన ఉందా? సంపన్నులు మరీ సంపన్నులవుతున్నారు, కుబేరులు మరీ కుబేరులవుతున్నారు. వారి మీద డైరెక్ట్‌టాక్స్ వేయడానికి వీలు ఉంది. మేము వీరిని మోసేటటువంటి కనీస ఉమ్మడి కార్యక్రమంలో కూడా చెప్పాము. ఈ విధంగా సంపన్నుల మీద అదనపు పన్ను వేయవచ్చు. 5 పైసల ఆదాయం తగ్గకుండా వేయచ్చు అన్నాము. అది వేయడానికి వారికి చేతులు రావు. వారి కాగ్ రిపోర్ట్ లెక్కలోకి తీసుకుంటే, రు.725 కోట్లు మా జె.సి. దివాకరరెడ్డిగారి సడక్ యోజన. వారి యంత్రాంగం చేతగానితనంతో పోయిందని కాగ్ రిపోర్ట్ చెప్పింది. ఎవరు చేయాలి అది, వీరు చూసుకోవలసిన అవసరం లేదా? ఇప్పుడున్న దానిలో పన్నులు వేశారు. ముఖ్యమంత్రిగారు ఉన్నారు. రు.120 కోట్లు క్షవరచారుల మీద భారం వేయబోతున్నారు. చేతి వృత్తులు, బి.సి.,ల మీద. నేను అనేదేమంటే, కార్పొరేషన్‌లో ఉన్న క్షవరచారులకు అన్నారా? దున్నపోతు ఈనితే ఛలో, దొడ్లో కట్టేయండి అన్నట్లు మాట్లాడుతున్నారు. వారందరి మీద వేయడానికి సిద్ధంగా ఉన్నారు. నెలకు రు.500 జుట్టు పన్ను. అప్పట్లో జిజియా పన్ను. ఔరంగజేబు హిందూ మతం అక్కసుతో అప్పుడు ఎంతో కొంత చేసాడనుకుందాము. ఈ రోజు సెక్యులర్ స్టేట్‌లో ఉన్నాము. ఇప్పుడు క్షవరచారులను వదలారా? రజకులకు, గొర్రెల పెంపకం దార్లకు,బి.సిలకు సంబంధించి ఫెడరేషన్స్‌కు ఇచ్చిన ఆదాయం వీరు ఇచ్చిన కేటాయింపులు ఖర్చు పెట్టిరాఅని అడుగుతున్నాను. వీరు ఇచ్చింది రజకులకు రు.75 లక్షలు, ఖర్చు పెట్టింది రు.10 లక్షలు, ఎలా వెళుతుందో చెప్పండని అంటున్నాను. అమర్త్యసేన్ కొటేషన్ గురించి చెప్పారు. వారొక మాట అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో భూసంస్కరణలకు సంబంధించి ఇది ఒక ఆదర్శమని చెప్పారు. లోకల్ బాడీస్‌కి సంబంధించి ఎంప్లాయిమెంట్ జనరేషన్‌కి ఇది ఆదర్శమని చెప్పారు. నేను చెప్పలేదు, వారు చెప్పారు. బెంగాల్‌లో అధికారంలో వచ్చిన రోజు మా పార్టీ ఆల్ ఇండియా పార్టీ. వరి దిగుమతి చేసుకున్నారు. విద్యుత్ సర్‌ప్లస్ బయటకు పంపుతున్నారు. పత్తి సగటు ఉత్పత్తి అక్కడ ఎక్కువగా ఉంది మిగిలిన కొన్ని రాష్ట్రాలకన్నా. మైనారిటీలకు సంబంధించి ఎన్నికల

ముందు రిజర్వేషన్ గబగబా పెట్టారు. ఏదో కొంత లాభం పొందారు. వారి నెత్తి మీద రాయి పడవేశారు. కోర్ట్ వేసిన రాయిఅని పక్కకుపోయారు. ఈనాడు మెజారిటి ఆఫ్ మైనారిటీస్ సి.పి.యం, కమ్యూనిస్ట్ పార్టీలలో వెనక వారు ఉన్నారు. వారికి ఆ ప్రభుత్వం మీద విశ్వాసం ఉంది.వక్ఫ్ ప్రాపర్టీస్‌ని ఎవరు ఆక్రమించినా అమెండ్ చేసి క్రిమినల్ కేసులు పెడుతున్నారు. ఆ విధంగా వారిని కాపాడుతున్నారు అక్కడ. ఇక్కడ వీరిని పెట్టమంటే, ఇక్కడ పెట్టడానికి వీరికి కనీసం చేత కాలేదు. అక్కడికి ఇక్కడికి నక్కకూ, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. అక్కడికి పోవద్దని అంటున్నాను. గతంలో బెంగాలో విషయం అందరికి తెలిసినదే. ఇక వీరి కేటాయింపుల విషయం చూస్తే, ఎస్.సి., ఎస్.టి., బిసిలకు, మైనారిటీలకు ఇచ్చింది బాగా లేదు. గతంకన్నా అభివృద్ధి అనుకుంటే కాలేదు. ప్రాజక్టులే తీసుకుంటే, పంజాబ్‌లో 95 శాతం ఇరిగేటెడ్ భూములు ఉన్నాయి. ఇక్కడ ఆత్మహత్యలు ఉన్నాయి. 66 శాతం వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తున్నారు. చేతివృత్తులవారిని ఏ విధంగా ఆదుకుంటారో చెప్పమనండి . రోశయ్యగారు కోపానికి రావలసిన అవసరం లేదు. కోపం ఎప్పుడూ ఉండదుకానీ, ఆ రోజు పక్కనవారు చేయి చూపిస్తే, తీస్తానన్నారు. ఆయనకు కోపం ఉండదు. కాకపోతే ఇంకా కాస్త లోతుగా వెళ్లి ఎక్సర్‌సైజ్ చేయమంటున్నాను. ఖనిజ సంపద పెంచారా? ఈ రోజు గ్రామ పంచాయితీ సర్పంచుల నుండి పై వరకూ ఎవరికి అవసరం వచ్చినంతవారు అమ్ముకొని కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు.

మ.2.40

మీరు అంటున్నారే పాశ్చాత్య దేశాలు, వారిని లెక్కలో తీసుకొన్నా ఆస్ట్రేలియాకు సంబంధించి 14.5 బిలియన్ డాలర్స్ ఎక్కువగా ఉంది. పోయిన సంవత్సరం 1.5 బిలియన్ డాలర్స్ సర్‌ప్లస్ వచ్చింది. అక్కడ సర్పంచ్ నుండి ప్రధానమంత్రి వరకు అందరూ ట్యాక్స్ కడతారు. మన దగ్గర మనం 42 వేల రూపాయల వరకు తీసుకొంటూ ట్యాక్స్ కట్టడం లేదు. డైరెక్టు ట్యాక్స్ కోసం, ఎవరు సంపన్నుడు, ఎవరి దగ్గర ట్యాక్స్ వేయాలో వేయడానికి కుడా చేతకాని పరిస్థితిలో మనం ఉన్నాము. ఈ రోజు బెంగాల్‌లో రూ. పది వేలు మాత్రమే ఎమ్.ఎల్.ఏ. లకు ఇస్తున్నారు. ఒక రూమ్ ఉన్న క్వార్టర్ ఇస్తున్నారు. మనం సంస్కరరించుకొంటే మిగతా వారు సంస్కరించబడతారు. గత నాలుగు సంవత్సరాలుగా గణనీయంగా రిసోర్సెస్ పెరిగాయి. పెరిగిన రిసోర్సెస్‌ని ఖర్చు చేయాలి. 80శాతం ఉన్న పేదలకు సంబంధించి, క్షేత్రఫలాలు మంచి విత్తనాలు రాబట్టడానికి

(మైక్ కట్ చేయబడింది.)

MR.SPEAKER : That is enough, That is enough. Minister గారు.

శ్రీ కె. రోశయ్య :- అధ్యక్షా, నర్శింహయ్య గారు చాలా వివరాలుచెప్పారు. 'కాగ్' రిపోర్టు గురించి చెప్పారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటి కాగ్ రిపోర్టుని పరిశీలిస్తుంది. వారు పరిశీలించిన పిదప ప్రభుత్వానికి రిపోర్టు ఇస్తే, గవర్నమెంట్ చర్యలు తీసుకొన్న తరువాత ప్రభుత్వం సభలో పెడుతుంది. కనుక, "CAG" Report పై un noticed గా పోవడానికి వీల్లేదు. పబ్లిక్ అకౌంట్స్ కమిటి నుండి వచ్చిన తరువాత We will take note of it. Government will take corrective steps also. Ultimately, we will inform the House. ఎక్స్‌పెండీచర్‌కి సంబంధించి నేను వారికి ఒకటే మనవి చేస్తున్నాను. ప్లాన్, నాన్ ప్లాన్ కలిసి ఉంది. ఒక్క దాన్నే చూస్తే మనకు రియల్ పిక్చర్ రాదు. రెండింటిని కలిపి చూస్తే, డెఫినెట్‌గా utmost satisfaction అని అనను కానీ you will not try to find fault with me. కొంత వరకైనా తృప్తి పడతారు. ల్యాండ్ డిస్ట్రిబ్యూషన్ గురించి

మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా నాలుగు లక్షల 37 వేల ఎకరాలు పంచడం జరిగింది. అందులో ఎస్.సి.లకు 97,199 మంది ఎస్.టి.లు, 71059, బి.సి.లు ఒక లక్షా 9473 మంది, మైనారిటీలకు సంబంధించిన ఫిగర్ ప్రస్తుతం నా దగ్గర ఫిగర్స్ లేవు. మైనారిటీల ఫిగర్ తక్కువ ఉంటే వారికి తగు రీతిలో భవిష్యత్తులో అయినా చూడడానికి ప్రయత్నం చేస్తాము. ఎనర్జీ సబ్జక్టు గురించి ఒక మాట అన్నారు. ప్లాన్ లో చూపించ లేదు., నాన్ ప్లాన్‌లో చూపించాము. వారు అడిగారు కాబట్టి పవర్ సెక్టర్ గురించిచెప్పాల్సి ఉంది. నిన్న కూడా ఎవరో అన్నారు. ఇది వరకు 9 గంటలపాటు విద్యుత్‌ని ఇచ్చేవారము, ఈ గవర్నమెంట్ వచ్చిన తరువాత 7 గంటలు ఇస్తున్నట్లు వారు మాపైన తీవ్రమైన ఆరోపణలు చేశారు. గతంలో 27.3.2003వ సంవత్సరంలో నోముల నర్సింహయ్య గారు, సున్నం రాజయ్య గారు ఒక ప్రశ్న వేశారు. ఏమంటే, ఇందన శాఖ మంత్రి గారు దయచేసి ఈ ప్రశ్నకు సమాధానం తెలియజేస్తారా: రాష్ట్రంలో 2002 -03వ సంవత్సరంలో ని రబీ కాలంలో వ్యవసాయానికి 9 గంటల నుండి 7 గంటలకు విద్యుత్ సరఫరాను తగ్గించిన మాట వాస్తమేనా? దానికి మంత్రి గారి సమాధానం, అధ్యక్షా, విద్యుత్ సరఫరా కొరత వల్ల పంటలు ఎండి పోకుండా చూసేందుకు చాలినంత విద్యుత్ సరఫరాను లభ్యంగా ఉంచడం జరిగింది. ఆనాడు ఇందన శాఖ మంత్రి గారు నో చెప్పాల్సిన ఆన్సర్. ఇందన శాఖ మంత్రి గారు చెప్పిన సమాధానం చాలా తెలివిగా విద్యుత్ సరఫరా కొరత వల్ల పంటలు ఎండి పోకుండా చూసేందుకు చాలినంత విద్యుత్ సరఫరాను లభ్యంగా ఉంచడం జరిగింది అన్నారు. మేమేమి చెపుతున్నాం అధ్యక్షా, ఏడు గంటలకు తక్కువ లేకుండా, 7 గంటలు విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడతామని చెపుతున్నాము.

శ్రీ ఇ. దయాకరరావు :- ఎన్నికల మ్యానిఫెస్టోలో ఏమి చెప్పారు.

శ్రీ కె. రోశయ్య :- అథారిటేటీవ్‌గా ఉంది. నర్సింహయ్య గార్కి చెప్పినటువంటి జవాబే కాకుండా 28.6.2003 మరో నెల ముందుగా 22.5.2003లో రెండు ఆర్డర్స్ ఉన్నాయి. 22.5.2003న ఛైర్మన్ అండ్ మేనేజింగ్‌డైరెక్టర్ గార్కి, వరంగల్ ఎన్‌పిడి.సిల్ డైరెక్టర్ ట్రాన్స్‌మిషన్ వ్రాస్తూ, The 11 KV rural feeders loads are made into three batches and three phase supply is being given at 7 hours per day between the period from 21 hours in night to 19 hours on the next day. అంటే రాత్రి 9 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు విద్యుత్ ఇస్తున్నామని ఎన్స్యూర్ చేస్తూ ఆయన పంపించారు. అలాగే 28.6.2003న ఇది నార్దన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ, వరంగల్ ఆయన మరోసారి గ్రూప్స్‌గా చేసి రెండు స్పెల్స్‌లో విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఈ ఆర్డర్లు దాచిపెడితే దాగేవి కావు. సత్యాన్ని ఒప్పుకొనే ధైర్యం లేక బుకాయించితే ఇవి ఎక్కడికి పోతాయి. ట్రాన్స్‌కో నుండి డిస్‌కామ్స్‌కి ఇచ్చిన ఆర్డర్ కూడా ఉంది. మరో మాట మనవి చేస్తున్నాను. నిన్న ప్రతిపక్షనాయకులు వ్యవసాయానికి పవర్ కన్‌జంప్షన్ గురించి ఏమీ జరకకుండా నే అమ్ముకొంటున్నారని అన్నారు. అది వాస్తవం కాదు. Uncharitable remark. 2003-04వ సంవత్సరంలో కన్‌జంప్షన్ ఎపిఇఆర్‌సి ఇచ్చిన తీర్పు ప్రకారం 11526 మిలియన్ యూనిట్స్. Actual consumption 12,636 million Units. 2003-04లో అంటే ఆనాడు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. గవర్నమెంట్ సబ్సిడీ 666 కోట్లు ఇచ్చారు. క్రాస్ సబ్సిడీ మిగిలిన సెక్టర్స్ నుండి అగ్రికల్చర్ సెక్టార్‌కి, డొమెస్టిక్ సెక్టర్‌కి కూడా క్రాస్ సబ్సిడీ వస్తుంది. అది కాకుండా ఫ్యూర్‌లో అగ్రికల్చర్ సెక్టర్‌కి 929 వచ్చింది. టోటల్ సబ్సిడీ ఆ సంవత్సరం 2003-04లో 1595కోట్లు. 2004-05వ సంవత్సరంలో ఎ.పి.ఇ.ఆర్.సి. 11638 కి మాత్రమే పరిమితంగా ఇచ్చింది. Actual consumption 13194 million units, Subsidy Government provide చేసింది. అంతకు ముందు ప్రతి సంవత్సరం రూ.666కోట్లు కాగా,

రూ.1102కోట్లకి పెరగడం జరిగింది. క్రాస్ సబ్సిడీ రా.827 కోట్లు అడ్జస్టు అయింది. మొత్తం కలిపితే 1929కోట్లు. 2005-06 సంవత్సరంలో 12,877మిలియన్ యూనిట్స్‌కి ఎ.పి.ఇ.ఆర్.సి. ప్రర్మిషన్ ఇచ్చింది. ఆక్చువల్ కన్‌సంప్షన్ 13267 మిలియన్ యూనిట్స్ అయింది. అలాగే ప్రభుత్వం ప్రొవైడ్ చేసిన సబ్సిడీ రూ.878 కోట్లు. క్రాస్ సబ్సిడీ రూ.1185కోట్లు మొత్తం రూ. 2063కోట్లు.

మ.2.50

2006-07 సంవత్సరంలో ఇప్పటి వరకూ ఎ.పి.ఇ.ఆర్. ఇచ్చింది 13,891 మిలియన్ యూనిట్లు వాడుకోవచ్చని అన్నారు కానీ ఇప్పటికే 15,036 మిలియన్ యూనిట్లు వాడుకున్నాము. అలాగే గవర్నమెంటు సబ్సిడీ కూడా ప్రైవేటు సబ్సిడీ రూ.1250 కోట్లు ఇచ్చాము. క్రాస్ సబ్సిడీ రూ.2,229 కోట్లు ఇచ్చాము. మొత్తం కలిపి, రూ.4,391 కోట్లు . 2003-04లో రూ.1595 కోట్లు మొత్తం సబ్సిడీ. ఈ రోజు 7 గంటలు ఫ్రీ పవర్ ఇస్తామని ఎన్ష్యూర్ చేశామన్నారు. సబ్సిడీ ఏమీ అమలు జరగలేదని ఏదో చెప్పారన్నారు. పవర్ అమ్ముకుంటున్నామన్నారు. రూ.4,391 కోట్లు అంటే రూ.1595 కోట్లకు సుమారుగా 3 రెట్లకు కొంచెం తగ్గుతుంది. అంతే కాకుండా మేనేజ్‌మెంటు ఎఫెక్టివ్‌గా చేస్తున్నందు వల్ల దేశంలో రేటింగ్ ఇచ్చేటటువంటి సంస్థ 2004-05కి ఆంధ్రప్రదేశ్‌లో ట్రాన్స్‌కో is number one and it is one of the best in the country అని ఇక్కడ రేటింగ్ ఇచ్చారు. 2005-06లో best is A.P.Transco అని ఇచ్చారు. 2006-07లో కూడా definitely we are going to come up as number one. అలాగే ఇ అండ్ డి లాసెస్ కూడా 2005-06లో 20.2 శాతం ఉంటే, 2006-07లో ఇప్పటి వరకూ 19.3 శాతానికి తగ్గించాము. అంటే ఎఫెక్టివ్ మేనేజ్‌మెంటు వల్ల లాసెస్ కొంత తగ్గించగలిగాము. సబ్సిడీ అవసరమైతే అదనంగా కూడా ఇస్తామని బడ్జెట్‌లో ప్రొవిజన్ పెట్టిందే కాకుండా, అధ్యక్షా, తమకు తెలుసు, కొంత ప్రత్యేక పరిస్థితి ఏర్పడింది. దానికి అదనంగా సుమారు రూ.1200 కోట్లు ఇవ్వడం జరిగింది.

పవర్ సెక్టారుకు సంబంధించి, ఏ మాత్రం అలసత్వం లేదు. ఎవరు ఎన్ని విధాలుగా బుకాయించినా కూడా గతంలో 7 గంటలు పవర్ ఇచ్చారు. ఈ రోజు అదే విధంగా 2 స్పెల్సులో ఇచ్చినా కొన్ని చోట్ల కొన్ని పరిమిత ప్రాంతాలలో ఒక్క స్పెల్ ఛార్జిలో ఇచ్చినా కూడా ఛార్జి లేకుండా రైతాంగానికి ఉచిత విద్యుత్తును ఇస్తున్నామని, ఈ సత్యాన్ని కాదని ఇక్కడ గట్టిగా బుకాయిస్తే అందులో కూడా గౌరవ ప్రతిపక్ష నాయకులు ఈ మాట మాట్లాడితే, న్యాయం కాదు. రికార్డులు చూడండి. ఏమి సమాధానం చెప్పారో చూడండి. నేను ఏదైనా తప్పు మాట్లాడినా అసెంబ్లీ రికార్డ్సులో ఉన్న మాటకు భిన్నంగా చెప్పలేను కదా. అసెంబ్లీ రికార్డ్సు ఒకసారి చూడండి. మీరు చెప్పిన జవాబు చూడండి.

కేంద్ర పవర్‌కు సంబంధించి కూడా we are doing our best. We will try to imporve our efforts.

శ్రీ చాడ వెంకట రెడ్డి (ఇందుర్తి) : అధ్యక్షా, ఆర్థిక శాఖా మంత్రి గారు తమ అపార అనుభవంతో అనేక విషయాలు వారి వాగ్ధోరణితో వాక్కులతో వారికి వారే సాటిగా అనేక విషయాలు ప్రస్తావించారు. అయితే మా ప్రసంగం ఏదైతే ఈ బడ్జెటుకు సంబంధించిన అంశాలు తెలియపరిచామో వాటికి సంబంధించి రిటెన్ ఆన్సర్సు పంపుతామని అన్నారు. రిటెన్ ఆన్సర్సు పంపిస్తే, క్లారిఫికేషన్సులో మళ్లీ వాటిని అడగవలసి వస్తుందేమోనన్న అనుమానం మాకు వస్తున్నది. మీరు అవకాశం ఇవ్వాలి. ఎందుకంటే, మేము అడిగిన నాలుగైదు పాయింట్సు, ఇంపార్టెంటువే అయివున్నాయి. వాటికి క్లారిఫికేషన్సు ఇస్తే సరిపోయేది.

శ్రీ కె. రోశయ్య : మీరన్న మాట నిజమే. అయినా టైమ్ ఫ్యాక్టర్‌ను దృష్టిలో పెట్టుకుని, కాదు అంటున్నాము. ఏమైనా కూడా మీరు డిమాండ్స్ మీద మాట్లాడేటప్పుడు తప్పకుండా మీరు రెయిజ్ చేసిన పాయింట్సుకు నేను ఇచ్చే వివరణ కూడా సంబంధిత మంత్రి గారికి పాసాన్ చేస్తాను. వారు వివరణ ఇస్తారు.

శ్రీ చాడ వెంకట రెడ్డి : అధ్యక్షా, సమస్య ఏమిటంటే, ఆదాయానికి సంబంధించి, సలహాలు ఇవ్వలేదనే అభిప్రాయం వారు వ్యక్తపరిచారు. మేము గతంలో రెండు మూడు బడ్జెట్ల సందర్భాలలో చెప్పాము. వారికి ఆ విషయం బాగా తెలుసు. ఆదాయం ఎలా సమకూర్చుకోవాలో వారికి తెలుసు. వారు బాగా ఎక్స్‌ప్రెస్ చేశారు. చేయలేదని అనడం లేదు. గతంలో కూడా మేము చెప్పాము.

ఈ రోజు రియల్ ఎస్టేట్ వ్యాపారం బ్రహ్మాండంగా ఒక పెద్ద వ్యాపారంగా సాగుతున్నది. అలాగే కార్పొరేట్ సంస్థలు కోటానుకోట్ల రూపాయలు గడిస్తున్నాయి. వాటికి సంబంధించి కూడా టాక్సులు వేయడం ద్వారా జీరో దందాలు బాగా జరుగుతున్నాయి. వాటిని అరికట్టడానికి ప్రయత్నం చేయమని గతంలో మేము చెప్పాము. పేద వాడు మరింత పేద వాడుగా, పెద్ద వాడు మరింత పెద్ద వాడుగా దీని మూలంగా అవుతున్నాడు. అంతరాలు పెరుగుతున్నాయన్న మాట కూడా నేను చాలా స్పష్టంగా గత బడ్జెటులో చెప్పడం జరిగింది. ఈ సారి మేము ప్రత్యేకంగా అనుకున్నది, చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు ఉండే పరిస్థితి ఉంటుందని, అందుచేత అపార అనుభవంతో వారు చెప్పారు. అందులో తప్పనిసరిగా ఈ విషయం గురించి ఆలోచిస్తారని, పదే పదే చెప్పేటటువంటి ప్రయత్నం మేము చేయలేదు.

రెండు మూడు క్లారిఫికేషన్సు అడుగుతున్నాను. ఎక్కువ సమయం తీసుకోదలచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రైతుల రీషెడ్యూల్ గురించి రూ.1650 కోట్లు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. దానికి సంబంధించి బడ్జెటులో రూ.800 కోట్లు కేటాయించారు. అయితే, ఇది ఏమాత్రం సరిపోదు. మరి మిగతా ఈక్విటీ వారు రూ.1650 కోట్లు ఇస్తే మనం రూ.1650 ఇవ్వాలి. దీనికి సంబంధించి బడ్జెటులో తక్కువ కేటాయించారు. మిగతాది కేటాయిస్తారా లేదా అని తమరి ద్వారా అడుగుతున్నాను. అంతే కాకుండా వాస్తవంగా గతంలో కరువు ఉన్నపుడు వడ్డీలు అసలు కలిపి కట్టినందువల్ల రీషెడ్యూల్సు చేశారు. అసలు కలవడం వల్ల వడ్డీ మాఫీ కాకుండా పోయింది. అందులో దానికి సంబంధించి కూడా ముఖ్యమంత్రి గారి దృష్టికి మేము తీసుకువచ్చాము. కేంద్ర మంత్రులతో వత్తిడి తీసుకువచ్చి చేయకపోతే, రూ.5 వేల కోట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతులు నష్టపోతారు. అందువల్ల దీనికి సంబంధించి మన బడ్జెటులో తక్కువ కేటాయించారని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అలాగే జైతీఘోష్ కమిషన్ రిపోర్టు ప్రకారంగా ధరల స్థిరీకరణ, రైతుల ఆత్మహత్యల నివారణకు రూ.500 కోట్లు గతంలో ఏర్పాటు చేయడానికి మంత్రి వర్గ ఉప సంఘం సిఫారసు చేసింది. కాబట్టి దానిని గురించి కూడా బడ్జెటులో కేటాయించాలని దానిని గురించి తర్వాత ఆలోచిస్తారా అని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ముఖ్యమంత్రి గారికి బాగా తెలుసు. ప్రధానమైన అంశం ఏమిటంటే, 2004-05వ సంవత్సరంలో తీవ్రమైన కరువు ఉన్నపుడు ఈ గవర్నమెంటు వచ్చిన తర్వాత అప్పుడు శాసన సభ్యులం అందరం ఊరూరా వెళ్లి మంచి నీటి కొరత నివారణ కోసం పనులు చేశాము. ఇప్పుడు ఇంకా ఆ బకాయిలు చెల్లించని పరిస్థితి ఉంది. కరీంనగరు జిల్లాలో ఈ పరిస్థితి నా దృష్టికి వచ్చింది. రూ.4 కోట్లు అక్కడ చెల్లించాలి.

ఇప్పటికి 2 సంవత్సరాలు దాటింది. అలాగే చాలా జిల్లాలలో ఇటువంటి పరిస్థితి ఉంది. దాదాపు రూ.20 కోట్లు లేక రూ.25 కోట్లు బకాయిలు చెల్లించవలసిన పరిస్థితి ఉంది. పనులు పూర్తి అయిన తర్వాత 2 సంవత్సరాల నుంచి బడ్జెటులో కేటాయింపులు లేవు. ఎక్కడా చేయలేదు. దానికి సంబంధించి ఇంకా అలాగే ఉంది. పంచాయతీరాజ్ సంస్థలకు సంబంధించి, స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషను ద్వారా ఎంత డబ్బు కేటాయించడం జరిగిందో స్పెసిఫిక్‌గా ఇక్కడ పొందుపరచలేదు. అది చెప్పలేదు. దానిని గురించి చెప్పాలని కోరుతున్నాను.

ఐసిడిఎస్ పని చేసే వర్కర్సుకు హెల్పర్సుకు సంబంధించి, ముఖ్యమంత్రి గారు గత సంవత్సరం రూ.200 పెంచారు. అంతకు ముందు కూడా పెంచారు. అలా పెంచినప్పటికీ ప్లాను బడ్జెట్ ఉందని, డబ్బులు లేవని చిత్తూరు జిల్లాలో, మిగతా చోట్ల కూడా వెయ్యి రూపాయలు, కొన్ని చోట్ల రూ.1200 ఇస్తున్నారు. ఇంకా బకాయిలు చెల్లించడం లేదు. ఇప్పటికీ బడ్జెటులో కేటాయింపులు లేవు దానికి సంబంధించి. కేంద్ర ప్రభుత్వం వెయ్యి రూపాయలు ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇస్తోంది. దాని మీద క్లారిఫికేషను చేయమని అడుగుతున్నాను. అలాగే ఇందిరమ్మ ఆదర్శ గ్రామాలకు సంబంధించిన కాన్సెప్టును అంగీకరిస్తున్నామని చెప్పాము. అయితే ధరలు పెరిగాయి. యూనిట్ కాస్టు కూడా పెంచడానికి బడ్జెటులో కేటాయింపు చేయమని అడుగుతున్నాము. వీటన్నిటి మీద మంత్రి గారు సమాధానం చెప్పాలని తమ ద్వారా కోరుతున్నాను.

మ.3.00

SRI AKBARUDDIN OWAISI (Chandrayanagutta) : Hon'ble Speaker Sir, first and foremost, regarding the revenues, I would like the Finance Minister to provide details as to how he proposes to raise Rs. 8,700 crores from the sale of lands and the places where the Government would auction the lands and the upset price per acre for the proposed auctions.

Secondly Sir, I want to have clarification about the increase in public debt as the public debt is estimated to go up to 86,464 crores by the end of 31st March, 2008 from Rs. 77,952 crores this year representing an increase of Rs.8512 crores. At this rate, the State's outstanding public debt is likely to increase by 1 lakh crore by 2008-2009, when the Congress Government will complete its tenure. So, I would like to have clarification in this regard from the Finance Minister.

I would also like the Finance Minister to spell out measures to ensure that the State does not slip into a virtual debt trap and the future generations are not unduly indebted.

I would request the Finance Minister to respond to our demands for increasing the budgetary allocations for minorities welfare to atleast Rs.500 crores a year, so that the Government could redouble its efforts for the socio economic and educational upliftment of the minorities in the backdrop of the Sanchar Committee recommendations.

I would like the Finance Minister to spell out the agency or organization, which would be designated as the nodal agency for disbursement of scholarships and reimbursement of fees to minority students now. Sufficient staff needs to be sanctioned for the nodal agency because the scholarship amounts have increased in this financial year.

I would request the Finance Minister to spell out the time frame for the 12 minority hostels promised last year and 36 more hostels promised by the Chief Minister recently to become functional.

I would also request the Finance Minister to extend the Jawahar Knowledge Centre scheme to the minority run professional Colleges all over the State so as to provide gainful employment to students graduating from these Colleges.

The Chief Minister has been kind enough to announce a special package for the Old City with outlay of Rs. 2025 crores over the next three years. I would like the Finance Minister to spell out the various heads of accounts and schemes under which allocations have been made for the Old City package in the next year's budget.

I request the Finance Minister to entrust the job to Quli Qutub Shah Urdu Development for effective implementation and monitoring of the Old City special package. Statutory status, adequate staff, powers and financial allocations should be provided to QQSUDA for overseeing the Old City special package.

I also request the Finance Minister to consider waiver of electricity bill arrears of the poor consumers of Old City and also to withdraw thousands of cases booked against them by Discom Officials in the last few years.

About the 3rd phase Krishna water Sir, it has not been mentioned anything in the Budget. The present requirement and the present water that is received by Hyderabad city is only 230 mgd and we need atleast 400 mgd of water and to fulfil the promise made by the Chief Minister i.e.,24 hours supply, we need 500 mgd of water. For this, 3rd phase of Krishna water for Hyderabad city is must and compulsory. Through you Sir, I request the Government to please reconsider the decision of not bringing the 3rd phase and please bring the 3rd phase because the Chief Minister had also promised 25 mgd of water to Fab city.

About the land distribution Sir, the Hon'ble Finance Minister mentioned….. I have the abstract and I would like to bring to his knowledge Sir that in the 1st phase, the minority beneficiaries have been 1568, in the 2nd phase Sir, the minority beneficiaries have been 1053 and in the last phase Sir, it is only 98 beneficiaries. Out of 4,023000, minority beneficiaries have only been 2819. This is less than 1%. I hope that the Government take notice and do justice.

About the Housing also I have the details Sir. The total houses constructed for SCs are 2,71,000 in terms of percentage it is 37% for STs it is 12%, for SCs and STs it is 68% for BCs it is 28% and for minority again it has been only 6%. I request that this also be taken care of by the Government and, according to the existing G.Os, houses should be allocated to the Muslims.

So far as the Urban Land Ceilings Act is concerned, I want the Finance Minister to spell out the time frame for repealing this Act in consonance with the repeal of the Central Government

Regarding the Arogya Sri Scheme to provide health insurance, I would like the Finance Minister to clarify how the ceiling of coverage up to Rs. 2 lakhs has been reduced to Rs. 1.5 lakh within a week from the Governor's address to the Budget speech.

I would like the Finance Minister to provide the details of the allocations made in the Budget for the MCH, HUDA and other civic agencies such as Jawaharlal Nehru National Urban Renewal Mission and Swarna Jayanti Shahari Rozgar Yojana and the other schemes like Indiramma.

Lastly I would like the Finance Minister to give an assurance to the House that the entire Annual Plan outlay for 2006-2007 would be fully spent before the financial

year comes to an end by March 31, specially since in the previous two years, there was a shortfall of Rs.4,506 crores in terms of actual plan expenditure against the budgeted outlay.

About the Regional Development Board, the Government has agreed to constitute a Board, I would like to know when would they constitute the Regional Board.

About Sarva Siksha Abiyaan Sir……..

MR. SPEAKER : Put the demands.

SRI AKBARUDDIN OWAISI : Sir, when we come to the Governor speech, you say Budget speech when we come to the Budget speech, you say speak Demands and when Demands come you say Appropriation…...

MR. SPEAKER : we are on clarification.

SRI AKBARUDDIN OWAISI : Sir, we come with so much of preparation. In the morning they took 5 hours for 1 question. One question only two parties Old building is there. Why don't you send us to old building? We feel this building is only for T.D.P and Congress legislators. We do so much of hard work and come prepared. Today one Urdu newspaper wrote stating that the MIM Legislators were quiet when the adjournment motion was raised about the 3rd phase of Krishna water by TDP, BJP and TRS. Here You don't give us time and the Jokers sitting write something not knowing what they have to write.

MR.SPEAKER : You have been quite articulate in your presentation. I would not like you to be inspired by such articles because this House runs through certain regulations. Let us all try to live up to the House regulations and definitely it will be monitored accordingly and if it is monitored you will get your opportunity.

SRI AKBARUDDIN OWAISI : I have given 2 privilege motions against these Newspapers. They just do not understand anything. They write anything. Privileges Committee is there. Why don't they take any action against them. They are white color criminals. The Editor's son has sold girls to prostitute houses….

MR.SPEAKER : We will leave it there now.

SRI AKBARUDDIN OWAISI : About Sarva Siksha Abiyaan Sir, I request in all those district where Urdu has been declared as 2nd Official language, 30% allocations should be made compulsory for Urdu schools.

Lastly Sir, most important issue which no one has mentioned I would like to bring to the notice of this House about the price rise in essential commodities. The Finance Minister and the Government should take a serious note about this rise of prices in all the essential commodities. A Committee should be formed and we should see how best we can tackle this and reduce the prices. I thank you very much for giving me this opportunity.
మ.3.10

శ్రీ కె.రోశయ్యః అధ్యక్షా, వెంకట రెడ్డి గారు ప్రధానమంత్రి ప్యాకేజ్ గురించి ప్రస్తావన చేశారు. దానికి వడ్డీ రాయితీ 50 శాతం ఇవ్వటానికి ఇరిగేషన్ మరియు ఇతర డిమాండ్స్ ఉన్నాయి. We will meet the share of the State. సార్, రీషెడ్యూల్ చేసిన రుణాల వడ్డీ మాఫీ గురించి ప్రధానమంత్రి గారికి

ముఖ్యమంత్రి గారు ప్రత్యేకంగా రిప్రజెంట్ చేశారు. రీషెడ్యూలింగ్ మాత్రమే కాకుండా రుణాల మీద ఇచ్చిన వడ్డీని కూడా మాఫీ చెయ్యమని డిమాండ్ చేస్తున్నాము. We will try to put more pressure on them. సార్, ఐ.సి.డి.ఎస్ వర్కర్స్‌కి పెంచిన ఆనరోరియం పెండింగ్‌లో ఉందని చెప్పారు, త్వరలోనే రిలీజ్ చేస్తాము. ఎస్.ఎఫ్.సి క్రింద 200 కోట్లు కేటాయించాము. అలాగే మిత్రులు అక్బరుద్దీన్ ఒవైసి గారు ఔట్‌స్టాండింగ్ డెట్ చాలా పెరుగుతూ ఉంది. ఎట్లా మీట్ చేస్తారని అన్నారు. ఎఫ్.ఆర్.బి.ఎంలో మన డెట్ 3 శాతానికి పరిమితంగా ఉండాలని ఉంది. దానిని దృష్టిలో పెట్టుకొని మన సంపద పెరిగినప్పుడు మనం చేపట్టే కార్యక్రమాలను కుదించుకుంటే రెవెన్యూ పెంచుకోవలసిన పని లేదు. కాని, కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టవలసి వస్తుంది కనుక ఇది అందరూ అంగీకరించిన కండిషన్ ప్రకారంగా అప్ టు త్రీ పర్సెంట్‌మాత్రమేఉంటుంది. ఇది మామూలుగా జి.ఎస్.డి.పి గ్రోత్‌ను బట్టి ఉంటుంది. ఇక మైనారిటీల స్కాలర్‌షిప్స్ గురించి ప్రస్తావించారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ఇది జరుగుతుంది. ఒక వేళ అది సరిగా లేదనే భావన మీకు ఏమైనా ఉంటే I will ask the A.P. State Minorities Finance Corporation and I will also ask the Minister for Minority Welfare to look into it and make it a pucca system. 2007-08లో మైనారిటీ హాస్టల్స్ అన్ని జిల్లాలలో ఏర్పాటు చెయ్యడానికి తప్పకుండా ప్రయత్నం చేస్తాము. మీరు మరొక మాట చెప్పారు. రీజనల్ బోర్డ్స్ ఎప్పుడు చేస్తారని అన్నారు. త్వరలోనే చేస్తామనే మాట చెపితే ఎన్నాళ్లండి అని అంటారు మీరు. ఇదివరలో కూడా చెప్పాను కమిట్ అయ్యానని, ఆ కమిట్‌మెంట్ ప్రకారమే గవర్నమెంట్ సీరియస్‌గా ఆలోచిస్తుంది. ఈ ఫైనాన్షియల్ ఇయర్ అంటే 2007-08 బిగినింగ్‌లోనే తప్పకుండా బోర్డ్స్ కాన్స్‌టిట్యూట్ చె య్యడం జరుగుతుంది. ఓల్డ్ సిటీ ప్యాకేజ్ గురించి సి.యం గారు అనౌన్స్ చేసిన మాట కరెక్ట్. దానికి స్పెసిఫిక్ ఏజెన్సీని ఇంతవరకూ వెయ్యలేదు. కనుక ఓల్డ్ సిటీకి డిఫరెంట్ డిపార్ట్‌మెంట్స్ నుండి మనీని డొవిటెయిల్ చెయ్యాలనే ఆలోచన ఉంది. దానిని ఎలా చేస్తారు, ఏమిటని సీరియస్‌గా ఎగ్జామిన్ చేస్తున్నాను. ఓల్డ్ సిటీ డెవలప్‌మెంట్‌కి As per the promise ఒక సంవత్సరం కాదు గ్రాడ్యువల్‌గా చెయ్యడం కోసం ప్రయత్నం చేస్తాము. ఆరోగ్య శ్రీ పథకానికి సంబంధించి 1.5 లక్షలుంటే దానిని రెండు లక్షలకి పెంచాలన్నారు. అవసరమైతే దానిని రెండు లక్షల వరకూ పెంచడానికి అవకాశం ఉంది. ఎందుకంటే Under the Community Health Insurance Scheme the financial coverage provided is Rs. 2.00 lakhs per family per year. మిగిలినవి వారు కొన్ని ప్రస్తావన చేశారు, వాటి గురించి నేను మరల సమాధానం చెప్పడానికి ప్రయత్నం చేస్తాను.

(Interruptions)

MR. SPEAKER: I do not know about the revenue deficit. Definitely, we had surplus discussion. The House is adjourned to meet again at 8.30 A.M tomorrow.

(The House then adjourned at 3.14 P.M to meet again at 8.30 A.M on Friday, the 2nd March, 2007.)